తెలుగు వెలుగు

జూన్ 2013 వెల: ₹20

VASU
WELLNESS
TRICHUP®
జీవితకాలం నిలిచే అందమైన శిరోజాలు
ఇదంతా మీ అమూల్యమైన అలంకారం గురించే.
ఇదంతా మీ శిరోజాల సౌందర్యం గురించే.
అందుకే సంపూర్ణ కేశ సంరక్షణియైన
- ట్రిచప్ పేరును నమ్మండి.
*14కు పైగా పోషకాలు మరియు ఆయుర్వేద ఔషధాలతో తయారుచేయబడినది.
క్షీరపాక ప్రక్రియ ద్వారా సమృద్ధం చేయబడినది.
DSIRచే గుర్తించబడిన ప్రయోగశాలలో సుదీర్ఘ పరిశోధనా అనంతరం తయారుచేయబడినది.
50 వేల మందికి పైగా డాక్టర్లచే విశ్వసించబడిన పేరు.
జీవితకాలం నిలిచే
అందమైన శిరోజాలు
ఆరోగ్యవంతమైన పొడవైన మరియు దృఢమైన కేశాల కోసం
ఆరోగ్యం, పెరుగుదల & బలాన్నిచ్చే ఆయిల్ & షాంపూ
జుట్టు రాలుటను అరికట్టుటకు
జుట్టు రాలుటను నియంత్రించే ఆయిల్ & షాంపూ
చుండ్రును నియంత్రించుట మరియు నయంచేయుటకు
జుట్టు రాలుటను నియంత్రించే ఆయిల్ & షాంపూ
100% రసాయనరహితం*
ట్రిచప్ హెన్నా
మృదువైన మరియు పట్టులాంటి కురుల కోసం
హెర్బల్ సీరం
ఉత్తమ ఫలితాల కొరకు లోపలి నుండి మీ జుట్టుకు పోషణనిచ్చే ట్రిచప్ మాత్రలను వాడండి.
మాత్ర
For Trade Enquiry: Hyderabad - 98494 36222 | : www.vasustore.in | : haircare@trichup.com

విపుల, చతుర తాజా సంచికలు వచ్చేశాయ్!

హాయిగొలిపే కథాకల్హారం
జూన్ విపులలో

- ☆ జ్ఞానపీఠ గ్రహీత ప్రతిభారాయ్ అంటరాని దైవం
- ☆ సత్యజిత్ రే అభిమాని
- ☆ సంజీవ్ పోళ్‌డేకా సిగ్గు
- ☆ చినువా అచెబె తిరుగుబాటు
- ☆ గ్రెగరీ ఫాలిస్ ఆమె ఎవరు?
- ☆ డి. కామేశ్వరి మనసే శిక్ష

అలరించే
ప్రత్యేక శీర్షికలు

- ☆ కథకుల ఫైల్‌లో నెల్లూరి కేశవస్వామి పసిడి బొమ్మ
- ☆ పరుచూరి గోపాలకృష్ణ ఎంపిక చేసిన 35 ఏళ్లనాటి విపుల కథ భార్య (గుజరాతీ)
- ☆ జ్ఞానధారలో శ్రీహనుమద్విభవం
- ☆ సినీనటులు, రచయిత రావికొండలరావు పరామర్శ

ఇంకా ముషాయిరా..
నేనెవరిని?
అభినందనమాల..
ఎన్నో మీ కోసం!

- ✱ ప్రపంచ సాహిత్యంలో అత్యుత్తమ రచయిత టాల్‌స్టాయ్ చిట్టచివరి నవల హాజీ మురాద్
- ✱ సాహితీ 'జ్ఞాన' మూర్ధన్యుడు డా. రావూరి భరద్వాజపై ప్రత్యేక కథనం
- ✱ కాలాతీతంలో డి.హెచ్. లారెన్స్ నవల సన్స్ అండ్ లవర్స్
- ✱ డా. అర్చనా నాయక్ ఒడిశా కథ చూడు చూడు నీడను!
- ✱ సరికొత్త శీర్షిక అక్షరధార

ఇంకా..
చతుర ప్ర.జ.
చతురంగం,
చతుర కతలు,
చతురప్రపంచం,
మీ కోసం!

రెంటికీ
ఏడాది చందా
రూ. 280/-
మాత్రమే

చందా ఆన్‌లైన్ బుకింగ్‌కు డబ్బు పంపినవారు,
నేరుగా చందా చెల్లించాలనుకున్నవారు దిగువ చిరునామాలో సంప్రదించండి.
మేనేజర్, వసుంధర పబ్లికేషన్స్, ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ హైదరాబాద్-82
ఫోన్: 040 23318181 Ext: 6441
email : vipula.chatura@eenadu.net - vipula.chatura@gmail.com

గౌ॥ శ్రీ నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి
రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
Chairman, Governing Body, Shilparaman Arts, Crafts & Cultural Society

SHILPARAMAM Arts, Crafts & Cultural Society
Madhapur, Hyderabad
సంస్కృతి - జ్ఞాపిక

ఆంధ్రప్రదేశ్ పర్యాటకం

నిర్మల్ చిత్రకళ, చేర్యాల చిత్రకళ, కలంకారి చిత్రకళ, పెంబర్తి ఇత్తడి సామాగ్రి, ఏటికొప్పాక కొయ్యబొమ్మలు,
కలపపై చెక్కడాలు, కొండపల్లి బొమ్మలు, గద్వాల చీరెలు, పోచంపల్లి, వెంకటగిరి
హస్తకళలు, చేనేతలు, తెలుగు సంస్కృతీ రూపాలు
మాదాపూర్, హైదరాబాద్, ఫోన్: 040-64518164
email: shilparamamctc@yahoo.co.in | website: www.shilparamamhyd.org

జి.యన్.రావు, IAS, (R)
ప్రత్యేక అధికారి, శిల్పారామం

గౌ॥ శ్రీ వట్టి వసంత కుమార్
రాష్ట్ర పర్యాటక శాఖామాత్యులు
Vice Chairman, Governing Body, Shilparaman Arts, Crafts & Cultural Society

అక్షర లక్షలు...

కదిలే దృశ్యాలు కమనీయ పద్యాలు — 16
- లింగుట్ల రవిశంకర్

ఇది విద్యా మిథ్యా? — 18
- ఇ.నాగేశ్వరరావు

బతుకు... బతికించు — 24
- తల్లావజ్ఝల పతంజలిశాస్త్రి

శ్రుతిలయలు — 28
- డా॥ ఎం.పురుషోత్తమాచార్య

పిల్లల స్థాయికి ఎదగాలి! — 34
- తెలుగు వెలుగు బృందం

74 **ప్రజల్లో మార్పు వస్తేనే పాలకుల్లో మార్పు**
- ఆచార్య కస్తూరి విశ్వనాథం

తేనెలూరే 'తెనాలి' తెలుగు — 38
- డా॥ కాపూరి పాపయ్యశాస్త్రి

చదువుల సారం జ్ఞానం — 44
- భరణి

అర్థాలే వేరులే! — 52
- డా॥ ద్వా. నా. శాస్త్రి

నాన్నా... నీ మనసే వెన్న! — 8
డా॥ యల్లాప్రగడ మల్లికార్జునరావు

పాటల వేటూరి మాటల చాతురి — 20
- రాంభట్ల నృసింహశర్మ

మంచి పుస్తకం 42
సరదా... సరదా... సాహిత్యం
- డాక్టర్ పాపినేని శివశంకర్

కథలు

డబ్బున్న వాడే మనిషి... ధనసంపాదనలో విలువలకు తిలోదకాలిచ్చినా సరే, ధనవంతున్నే సమాజం గౌరవిస్తుంది... ఈ కఠోర వాస్తవాన్ని ప్రభావవంతంగా చెప్పే రావూరి భరద్వాజ రచన... **'సాంఘిక విలువ' ఈ నెల కథా పారిజాతం.** 78

ప్రేమ కుదిరింది! — 12
- పొన్నాడ విజయ్‌కుమార్

గూడు — 30
- సమ్మెట ఉమాదేవి

నేనెవరో చెబుతారా? — 48
- డా. దేవరాజు మహారాజు

సముద్రం — 54
- హేమాచల శ్రీరమణ ప్రసాద్

'అది'కాదు — 86
- పి. వి. ప్రసాద్

కవులకది త్రివేణి సంగమం — 58
- కట్టా శ్రీనివాస్

ఇట్లు నాన్న! — 62
- బి. స్టాలిన్, షంషుద్దీన్

మాతృభాషలకు మరణశాసనం — 72
- రోహిత్ కుమార్

పదం పద్యం పట్టి నిలిచెను..! — 84
- పి. వి. బి. శ్రీరామమూర్తి

అమ్మ భాష — 98
- సాయిహర్ష

బహుమతి పొందిన ప్రేమలేఖలు

పేరు బంధాన్ని మించిన అనుబంధం — 37
- చిన్నా

మాట్లాడు నాన్నా! — 65
- ప్రభాకర్

ప్రియమైన అక్షరానికి — 71
- అన్వర్

ప్రత్యేక శీర్షికలు

నెట్టిక్కితే గట్టెక్కినట్టే! — 66
- రచ్చ సుమతీదేవి

కాదేది ప్రశ్నకనర్హం — 68
- సాయి

మరిన్ని ప్రత్యేకాలు

మాటకట్టు — 89

జానపద గేయాలు — 64 83

తెలుగు వెలుగు

సంపాదకుడు: **రామోజీరావు**

సంపుటి : 1 , సంచిక : 10

జూన్ 2013

పుటలు : 100, **వెల :** రూ. 20

ముఖచిత్రం : చారి పి. యస్.

పత్రాలంకరణ : రవిశంకర్

సహకారం : రామోజీ విజ్ఞానకేంద్రం

ప్రకటనల కోసం : +91 80081 51599, +91 90001 80608

వివరాలకు : సంపాదకుడు, తెలుగువెలుగు, రామోజీ ఫిల్మ్‌సిటీ, హయత్ నగర్(మం.) రంగారెడ్డి - 501 512.

ఫోను: +91 8415 246 999

మొబైల్: +91 800 800 1656

ఫ్యాక్సు: +91 8415 305 018

ఈమెయిల్:

teluguvelugu@ramojifoundation.org

పత్రికపై కాపీరైట్ హక్కులు రామోజీ ఫౌండేషన్‌వి. ఈ పత్రికలోని భాగాలను, పత్రికను అనుమతి లేకుండా అంతర్జాలంలో పెట్టడం లేదా మరో చోట ప్రచురించడం కానీ చట్ట వ్యతిరేకం.

Telugu Velugu

Owned, Printed, published and Edited by Ramoji Rao on behalf of Ramoji Foundation, Ramoji Film City, Hayathnagar Mandal, Ranga Reddy District, Andhra Pradesh. Printed at Eenadu Press, D.No.7-134/1&2, Moosapet Village, Balanagar Mandal, Kukatpally, Rangareddy District -500 072.
RNI No: APTEL/2012/45352

విన్నపం: తెలుగు భాషాభివృద్ధి, పరిరక్షణ, మేధోమథనం 'తెలుగువెలుగు' ముఖ్య ఆశయాలు. మన భాషకు పుష్టి చేకూర్చే రచనలకు పత్రికలో అగ్రతాంబూలం లభిస్తుంది. ఈ రచనల్లో వెల్లడయ్యేవి రచయితల అభిప్రాయాలు మాత్రమేనని మనవి. ఇవన్నీ పత్రిక యాజమాన్యం, సంపాదకవర్గ అభిప్రాయాలు కానక్కర్లేదు. భిన్న భావజాలాలకు నిష్పక్షపాత వేదికగా ఈ పత్రిక నిలుస్తుంది.

తెలుగు తేనెలూరాలి... బడుల్లో పలుకుబడుల్లో



తిరుపతి సభలో రాష్ట్రప్రభుత్వ ప్రకటన ప్రకారం, ఇది తెలుగు భాష సంస్కృతీ వికాస సంవత్సరం. అప్పట్లో ముఖ్యమంత్రి చెప్పినట్లు- అంతటా తెలుగు కనిపించేలా వినిపించేలా చేయాలన్న ఉమ్మడి చొరవ సాధ్యపడితే... రానున్న కాలంలో తెలుగు జాతికి విజయం, వికాసం రెండూ తథ్యం. ఇది కలగా మిగిలిపోకూడదు. ఎండమావిని తలపించకూడదు. అందుకు ఎవరేం చేయాలి? రాష్ట్ర ప్రభుత్వమే ముందుండి గట్టి పూనిక వహించాలి. వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు చిత్తశుద్ధితో తోడ్పాటు అందించాలి!

వార్షిక పరీక్షల అనంతరం ఇచ్చే వేసవి సెలవులు పూర్తయ్యాక జూన్ రెండోవారంలో బడులు తిరిగి తెరుస్తారు. తరగతులు ప్రారంభమయ్యేసరికి పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉండాలి. పాత, మూస ధోరణులకు సెలవిచ్చి తేటతెలుగు గుబాళించేలా పాఠ్యపుస్తక రచన, సంపుటాల క్రోడీకరణ ప్రణాళిక కొత్త పుంతలు తొక్కాలి. ఆ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అన్యాపదేశంగా స్వీకరించినట్లయింది. ప్రాథమిక పాఠశాల స్థాయినుంచి పదో తరగతి వరకు కచ్చితంగా తెలుగు భాషా బోధనకు సంకల్పించామని ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రభుత్వం వెల్లడించింది. ఇతర రాష్ట్రాల్లోని, విదేశాల్లోని తెలుగువారి పిల్లలు మాతృభాష నేర్చేందుకు అవసరమైన పాఠ్యపుస్తకాలను ప్రభుత్వమే ఉచితంగా అందించాలన్న తీర్మానాన్నీ తిరుపతిలో ఆమోదించారు. ఇప్పుడిక పాఠ్యపుస్తక రచన తేటపడాలి. బడుల్లో, పలుకుబడుల్లో తెలుగు తేనెలూరేలా చేయడమే మన మాతృభాషా వికాసోద్యమానికి అసలైన నాందీ ప్రస్తావన!

ఈమధ్య మోత చేటు పుస్తకాల బరువు తగ్గించి, పాఠ్యాంశాలు కుదించి, మెదడుకు మేత పెట్టే లోతైన విశ్లేషణలతో రాష్ట్ర పాఠ్య ప్రణాళికను మెరుగుపరచాలన్న ప్రతిపాదనలు వెలుగు చూశాయి. విజ్ఞానం, వికాసం, వినోదాల కలబోతగా పాఠ్యప్రణాళికలు ఎలా ఉండాలో పెద్దబాలశిక్షే గొప్ప ఉదాహరణ. పిల్లల కోసం మంచి పుస్తకం ముద్రించాలన్న ఒక ఆంగ్లేయుడి సంకల్పం ఫలించి, ఆయన మిత్రుడి సాయంతో 1856లో ఓ సంకలనం విడుదలైంది. దానికి భౌగోళిక, సాహిత్య విషయాలు, శ్లోకాల మేళవింపుతో ఇంకో తొమ్మిదేళ్ల తరవాత 'వివేక కల్పతరువు' తయారైంది. అదే కొన్ని దశాబ్దాలపాటు తెలుగు లోగిళ్లలో పెద్దబాలశిక్షగా ప్రాచుర్యం పొందింది. అది తొంభైపుటల్లో పొందిగ్గా ఉండేది. అనంతర కాలంలో రకరకాల అనుకరణలు, విస్తరణలు పుట్టుకొచ్చాయి. వాటన్నింటికీ మాతృక, స్ఫూర్తి వివేక కల్పతరువే! తొమ్మిదేళ్లగా పద్దెనిమిది విభాగాలతో వెయ్యి పుటలకుపైగా విస్తరించిన సమాచారం పెద్దబాలశిక్షగా నేటికీ ఎందరినో అబ్బురపరుస్తోంది. గుణింతాలు, కూడిక పదాలు, జంట మాటలు, మాటల గారడి, నీతికథలు, భిన్నరంగాలకు చెందిన ప్రాథమిక అంశాల సమాహారమది! చదువుకునే పిల్లలకు అంతకన్నా మెరుగైన నాంది, పటిష్ఠ పునాది ఇంకేం కావాలి?

కొత్తగా తెలుగు పాఠ్యపుస్తకాల్లో శతక పద్యాలు, పొడుపు కథలు, సామెతలు, ఇతిహాస గాథలు, ప్రముఖుల చరిత్రలు ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నది స్వాగతించదగ్గ ప్రతిపాదన. వాటి కూర్పు ఈతరం పిల్లల ఆసక్తికి, అభిరుచులకు వన్నెలద్దేలా జాగ్రత్తపడటం పాఠ్యాంశాల రూపకర్తల సామాజిక బాధ్యత. విద్యవల్ల ఆత్మవిశ్వాసం ఇనుమడించాలి. తర్కించి, ఆలోచించి, సొంతంగా నిర్ణయాలు తీసుకోగల మనోస్థైర్యం కలిగించాలి. ఇప్పటి పాఠ్యపుస్తకాల్లో మచ్చుకైనా అటువంటి లక్షణాలు కానరాకపోవడమే పెద్దలోపం. గుడ్డెద్దు చేలో పడ్డట్టు, పుస్తకాల బరువు పెంచుకుంటూ పోవడం- ఇంకో తప్పిదం. నిపుణుల సిఫార్సుల మేరకు, అయిదో తరగతి లోపు విద్యార్థుల పుస్తకాల బరువు మూడు కిలోలకు మించకూడదు. పదినుంచి పదిహేను కేజీలదాకా పంటిబిగువున చిన్నపిల్లలు మోస్తున్న పుస్తకాల్లోంచి అనవసర, అసమంజస సరకునంతటినీ వదిలించాల్సిందే.

పిల్లల తెలివితేటలు గణనీయంగా పెంపొందించడంలో మాతృభాష కీలకపాత్ర పోషిస్తుంది. యాభై ఆరక్షరాల తెలుగుదనం, మన జాతి ఘనవారసత్వ సంస్కృతీ మూలధనమన్నది నికార్సయిన నిజం. అందుకే తెలుగుభాష పరిపుష్టికి అనువైన కార్యాచరణతో సాహిత్య గ్రంథాల ప్రచురణలకు, భావి అవసరాలు తీర్చే బృహత్ నిఘంటువుల నిర్మాణానికి 'రామోజీ ఫౌండేషన్' కృషి చేస్తోంది. తనవంతుగా అటు ప్రభుత్వమూ తేలిక పద్ధతుల్లో తెలుగు బోధనను ప్రోత్సహించాలి. అందుకు తగ్గట్లు పాఠ్యపుస్తక ప్రణాళికను ప్రక్షాళించి, అర్థవంతంగా తీర్చిదిద్దాలి. తెలుగు ఉపాధ్యాయులు మానసికంగా కుంగిపోయేలా దిగజారిన పని పరిస్థితుల్ని చక్కదిద్దడానికీ ప్రభుత్వం నడుం బిగించాలి. తెలుగు భాషలోని నుడికారాలు, జాతీయాలు, చమత్కారాలు తెలుసుకోకుండానే ఇప్పటి బడిపిల్లలు ఏబీసీడీలు దిద్దుతున్నారు. మన వాతావరణంలో వానల ప్రాముఖ్యం ఎంతటిదో తెలియజెప్పని గురువులు 'రెయిన్ రెయిన్ గో అవే...' అంటూ వాళ్లచేత బట్టీ పట్టిస్తున్నారు. ఈ చదువులు మారాలి. పిల్లలు పునరుత్తేజితులై వికాసం పొందేలా తేట తెలుగులో పనికొచ్చే పాఠ్యాంశాలతో కొత్త పుస్తకాలు వెలుగులీనాలి.

భాషను బతికిస్తే, అది మనకు బతుకిస్తుంది.

తెలుగును కాపాడుకుంటే, జాతికి కంటి వెలుగవుతుంది!



ముందడుగేయాలి

భాషాభివృద్ధికి జీవితాల్ని అంకితం చేసిన వారి జీవిత చరిత్రలను ప్రచురించాలి. భావితరాలకవి స్ఫూర్తినిస్తాయి. మాతృభాషాభివృద్ధికి మనమంతా ముందడుగేద్దాం.

- జి.వెంకటతిలక్, నాగర్‌కర్నూలు

తెలుగులో మాట్లాడతా

ఓ ఉద్యమంలా 'తెలుగు వెలుగు' మాలో ప్రేరణ కలిగిస్తోంది. తెలుగును చిన్నచూపు చూస్తున్నారు కొందరు. విశేషాల పరంగా ఆంగ్లం కంటే తెలుగే ఉన్నతమైందని వారికి తెలియదు. మా కార్యాలయ సమావేశాల్లో 'తెలుగు' గురించి మాట్లాడతా. ఉత్తర ప్రత్యుత్తరాలను తెలుగులోనే రాస్తాను.

- ఎ.వి.రమాదేవి, ఖమ్మం

స్ఫూర్తి అనంతం

తెలుగు వెలుగుతో వెలిగించుకున్నా
ఆరిపోయిన నాలోని తెలుగు దీపాన్ని!
తెలుగు వెలుగుతో తెచ్చుకున్నా
కోల్పోయిన నా ఆత్మవిశ్వాసాన్ని!
తెలుగు వెలుగుతో అలవరచుకున్నా
స్పందించే గుణాన్ని కవిత్వ హృదయంతో!

- ఎం.రామచంద్ర ప్రసాద్, సింగపూర్

'బంధం' బాగుంది

మా మనవడితో 'తెలుగు వెలుగు'ను చదివిస్తున్నా. గతంలో ప్రచురించిన 'అష్టనాగ బంధం' వాణ్ని ఎంతో ఆకట్టుకుంది. అందులోని పద్యాన్ని ఆసక్తిగా గమనిస్తూ చదివాడు. పద్య రచనలో ఉన్న ఇలాంటి విశేషాలను ఇకపై కూడా ప్రచురిస్తుంటారని ఆశిస్తున్నా.

- కె.సుబ్రహ్మణ్యం, మార్కాపురం

జానపదాలు ప్రచురించాలి

శీర్షికలు అన్నీ బాగున్నాయి. పల్లెల్లో ఎన్నో పురాణ కథలు, జానపద గేయాలు ప్రచారంలో ఉన్నాయి. వాటిని కూడా ప్రచురించాలి.

- వి.వి.ఎన్.వరలక్ష్మి, విశాఖపట్నం

నా వంతుగా...

మా నాన్నగారి పేరిట మా ఊరు గ్రంథాలయానికి 'తెలుగు వెలుగు'ను అందించాలని నిర్ణయించుకున్నా. పత్రికను ఏడాది పాటు తెప్పించడానికి అవసరమైన విరాళాన్ని అందజేశా.

- నరసింహస్వామి, (ఫేస్‌బుక్ నుంచి)

సాహిత్య సౌరభం

సుమధుర సుందరంగా మన సాహిత్యాన్ని అందిస్తోంది పత్రిక. హృదయారవిందమైన కథలు, వెలుగులీనే పద్యాలు బాగున్నాయి.

- గంగరాజు మోహనరావు, తమిళనాడు

అవి కూడా ఉంటే...

తెలుగు వారికి చుక్కానీలా నిలుస్తోంది 'తెలుగు వెలుగు'. రచనలన్నీ ఆపాత మధురాలను గుర్తు చేస్తున్నాయి. ప్రతి జిల్లా మాండలికాన్నీ ప్రచురించాలి. అమ్మభాషకు అరుదైన సేవ చేస్తున్న విద్యాలయాలపై వ్యాసాలివ్వాలి.

- జానపాటి శ్రీనివాస్, మిర్యాలగూడ

ప్రాధాన్యం ఇవ్వాలి

'తెలుగు వెలుగు' వ్యాసాలు ఆలోచింపజేస్తున్నాయి. ఆంగ్ల వ్యామోహంతో మన కమ్మని తెలుగుని చిన్నచూపు చూస్తున్నాం. అది తప్పు. తెలుగు చదివిన వారికి ఉద్యోగాల్లో ప్రాధాన్యతనివ్వాలి.

- కె.అప్పారావు, పెద్దాపురం

అమ్మ ప్రేమ

అమ్మను తలచుకుంటే ఎంత సాంత్వన కలుగుతుందో 'తెలుగువెలుగు'ను చదివితే అంత సాంత్వన. ఎన్నాళ్ల నుంచో తీరని మాతృభాషా దాహం ఈ పత్రిక వల్ల తీరుతోంది.

- కె.శ్రీనివాసరెడ్డి, మున్నంగి, గుంటూరు

ఈ సంచికలో మినీ కవితలు అందించినవారు
పిన్నంశెట్టి కిషన్, ఇన్‌స్పెక్టరు, తూనికలు-కొలతలు శాఖ, సూర్యాపేట, 9700230310
రాపోలు పరమేశ్వరరావు, గుంటూరు. 99514 16618

భావితరాల కోసం...

మేధస్సుకు పదును పెట్టే ప్రక్రియలెన్నో తెలుగులో ఉన్నాయి. తెలుగుపై భావితరాలకు ఆసక్తి కలిగించేందుకు ఇవి ఉపయోగపడతాయి. మీరు ప్రచురించే 'మాటకట్టు', 'అక్షరక్రీడ' లాంటి వాటిని మా విద్యార్థులతో చేయిస్తున్నాం.

- జి.రమ, సికింద్రాబాద్

ఫోను నెంబరు ఉండాలి

పత్రికలోని అంశాలన్నీ బాగుంటున్నాయి. సమీక్షలలో... ఆ పుస్తకం దొరికే ప్రదేశం చిరునామాతో పాటు సంబంధిత వ్యక్తుల ఫోను నంబరు కూడా ఇస్తే మేలు. పుస్తకాలను తొందరగా తెప్పించుకోవడానికి ఇది సాయపడుతుంది.

- బి.శ్రీనివాసరావు, విజయవాడ

'పునరావాసం' కాకూడదు!

సంపాదకీయం ఆలోచింపజేసేలా ఉంది. ప్రభుత్వ నిర్ణయం మంచిదైనా... అకాడమీలు మాత్రం రాజకీయ పక్షాల కార్యకర్తలకు పునరావాస కేంద్రాలు కారాదు. కార్యశీలత, పారదర్శకత, నిజాయితీతో వ్యవహరించే అనుభజ్ఞులైన మేధావులు, కళాకారులనే వాటికి ఎంపిక చేయాలి. అప్పుడే ప్రభుత్వంపై విశ్వసనీయత పెరుగుతుంది.

- అలపర్తి పిచ్చయ్య చౌదరి, కడప

రావూరికి వందనం

జ్ఞానపీఠాన్ని అధిష్ఠించిన రావూరి భరద్వాజ గారికి అభినందనలు. కృషి ఉంటే మనుషులు రుషులవుతారు, మహాపురుషులవుతారనడానికి ఆయనే నిదర్శనం. మే నెల సంచికలో ఆయనపై ఇచ్చిన వ్యాసం బాగుంది.

- ఆదూరి పద్మావతి, హైదరాబాద్

అవి రెండు!

మన సంస్కృతిని ప్రతిబింబించే కథలను ప్రచురిస్తున్నారు. అలాగే, ప్రతి సంచికలోనూ రెండేసి శతక పద్యాలను ప్రతిపదార్థ సహితంగా ఇవ్వాలి.

- యం.విజయభాస్కర్, మహబూబ్‌నగర్

ఆవేదన అర్థవంతం

భాషాభివృద్ధి, వికాసం కోసం అకాడమీలన్న దానిపై సంపాదకుల ఆసక్తి, ఆవేదన అర్థమయ్యాయి. 'అక్షరంలో అమ్మ' నుంచి 'మరుగున పడుతున్న మాణిక్యాలు' వరకూ మే నెల సంచికలోని ప్రతీ అక్షరంలో మన భాష కమ్మదనం ప్రతిఫలించింది. కథలు వైవిధ్యంగా ఉండి చదివించాయి.

- కృష్ణ మాధవరపు, కాకినాడ

పరిజ్ఞాన గని

యువతరానికి చక్కని భాషా పరిజ్ఞానాన్ని అందిస్తోంది 'తెలుగు వెలుగు'. పూర్వ కవుల జీవిత విశేషాలు, నాటక రంగ విషయాలు ప్రచురించాలి.

- మొయలి మోహనరావు, శ్రీకాకుళం

అభినందనీయం... పత్రిక మార్గం

తెలుగు భాషోద్యమానికి అంకురారోపణ చేసిన రామోజీ ఫౌండేషన్‌ను అభినందిస్తున్నా. ఇప్పటి వరకూ 'తెలుగు వెలుగు' లాంటి పత్రిక రాలేదు. సినిమా, శృంగార విషయాలకు తావు లేకుండా వస్తున్న పత్రిక ఇదే. మన భాష, సంస్కృతులు కలకాలం నిలవాలంటే ఇలాంటి పత్రిక రావాలి. తెలుగు వారిలో ఇప్పుడిప్పుడే భాషా స్పృహ పెరుగుతోంది.

- బి.శాంతి, విజయవాడ

అభినందనలు

అన్ని కథలూ, కవితలూ, వ్యాసాలూ బాగుంటున్నాయి. తెలుగు వెలుగు ద్వారా తెలుగు సాహిత్యాన్ని బతికించేందుకు మీరు చేస్తున్న కృషికి అభినందనలు.

- కాళహస్తి వెంకటశేషగిరిరావు, నెల్లూరు

- అందేపాక నరహరి, హైదరాబాద్

- జి.వి.రవీంద్రుడు, విశాఖపట్నం

స్ఫూర్తిదాయకం

వ్యాసాలు, కవితలు స్ఫూర్తిదాయకంగా ఉంటాయిన్నాయి. దోషరహితంగా ఉంటూ చక్కటి పదప్రయోగాలతో ఆకట్టుకుంటున్నాయి. ముమ్ముందు ఇంకా మంచి సాహితీ అంశాలను అందించాలి.

- వి.రాఘవరావు, బొమ్మూరు, తూ.గో జిల్లా

ఆ వ్యాసం బాగు

రావూరి భరద్వాజుడు 'జ్ఞాన'పీఠాన్ని అధిరోహించి మన కీర్తిపతాకాన్ని ఎగరేశారు. 'ఓ భువన విజయం' దివ్యంగా ఉంది. చిన్నారుల అవధాన ప్రతిభ గురించి చదువుతుంటే ముచ్చటేసింది.

- వాస్తు రామచంద్ర, రాంజీనగర్, నెల్లూరు

ఎంకి ముచ్చట్లు బాగున్నాయి

తెలుగునాట సాహితీప్రియుల గుండెల్లో ఇప్పటికీ 'ఎంకి' పదిలంగానే ఉంది. పత్రిక ఆద్యంతం అలరిస్తోంది. తెలుగు వ్యాప్తి కోసం శ్రమిస్తున్న మీకు అభినందనలు.

- భాస్కర్ల శోభప్రభాదేవి, మచిలీపట్నం

ఆపాతమధురాలు

ప్రాచీన కావ్యాలను, చాటువులను ప్రచురించాలి. సమాజంలో మార్పుతెచ్చిన సాహిత్యానికి ప్రాధాన్యమివ్వాలి.

- పి.జయచంద్రరావు, శ్రీకాళహస్తి

మనమే కారణం

విద్యార్థి దశలోనే ఆంగ్ల భాషకు అగ్రపూజ చేస్తున్నారు. మాతృభాషలో మాట్లాడటానికి కూడా సిగ్గుపడుతున్నారు. తల్లిదండ్రులు ప్రోత్సాహంతోనే పరిస్థితి ఇంత దాకా వచ్చింది.

- ఎం.లీల, హైదరాబాద్

పత్రికలే ఆధారం

సంస్కృతిని కాపాడటానికి పత్రికలే మూలస్తంభాలు. ప్రవాసాంధ్రులు అమ్మభాష కోసం తపన పడుతుంటే... మనం మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నాం.

- శ్రీనివాస్, కడప

తెలుగు తోటలో విహారం

'తెలుగు' గురించి మా మనసుల్లో ఉన్న భావాలకు పత్రిక అద్దం పడుతోంది. పత్రికను చదివినంతసేపు 'తెలుగువెన్నెల' తోటలో విహారానికెళ్లి విందుభోజనం ఆరగించినంత ఆనందంగా ఉంది. పత్రిక వర్ధిల్లాలి. తెలుగు భాషౌన్నత్యపు బావుటాను నింగికెగరేయాలి.

- వి.ఉమాదేవి, కాకినాడ

ఎందుకు వాడుతున్నారో...

తెలుగు భాషకు హాని చేస్తుంది 'టీవి రంగమే'. ఛానళ్ల నిర్వాహకులు భాషని సంస్కరించే ప్రయత్నం చేయాలి. తెలుగు కార్యక్రమాలకు ఆంగ్లం పేరు పెట్టడటం ఎంతమాత్రం ఔచిత్యం కాదు. అసలు ఎందుకు ఆంగ్లం వాడుతున్నారో...?

- బి.సుధీర్ కుమార్, హైదరాబాద్

ఆణిముత్యాలే.

'ఆ గురుకులం ఓ భువన విజయం' చదివి మాకు సాహిత్యాన్ని నేర్చుకోవాలనే అభిలాష కలిగింది. తెలుగు తిరకాసులు హాస్యస్ఫోరకంగా ఉంది.

- బి.వీరా శ్రీకాకుళం

బొమ్మలు బాగున్నాయి

పత్రికలో ప్రచురిస్తున్న కథలు ఆసక్తికరంగా ఉంటూ చదివిస్తున్నాయి. బొమ్మలు అర్థవంతంగా, ఆకట్టుకునేలా ఉంటున్నాయి.

- అనన్య పోలోజు, హైదరాబాద్

ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్

హెడ్ ఆఫీస్ : అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 530016

ఫోన్: 0891-2562731. ఇమెయిల్ : kcb_1999@radiffmail.com

ప్రత్యేక డిపాజిట్ పథకం

1000 రోజులు డిపాజిట్‌పై 11.50 % వడ్డీ (వార్షిక రాబడి 13.29 %)

డిపాజిట్ కాలం (టర్మ్ డిపాజిట్‌లు)	సాధారణ	సీనియర్ సిటిజన్స్
31 రోజులు నుండి 45 రోజులు	5.00	5.00
46 రోజులు నుండి 90 రోజులు	6.50	6.50
91 రోజులు నుండి 180 రోజులు	8.00	8.50
181 రోజులు నుండి 1 సంవత్సరం	9.00	9.50
1 సంవత్సరం నుండి 3 సంవత్సరాల లోపు	10.50	11.00
3 సంవత్సరాలు ఆపైన	11.00	11.50

సీనియర్ సిటిజన్స్‌కు 3 సం॥ల పథకం క్రింద డిపాజిట్ చేసే ప్రతి లక్ష రూపాయలకు రూ॥ 949/- నెలవారీ వడ్డీ పొందవచ్చును.

మా బ్యాంక్ నందు లభించే సదుపాయాలు

★ పూర్తి కంప్యూటరైజ్డ్ ఆన్‌లైన్ సేవ ★ సభ్యుల డిపాజిట్‌పై వచ్చే వడ్డీపై పన్ను వసూలు ఉండదు.
★ లాకర్ సౌకర్యం కలదు ★ వివిధ అవసరాలకు రుణాలు ★ RTGS, NEFT సదుపాయం
★ 7 రోజులు బ్యాంకింగ్ - అనువైన వ్యాపారపని వేళలు ★ భారతదేశం అంతటా డి.డి. సౌకర్యం

డిపాజిట్‌లకు బీమా సదుపాయం, RBI అనుబంధ సంస్థ డిపాజిట్ ఇన్సూరెన్స్ & క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ వారితో డిపాజిట్‌లకు భీమా

మా బ్రాంచీలు :
విశాఖపట్నం : అక్కయ్యపాలెం, MVP కాలనీ, NAD కొత్తరోడ్, అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం
పశ్చిమగోదావరి జిల్లా : పాలకొల్లు, భీమవరం, ఏలూరు
త్వరలో : జంగారెడ్డిగూడెం, తణుకు బ్రాంచీలు ప్రారంభం

పి. రఘునాధరావు, వ్యవస్థాపక అధ్యక్షులు



నాన్న... నీ మనసే వెన్న!

తన పిల్లల్ని ఎవరైనా పొగిడితే ఏ నాన్న అయినా మురిసిపోతాడు. మనసులోనే మీసం మెలేస్తాడు. గొంతులో గాంభీర్యం పలుకుతున్నా చూపుల్లో అనురాగాన్ని వర్షించే వ్యక్తి నాన్న. బిడ్డల బాగు కోసం తన రక్తాన్నే రూకలుగా మార్చే మనిషి ఆయన. అందుకే, నాన్న ప్రేమను అక్షరీకరించడం సులభసాధ్యం కాదు. కానీ, తీరైన తెలుగు కలాలకు మాత్రం అది సుసాధ్యమే!



సృష్టిలో గొప్ప వ్యక్తి నాన్న. దీంతోపాటు నాన్నతనానికి మరో గొప్ప ప్రత్యేకత కూడా ఉంది. అదే అలౌకికానుభూతి. నాన్నా అని నోరారా పిలిచే బిడ్డను గుండెలకు హత్తుకున్నప్పుడే ఆ దివ్యానుభూతి అనుభవంలోకి వస్తుంది. అదే సమయంలో బిడ్డ మనసులోనూ ఓ ధైర్యం. తనకే కష్టం వచ్చినా కాపాడటానికి నాన్న ఉన్నాడన్న నమ్మకం!

కన్నబిడ్డల బాగోగులను గురించి నిరంతరం కలలు కంటాడు తండ్రి. ఆ కలలను సాకారం చేసుకోవడానికి రెక్కల కష్టం చేస్తూ తినీతినక పైసాపైసా కూడబెడతాడు. ఈ క్రమంలోనే కష్టాలను దిగమింగుకుంటూ బయటికి మాత్రం గంభీరంగా, సంతోషానికి చిరునామాగా కనిపించే దివ్యమూర్తి నాన్న.

పైకి కరకుగా కనిపించే నాన్న మనసు నిజంగా వెన్న. కన్యాశుల్కం నాటకంలోని అగ్నిహోత్రావధానులు పాత్ర ద్వారా ఈ విషయాన్ని చక్కగా చెప్పారు గురజాడ. ప్రతి మాటకీ ధుమధుమలాడుతూ ప్రథమ కోపంతో మండిపడే అగ్నిహోత్రావధానులు ... తన కొడుకు వెంకటేశానికి గిరీశం చక్కగా చదువుచెబుతున్నాడని తెలుసుకొని 'అదిగో, చదువంటే అష్లాగే చదువుకోవాలి. గొట్టికాయలాడకుండా మావాడిని హాయిదా చేస్తే యంత చదువైనా వొస్తుంది... అలాగే

చేస్తే మా వాడికి చదువొచ్చి అన్ని పరీక్షలూ పాసవుతాడండీ. మా వాడికి డబ్బు ఖర్చు లేకుండా పెళ్ళయ్యే సాధనం కూడా తటస్థిం చిందండి' అంటాడు. ఈ మాటల్లో సామా న్యమైన నాన్న మనసు కనిపిస్తుంది. అంతే కాదు ఆ విషయాన్ని మరింత స్పష్టం చేస్తూ అగ్నిహోత్రావధాన్లు భార్య వెంకమ్మ... 'మీ నైజం కొద్దీ చిట్టూ కొట్టూ మంచారు గాని మీకు మాత్రం అచ్చి మీద ప్రేవలేదా యేవిఁషి?' పట్నంలో గొట్టాలమ్మొచ్చినప్పుడు యంతో బెంగబెట్టుకొని అబ్బిని శలవర్జీ రాసి వెళ్ళిపోరమ్మన్నారు కారా? చదువూ చెప్పిం చక పెళ్ళీ చెయ్యక తీరుతుందా యేవిఁషి?' అంటుంది. కొడుకు దూరంగా ఉన్నప్పుడు తండ్రి మనసు ఎలా తల్లడిల్లుతుందో దీంతో స్పష్టమవుతుంది.

తెలుగు సాహిత్యంలో నాన్న గొప్పత నాన్ని, నాన్నతనంలోని నాణ్యమైన దివ్యాను భూతి పరిమళాన్ని ప్రకటించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. వీటిని ఓసారి తేరిపార చూస్తే నాన్న విలువ అవగతమవుతుంది.

నాన్నకే సొంతం

సృష్టిలో మరెవరూ పొందలేని ఓ అనుభూ తిని బిడ్డల ద్వారా నాన్న పొందుతాడు. అసలు దాన్ని పొందే అర్హత నాన్నకు మాత్రమే ఉంది. ఈ విషయాన్ని తెలుగు సాహిత్యానికి నాన్న లాంటి నన్నయ చెప్పటం మరీ విశేషం. ఆయన స్వయంగా ఆ దివ్యానుభూతిని పొంది ఉండవచ్చు. అందుకే మూలంలో లేకపోయినా తన రచ నలో దాన్ని అంత గొప్పగా అక్షరీకరించాడు. ఆంధ్రమహాభారతం ఆదిపర్వంలో ఒకచోట దుష్యంతుడి ఎదుట శకుంతల ఇలా అంటుంది...

విపరీతప్రతిభాష లేమిటికి నుర్వీనాథ! యీ
పుత్త్రగా
త్రపరిష్వంగసుఖంబు సేకొనుము ముక్తా
హార కర్పూర సాం
ద్రపరాగ ప్రసరంబు జందనము జంద్ర
జ్యోత్స్నయుం బుత్త్రగా
త్రపరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబే
కడున్ శీతమే

'ఈ పిల్లవాడు నీ కుమారుడో కాదో తెలుసు కోవటానికి ఇన్ని మాటలనవసరం. వీణ్ని ఒక్కసారి కౌగిలించుకొని చూడు. పుత్రగాత్ర పరిష్వంగ సుఖమేంటో నీకే తెలుస్తుంది. పచ్చకర్పూరపు పొడి, మంచిగంధం, పండువె న్నెల ఇలాంటివేవీ ఇవ్వలేనంత సుఖాన్ని, చల్లదనాన్ని నీవు పొందుతావ'న్నది శకుంతల మాటల్లోని భావం. తండ్రులెవరి కైనా సరే పుత్రగాత్రపరిష్వంగ సుఖం ఇలా ఉంటుందని చెప్పించాడు నన్నయ. ఈ పద్యంలో వ్యతిరేకాలంకారం కనిపిస్తుంది. అంతేకాదు తెలుగు సాహిత్యంలో స్పర్శ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన గొప్ప పద్యం కూడా ఇదే.

కన్నతండ్రి బిడ్డల విషయంలో పైకి కఠి నంగానే కనిపించవచ్చు. వెన్నముద్ద కూడా దూరం నుంచి చూస్తే గట్టిగా ఉంటుందనిపి స్తుంది. కానీ దగ్గరకు వెళ్లి చూస్తే దాని సున్నితత్వం అర్థమవుతుంది. నాన్న విషయంలోనూ అంతే. ఈ సంగతిని హిర ణ్యకశిపుడి ద్వారా చెప్పాడు పోతన. ప్రహ్లాద చరిత్ర ప్రారంభంలోనే... చిన్నప్పుడే నాన్నను పోగొట్టుకున్న ధర్మరాజు చేత నాన్న గొప్పత నాన్ని చెప్పించాడు. నారదుడు ప్రహ్లాదుడి గురించి చెబుతూ... ఆ పిల్లాణ్ని హిరణ్యకశి పుడు ఎలా బాధించాడో వివరించాడు. ఆ మాటలు విని ఆశ్చర్యపోతూ ధర్మరాజు అంటాడు కదా...

పుత్రులఁ నేర్చిన నేర్వకున్న జనకుల్
పోషింతు రెల్లప్పుడున్
మిత్రత్వంబున బుద్ధి సెప్పి దురితోన్మే
షంబు వారింతు రే
శత్రుత్వంబున దలంప రెట్టియెడ...

పిల్లల విషయంలో తండ్రులెంత ఓర్పుతో ఉంటారో చెప్పే చక్కటి అక్షరాల కూర్పు ఇది.

స్వభావం వృత్తి, వ్యాపారాలు అనుస రించి... తండ్రుల్లో కాఠిన్యం ఉంటే ఉండ వచ్చు. కానీ, కడుపున పుట్టిన బిడ్డలు తమ లా కాకుండా ఇంకా పైఎత్తులకు ఎదగాలని కోరుకుంటారు ఎవరైనా. అలా ఎదిగేందుకు అవసరమైన జ్ఞానాన్ని ప్రసాదించే గొప్ప గురువుల దగ్గరకు తమ పిల్లలను పంపిస్తారు. ఈ ఆలోచనాసరళినే హిరణ్యకశి పుడి పాత్రలో చూపించాడు పోతన. పోతన భాగవతం ఏడో స్కంధంలో ఈ పద్యం ఉంటుంది.

చదువనివా డజ్ఞుండగు
జదివిన సదసద్వివేక చతురత గలుగుం

రాజీవ్ విద్యామిషన్ - కడప, వై.ఎస్.ఆర్. జిల్లా

2012-13 విద్యా సంవత్సరానికి కడప వై.ఎస్.ఆర్. జిల్లాలో రాజీవ్ విద్యామిషన్ చేపట్టిన కార్యక్రమాలు

- 6 నుండి 14 సం॥లోపు బాలబాలికలందరూ ఎలిమెంటరీ విద్య (1 నుండి 8 తరగతులు) పూర్తి చేసేలా కృషి చేయడం కొరకు 1 కి.మీ పరిధిలో ప్రాథమిక పాఠశాల, 3 కి.మీ. పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాల మరియు 5 కి.మీ. పరిధిలో ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేసి బాలబాలికలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించి వాటిని కావలసిన మౌళిక వసతులను కల్పించాలన్న ముఖ్య ఉద్దేశంతో రాజీవ్ విద్యామిషన్ (సర్వశిక్షా అభియాన్) స్థాపించడం జరిగింది.
- జిల్లాలో 4497 ఆవాస ప్రాంతాలు (habitations) ఉన్నాయి. ఇందులో 4336 ఆవాస ప్రాంతాలలో ప్రాథమిక పాఠశాలలు మరియు 4497 ఆవాస ప్రాంతాలలో ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. మిగిలిన 161 ప్రాథమిక పాఠశాలలు లేని ఆవాస ప్రాంతాలలో ఉన్న 463 మంది బాలబాలికలకు రవాణా (ట్రాన్స్‌పోర్ట్) సౌకర్యము కల్పించడం జరుగుచున్నది. ఇందుకు గాను ఒక విద్యార్థికి సం॥నకు రూ.2500/-లు ఖర్చు చేయడం జరుగుచున్నది.
- జిల్లాలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అవసరమగు అదనపు తరగతి గదులు నిర్మించడం మరియు గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మార్చి 2013కు అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, త్రాగునీటి సౌకర్యములాంటి మౌళిక వసతులు కల్పించడం జరుగుచున్నది.
- బాలికల కొరకు అన్ని మౌలిక వసతుల సదుపాయాలతో జిల్లాలో 29 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ద్వారా 5026 మంది బాలికలకు విద్యను అందజేయడం జరుగుతున్నది. విషయనిపుణుల ద్వారా సెలవుల యందు ప్రత్యేక బోధనాతరగతులు నిర్వహించి 2012 మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో 17 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలకు గాను 13 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో 100% ఉత్తీర్ణతను సాధించగా మొత్తం మీద 405 మందిలో 397 మంది ఉత్తీర్ణతతో 98.025%తో మెరుగైన ఫలితాలు సాధించడమైనది.
- జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న 2,18,110 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ప్రాథమిక కంటి పరీక్షలు (చిన్నారి చూపు) నిర్వహించగా 14,059 మంది విద్యార్థులకు దృష్టిలోపము కలిగిన వారిని గుర్తించడం జరిగినది. వీరికి 2వ దశలో 4979 మందికి కంటి అద్దాలు (ఇవ్వడం జరిగినది), 727 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించడం జరిగినది. 3వ దశలో 727 మందికి శస్త్ర చికిత్సలు చేయడం జరిగింది. ఇందులో 22.02.2013 నాటికి 159 మందికి కడప రిమ్స్‌లో నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వారిలో 26 మందికి శస్త్ర చికిత్సల కొరకు ఉన్నత స్థాయి ఆసుపత్రులైన మాద్రన్ కంటి ఆసుపత్రి, నెల్లూరు మరియు పుష్పగిరి ఆసుపత్రి, సికింద్రాబాదు వారి ద్వారా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కడప వారి ద్వారా అవసరమగు వారికి శస్త్ర చికిత్సలు చేయడం జరిగింది.
- జిల్లాలో 2763 మంది బడిబయటి పిల్లలను (అంగన్‌వాడి కార్యకర్తల సర్వే ద్వారా) గుర్తించడం జరిగినది. ఇందులో 6 నుండి 7 సం॥ల వయస్సు గల 182 మందిని రెగ్యులర్ పాఠశాలలో, 8 నుండి 14 సం॥ల వయస్సు గల 1118 మంది బాలురను యన్.సి.యల్.పి. కేంద్రాలలో, సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో మరియు మిగిలిన 8 నుండి 14 సం॥ వయస్సు గల 1463 మంది బాలికలను కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయములలో చేర్పించడం జరుగుతుంది.
- పాఠశాల విద్య మరియు వైద్య ఆరోగ్య శాఖలు సంయుక్తంగా జవహర్ బాల ఆరోగ్య రక్ష అను పేరుతో జిల్లాలో చదువుతున్న అందరు బాలబాలికలకు ఆరోగ్య కార్డులు పంపిణీ చేయడం జరిగినది మరియు విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు నిర్వహించుటకు ఆరోగ్యశాఖ డాక్టర్ల బృందము కూడా ఏర్పాటు చేయడమైనది.
- 2012-13 విద్యా సంవత్సరంనకు గాను బాలబాలికలందరూ ఎలిమెంటరీ విద్య పూర్తి చేసేలా కృషి చేయడం కొరకు ప్రభుత్వం రూ॥ 150.00 కోట్లు నిధులు కేటాయించడం జరిగినది.

డా॥ ఎ.సూర్యనారాయణ రెడ్డి
M.Sc., M.Phil., Ph.D.,
ప్రాజెక్టు ఆఫీసర్,
రాజీవ్ విద్యామిషన్ (SSA)
కడప, వై.ఎస్.ఆర్. జిల్లా

జిల్లా ప్రజలకు విజ్ఞప్తి
బాలల బాల్యం బడిలోనే,
బాలల భవిష్యత్తు
బడిలోనే

కోన శశిధర్
I.A.S.,
చైర్మన్, జిల్లా కలెక్టర్,
రాజీవ్ విద్యామిషన్ (S.S.A.)
కడప, వై.ఎస్.ఆర్. జిల్లా.

★ అందుబాటులో విద్య ★ అందరికీ విద్య ★ ఆడుతూ పాడుతూ విద్య - నాణ్యమైన విద్య ★ విజ్ఞానదాయకమైన విద్య - వ్యక్తి వికాసానికి విద్య!!

జదువగ వలయును జనులకు
జదివించెద నార్యులొద్ద జదువుము తండ్రీ!

ఇప్పటికీ నాన్న మనసు ఇలానే ఉంది. ఆర్థిక స్తోమత లేకపోయినా, అప్పో సప్పో చేసి బిడ్డల్ని మంచి విద్యాసంస్థల్లో చేర్పించాలనుకునే నేటి తండ్రుల మనస్తత్త్వం... నాటి హిరణ్యకశిపుడి మాటల్లో ద్యోతకమవుతోంది. హిరణ్యకశిపుడిలోని నాన్నతనాన్ని ఆ తర్వాత పద్యాల్లో ఇంకా బాగా చెప్పాడు పోతన. ప్రహ్లాదుడు తన శత్రువు శ్రీహరి గురించి పొగుడుతున్నప్పుడు... అదంతా తన బిడ్డ తప్పు కాదని ఎవరో ఏదో అలా చెప్పి ఉంటారని అంటాడే తప్పా ముందు పిల్లాణ్ని కోపగించుకోడు. నాన్న ప్రేమ ఇలాగే ఉంటుంది. దుర్యోధనుడి పద్ధతి మంచిది కాదని తెలిసినా ధృతరాష్ట్రుడు అతన్నే ఎందుకు సమర్థించాడు? పిల్లలపై సహజంగా ఉండే ప్రేమ వల్లే.

తండ్రి గొప్పతనాన్ని తెలుసుకోలేని బిడ్డలు కూడా ఉంటారు. కానీ, జీవిత గమనంలో వారే నాన్నలు అయినప్పుడు మాత్రం తమ పిల్లలను ప్రాణప్రదంగా చూసుకుంటారు. దీనికి కారణం...'ఆత్మావై పుత్రనామాసి' కావటమే. తానే మళ్ళీ కుమారుడుగా పుట్టడం లేదా తన ప్రతిరూపమే కొడుకు అన్నభావం నాన్నలో ఉంటుంది. ఒక దీపం మరో దీపాన్ని వెలిగించినట్టు తండ్రి బిడ్డకు జన్మనిస్తాడు. తనలా వెలిగిపోతూ తనకంటే ఇంకా ఎక్కువ కాంతులను ప్రసరింపచేయాలనే ఆకాంక్ష తండ్రిలో ఉంటుంది.

తెనాలి రామకృష్ణుడి పాండురంగ మాహాత్మ్యంలో నిగమశర్మ ఎలాంటివాడో తెలుగువారందరికీ తెలిసిందే. అతను ఓ నాన్నకు కొడుకుగా ఉన్నప్పుడు ఎన్నెన్నో మోసాలు చేస్తాడు. (ముఖ్యంగా తండ్రి విషయంలోనే). ఆ క్రమంలోనే ఇల్లు విడిచి చెడు తిరుగుళ్లు తిరుగుతూ వేశ్యను పెళ్లాడతాడు. ఆమెవల్ల పుత్ర సంతానం కలుగుతుంది. ఆ బిడ్డలతో అలౌకిక దివ్యానుభూతిని పొందుతాడు నిగమశర్మ. అయితే, ఓ రోజున అతను ఇంట్లో లేనప్పుడు అగ్నిప్రమాదం జరుగుతుంది. అందులో శర్మ భార్యాబిడ్డలు మరణిస్తారు. తిరిగొచ్చాక ఆ దృశ్యాన్ని చూసిన నిగమశర్మ విలవిల్లాడిపోతాడు.

అని తన యాలిని దనయా
లిని గని మణికాని కుడవలే గూడు జలం
బును ద్రావలేననుచు నన
శనమున నతడేగజొచ్చె జనరహితమహిన్.

వలచిన భార్య, వంశోద్ధారకులైన పిల్లలు దూరమయ్యేసరికి తిండి సహించదు. చివరికి అడవులను పట్టుకుని వెళ్లిపోతాడు. తాను బిడ్డగా ఉన్నప్పుడు తండ్రికి మనోవేదన మిగిల్చినా... తానే తండ్రి అయినప్పుడు మాత్రం బిడ్డలపై అవ్యాజమైన ప్రేమను పెంచుకున్నాడు నిగమశర్మ. పై పద్యంలో తెనాలి రామకృష్ణుడు... ఆలి, తనయాలి అనే రెండు పదాలను పక్కపక్కనే వాడటం గమనార్హం. ఆలి అంటే భార్య, తనయాలి అనంటే తనయుల సమూహం.

తథ్యం

దీపాల్ని ఆర్పేసి
చీకటి రాత్రుల్ని
నేలంతా పులిమినా
వినీలాకాశంలో
మబ్బు తెరల్ని కట్టినా
వేకువ వెలుగు
సోకక మానునా!

విశ్వనాథ వారి శ్రీమద్రామాయణ కల్పవృక్షంలోని దశరథుడి పాత్ర అచ్చమైన తెలుగింటి నాన్నకు ప్రతిరూపం. యాగ సంరక్షణ కోసం రాముణ్ని పంపమని విశ్వామిత్రుడు అడిగినప్పుడు, పట్టాభిషేకం భగ్నమై రాముడు అడవులకు వెళుతున్నప్పుడు... దశరథుడిలోని నాన్నతనాన్ని యథాతథంగా అక్షరాల్లోకి అనువదించారు విశ్వనాథ. దశరథుడి మాటల్లో చాలా చోట్ల రఘురాముడు 'తన ప్రాణంలో ప్రాణం' అని చెబుతాడు. తండ్రికి బిడ్డ మీద ఉండే ప్రేమకు అద్దం పట్టే అక్షరాలివి. అయోధ్య కాండలో ఓ చోట కొడుకుతో దశరథుడు ఇలా అంటాడు... 'బిడ్డా! నీ తండ్రిని అని అనిపించుకున్న భాగ్యం నాకు దక్కింది. ఇప్పుడు ఆ భాగ్యమే నాకింతటి వ్యథను కలిగిస్తోంది'. రాముడి ఎడబాటుని తట్టుకోలేని బాధ నుంచి వచ్చిన పలుకులివి.

'కూన! నీ తండ్రి ననిపించుకొన్న భాగ్యమి దియు
నాప్రాణము కెదురెక్కికూల ముద్రుజమ్ముగ నున్నది
ముసురుకొనియె జీవితప్రఘాణ మ్మిరుల్ చెక్కినట్లు'...

రాముడు దూరమవటం అన్నది తన ప్రాణాలను హరించేంతటి భయంకరమైందని ఆవేదన చెందుతాడు ఆ తండ్రి. ఆ అనుభవం... జీవితమనే గృహానికి ముందువైపు ఉండే గది చెదరని చీకట్లో చిక్కుకోవడంతో సమానమన్నది కవి భావన. ఇక్కడ విశ్వనాథ ప్రయోగించిన 'ప్రఘాణం' అనే పదం... పూర్వకాలపు గృహనిర్మాణ విశేషాన్ని వివరిస్తుంది. ఆ రోజుల్లో ఇంటికి తలవాకిట పక్కన ఓ చిన్న గది ఉండేది. అతిథులు అక్కడ సేదతీరే వారు. ఆ గదిలో అంధకారం అలుముకుంది అంటే ఇల్లు కళావిహీనం అయినట్లే లెక్క. (ఇరులు అంటే చీకటి). పుత్రుడు దూరమయ్యాక తన పరిస్థితి అలాగే ఉందని విశ్వనాథ వారి దశరథుడు వాపోయాడు. ఇప్పటికీ బిడ్డలు పెద్ద చదువుల కోసం ఊరు దాటుతున్నప్పుడు... నాన్న మనసు ఇలాగే మూగగా రోదిస్తుంటుంది.

బిడ్డ పుట్టగానే నాన్న మనసు ఉత్సాహంతో ఉరకలేయకపోవచ్చు. కానీ, ఆయన పుత్రోత్సాహాన్ని అనుభవించేది ఎప్పుడంటే... పదిమందీ తన బిడ్డ చేతలను చూసి పొగిడినప్పుడే అన్నాడు సుమతీ శతకకారుడు. నిజమే! 'తండ్రికి మించిన తనయుడు' అనిపించుకున్నప్పుడే కదా కొడుకుకి గొప్పతనం. తండ్రికి ఆనందం. బిడ్డ ప్రగతిని చూసి సంతోషపడినా... ఆ అనుభూతిని లోలోపలే అణచుకుంటాడు నాన్న. బిడ్డను అప్పుడే పొగిడితే... అక్కడితో అతని అభివృద్ధి ఆగిపోతుందేమో నన్న భయమే దీనికి కారణం.

కవులు తమ కావ్యాలు, ప్రబంధాలు, శతకాల్లో నాన్నతనాన్ని గురించి చెప్పిన దాని కన్నా ఓ మెట్టు పైకెక్కి నాన్న శిల్పాన్ని సజీవంగా చెక్కారు ఆధునిక కథా

రచయితలు. నాన్న నేపథ్యంగా కథలు రాసిలో తక్కువే అయినా వాసిలో మాత్రం ముందు వరసల్లో ఉంటాయి. చాసో కథల సంపుటిలోని 'ఎందుకు పారేస్తాను నాన్నా', జగన్నాథశర్మ పేగుకాలిన వాసన కథలసంపుటిలోని 'నాన్నంటే', పెనుమాక నాగేశ్వర రావు రాసిన 'నాన్నలూ జాగ్రత్త, నాన్న..ను వ్వో సున్నానా?, ఆఖరిభయం' లాంటి కథలు నాన్నల సున్నితమైన మనసులను పాఠకుల ముందు ఆవిష్కరించాయి.

వీటిలో 'ఆఖరి భయం' కథ మనసును చివుక్కుమనిపిస్తుంది. పొరుగూరులో ఉన్న కొడుకు తనను చూడటానికి రావట్లేదని బాధ పడుతుంటాడు ఓ తండ్రి. తల్లి లేని బిడ్డ అని ఎంత గారాబంగా పెంచిదీ గుర్తుచేసుకుంటాడు. చివరకు తనకు ఒంట్లో బాగోలేదంటూ టెలిగ్రాం పంపిస్తాడు. హడావుడిగా పరుగెత్తుకొచ్చిన కొడుకుతో ఆ రోజు మాట్లాడతాడు. రాత్రికి ఓ ఉత్తరం రాసి, నిద్రమాత్రలు మింగి మరణిస్తాడు. ఆ ఉత్తరంలో '... నాకు ఆరోగ్యం సరిగా లేదు. ఒక్కసారి చూసి పొమ్మని పదే పదే ఉత్తరాలు రాసినా రాని నువ్వు, నేను చనిపోయానని తెలిసినా వస్తావనే ఆశ చచ్చిపోయింది నాకు. అటు తర్వాత అయినవాళ్ళు, కానివాళ్లు నిన్ను కాకుల్లా పొడుస్తారు. నీకు ఆ మచ్చ జీవితాంతం ఉంటుంది.

అందరిచేత నువ్వలా దూషింపబడకుండా ఉండాలని, దోషిలా తల వంచుకొని నిలబడాల్సిన అవసరం రాకూడదని, నిన్ను ముందుగా పిలిపించుకొని తృప్తిగా కన్ను మూయాలని ఏర్పాట్లు చేసుకున్నాను. ఇదంతా లోకం నిన్ను తప్పుపడితే తట్టుకోలేవనే నీ గురించి భయపడి చేశానుగాని నా స్వార్థం మాత్రం కాదు. డాక్టర్లు అప్పుడప్పుడు రాసిచ్చిన నిద్ర మాత్రలన్నింటినీ పోగుచేసుకొని ఒక్కసారే వేసుకుంటున్నాను. నేనిలా పోయానని ఎవ్వరికి తెలియనీయకు. అందరికీ ఈ రోజుల్లో సాధారణంగా వస్తున్న గుండెపోటే నా చావుకు కూడా కారణం అని మాత్రం అందరూ అనుకోవాలి. నీకు ముందుగానే, నేను టెలిగ్రాం పంపినట్లు కూడా ఎవ్వరికీ చెప్పకు. నీ భార్యకు కూడా ఎవ్వరికీ చెప్పవద్దని చెప్పు.

కన్నకొడుకు తలకొరివి పెట్టకపోతే పున్నామనరకం తప్పించుకోలేనన భయంతో కాదు నిన్ను పిలిపించుకుంది. మనవాళ్లంతా నీ గురించి నీచంగా మాట్లాడుకుంటే నీవు తట్టుకోలేవనే భయంతో మాత్రమే రాశాను. నీ గురించి నా ఆఖరి భయం ఇది.

కోడలికి, పిల్లలకు ఆశీస్సులు. నా దహన సంస్కారాది పనులకు నీ సొమ్ము అనవసరంగా వృథా చేసుకోకు. ఈ పాత పెంకుటిల్లు మాత్రమే నీకు ఈ పేద తండ్రి మిగిల్చి ఇవ్వగలిగిన ఆస్తి. అప్పుడప్పుడు నన్ను గుర్తుకు తెచ్చుకుంటుండు. అదే నాకు తృప్తి' అంటూ రాసి ముగిస్తాడు ఆ పిచ్చి తండ్రి!

సిగ్గుతో చితికిపోయిన కొడుకు... తండ్రి శవంపై పడి గొల్లుమంటాడు. నాన్న మనస్సును సరిగా అర్థం చేసుకోకపోతే... చివరికి విషాదమే మిగులుతుంది.

నాన్న అనురాగంపై కొన్ని చలనచిత్రాల్లో కూడా చక్కటి పాటలు వచ్చాయి. 'ధర్మదాత' కోసం సినారె రాసిన 'ఓ నాన్నా.. నీ మనసే వెన్న.. అమృతం కన్నా అది ఎంతో మిన్న' అనే పాటను వినని తెలుగు వారుండరు.

ఇంకా చెప్పుకోవాలంటే బిడ్డ జీవితంలో నాన్న కలిగించే స్ఫూర్తి అనంతం. త్రిపురనేని గోపీచంద్ ఈ విషయాన్ని సూటిగా చెబుతారు 'అసమర్థుని జీవయాత్ర' ముందుమాటలో. 'ఎందుకు? అన్న ప్రశ్న నేర్పినందుకు నాన్నగారికి' అంటూ అక్కడ ఆయన రాసుకున్న మాటలు... నాన్న పాదాల ముందు సమర్పించిన సువర్ణ పుష్పాలు. ఇలాంటి బంగారు పువ్వులతో నాన్నను నిత్యం పూజిస్తూ, ఆయన మనసును అర్థం చేసుకుంటూ, ఆ గుండె లోతుల్లోని ప్రేమను అందిపుచ్చుకోగలిగినవారే అదృష్టవంతులు.

డా॥ యల్లాప్రగడ మల్లికార్జునరావు
తెలుగుశాఖాధిపతి, హిందూ కళాశాల, గుంటూరు. 80085 73108.

ముద్దతో ముద్దరా...!

అ ఆ స్పందన



పిల్లలు కొన్నింటిని చాలా ఇష్టపడతారు. బొమ్మలనో! కథలనో! ఆ అలవాటును ఉపయోగించుకునే వారికి చక్కగా తెలుగు నేర్పవచ్చు. మా బాబు లక్ష్మీనరసింహమూర్తికి కృష్ణుడి కథలంటే ప్రాణం. వాటిని చెప్పమని అడిగేవాడు. 'అక్షరాలు దిద్దితేనే చెబుతా'ననే దాన్ని. దాంతో వాడు బుద్ధిగా దిద్దేవాడు. అలా కథలు చెబుతూ వాడికి మొత్తం అక్షరాలు, గుణింతాలు నేర్పించా. అలాగే, పళ్లెంలో అన్నం ముద్దలు పెడుతూ లెక్కలు చెప్పేదాన్ని. భోజనం అయ్యాక ఎన్ని ముద్దలు తిన్నావు రా అంటే ఠక్కున చెప్పేవాడు. రాత్రి పడుకునే ముందు సుమతీ, వేమన పద్యాలు నేర్పించే దాన్ని. అయిదేళ్లు వచ్చేసరికి చదవడం, రాయడం నేర్చుకున్నాడు. దాంతో పంచతంత్రం, బొమ్మల రామాయణం, భారతం తదితర పుస్తకాలను తెప్పించి చదివించే దాన్ని. అలా వాడికి తెలుగుపై అభిమానం పెంచా. కాలక్రమంలో ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లాడు. అక్కడే ఉద్యోగం సంపాదించుకున్నాడు. కానీ, మనదైన సంస్కృతిని విడిచి ఉండలేక ఇక్కడకు తిరిగి వచ్చేశాడు. ఇప్పుడు తన పిల్లలకు కూడా తెలుగును పద్యాలతో సహా నేర్పుతున్నాడు.

- చిలుకమర్రి విజయలక్ష్మి
ఇటిక్యాల, కరీంనగర్ జిల్లా

ప్రేమ కుదిరింది!

నాంపల్లి రైల్వేస్టేషన్. కారు ఆగింది. తలుపు తీసుకుని సూట్‌కేసుతో దిగాను. "అన్నీ తీసుకున్నారా" అడిగింది నా భార్య. తలూపాను. "ఫోనుచార్జరు?" అడిగింది.

"మర్చిపోయాను" అన్నాను. ప్రయాణంలో ఏదోకటి మర్చిపోవటం ఆనవాయితీ. తను నవ్వింది. నేనూ నవ్వేశాను.

"అక్కడ ఏదో చూసుకుంటాను. నువ్వు బయలుదేరు" అన్నాను. స్టేషన్లోకి వెళ్లటానికి తిరుగుతూ, "సరే జాగ్రత్త" అని తను కార్లో వెళ్లిపోయింది. రెండు క్షణాలు అలానే చూసి, స్టేషన్లోకి నడిచాను. గోదావరి బయల్దేరడానికి ఇంకా పదిహేను నిమిషాలుంది. పుస్తకాలకొట్టు వైపు నడిచాను. నికోలస్ స్పార్క్ రాసిన 'గార్డియన్' కొని రైలువైపు కదిలాను.

రైలు ప్రయాణం అనేసరికి నాకు ఓ అద్భుతమైన అనుభూతి గుర్తొస్తుంది. అజ్ఞాతంగా ఓ వ్యక్తిని ప్రేమించడం జరుగుతుందా? జరిగింది. అదీ నా విషయంలోనే. నాకు పరిచయం లేని, చూడని, ఊహించలేని ఓ అమ్మాయిని ప్రేమించాను. పిచ్చిపరవశంతో ప్రేమించాను. వింత అనుభూతి!

'ఎస్-9' నాకు ఇష్టమైన బోగీ. సైడ్ లోవర్ బెర్త్. 23 నాకిష్టమైన సీటు ఇదే. పాతికేళ్లక్రితం. 'ఆ' వింత అనుభూతికి నాంది పలికింది. సూట్‌కేసు సీటు కిందకు తోసి సీట్లో కూర్చున్నాను. ఒక్కొక్కరే ఎక్కుతున్నారు. పది నిమిషాలు ఇట్టే గడిచిపోయాయి. రైలు ముందుకు కదిలింది. నా ఆలోచన్లు వెనక్కి కదిలాయి.

ఇదే రైలు, ఇదే కోచ్, ఇదే సీటు, ఇదే స్టేషన్, అదే నేను...

బైకు స్టాండులో పెట్టి "ఇంకా చాలా టైముంది. పెళ్లి చూపులు నీకు, రైలుకి కాదు. అది దాని టైముకే బయల్దేరుతుంది. దానికి తొందరేం లేదు" అన్నాడు సుబ్బు.

"ఎందుకు ఏడుస్తావు? నీకూ ఓ రోజు పెళ్లి అవుతుందిలే. ఇంకా నీ జుట్టు పూర్తిగా నెరవలేదు." అన్నాను, బ్యాగ్ భుజాన వేసుకుని స్టేషన్ వైపు నడుస్తూ.

"నీకే అవుతూంటే నాకు ఎందుకు అవ్వదు" అని. "నేను ఏడుస్తున్నది, నా కోసం కాదు. నీ కోసం" అన్నాడు సుబ్బు.

"ఎవడి ఏడుపువాడు ఏడిస్తేనే, ఏడ్చినట్టుంటుంది" అన్నాను.

"పర్వాలేదు, పరోపకారం. ఇవాళ పొద్దున దాకా ప్రేమించే పెళ్లి చేసుకుంటానని భీష్మించుక్కూర్చుని, ఇలా పెళ్లి చూపులనగానే ఎగేసుకుపోవటం నచ్చక, ఏడుస్తున్నాను." సుబ్బు అన్నాడు.

"ఇంకా 24 గంటలు వ్యవధి ఉంది. రైల్లో ఓ అమ్మాయి దొరకొచ్చు. ఆ పైన నచ్చొచ్చు. తరువాత ప్రేమించొచ్చు. రేపు

సాయంత్రం కదా పెళ్లి చూపులు" అన్నాను.

"అంత అదృష్టమే ఉంటే, నీకు ఈ 24 నెలల్లో ఏదో అమ్మాయి దొరికేది 24 గంటల్లో జరగదు." పెదవి విరిచేశాడు. నేను నవ్వాను.

"అదృష్టం అంటే ఏమిటి? సరైన పని, సరైన చోట, సరైన సమయానికి చేయటమే అదృష్టం. ఓ ఆబ్‌స్ట్రాక్ట్ కాదు, ఓ ఈక్వేషన్" అన్నాను. వాడు నవ్వాడు.

"ఇదే నీ కోచ్. ఎస్-9" ఆగాడు సుబ్బు. నేను చార్టులో నా పేరు చూసుకుంటున్నాను. ఇది నాకు చిన్నప్పటి నుంచి అలవాటు. "అదేం పరీక్షా ఫలితాల జాబితా కాదు. పేరు లేకపోవడానికి అన్నాడు సుబ్బు. "నేను నీ పేరు వెదకటం లేదు" అన్నాను.

"ఎస్ఎల్ 23 శ్రీకాంత్ మేల్ 27" అని ఉంది. 'ఒరేయ్' అరిచాడు సుబ్బు. "నీ సరైన పనికి, సరైన చోటు, సమయం దొరికే సాయనుకుంటా, 24 చూడు" అన్నాడు సుబ్బు.

"ఎస్ యూ 24 పి.సుజాత, ఫిమేల్ 24" అనుంది. "వాళ్ల తాలూకా వాళ్లెవ్వరూ ఉన్నట్లు లేరు తన పీఎన్ఆర్ నంబరు ఎవ్వరికీ లేదు" ఉత్సాహంగా అన్నాను. గాల్లో తేలిపోతున్నంత ఆనందంగా, హాయిగా ఉంది. "పద" అని టైము చూసుకుని, ప్లాట్‌ఫారం మీద పరిగెడుతూ, "ఎక్కడికీ" వెనకే పరిగెడుతూ సుబ్బు. బుక్‌స్టాల్ దగ్గర ఆగాను. ఇండియా టుడే, ది వీక్, బాపు కార్టూన్లు 'టింకిల్స్' కూడా కొన్నాను. ఆ అమ్మాయికి ఏదిష్టమో. డాన్ బ్రౌన్‌ది, డిసెప్షన్ పాయింట్" కొన్నాను. కాస్తయినా ఫోజు కొట్టాలి కదా. నిజానికి బాపు కార్టూన్లు, టింకిల్స్ తప్ప పెద్దగా చదివిన పాపాన పోలేదు. అయినా తప్పదు. అమ్మాయిలకి అబ్బాయిలు కాస్త తెలివైన వాళ్లయితేగానీ ఆనరు. చిరుతిళ్లూ, నీళ్ల సీసా కొనుక్కుని, కాస్త ముఖం సబ్బెట్టి కడుక్కుని, బ్యాగ్‌లోంచి మంచి షర్టు తీసుకుని వేసుకున్నా. గబగబా మళ్లీ కోచ్ దగ్గరకొచ్చేశాం. 24 సీటు ఖాళీగానే ఉంది. ఇంకా వచ్చి ఉండదు. రైలు బయల్దేరడానికి ఇంకా పది నిమిషాలుంది. పదియుగాలన్న మాట.

నా కూపేలో ఓ అయిదుగురు ఒకే కుటుంబం వారున్నారు. 22లో మాత్రం ఎవరో షాబుద్దీన్, వయస్సు 34. అంటే పెళ్లయినవాడే. ఈ ఎనిమిదిట్లో నేనే బ్రహ్మచారిని. హమ్మయ్య అనుకున్నాను.

అనౌన్సర్ పీక పిసికేయాలనిపించింది. గోదావరి ఎక్స్‌ప్రెస్ బయల్దేరుటకు సిద్ధంగా ఉందని పదేపదే చెప్పేస్తోంది. 24 ఇంకా ఖాళీగానే ఉంది.

ఎవడో కోచ్‌లో అటువెళ్తూ ఆగి "సార్ ఇది ఖాళీయేనా" అనడిగాడు కూర్చోబోతూ. "లేదు ఉన్నారు" అని వాడ్ని తరిమినంత పని చేశా. "సుజాత ఇంకా రాలేదేంటి" పైకి అనేశాను. మా సుబ్బు నాకేసి చాలా విసుగ్గా చూశాడు. "నువ్వు బయలుదేరు" అన్నాను. "పర్లేదులే, సుజాత వచ్చాక వెళ్తాను" అన్నాడు. "చెల్లెలంటే ఎంత ప్రేమో?" ముందరి కాళ్లకు బంధం వేసేశా! ఇద్దరం గట్టిగా నవ్వేశాం. సుబ్బు నా చిన్ననాటి నేస్తం, ప్రాణ స్నేహితుడు.

నేను కిటికీలోంచి బయటికి అటూఇటూ చూస్తున్నాను. దూరంగా ఓ అమ్మాయి సల్వార్ వేసుకుని పెద్ద సంచీతో మా వైపు పరిగెత్తుకుంటూ వస్తోంది. జాబితాలో వివరాలకి సరిపోతుంది. రొప్పుతూ పరుగెడుతోంది. దగ్గరకొచ్చేసింది. నా గుండె వేగంగా కొట్టుకుంటోంది. తలుపు దగ్గరకొచ్చేసింది. ఇంకా వేగం పెంచింది. మా కోచ్ దాటి పరిగెత్తుకు వెళ్లిపోయింది. గుండె ఆగినట్టయ్యింది. ఉసూరుమంది ప్రాణం.

"సిగ్నల్ ఇచ్చేశాడు" అన్నాడు సుబ్బు. ఆ క్షణంలో మా ప్రేమకి అడ్డుగోడలా కనిపించాడు. రైలు కదులుతోంది. నా కళ్లు ఇంకా వెదుకుతూనే ఉన్నాయి. సుబ్బు రైలుతోపాటే కదులుతూ "పోన్లేరా, పెళ్లిచూపుల్లో అమ్మాయినే కుదుర్చుకో" అన్నాడు. నేను విషాదంగా నవ్వాను. రైలు స్టేషన్ వదిలి సికింద్రాబాదు వైపు వెళ్లిపోతోంది. 24 ఇంకా ఖాళీగా ఉంది. 24 గంటలు సమయం ఉంది.

లోపల వెదుకుతున్నాను. "ట్రైన్ మిస్సయిందా?". ఆడపిల్లలకి బొత్తిగా సమయం విలువ తెలీదు. "తను ఎక్కవలసిన రైలు, జీవితకాలం లేటు" అనుకుని పైకి చూసి "ఆరుద్రగారూ నన్ను క్షమించండి" అన్నాను. రైలు వేగం

పుంజుకుంది. "ఛ! అనవసరంగా పుస్తకాలు కొన్నాను" అనుకున్నా. ఆటో దొరికుండదు. లేదా ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయుండచ్చు. వచ్చుంటే బాగుండేది. రైలు ఖైరతాబాద్ దాటింది.

"బాబూ మా వాడ్ని కొంచెంసేపు ఇక్కడ కూర్చోబెట్టనా" అడిగింది పక్కసీట్లో ఆవిడ. "భలేవారే! కూర్చోబెట్టండి" అన్నాను. నాలుగేళ్లుంటాయి. చాలా ముద్దుగా ఉన్నాడు. "అల్లరి చేయకుండా కూర్చో" అని, "విండో సీటు కావాలని ఒకటే గోల" అందావిడ. నేను పక్కవైపు చూశాను. "మా అత్తగారు, మామగారు పెద్దవాళ్లు కదా అందుకే..." అందావిడ. నేను సిగ్గుపడ్డాను. "అయ్యో అదేంలేదండి, కూర్చోనీయండి" అన్నాను.

"నీ పేరేంటి" అడిగాను. హుస్సేన్‌సాగర్ దాటేలోపే, మేం మంచి ఫ్రెండ్స్ అయిపోయాం. కానీ, ఆ సుజాత ఇంకా నా మెదడులోంచి పోలేదు. సుబ్బు ఫోన్ చేశాడు. "ఏంట్రా" విసుగ్గా అన్నాను. "సికింద్రాబాదులో కూడా ఎక్కచ్చు మరీ అలా 'డిప్రెషన్' లోకి వెళ్లిపోకు" అన్నాడు. 'థ్యాంక్స్' అని ఫోన్ పెట్టేశాను. ఈ విషయం నాకు తట్టలేదు. జేమ్స్ స్ట్రీట్‌దాటి సికింద్రాబాద్ చేరుకుంటోంది రైలు. సర్దుక్కూర్చున్నాను. రైలు సికింద్రాబాద్‌లో ఆగింది. మళ్లీ ప్రకటనల గోల మొదలైంది. "ఏమండీ ఇదేనా ఎస్-9" అడిగాడు ఒకడు.

"అక్కడ రాసుంది చదువుకో" అని విసుక్కున్నాను. నా కళ్లు ప్లాట్‌ఫారం మొత్తం వెతికేస్తున్నాయి. "సార్ బటర్‌మిల్క్" అన్నాడు ఒకడు తన్నాలనిపించింది.

"ఏం బాబూ ఎవరైనా రావాలా?" పక్కావిడ వాళ్లబాబు చేతిలో బిస్కెట్లు పెడుతూ, నాకూ ఒకటిచ్చింది. "అబ్బే వద్దండి" అన్నాను. ఆవిడ చేతిలో పెట్టేసింది. "తినే బిస్కెట్, బంగారు బిస్కెట్టు కాదు" అంది నవ్వుతూ. ఆవిడ నవ్వు చాలా బాగుంది.

టైం అయిపోతోంది. 'రైలు బయల్దేరడానికి సిద్ధంగా ఉంది' అని వినిపించింది. అందరూ వచ్చి సీట్లలో కుదురుకున్నారు. ఒక్క 24 తప్ప. కోపం, విసుగు, చిరాకు, అన్నీ ఒకేసారి వచ్చాయి. సుజాత మాత్రం రాలేదు. "సుజాత" ఆ పేరు ఎన్నిసార్లు అనుకున్నానో, రైలు దిగి ప్లాట్‌ఫారం మీద నిలబడి గట్టిగా పిలవాలనిపించింది. 'కృపయా ధ్యాన్‌దే' నాలో కంగారు ఎక్కువైంది. ఓపిక నశిస్తోంది. అసహనం పెరిగింది. 'ఛీ' అనుకున్నాను. 'అదృష్టం' నవ్వొచ్చింది. లోపలమాత్రం ఏడుపే. ఏదో ఆత్రం... నాకే వింతగా అనిపిస్తోంది. పరిచయం లేనివాళ్ల కోసం ఆరాటం. వింతకాక మరేంటి?

రైలు కదిలింది. కుడిచెయ్యి పిడికిలితో కిటికీని గట్టిగా కొట్టాను. కోపమే అనుకుంటా. మళ్లీ బయటికి చూశాను. ఎవరైనా బ్యాగ్ తీసుకుని పరుగెత్తుకుంటూ వచ్చే అమ్మాయి కనిపిస్తుందేమోనని. చేతులూపి, వెనక్కి తిరిగి వెళ్లిపోయే వాళ్లే కనిపించారు. ఓ పాతికేళ్ల అమ్మాయిని చూసి "ఇలా ఉంటుందా" అని ఊహించాను. ఇక అనవసరం. రాదు, కాజీపేటలో ఎవ్వరూ ఎక్కరు. నా ముఖం కళావిహీనంగా మారిపోయింది. నాకు తెలుసు. ముఖం చూసుకోనక్కర్లేదు.

ఆ అమ్మాయిని చూడలేదు. ఎవరో తెలీదు. ఎలా ఉంటుందో ఊహించలేను. ఒక్క పేరు తప్ప ఏమీ తెలీవు. కానీ, ఏదో ఆరాటం. ఆతృత. వస్తే బాగుండేది. రానందుకు ఏదో వెలితిగా ఉంది. దీన్ని ఏమంటారు? ప్రేమ? కచ్చితంగా కాదు. అజ్ఞాతంగా ఒకరిని ప్రేమించడం సాధ్యమేనా? 'రబ్బిష్'! మరి విరహమా? ప్రేమించిన అమ్మాయికి దూరంగా ఉంటే విరహం అనుకుంటాను. ఇదేమైనా మనో వికారమా! అయ్యుండొచ్చు. పిచ్చి? అది కూడా. రైలుకి ఇదేం పట్టనట్టు దూసుకుపోతోంది. నా తోటి ప్రయాణికులు, ఎవరి కాలక్షేపం వాళ్లు చూసుకుంటున్నారు నేను తప్ప. అక్కర్లేని ఆలోచనల్తో బుర్ర పాడు చేసుకుంటున్నాను.

నా ఎదురుగా కూర్చున్న కుర్రాడితో కబుర్లు చెప్పాను. అరగంటయ్యింది. టీటీ వచ్చాడు. అందరి టిక్కెట్లు చూశాడు. 24 గురించి అడగలేదు. "సార్ 24 ఖాళీయేనా! అందరూ అడుగుతున్నారు" అనడిగాను. లేదు సుజాత అనే అమ్మాయిది. ముందే



చెక్ చేయించేసుకుని ఎస్-13లో వాళ్ల స్నేహితుల దగ్గర కూర్చుంది" అన్నాడు. నాకు ఎగిరి గంతెయ్యాలనిపించింది. అంటే నిద్రపోటానికి వస్తుంది. వేచి చూద్దాం.

ఆ అమ్మాయి ఎలా ఉంటుంది? నాలో మళ్లీ ఆ సుజాత గురించిన ఊహలు మొదలయ్యాయి. సన్నగా, నాజూగ్గా, పొడుగ్గా, అందంగా ఉంటుందా?

కాలేజీలో మాతో చదువుకున్న సుజాత గుర్తొచ్చింది. ఆ అమ్మాయి తెల్లగా ఉండేది. ఎత్తు తక్కువే. జడలు నడుం వరకు వచ్చేవి. రెండు జడలు వేసుకునేది. కానీ పాపం కుడికాలికి పోలియో! ఈ సుజాత 'ఆ' సుజాత కాదు కదా? అవ్వటానికి ఆస్కారం లేదు. ఆ సుజాత మరాఠీ అమ్మాయి. ఈ పాటికి పెళ్లి చేసేసుకుని ఉండొచ్చు. చదువులో అంత చురుకు కాదు, ఏమో చెప్పలేం, తనే కావచ్చు కూడా. ఓసారి ఎస్-13కి వెళ్లి చూసొస్తే? ఎవరో మనకి ఎలా తెలుస్తుంది.

మా తాతగారి ఊర్లో, ఆయన ఇంటి కింద వాటాలో అద్దెకుండే రమణ మాస్టారి గారి భార్య పేరు కూడా సుజాతే. ఆవిడ చాలా లావుగా ఉండేది. జుట్టు పలచగా ఉండేది. ఎత్తు కూడా తక్కువే. పది దాకానే చదివింది. ఆవిడకి నా లెక్క ప్రకారం ఈ పాటికి నలభై దాటుంటాయి. ఆవిడ ఛస్తే కాదు. కానీ, ఆవిడలా ఉంటుందా? అమ్మో ఊహించుకోలేను.

కాజీపేట వచ్చింది. రైలు దిగి, ఏదో పనున్నవాడిలా ఎస్-13 వైపు కదిలాను. బయటినుంచి చూశాను. చాలా మంది అమ్మాయిలున్నారు. వీరిలో సుజాత ఎవరని? మాయాబజార్ సినిమాలో ఎస్వీ రంగారావు శశిరేఖను వెదకటానికి, వివరాలు తెలుసుకోకుండా, అక్కర్లేని గద పుచ్చుకెళ్లినట్టు. ఏంటో నాకే పిచ్చనిపిస్తోంది. ఎవరో, ఏమిటో, ఎలా ఉంటుందో తెలీకుండా, ఓ అమ్మాయి గురించి ఇంత ఆరాటమా! ఇది ప్రేమా? పిచ్చా?. రెండోదే. 'అమలిన ప్రేమ' ఏమో తెలీదు. మళ్లీ విశ్లేషణ. నేను సమర్థించుకున్నాను.

ఆకర్షణా? మనిషిని చూడకుండా ఆకర్షణ ఎలా పుడుతుంది? మరి ప్రేమ పుడుతుందా? ఛస్తే పుట్టదు. కానీ నాలో ఈ ఆత్రానికి కారణమేంటో? బహుశా, నేను ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకున్నాను కనుక, ప్రేమించేందుకు అమ్మాయి, అవకాశం దొరకలేదు కనుక, విధి లేక ఈ అమ్మాయిని ప్రేమిస్తున్నానేమో! కచ్చితంగా కాకపోయినా, అదే అయ్యుండొచ్చు.

రైలు కదులుతోంది. ఎక్కి నా సీట్లో కూర్చున్నాను. కొన్ని పుస్తకాలు తిరగేస్తున్నాను. అసహనం ఎక్కువైంది. సుజాత మీద కోపంతో పుస్తకాలు పక్కన పడేశాను.

ఖమ్మం దాటే సరికి, బోగీలో అంతా లైట్లు ఆర్పేసి పడకలేశారు. నాకు నిద్దరొస్తోంది.

"ఎక్స్‌క్యూజ్‌మీ" వీణ మీటినట్టుంది. తిరిగి చూశాను. ఓ మెరుపు తీగ. "కొంచెం సీటు మీద కాళ్లు తీస్తారా?" అడిగింది.

"సారీ" అని కాళ్లు తీసి "మీరు సుజాతా?" అడిగాను.

"మీకేమైనా అభ్యంతరమా?" అడిగింది.

"అబ్బే అస్సలు లేదు. కాకపోతే, ఇందాకట్నించి ఎవరోకరు వచ్చి కూర్చుంటూంటే, ఈగల్ని తోలినట్టు తోలేస్తూ, మీ సీటు కాపాడాను" అన్నాను.

"థ్యాంక్స్" అంది కూర్చుంటూ. కిటికీలోంచి బయట చీకట్లోకి చూస్తోంది. నేను దొంగ చూపులు చూస్తున్నా. పది నిమిషాలు గడిచాయి.

"మీకు అభ్యంతరం లేకపోతే, మీరు పైబెర్తు తీసుకుంటారా? నాకు ఇలా కూర్చుని చూస్తూ ప్రయాణం చేయటం ఇష్టం" అంది.

"దానికేముంది అలాగే" అన్నాను. అందమైన అమ్మాయికి సాయం చేయటంలో ఆనందం ఉంటుంది. "ఇప్పుడే పైకి పొమ్మంటారా?" అడిగాను.

"ఇప్పుడే, ఏం తొందర! ఇంకా బోల్డు వయసుంది" అంది నవ్వేస్తూ. నేనూ నవ్వాను. తరువాత ఓ పావుగంటలో డోర్నకల్ వచ్చింది. ఇద్దరం కాఫీ తాగాం. డబ్బులు తనే ఇచ్చింది. రైలు కదిలాక పైకెళ్లి పడుకున్నాను. తెల్లారాక పరిచయం కొనసాగించాలని.

విజయవాడలో లేచి కాఫీకి కాఫీ చెల్లు చేసే నేపథ్యంలో, కాస్త మాట్లాడొచ్చు కదా? అందుకే కళ్లు మూతలు పడుతున్నా బలవంతంగా మెలకువగా ఉన్నాను. నిద్ర ముంచుకొస్తోంది. నిద్ర పోకూడదు. కళ్లు బరువెక్కి పోతున్నాయి. వాలిపోయాయి.

గబుక్కున లేచాను. బోగీలో వెలుగు తెల్లారిపోయింది. కిందకి చూశాను. సుజాత లేదు. రైలు ఆగి ఉంది. కిందకి దిగి ఉంటుంది. అనకాపల్లి. రైలు కదులుతోంది.

"అరే ఈ అమ్మాయి ఎక్కలేదు" పైకనేశాను. పక్క ఆవిడ నాకేసి చూసింది. "ఆ అమ్మాయి ఏలూరులో దిగిపోయింది" అంది.

"అదేంటి! విశాఖపట్నం కదా దిగవలసింది" అన్నాను.

"నిజమే. రాత్రి 22లో అతనికి హఠాత్తుగా గుండెపోటొచ్చింది. చెమటలు పట్టేశాయి. ఈ అమ్మాయి నిద్రపోకుండా ఉంది కనుక చూసి మిమ్మల్ని లేపింది. బోగీలో వైద్యులు కోసం వెదికింది. ఓ వైద్యురాలు దొరికింది. వెంటనే బిళ్లొకటి నాలుక కింద పెట్టి పడుకోబెట్టింది. అప్పుడే ఏలూరు వచ్చింది. ఆ అమ్మాయి మరో ఇద్దరి స్నేహితులతో ఆయన్ని ఆసుపత్రికి తీసుకెళ్లింది" చెప్పిందావిడ.

"మరి నాకు మెలకువ రాలేదేంటి?" మళ్లీ పైకే అన్నాను. "అదే మేమూ ఆశ్చర్యపోయాం. ఇంత గోలా గొడవలో కూడా, నువ్వు అస్సలు కదల్లేదు, లేవలేదు" అంది. నాకు సిగ్గేసింది. అలానే కూర్చుండిపోయాను.

విశాఖపట్నంలో దిగి ఇంటికెళ్లాను. ఎందుకో ఉత్సాహంగా లేదు. సుజాత గురించే నా ఆలోచన. చాలా ముభావంగా ఉన్నాను. మా వాళ్లంతా, నేను ప్రేమించిన అమ్మాయిని చేసుకుంటానని, ఈ సంబంధం బలవంతంగా చూస్తున్నానని అనుకున్నారు. కానీ, అసలు విషయం తెలీదు. నేను చెప్పలేదు.

మధ్యాహ్నం నాన్న చెప్పారు. నీకో శుభవార్త. అమ్మాయి, అదే పెళ్లి కూతురు, హైదరాబాద్ నుంచి రాలేదట. మనం పెళ్లి చూపులకి వెళ్లక్కర్లేదు" అన్నాడు.

"అదేంటి?" అని మాత్రం అడిగాను.

"తను వచ్చే రైల్లో ఎవరో అనామకుడికి గుండె జబ్బు వస్తే, వాడ్ని ఆసుపత్రిలో చేర్చడానికి ఏలూరులో దిగిపోయిందట" అన్నారు.

"ఆ అమ్మాయి పేరు..."

"సుజాత" అంది అమ్మ. "అయినా ఇలాంటి పిల్ల మన కోడలు కాకపోవటమే మన అదృష్టం" అంది.

"అదృష్టం. సరైన పని. సరైన సమయానికి సరైన చోట చేయటమే. ఆ అమ్మాయే అదృష్టం" అనుకున్నాను మనస్సులో.

"మరే.. బాగా చెప్పావు. రేపు పెళ్లయ్యాక, ఇలానే మనల్ని వదిలేసి, ప్రజలకు సేవ చేసేలా ఉంది" అన్నారు నాన్న. నేను వింటున్నాను.

"నీకేంరా... ఇంకా రెండు సంబంధాలున్నాయి, బాధపడకు" అంది అమ్మ. తనకేసి చూశాను.

"పెళ్లి చూపులు రేపు పెట్టుకుందాం అన్నాడాయన. అక్కర్లేదని చెప్పేయనా?" అడిగాడు నాన్న, నన్ను చూసి.

"చెప్పేయండి. పెళ్లి చూపులు అవసరం లేదని" అని "నేను ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుంటాను" అన్నాను. ఇద్దరూ అవాక్కయ్యారు.

"నీకేమైనా మతిపోయిందా?" అడిగింది అమ్మ.

"అమ్మా, ఆ అమ్మాయి ఎవరో ముక్కూ మొహం తెలీని అనామకుడికి సహాయం చేసి, అతని ప్రాణాన్ని కాపాడింది. ఆ అనామకుడి స్థానంలో నేనో, నాన్నో ఉన్నామనుకో" అన్నాను.

"నోర్ముయ్యి. అశుభం పలక్కు" అంది అమ్మ. ఇంక ఏదో అనబోతుంటే, "నువ్వుండు" అన్నారు నాన్న. ఫోన్ తీసి ఏదో నంబరు డయల్ చేశారు.

"భాస్కర్రావు గారూ పెళ్లి చూపులు రద్దు చేయండి. మావాడు ఇష్టపడటం లేదు" అని ఆగి "రేపు నిశ్చితార్థానికి ఏర్పాట్లు చేయించండి" అన్నారు నాకేసి చూసి కన్నుకొడుతూ. నేను ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయ్యాను. "మీకూ మతిపోయిందా?" అంది అమ్మ.

"లేదు నచ్చింది. వాడు చెప్పింది చాలా సమంజసంగా ఉంది. నాకు కనువిప్పు కల్గింది. ఒక్కసారి ఆలోచించు, ఎవరో ముక్కు మొహం తెలీనివాడిని అంతలా చూస్తే, మనల్ని ఎలా చూసుకుంటుందో" ఆలోచించు అన్నారు నాన్న. అమ్మ కూడా ఒప్పుకుంది.

ఇక విశ్లేషణకి తావులేదు. నాది కచ్చితంగా ప్రేమే. సూర్యోదయం ముందొచ్చే ఉదయ కాలపు వెలుగులా, తను నా జీవితంలోకి వచ్చే ముందు, నా హృదయాన్ని తాకిన ఈ సంకేతాలే ప్రేమ.

పెళ్లి జరిగిపోయి, తను నా జీవితంలోకి ప్రవేశించి పాతికేళ్లయ్యింది. మా జీవన గమనం సాగుతూనే ఉంది.

రైలు మాత్రం ఇదేం పట్టనట్టు. ముందుకు సాగిపోతోంది.



పొన్నాడ విజయకుమార్
సినీ రచయిత, హైదరాబాద్.
80088 84281

కదిలే దృశ్యాలు కమనీయ పద్యాలు

కదిలే బొమ్మలు చెప్పే కబుర్లను ఇష్టపడని పిల్లలుంటారా! సాలెపురుగు, గుడ్లగూబ రూపంలోకి మారిపోయి 'చిత్ర'మైన పాత్రలు చేసే సాహసాల నుంచి పిల్లి - ఎలుక కొట్లాటల వరకూ అన్నీ వారికి ప్రాణప్రదమైనవే. బాలకృష్ణులు, బాలభీముల అల్లరినైతే హాయిగా ఆస్వాదించేస్తుంటారు. చిన్నారులకు ఇంతిష్టమైన వినోదాన్ని అందిస్తోంది యానిమేషన్ రంగం. ఇప్పుడు పంచతంత్ర కథల నుంచి వేమన పద్యాల వరకూ అన్నీ బొమ్మల రూపంలో పిల్లల కళ్ల ముందు కదులుతున్నాయి. కాస్తో కూస్తో నీతి, సంస్కారం లాంటి సుగుణాల వైపు కదిలిస్తున్నాయి.

చిన్నారుల్లో మన భాష, సంస్కృతీ సంప్రదాయాల పట్ల జిజ్ఞాసను పెంచడానికి యానిమేషన్ రంగాన్ని ప్రభావవంతంగా ఉపయోగిస్తున్నారు **కొత్తపల్లి సీతారాము.** తన చిత్రాల ద్వారా తెలుగు సాహిత్యాన్ని పిల్లలకు చేరువ చేసేందుకు కృషి చేస్తున్నారు. వేమన శతకం లాంటి ఛందోబద్ధ సాహిత్యానికి దృశ్యరూపమిచ్చి... ప్రపంచంలోనే ఆ ఘనత సాధించిన మొదటి వ్యక్తి అయ్యారు. గిన్నిస్‌బుక్‌లో స్థానం సంపాదించారు. ఈ క్రమంలో తన ప్రస్థానం, తెలుగుపై బాలల్లో మక్కువ పెంచేందుకు యానిమేషన్ మాధ్యమం తోడ్పడే తీరు తదితర అంశాలపై 'తెలుగు వెలుగు'తో సంభాషించారు. విశేషాలు ఆయన మాటల్లోనే...

1990లో ఒక మిత్రుని సూచనతో వ్యాపారార్థం హైదరాబాద్ వచ్చా. తీరిక సమయాల్లో మిత్రుని స్టూడియోలో యానిమేషన్ రూపకల్పన విధానాన్ని పరిశీలించేవాణ్ని. వారు పంచతంత్రాన్ని యానిమేషన్ ధారావాహికగా తీయాలని ప్రయత్నించి, ఆర్థికంగా వెసులుబాటు కాదని విరమించుకున్నారు. అప్పుడు నాకొక పురాతన పంచతంత్ర గ్రంథం లభించింది. అత్యధిక ఆదరణ కలిగిన పంచతంత్రను యానిమేషన్ ధారావాహికగా రూపొందించాలని సంకల్పించుకున్నా. అయితే, ఇది చాలా ఖరీదైన వ్యవహారం. దానికోసం సొంతంగా పరిశోధన చేసి తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో ఈ చిత్రాలను రూపొందించడానికి సాయపడే ఒక సాఫ్ట్‌వేరును రూపొందించా. దీని ఆధారంగా పనిచేసేందుకు 13 రకాల యంత్ర పరికరాలనూ తయారుచేశా. నా ప్రయత్నం గురించి చెబుతూ చాలా మందిని కలిశా. ఎవరూ స్పందించలేదు.

ఈ సాఫ్టువేరుతో సాధారణ కెమెరాతో మా ఊరిలోనే 'సత్యమేవ జయతే' యానిమేషన్ లఘుచిత్రం తీసి ప్రదర్శించా. ఇది పిల్లలను బాగా ఆకట్టుకుంది. ఢిల్లీ 'దూరదర్శన్' వారికి చూపించా. 'పంచతంత్రం' మొత్తం తీయండి, మేం అన్ని భాషల్లో ప్రసారం చేస్తాం అని అన్నారు. యానిమేషన్‌కు అనువుగా, నేటి బాలలకు ఆసక్తికరంగా ఉండేలా మూల కథలను స్వల్పంగా మార్చి రాసుకున్నా. స్క్రిప్టు పట్టుకుని రెండేళ్ల చెప్పులరిగేలా తిరిగాను. ఎట్టకేలకు, అమెరికాలో వైద్యుడిగా స్థిరపడ్డ మాధవ.టి.పల్లి ముందుకొచ్చారు. ఆయన సాయంతో 1999-2000లో రెండు కథలను లఘుచిత్రాలుగా రూపొందించా. పలు చలనచిత్రోత్సవాల్లో ఇవి ప్రశంసలు అందుకున్నాయి. ఆ తర్వాత వ్యాపార ఒప్పందాల్లో ఇబ్బందులు తలెత్తడంతో నాలుగేళ్ల పాటు ఖాళీగా ఉండిపోయా. ఆ సమయంలోనే మనసు తెలుగు పద్యాలపైకి మళ్లింది. ఇక్కడో విషయం చెప్పాలి. 1997లో మా అమ్మాయి హైదరాబాద్‌లోని ఓ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతుండేది. తను ఒకసారి ఏనుగంటే ఎలిఫెంటా అని అడిగింది. తెలుగు భవితపై నాకు భయం పుట్టింది. ఈ ముప్పును తప్పించడానికి నాకు తెలిసిన విద్యతో ఏదైనా చేయాలనుకున్నా. బాల్యంలో చదువుకున్న రామ, సుమతీ, కృష్ణ, వేమన శతకాలను సేకరించి అధ్యయనం చేశా.

1998లో అనుకుంటా! మూడో తరగతిలో ఉన్న మా అబ్బాయి- 'వేరుపురుగు చేరి వృక్షంబు చెరచును'



అన్న వేమన పద్యం చదువుతున్నాడు. అదే సమయంలో ఈటీవీలో 'అన్నదాత' కార్యక్రమం వస్తోంది. పంటను దెబ్బతీసే వేరుపురుగు, కాండం తొలచే పురుగు గురించి అందులో దృశ్యసహితంగా చెబుతున్నారు. ఇటు అబ్బాయి చదువుతున్న పద్యం, అటు టీవీలో కనిపిస్తున్న దృశ్యం నాలో కొత్త ఆలోచన కలిగించాయి. తెలుగు పద్యాలను ఇలా దృశ్యాధారంగా చెబితే పిల్లల హృదయాలకు హత్తుకుంటాయని అనిపించింది.

అయితే, ఇతర పద్యాలతో పోలిస్తే దృశ్య సంవిధానానికి ఉండాల్సిన లక్షణాలు వేమన పద్యాల్లో పుష్కలంగా కనిపించాయి. వేల సంఖ్యలో ఉన్న వాటిల్లోంచి యానిమేషన్‌కు అత్యంత అనువైన వంద పద్యాలను ఎంపిక చేశా. నేటి చిన్నారుల ఆసక్తి, పద్యాల్లో భావం, వ్యక్తీకరణలో సరళత్వం, తెలుగు సంస్కృతి- ఇలాంటి అంశాల ప్రాతిపదికగా వీటిని ఎంచుకున్నా. 'విశ్వదాభిరామ వినురవేమ' పేరుతో ఒక నివేదిక తయారు చేసి, అనేక మందిని కలిశా. ఎవరూ పట్టించుకోలేదు. దాంతో పూర్తి నిరాశలో ఉన్న నాకు మిత్రుడు చంద్రశేఖర్ (హైదరాబాద్) ద్వారా నిడదవోలు వెంకటేశ్వరప్రసాద్ (విశాఖపట్నం)తో పరిచయమైంది. ఆయన ఆర్థిక సాయంతో 2007 నాటికి ఈ చిత్రం రూపు దిద్దుకుంది. కొద్దిమంది సిబ్బంది సాయంతో రెండేళ్లలో చిన్న ఇంట్లో దీనిని పూర్తిచేశాం. ఈ చిత్రం చూస్తే తెలుగు అక్షరాలు చదవడం రాని తెలుగు బాలలకు కూడా వేమన పద్యాలు కంఠతా వచ్చేస్తాయి. అత్యధిక తెలుగు లోగిళ్లకు చేరితేనే ఈ చిత్ర రూపకల్పన వెనకున్న 'సాంస్కృతిక లక్ష్యం' నెరవేరుతుంది. తక్కువ ధరకు అందివ్వడం, వ్యయనియంత్రణ కోసం సొంతంగా అభివృద్ధి చేసుకున్న ఒక దేశవాళీ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ చిత్రాన్ని రూపొందించాం. పూర్తయిన చిత్రాన్ని పట్టుకుని, ప్రపంచంలో ప్రముఖ తెలుగు భాషాభిమానులు అనుకుంటున్న వారందరినీ కలిశా. ఎక్కడా ఆశించిన స్పందన రాలేదు. రిక్త హస్తాలతో మా ఊరు వెళ్లడానికి మనసు అంగీకరించక, ఇక్కడ ఉండలేక నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న నాకు విశ్రాంత ఐపీఎస్ అధికారి చెన్నూరు ఆంజనేయరెడ్డితో పరిచయం కలిగింది. ఆయన అండదండలతో ఈ ఏడాది జనవరిలో బొమ్మల పుస్తకం-డీవీడీ రూపంలో 'విశ్వదాభిరామ-వినురవేమ' విడుదలైంది. గంట నిడివిగల ఈ చిత్రానికి సాంకేతిక పరిజ్ఞాన పరంగానే కాకుండా, మరో ప్రత్యేకత కూడా ఉంది. ఛందోబద్ధ సాహిత్యం దృశ్యరూపం పొందడం ప్రపంచంలో ఇదే తొలిసారి. అందుకే దీనికి గిన్నిస్ బుక్‌లో చోటు లభించింది.

కొత్త తరంలో మాతృభాషపై ప్రేరణ కలిగించడానికి యానిమేషన్ మంచి సాధనం. తెలుగుపై ఆసక్తి లేని వారికీ ఆసక్తి కలిగించి భాషను అభివృద్ధి చేసుకోవాలి. తెలుగువారిలో తెలుగు అక్షరాస్యులు తగ్గిపోతున్నారు! చాలా మంది తల్లిదండ్రుల్లో పిల్లలకు తెలుగు రావడం లేదనే బాధ ఉంది. దీన్నుంచి బయటపడేందుకు తగిన మార్గాలు లేవు. ఉన్న కొన్నింటిలో దృశ్యశ్రవణ మాధ్యమం ఒకటి. దీని కిందకు వచ్చే వాటిలో యానిమేషన్ ప్రధానమైంది. కదిలే దృశ్యాలు ఏవైనా పిల్లలను కట్టిపడేస్తాయన్నది వాస్తవం. సాధారణ సినిమాల్లో మనిషి బలహీనతలను ఆసరాగా చేసుకుంటుంటారు. యానిమేషన్ చిత్రాల్లో ఊహకు అవకాశం ఎక్కువ. ఊహ విస్తృతి పెరిగేకొద్దీ వీక్షకుడిలో ఆశ్చర్యం, స్పందన పెరుగుతూ పోతాయి. ఈ ప్రభావం పిల్లలపై మరీ ఎక్కువ. దీనిని గుర్తించి ఒక అవకాశంగా మలచుకోవాలి. ఇప్పుడు టీవీల్లో వచ్చే సాధారణ సినిమాల కన్నా యానిమేషన్/కార్టూన్ చిత్రాలనే పిల్లలు ఎక్కువగా ఇష్టపడతారు. శిబి చక్రవర్తి, రంతిదేవుడు, జీమూతవాహనుడు, దధీచి, నచికేతుడు లాంటి వీరులు, త్యాగధనుల జీవితచరిత్రను యానిమేషన్ చిత్రాలతో బాలలకు పరిచయం చేస్తే వారి వ్యక్తిత్వం వికసిస్తుంది. ఇలాంటి చిత్రాల రూపకల్పనలో ప్రభుత్వం చొరవ చూపాలి. సమావేశాలకు పరిమితమైతే భాషాభివృద్ధి అసాధ్యం. కచ్చితమైన, నిర్మాణాత్మకమైన కార్యక్రమాలు జరగాలి.



లోకాన్ని చదివారు

శ్రీకాకుళం జిల్లా పలాస మండలం లొద్దభద్రలో జన్మించారు సీతారాము. కారణాంతరాల వల్ల ప్రాథమిక విద్యతోనే ఆయన చదువు ఆగిపోయింది. అయితే, పెదనాన్న సాహచర్యంలో ఆధ్యాత్మిక భావాలు, పురాణ పఠనంతో భాషాజ్ఞానం అలవడ్డాయి. కథలు, కవితలు, పాటలు రాయడంతోపాటు నాటకాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో, రాజకీయాల్లో పాల్గొన్నారు. ఒక చిన్న పత్రిక నడిపారు. యానిమేషన్ రంగంలోకి వచ్చాక బెంగళూరుకు చెందిన 'ఇంటర్నేషనల్ ఇంటిగ్రిటీ, పీస్ అండ్ ఫ్రెండ్‌షిప్ సొసైటీ' నుంచి 'భారత జ్యోతి', హైదరాబాద్ జ్ఞానీ ఫౌండేషన్ నుంచి 'కళాసమ్రాట్', సీవీ రామన్ అకాడమీ నుంచి 'సరస్వతీ పుత్ర' పురస్కారాలను అందుకున్నారు.

సీతారాము యానిమేషన్ చిత్రాలు

- సత్యమేవ జయతే (22 నిమిషాలు)
- చెరపకురా చెడేవు (45 ని॥)
- గుడ్డి గద్ద-టక్కరి పిల్లి (23 ని॥)
- దసరా పాటలు (27 ని॥)
- విశ్వదాభిరామ వినురవేమ (60 ని॥)

(కొత్తపల్లి సీతారాము: 98499 32519)

లింగుట్ల రవిశంకర్.
హైదరాబాద్. 99633 79716.

ఇది విద్యా మిథ్యా?



విద్యార్థులను నైతికంగా సమున్నతులుగా తీర్చిదిద్దాల్సిన వ్యవస్థ... కేవలం భావి ఉద్యోగులను తయారు చేసే కర్మాగారంలా తయారైంది. ముఖ్యంగా గడిచిన రెండు దశాబ్దాల్లో విద్యారంగంలో నైతిక విలువలు పతనమయ్యాయి. ప్రభుత్వం, విధాన నిర్ణేతలు, విద్యాధికారులు, ఉపాధ్యాయులు... ఎవరూ ఈ విషయాన్ని పట్టించుకోవట్లేదు. వాస్తవానికి విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడానికి నాలుగు పద్ధతులు ఉన్నాయి. అవి జ్ఞానాన్ని అందజేయడం, నైపుణ్యాలు (స్కిల్స్) నేర్పడం, మానవత్వ విలువలు పెంపొందించడం, శారీరక వ్యాయామం. ఒకప్పుడు విద్యాలయాల్లో మొదటి దానికి ఎక్కువ ప్రాధాన్యం ఉండేది. ఇటీవల నైపుణ్యాలకు గిరాకీ బాగా పెరిగింది. పెద్ద జీతాలు వచ్చే ఉద్యోగాలను సాధించడానికి అవసరమయ్యే నైపుణ్యాలను నేర్పడాన్నే ఇప్పటి విద్యాసంస్థలు ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నాయి. అయితే ఈ నైపుణ్యాలు కేవలం బతకడానికి, ఆర్థికాభివృద్ధికి మాత్రమే ఉపయోగపడతాయి. కానీ, మనిషి మనిషిలా బతకడమెలాగో అవి నేర్పించవు. జ్ఞానం ఆ పని చేస్తుంది. జ్ఞానాధారిత విద్య... నవతరాన్ని బాధ్యతాయుతమైన, నిజాయితీపరులైన, నిష్పాక్షిక, నిశిత దృష్టితో అన్ని విషయాలను పరిశీలించగల పౌరులుగా తయారు చేస్తుంది. సృజనాత్మకత, బుద్ధి కుశలత, ఓర్పు, స్వయంకృషి లాంటి సుగుణాలు విద్యార్థులకు అబ్బుతాయి.

నేటి యువతరం శారీరకంగా, మానసికంగా ఎక్కువ ఒత్తిడికి గురవుతోంది. కొన్ని దశాబ్దాల కిందట ఆర్. కె. నారాయణ్ ఎంపీగా ఉన్నప్పుడు, రాజ్యసభలో మాట్లాడుతూ... బడి పిల్లలు మోసే పుస్తకాల బరువు నానాటికీ పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నేళ్లయినా పరిస్థితిలో ఏమైనా మార్పు వచ్చిందా అంటే, వచ్చిందనే చెప్పాలి! బరువు ఇంకా పెరిగింది!

వేలకు వేలు చెల్లించి పిల్లలను ఖరీదైన పాఠశాలల్లో చేర్పిస్తున్నారు తల్లిదండ్రులు. అయితే, ఆ బళ్లలో పిల్లలు సరదాగా ఆడుకోవడానికి, వినోదానికి, విశ్రాంతికి సమయముండదు. తరగతి గది నుంచి భోజనశాలకి అక్కడ నుంచి వెంటనే మళ్లీ తరగతులకి వెళ్లాలి. కొన్ని బళ్లలో భోజనశాలలో గోడల మీద వాళ్ల పేర్లూ, పరీక్షల్లో వారి స్థానాలూ, ఇతర విద్యార్థులతో పోలికలు రాసి ఉంటాయి. దాంతో చిన్నారులు మనశ్శాంతిగా భోజనం కూడా చేయలేరు. ఇలాంటి కఠినమైన, నిర్దాక్షిణ్యమైన, తెలివిమాలిన శిక్షణ పూర్తి చేసుకున్నవారు ఎలాంటి పౌరులుగా మారతారు? మనోవైకల్యాలు, ఆనందరహిత బాల్యం వారిని వేధించవా?

ప్రవేశ పరీక్షలు, ఉత్తీర్ణత శాతాలు, ఉన్నత స్థానాల హోరులో నిజమైన చదువులు మట్టిగొట్టుకుపోతున్నాయి. వ్యాపార దృష్టితో కూడిన ఈ విద్యావిధానం నుంచి తల్లిదండ్రులు బయటకురావాలి. తమ పిల్లల్లో కూడా చైతన్యం తీసుకురావాలి. పిల్లవాడికి ఆసక్తి ఉన్న వాటినే చదువుకునేలా ప్రోత్సాహమివ్వాలి. అప్పుడే ఆరోగ్యవంతమైన నవసమాజం రూపొందుతుంది.

విద్యలో నైతిక విలువల ఆవశ్యకత గురించి రాధాకృష్ణన్ కమిషన్ (1948), కొఠారి కమిషన్ (1965) చెప్పాయి. యునెస్కో కూడా ఉన్నత విద్యలో మానవత్వ విలువలను పోషించాలంది. విద్యావ్యవస్థలో స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం ఉండాలని 1998లో జరిగిన అంతర్జాతీయ సమావేశం స్పష్టం చేసింది. ఈ సమావేశానికి 180 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. 1999 నాటి మన దేశ పార్లమెంటరీ కమిటీ తన నివేదికలో 'వైజ్ఞానిక, శారీరక, ఆధ్యాత్మిక, నైతిక పురోగతిని దృష్టిలో పెట్టుకునే విద్య సాగాల'ని చెప్పింది. అయితే, ఏం లాభం! మన విధాన నిర్ణేతలకు ఇవన్నీ తలకెక్కట్లేదు. విద్యావ్యవస్థలో మార్పులు చేయడానికి వారికి మనస్కరించట్లేదు.

విద్యలో నాలుగో అంశమైన శారీరక వ్యాయామం గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. ఇప్పుడు చాలా ప్రభుత్వేతర పాఠశాలలు చిన్న చిన్న ఇళ్లల్లో, వాణిజ్య సముదాయాల్లో నడుస్తున్నాయి. వాటిల్లో ఆటస్థలమన్నది మిథ్య. విద్యార్థులకు ఆటలు అనవసరమని చాలా విద్యాసంస్థలు భావిస్తుంటాయి. కానీ, శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే మనస్సు ఆనందంగా ఉంటుంది. అప్పుడే మెదడు కొత్త విషయాలను నేర్చుకోవడంపై దృష్టి పెడుతుంది. ఆటపాటలకు దూరమైన చిన్నారులకు ఈ అవకాశం ఉండదు కదా! 'విద్య అంటే ప్రజలకు సరైన అవగాహన లేకపోవడమే అభివృద్ధికి నిజమైన ప్రతిబంధకం. మనం భూమి విలువని ఎలా అంచనా వేస్తామో అలాగే విద్య విలువనీ అంచనా వేస్తాం. ఎక్కువ సంపాదన తెచ్చే విద్య మాత్రమే కావాలనుకుంటాం. చదువుకునే వారి శీలం, నడవడిని మెరుగుపర్చడం గురించి మనం ఎక్కువ ఆలోచించం'... ఎనిమిది దశాబ్దాల కిందట జాతిపిత మహాత్మాగాంధీ వ్యక్తం చేసిన అభిప్రాయమిది. ఇన్నేళ్లలో మనలో ఏమైనా మార్పు వచ్చిందా? ఆత్మపరిశీలన చేసుకోవాలి.

భారత దేశ విద్యావ్యవస్థ లోపభూయిష్టంగా మారింది. తక్షణం ప్రక్షాళన చేయాలి... 2001లో నాటి ప్రధాని వాజ్‌పేయి వ్యాఖ్య.

దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం... 2013లో నేటి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి పల్లంరాజు హామీ.

ఏళ్ల తరబడి పాలకులు ఇలా మాటలు చెబుతూనే ఉన్నారు. అలా తరాలు మారిపోతున్నాయి. మరి పనులెప్పుడు చేస్తారో!?

ఇ.నాగేశ్వరరావు

హైదరాబాద్. 040 27424192

అక్షరాలతో ముగ్గులు! అ ఆ స్పందన



బమ్మార్పణం... బమ్మామహి... బమ్మగ్నో.... కంగారు పడకండేం! మా చిట్టితల్లి శరణ్య శ్లోకాలు చదివే శైలి ఇది. భగవద్గీతలోని బ్రహ్మార్పణం... బ్రహ్మహవిః.. బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్‌ను ఇలా ముద్దు ముద్దు మాటలతో చెబుతుంటే వినేవాళ్లందరూ ఎంత ముచ్చటపడే వాళ్లో! తనకొచ్చినట్లుగా అలా పాడుతూనే పదిహేను రోజుల్లో శ్లోకాలపై పట్టుసాధించింది మా బంగారం. మన సంస్కృతి అంటే నాకు ప్రాణం. మన భాష అంటే తరగని అభిమానం. అందుకే తెలుగులో స్నాతకోత్తర విద్య పూర్తి చేశా. ప్రస్తుతం ఆంధ్ర భాషోపన్యాసకురాలిని. తరగతి గదిలో పద్యాలను రాగయుక్తంగా పాడుతూ పిల్లలకు బోధన చేస్తా. ఇక మా శరణ్యకు తెలుగును ఎలా నేర్పానంటే... ముగ్గులు, చిరుతిళ్లు, చలనచిత్రాల ద్వారా! ముగ్గులు వేసేటప్పుడు తెలుగు అక్షరాలు, అంకెలను వాటిలో చిత్రించే దాన్ని. తర్వాత వాటిల్లో ఒక్కొక్క దాని గురించి చెబుతూ పాపతో మళ్లీ వేయించే దాన్ని. తర్వాత జంతికల్లాంటి వాటిని కూడా 'అక్షర' రూపంలోనే తయారు చేసేదాన్ని. ఒక్కొక్క దాన్ని చదువుతూ తినేది శరణ్య. నందమూరి వారి చిత్రాల సాయంతో చారిత్రక కథలపై మా అమ్మాయికి ఆసక్తి కలిగించా. బొబ్బిలి యుద్ధం లాంటి చిత్రాలను కథలుగా మార్చి చెప్పేదాన్ని. అలాగే, పాప వాళ్ల నాన్నమ్మ భారత, రామాయణాలను కథలుగా చెప్పేవారు. అవంటే పాపకు ఎంతిష్టమో! అడిగి మరీ చెప్పించుకునేది. ఈ కథలతో తెలుగుపై తనకు ఇష్టం ఇంకా పెరిగింది. ఆ ఇష్టాన్ని ప్రేమగా మార్చి భవిష్యత్తులో తనను కూడా తెలుగు ఉపాధ్యాయురాలిని చేయాలన్నది నా ఆశ! చేస్తానన్న నమ్మకమూ ఉంది.

- మంత్రిప్రగడ నాగలక్ష్మి,

నర్సీపట్నం, విశాఖపట్నం జిల్లా

పాటల వేటూరి మాటల చాతురి

వేటూరి

అనే మూడక్షరాల పేరు... తెలుగు పాటలమ్మ వన్నెల చీరకు వెన్నెల జలతారు. గలగలపారే పదామృతాల సెలయేరు. దాదాపు మూడు దశాబ్దాలకు పైబడి చలనచిత్ర సీమను ఒక ఏలుబడిగా, సాగుబడిగా తన పాటల పలుకుబడిగా చెలాయించుకుని, చెలామణి చేసుకున్న అపురూపమైన మాటల ముత్యాలపేరు - 'వేటూరి'.



వెండితెర ద్వారా అశేష రసజ్ఞలోకాన్ని పాటకట్టుతో ఆకట్టుకున్న చలనచిత్ర మహాభారత గేయపర్వ గాంగేయమూర్తి, స్వర్గీయ డా॥ వేటూరి సుందరరామమూర్తి.

మంచి గంధపు చల్లదనం, మల్లెపూవు సౌరభం, జుంటితేనె తీయదనం, కోయిల గొంతు కమ్మదనం వంటి పరిచయం అక్కర్లేని జాతివన్నె వస్తువుల జాబితాలో చేరే మరో అంశం వేటూరి పాట.

చలనచిత్ర గీతాలకు కలం నేత నేసిన కలనేతలు, చమత్కారాల చమ్కీల కలబోతల సంగతులన్నీ ఆయా గాయకుల గళగతుల్లో ఇప్పటికే జనప్రసిద్ధం.

పాటల్లోనే కాదు.. మామూలు మాటల్లో కూడా మనస్సును ఆహ్లాదపరుస్తూ సంభాషణ సరస్వతికి వేటూరి వేసిన పట్టుశాలువలు ఎన్నో..

హాసాలు, విలాసాలు, వికాసాలు ఎన్నెన్నో.... ఆ నోటిన వెలువడిన అన్నోటి చమత్కా "రసగుల్లాల" నుంచి ఉల్లాసంగా కొన్ని సల్లాపాలు...

విశ్వప్రభాకరం

విజయవాడలోని ఎస్.ఆర్.ఆర్.సి.వి.ఆర్ ప్రభుత్వ కళాశాల్లో బి.ఏ. విద్యార్థిగా ఉన్న రోజులవి. తెలుగు, సంస్కృత భాషలు అభిమానవిశేషకంగా తీసుకొని అధ్యయనం సాగిస్తారనుకున్న వేటూరి బి.ఏ(ఆర్థికశాస్త్రం)లో చేరారు. అప్పట్లో ఆ కళాశాలలో వేటూరికి ఆంధ్రోపన్యాసకులుగా తరగతులను తీసుకుంటున్న కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు వేటూరి వారి వంశ ప్రఖ్యాతి తెలుసు. ఓ రోజు సుందరరామమూర్తిని దగ్గరగా పిలిచి "మీ పెదనాన్న గారైన వేటూరి ప్రభాకరశాస్త్రిగారిలా పండితుడివో, లేదా నాలాంటి గొప్ప కవివో అయ్యేలా ఏ స్పెషల్ తెలుగునో అభిమాన విషయంగా ఎంచుకోక ఈ ఆర్థికశాస్త్రంలో చేరావేం." అని అడిగారట. దానికి బదులిస్తూ "మా పెదతండ్రి గారి నుంచి ఇంటి విద్య

అయిన శాస్త్రసారం, మీ సాహిత్యానికి చెందిన అర్థసర్వస్వం గ్రహించడానికే ఈ "ఆర్థికశాస్త్రం" అనే మిషతో ఈ కళాశాలలో చేరాను. మీరింత స్పెషల్‌గా నన్ను పిలిచి అడగడం కన్నా స్పెషల్ తెలుగు తరగతిలో చేరడం గొప్పంటారా?" అని ప్రశ్నించారు. వేటూరి ప్రతిభాత్మక వినయానికి ముగ్ధులయ్యారట విశ్వనాథ. అనంతర కాలంలో గారి వ్యక్తిత్వ వైభవాన్ని ఎంత చమత్కారంగా వర్ణించారో!

పార్క్‌లాండ్స్ హోటల్‌లో కాఫీ- పానగల్ పార్క్ ముందు పేవ్‌మెంట్ వారి పార్లమెంటు. స్పీకర్‌వారు. అలాగని వారే స్పీకర్. వారికంటె, వారి కంటి చూపు, దాని కంటె వారి చిరునవ్వు, రెంటి కంటె వారి మద్యేమౌనం ఇంకా బాగా మాట్లాడేది. వద్దన్నా గోల్డ్‌ఫ్లాక్ సిగరెట్ అందించేవారు. విశ్లేషించిన తీరు అనితర సాధ్యం. అందుకే రాసిన మల్లాది వారు, వారి గురించి విశేషాలు రాసి పోసిన వేటూరి 'చిరంజీవులు'.

వైకౌంట్ విమానం... వైకుంఠయానం

'ఓసారి.. ప్రముఖకవి దాశరథి, వేటూరి కలిసి మద్రాసు నుంచి హైదరాబాద్ వస్తున్నారు. తానెక్కిన విమానం పేరు 'వైకౌంట్". విమానం నెమ్మదిగా గాల్లోకి లేచి

చెణుకుల పుణుకులు

- విద్యుత్తు సరఫరా ఆగిపోయి బాగా ఉక్కపోస్తున్న సమయాన "గురూజీ! ఏదైనా మాంచి చమత్కారం ఒకటి వెయ్యండి" అన్న అభిమానిపై ముద్దుగా విసుక్కొంటూ 'చెమటకారడాలు ఆగడం ఎలాగా? అని ఆలోచిస్తుంటే మీ చమత్కారాల ఆగడం ఏమిటి స్వామీ?" అన్నారు వేటూరి.
- మార్క్సిజం అంటే? అని ప్రశ్నిస్తే రిమార్క్సిజం లేనిది అని ఆయన జవాబు.
- ఆదిశంకరులు చెప్పింది భజగోవిందం - ఆధునిక సంకరులు చేస్తున్నది భజనగోవిందం.
- దివిసీమలోని 'అవనిగడ్డ'లో వేటూరి వారి సప్తతి ఉత్సవానికి ఏర్పాటు చేశారు. రాజకీయరంగ, సాహితీ సంస్కారులు మండలి బుద్ధప్రసాద్ ప్రధాన కర్తవ్య బాధ్యత వహిస్తున్న నేపథ్యంలో "ఇది సాహితీ యోగకుండలి.. మనదంతా బుద్ధప్రసాద మండలి" అని చమత్కరించారు.
- నటరత్నంగా కాంతులీనుతున్న కాలంలో ఎన్టీఆర్ తన స్వస్థలం నిమ్మకూరుకు వేటూరిని తీసుకువెళ్లారు. భోజనం ఎన్టీఆర్ స్వగృహంలోనే. ఆ సన్నివేశాన్ని మరింత రుచిభరితం చేస్తూ "నిమ్మకూరు ఆవాసం- కమ్మని భోజన గ్రాసం... నందమూరి సావాసం... వేటూరికి రసకోశం" అన్నారట.
- 'కాకతీయులు' పదానికి "శత్రువుల కాకలు తీయువారు" అని వేటూరి నిర్వచనం ఇచ్చారు.
- ఇప్పటివరకూ మీరెన్ని పాటలు రాసి ఉంటారని పాత్రికేయులడిగితే "నేనేదీ లెక్క పెట్టుకోను.. నాదగ్గర దేనికీ లెక్క లుండవు.. నేనేదీ లెక్క చేసే మనిషిని కాననుకోండి. అసలు నేనో లెక్కల్లో మనిషినైతే కదా! అంకెల ఆర్జనే మనది... లెక్కలన్నీ పైవాడి పని" అని వేటూరి జవాబు.
- "ఆరోగ్యం ఎలా ఉం"దని అడిగితే "యా వత్తుపోయి అలాగే ఉంది." అని ఆయన చమక్కు. 'ఆరోగ్యం' పదంలో 'గ' కింద 'య'వత్తు పోయి - 'ఆ రోగం అలాగు ఉం'దని అంతర్యం.

చలనచిత్ర గీతికా సమ్రాట్టుగా ఎదిగిన వేటూరి, "మనోహరం" చిత్రానికి రాసిన - "ఓరా, వాకిలి తీసి తీయని దోరవయసులతో" పాటకు ప్రేరణ - విశ్వనాథ వారి " తెనుగు ఋతువులలోని" "తలుపింత ఓర వాకిలి తీయనీయదు" అనే పద్యమే.

మల్లాది రామకృష్ణాతీరంలో...

వేటూరి వారికి గురుస్థానీయులైన వారిలో ముఖ్యులు మల్లాది రామకృష్ణశాస్త్రి. 1960 ప్రాంతాల్లో 'ఆంధ్రసచిత్ర వారపత్రిక'లో వేటూరి ఉపసంపాదకుడిగా ఉన్నప్పటి నుంచి మల్లాది శిష్యుల్లో తానూ ఒకరయ్యారు. మల్లాది వారి మరణానంతరం వెలువడిన 'ఆనందవాణి' సంచికలో వేటూరి రాసిన సంస్మరణ వ్యాసంలో తన గురువు ఆయన బ్రాహ్మణీ లోకానికి గోల్డ్‌ఫ్లాక్ టిన్-గుండుచెంబు" ఇలా ఆద్యంతభక్తి భావపూర్ణంగా చమత్కార పద సత్కార సంభరితంగా మల్లాది గురు సంస్మరణను ప్రకటించిన వేదనావ్యాసులు వేటూరి.

2008లో హైదరాబాద్‌లో జరిగిన "ఆపాతమధురాలు" సంగీత విభావరిలో అన్నీ మల్లాది రామకృష్ణ శాస్త్రియ చలనచిత్ర గీతాలే ఆలపించారు. ఆ సభకు ప్రధాన అతిథి వేటూరి.

'చిరంజీవులు' చిత్రగీతమైన "తెల్లవారవచ్చె తెలియక నా స్వామి... మళ్లీ పరుండేవు... మా రాము చాలింక లేరా!" పాటను వేటూరి విశదీకరించిన తీరు అద్భుతం. 'మళ్లీ పరుండేవు' అని నొక్కి చెప్పడంలో 'లేరా!' అని ఒకసారి. "లే! రా!" అని రెండోసారి అనటంలో మల్లాది వారు ఎత్తుకు దూసుకుపోతోంది. 'ఇది ఇలా వైకుంఠాన్ని అందుకొనేటంత ఎత్తుకు మనల్ని తీసుకువెళ్తుంది. కనుకనే దీన్ని "వైకౌంట్" అన్నారేమో' అని వేటూరి వ్యాఖ్య.

...అందుకే ఆత్రేయ

తప్పనిసరి పరిస్థితుల్లో మనసుకవి ఆచార్య ఆత్రేయ రాయాల్సిన పాటను వేటూరి రాసి వ్వాల్సి వచ్చింది. దర్శక నిర్మాతల బలవంతం మీద అందుకు అంగీకరిస్తూ, పాటకు తగిన పారితోషికం ఆత్రేయకే ఇవ్వాలనీ, ఆ పాట తాను రాయడానికి ఫోన్ ద్వారా ఆత్రేయ అనుమతించాలనీ షరతు విధించారు వేటూరి. అన్నీ సక్రమంగానే జరి

గాయి. పాట రికార్డింగ్ పూర్తయి ఇంటికి వెళ్లారు వేటూరి. ఈలోగా ఆత్రేయ ఫోన్ చేసి వేటూరి గారి శ్రీమతితో, పారితోషికం అందిందని, మర్నాడు వచ్చే శుక్రవారం నాడు ఆమెకు తండ్రిలా పట్టుచీరె పెట్టి ఆమె చేత పట్టెడన్నం తిని వెళ్తానని అన్నట్లుగా వేటూరికి చెప్పారు భార్య సీతమ్మ. అలాంటి శుక్రవారాలు చాలా వచ్చాయిగానీ ఆత్రేయ రాలేదు. "ఆత్రేయ గారు అంతగా చెప్పారు రాలేదేమండీ" అన్న శ్రీమతికి "వస్తే ఆత్రేయ కాడు కనుక" అని వేటూరి సమాధానం.

పాటల రచయితగా ఆత్రేయ పతాకం జగజ్జేగీయమానంగా ఎగురుతున్న కాలంలోనే వేటూరి వారి కలం కదం తొక్కుతున్న 1980 ఎదురుపడ్డారు వేటూరి. "దొరకునా ఇటువంటి సేవ" పాటవిని వస్తున్న ఆత్రేయ "ఏమిటయ్యా! అంత పొడవు పల్లవి రాశావు. పాడేవాడి ప్రాణం పోతుంది" అన్నారు. "... అలా అనిపించిందా! అయితే ధన్యుడిని. ఆ సన్నివేశమే అది" అన్నారు వేటూరి. నిజంగానే ఆ చిత్రంలో శంకరశాస్త్రి ఆఖరుగా పాడే పాట అదే. ఆ గీతాలాపనతోనే ఆ పాత్ర ముగిసిపోతుంది మరి.

"సాగరసంగమం" చిత్రంలో "ఓం నమఃశ్శివాయ" గీతంలో త్రికాలములు నీ నేత్రత్రయమై" అనే వేటూరి ప్రయోగం మీద ఆత్రేయ వివరణ కోరారు. శివుని ముఖాన స్థిరంగా ఉండే త్రినేత్రాలకు, సంచార శీలమైన కాలానికి సమన్వయమెలా అని నయనం ఎప్పుడూ మూసే ఉంటుంది. అందుకే మనకు భవిష్యత్తు అగోచరంగానే ఉంటుంది" అని బదులిచ్చారు.

ఇంతటి పాండితీగరిమ, పామర జనహితంగా సాగే గీతార్థ మహిమ పడుగు పేకగా అల్లుకున్న సాహితీ సమున్నతులు కనుకనే వేటూరి పట్ల ఆచార్య ఆత్రేయకు గల అభిమానం, "అభిలాష" చిత్రం శతదినోత్సవ సభలో ఎల్లలు దాటి పెల్లుబికిన సందర్భాన్ని ముచ్చటించుకు తీరాలి.

"నేను సినిమా పాటలకు పది పన్నెండు మాటలను వాడుకున్నాను. అవే అటూ ఇటూ మార్చి కాలక్షేపం చేశాను. కానీ నువ్వలా కాదు. ఏళ్ల తరబడి సుళ్లు తిరిగి ఎక్కడినుంచో వారసత్వంగా వరదలా

చెణుకుల పుణుకులు

- 2006లో హైదరాబాద్‌లో ఓ చోట ఇడ్లీలు బావుంటాయని తీసుకెళ్లి చెయ్యి కడుక్కోవటాలు, మూతి తుడుచుకోవటాలు పూర్తయ్యాక బిల్లు చెల్లింపు నిమిత్తం ఐదువందల రూపాయల నోటు ఇచ్చారు. మంది మార్బలం తిండి తిప్పలు నిమిత్తం రూ.480 అయింది. హోటల్ మనిషి ఇరవై రూపాయలు తెచ్చాడు. "గురువుగారూ! చిల్లర..." అని గుర్తు చేస్తే "ఇలాంటి చిల్లర వ్యవహారాల్లోకి దిగే అలవాటు లేదు" అని చమత్కరించారు. "టిప్పు"గా వదిలేస్తారా ఇరవై రూపాయలు" అని ఆశ్చర్యంగా అడిగితే "ఈ ట్రిప్పుకు ఇంతే టిప్పు" అన్నారు.
- ఓ మహాశివరాత్రి ఉదయ వేళ ఫోన్ చేసి "గురువుగారూ! పత్రికా పఠనమా! బిల్వ పత్రికా సంఘటనమా!" అని అడిగితే "అయ్యా! అడగాల్సింది బిల్వపత్రి గురించి కాదు ఆసుపత్రి గురించి. ప్రస్తుతం 'హాస్పిటాలిటీ' అనుభవిస్తున్నాను. అన్నారు. "ఇంతకూ ఆస్పత్రి ఏ ప్రాంతంలో ఉంద"ని అడిగితే "వద్దు... అడగొద్దు... ఈ ఆయాసంలో ఆ పేరు తిట్టులా వినబడుతుంది... తర్వాత చెప్తా" నన్నారు.
- సుందరరామమూర్తికి ఇంకా గౌరవ డాక్టరేట్ రానప్పటి మాట. "అయ్యా! మీ ముందు 'డాక్టర్' ఉంటే బావుణ్ణ"ని అంటూండగా "అదిగో! మీ కోరిక తీరబోతుంది." అన్నారు. అప్పుడే తన ముందర చెకప్ కోసం వచ్చిన వైద్యుణ్ని చూపిస్తూ వేటూరి. మరికొద్ది రోజులకే నాగార్జున విశ్వవిద్యాలయం 'వేటూరి'కి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసి తనను తాను గౌరవించుకొంది.

పండిత "వేటూరి"లోని 'సుందర' చిత్రగీతా "రామ"ంతో పాటు తరచుగా తొంగి చూసిన చమత్కార మూర్తి "మత్యమహత్యానికి ఈ ముచ్చట్లు కొన్ని, మచ్చుతునకలు మాత్రమే.

నాటి రోజులవి. ఓనాడు తనకు ఎదురుపడిన వేటూరితో " ఏం తొందరొచ్చిందని వచ్చావయ్యా, ఇంకా ముందు భవిష్యత్తు పెట్టుకుని.. ఎడాపెడా రాసి పారేస్తున్నావట.. చాలా స్పీడుగా రాస్తున్నావట" అన్నారు ఆత్రేయ. అందుకు వేటూరి "గురువుగారూ మీ అంత గొప్పగా ఎలాగూ రాయలేను- మీకన్నా తొందరగానైనా రాయకపోతే నా బతుకుతెరువు ఎలాగండీ!" అని వినయంగా బదులిచ్చారు.

"శంకరాభరణం" చిత్రగీతాలు రికార్డింగు జరుగుతున్న స్టూడియోలోంచి బయటకు వస్తున్నారు ఆచార్య ఆత్రేయ. ఆయనకు ఆత్రేయ సందేహం. అందుకు స్పందిస్తూ వేటూరి "కనులకు గమించే స్వభావం లేకపోయినా రెప్పలకు ఓ లయ ఉంది. వాటితోనే తాళం, సమయం ముడిపడి ఉన్నాయి. కాలనిర్ణయానికి మూలమైన "లిప్త" (రెప్పపాటుకాలం) కనురెప్పల కదలికలోంచి పుట్టిందే. కనుక ఆ మూడు కళ్లనూ త్రికాలాలతో పోల్చాను. ఆ మూడూ కళ్లనూ ఎటు నుంచి ఎటు త్రికాలాలకూ కేటాయించుకొని చూస్తే మూడోకన్ను కచ్చితంగా భవిష్యత్తుకు సంబంధించిందే. ఆ కన్ను తెరిస్తే అంతా భస్మం. భవితవ్యం తెలుసుకోవాలనుకొంటే కూడా అదే మిగులుతుంది. అందుకే ఆ వస్తుంది నీ పాట" అని భావావేశంతో అందరి వైపు తిరిగి "వీడు నావాడు.... వీడు మావాడు.. వీడు మనవాడు.. నా వారసత్వం వీడిదే" అంటూ వేటూరిని కౌగిలించుకున్నారు ఆత్రేయ. మనసుకవి కంట ఆశీః బాష్పాక్షతలు.. వేటూరి వెడద కనులంట అశ్రురూప కృతజ్ఞతలు.

"సరిగమ"లకు "డుముువు"ల ఆశీస్సులు... జూన్ 4వ తేదీ... పద్మభూషణ్ డా॥ ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం పుట్టినరోజు. అదీ 2006వ సం॥లో షష్టిపూర్తి వేడుకగా అమరిన రోజు. ఆనాటి ఆ ముచ్చటకు మూలమైన 'బాలు'ని ఆశీర్వదిస్తూ అదే నెలలో

ప్రత్యేక సంచికగా వెలువడిన 'వెలుగు'లో అచ్చయిన వేటూరి వారి అక్షరాల ఆశీరక్షతలు...

"శ్రీనారద సరసీరుహ భృంగ గళోత్తుంగ మహా
మధుగంగా భగీరథుడు మా యస్పీబాలు
శారదవీణా ప్రసంగ సంగీతపు ప్రావీణుకుల
ప్రాణాయామం లోతున పండిన పండితుడీతడు
షష్టిదాటినా సరే "బాలు"డిగా చలా"మణీ"
ఘంటసాల గాంధర్వపు వంశానికి శిరోమణి
తనువంతా హృదయమున్న అతనికెవరు సాటి?
స్వర సంపదలో అతనికి లేరు కదా పోటీ
వెయ్యి పూర్ణ చంద్రులనూ చూడాలీ బాలు
ఈ ఆశీరక్షతలే ప్రియమిత్రుడి వ్రాలు"

సంగీత నేపథ్యంగల నేస్తానికి,

> దశావతారాల గురించి పిల్లలకు సులువుగా చెప్పడానికి మన పెద్దలు రాసిన ఈ పాటను చూడండి. ఇందులోని హాస్యం మనసుకు హాయి కలిగిస్తుంది.
>
> 'మా పాప మామల్లు మత్స్యావతారం
> కూర్చున్న తాతల్లు కూర్మావతారం
> వరసైన బావల్లు వరహావతారం
> నట్టింట నాయత్త నరసింహావతారం
> వాసిగల బొట్టెల్లు వామనావతారం
> పరమగురుదేవ పరశురామావతారం
> రక్షించు మామయ్య రామావతారం
> చిట్టి నా కన్నోడ శ్రీ కృష్ణావతారం
> బుద్ధితో మా చిట్టి బుద్ధావతారం
> కలివిడితో నాయన్న కలికావతారం
> వర్ధిల్లు పసిపాప వర్ధిల్లు నా తండ్రి

సాహిత్య సంపన్నుడైన స్నేహితుడిచ్చే కవి తాకృతి గల కానుక కనుకనే "సరిగమలకు డుమువుల ఆశీస్సు"లనే శీర్షిక పెట్టారు వేటూరి. ఆంధ్ర జనత వంటి పత్రికల్లో పనిచేసిన ఒకప్పటి పాత్రికేయ దిగ్గజం కూడా అయినందువల్ల వాక్యవిన్యాసం, వ్యాఖ్యావిలాసంలో పదునుదేరిన పాళీ వేటూరిది. 'వెలుగు' మాసపత్రిక ముఖ చిత్రం దిగువన "ప్రతి ఏక సంచిక ప్రత్యేక సంచికే" అనే విశేష పదప్రకాశం వేటూరిదే.

తెలుగు తక్కువ సన్నాసులు

ఉత్సవ్, వైభవ్, మార్గ్ వంటి పదాలను తెలుగు లిపిలో రాసేటపుడు ఉత్సవం, వైభవం, మార్గం అనడమే న్యాయమని, అలా కాకుండా పొల్లుతో పదాన్ని ముగించే వారు " తెలుగు తక్కువ సన్నాసు"లని వేటూరి అభిప్రాయం. పైగా ఉత్సవ్, వైభవ్ లాంటి మాటల ఉచ్చారణలో "భౌభౌ" అన్నట్లుగా వినపడటం తెలుగు భాషకు అవమానం అంటూ, ఆంధ్రులది సంగ్రామ సింహ" భాషే కానీ, "గ్రామసింహ (కుక్క) భాష" కాదని చెప్పారు.

"తెలుగునాడు అన్న తెలుగుల రాష్ట్రాన
నాడు తెలుగు గాన నేడు లేదు
నేతి బీరలోన నేయెక్కడుందిరా
తెలుగువాడనోడ తెలుగువాడ"
"మాతృభాష మీద మమకారమే లేక
తెలుగువాడనోడు తెలుగువాడు
ఇరుగుపొరుగు నున్న అరవము కన్నడ
వారిజూచి తలను వంచుకోడు"

- అనే ఈ పద్యరూప విమర్శనాస్త్రాలు వేటూరి వారి చమత్ కారాలూ మిరియాల్లో కొద్దిపాటి ఘాటైనవి, ఆయన అంతేవాసులకు అంతే అలవాటైన వీనూ.

వేటూరి 'పద' బాలశిక్ష

"ఎవరూ పుట్టించ కపోతే మాటలెలా పుడతాయ్" అన్న "మాయాబజార్" లోని పింగళి ఆలో చనా విధానం వేటూరిది.

పాట బాగే పాడే తత్వాన్ని 'పాట'వంగా, చక్కని గీతాన్ని 'పాట'లీ కుసుమంగా, ఎస్పీబాలును 'పాట'లాధర చక్రవర్తి, పాటలీపుత్రుడనే విశేషణాలతో సంభావించడం వేటూరి ప్రతిభలాలు. 'బాలు' గళానికి ఏ స్వరమైనా లొంగుతుందనే అర్థంలో, ఆయనకు పలకని స్వరమే లేదనే పరమార్థంలో "బాలోచ్ఛిష్టం స్వరం సర్వం" అన్నారు. "స్వరాయురస్తు" దీవెన కూడా వేటూరి వారిదే. ప్రముఖ సంగీత దర్శకులు రెహమాన్‌ని ఉద్దేశించి "బాల చాకచక్యు" డన్నారు. డబ్బింగ్ చిత్రాలను "అధరచలనాధార"గా పేర్కొన్నారు. వేటూరి 'పద'బాలశిక్షలో ఇప్పుడు చెప్పినవి కొన్ని మాత్రమే. ఇలాంటి అక్షరామృత బిందువులు ఎన్నో... ఎన్నెన్నో!

రాంభట్ల నృసింహశర్మ
విశాఖపట్నం. 93948 85173



బతుకు... బతికించు

తెలుగు నేలంతా వట్టిపోతోంది. మట్టిని, మానును మింగేసే మనుషుల ధాటికి తట్టుకోలేకపోతోంది. పైసలే పరమావధిగా పర్యావరణాన్ని నాశనం చేస్తూ... తెలుగు జాతి మనుగడకే ప్రమాదం తెచ్చిపెడుతున్న వారి తీరుకు తల్లడిల్లుతోంది.

మనిషి బతకాలనుకోవడానికి మించి మనిషి మాత్రమే బతకాలి అనుకుంటున్న వారి దురాశ చివరికి దుఃఖానికి చేటవుతోంది. చెట్టూచేమలు, పక్షులు, జంతువులు.. అన్నీ కలిస్తేనే 'లోకం'. కాస్త ఆలోచన శక్తి ఉంది కాబట్టి లోక నాయకుడిగా దీన్ని కాపాడాల్సిన బాధ్యత మనిషిదే. కానీ, తను ఏం చేస్తున్నాడు? ఒక్కొక్క దాన్ని కబళిస్తున్నాడు. విశాల వసుధపై ఒంటరిగా మిగిలిపోయేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. ప్రపంచం మొత్తం ఇదే పరిస్థితి. తెలుగు నేల కూడా ఇందుకు అతీతం కాదు. అసలు ఒక పిసరు ఎక్కువే అనిపిస్తోంది.

ప్రతి జీవావరణ వ్యవస్థా విలక్షణమైందే. ప్రాంతీయ వైవిధ్యం ఉండటం వల్లనే జీవవైవిధ్యం ఏర్పడింది. అలాంటి వైవిధ్యం మన తెలుగు నేలకు ఎంతో ఉంది. అది మన సంస్కృతిలో భాగంగా మారిపోయింది. కొండలు, అడవులు, అటవీ పర్వతాలు, నదులు, సరస్సులు, బీలభూములు వంటివి అన్నిచోట్లా ప్రాంతీయ వైవిధ్యంతో ఉండే నైసర్గిక పరిస్థితులు. భిన్న జీవావరణ వ్యవస్థల కారణంగానే భిన్న జీవన విధానాలు ఏర్పడ్డాయి. వీటిలో మళ్లీ కొన్ని ప్రత్యేకమైన జీవావరణ వ్యవస్థల్లో ప్రత్యేకమైన జీవికానిర్వహణ చేసుకునే సమూహాలు వృత్తి కులాలుగా, జాతులుగా ఏర్పడ్డారు. మత్స్యకారులు ఇందుకు ఉదాహరణ.

జంతు, పక్షిజాతులు... ప్రత్యేక జీవావరణ వ్యవస్థలు పరస్పర ఆధారితాలు. బలిష్ట ఆహారమైన మెట్ట పంటలు పండే చోట శతాబ్దాలుగా ఒంగోలు జాతి పశుసంతతి వృద్ధి చెందింది. (చారిత్రక యుగాల్లో గుంటూరు, ప్రకాశం జిల్లాలను మహిష మండలం అనే వారు) క్రమంగా అక్కడ జొన్న వెయ్యడం తగ్గిపోతోంది. ఇది ఇలాగే కొనసాగితే ఒంగోలు ఎద్దుల ప్రత్యేకత అంతరిస్తుంది. కొన్ని పక్షిజాతులు మనుషుల మీద ఆధారపడతాయి. మన జీవన విధానంలో మార్పు వచ్చినప్పుడు ఆ ప్రభావం వాటి మీద పడుతుంది. పిచ్చుకలు ఎక్కడైనా ఉన్నాయా? మన గృహ నిర్మాణ శైలిలో మార్పుల వల్ల వాటికి గూళ్లు పెట్టుకునే సౌకర్యం తగ్గిపోయింది. పిడికెడంత పిట్ట, చక్కటి చిన్నముక్కు, క్షణం కూడా ఒక చోట నిలవనితనం, కిచకిచలు - ఇవన్నీ ఇప్పటికే కనిపించడం మానేశాయి. మన జీవితాల్లో పెద్ద వెలితి వదిలి వెళ్లిపోయాయి. సెల్‌టవర్లు వచ్చిన ఇంత కాలానికి గానీ అవి పక్షులకు హానికరం అని మనకి తెలియలేదు. నగరాల్లో పశువులు ప్లాస్టిక్ వ్యర్థాలు తిని, అవి అరక్క నరకాన్ని అనుభవిస్తున్నాయి. ఒక జాతికి చెందిన గద్దలు దాదాపు అంతరించిపోయాయి. పురుగు మందుల కారణంగానే గద్దల ఆహారం విషతుల్యమైంది. ప్రపంచ వ్యాప్తంగా వారానికి ఏదో ఒక పక్షి, జంతు జాతి నశిస్తోంది. ఎందుకంటే అవి ఆధారపడే జీవావరణ వ్యవస్థని మనం నాశనం చేస్తున్నాం కాబట్టి.

మన చిన్నతనంలో ఎక్కడ ప్రయాణించినా రైలు పట్టాల పక్కన విద్యుత్, టెలిఫోన్ తీగలకు అద్భుతంగా వేలాడుతూ బంగారు పిట్టల గూళ్లు కనిపించేవి. ఎంతో అందంగా ఉండేవి వాటి గూళ్లు. ఇప్పుడు అవీ ఎక్కడా కనిపించట్లేదు. ఈ పిట్టలన్నీ రైతులకి స్నేహితులు. పంటని చీడపీడల్నుంచి కాపాడేవి. మన బాల్యాన్ని లయబద్ధం చేసిన వడ్రంగి పిట్ట ఎటువెళ్లిపోయింది?

రుతువులకే రంగులద్ది స్వరబద్ధం చేసి జీవితం పట్ల రుచి నేర్పిన అనేక పక్షులు మనకింక ఎప్పటికీ కనిపించవు. అవి మనకి చేసిన ఉపకారం కూడా మనకి తెలియదు. స్థూలంగా మన రాష్ట్రంలో మూడు ప్రత్యేకమైన జీవావరణ వ్యవస్థలున్న ప్రాంతాలు లేదా మూడు వ్యవసాయ వాతావరణ ప్రదేశాలున్నాయి. కోస్తా, తెలంగాణ, రాయలసీమ. ఇప్పుడు రాయలసీమలో అనేక ప్రాంతాలు వర్షాభావ పరిస్థితుల వల్ల క్షామప్రాంతాలయ్యాయి. కానీ వీటిలో చాలా భాగం చారిత్రక యుగాల్లో అడవులతో, చెరువులతో నిండి ఉండేవి. కర్నూలు జిల్లాలో విస్తారంగా గడ్డిమైదానాలుండేవి.

మెట్టపంటలు, గడ్డిమైదానాలు ఉన్న చోట పశుసంపద పుష్కలంగా ఉంటుంది. మనకి ఆ ఇంగితం లేకపోవడంతో కొన్ని విశాల ప్రాంతాలను కేవలం పశుపోషణకూ, పాల ఉత్పత్తి కేంద్రాలుగా అభివృద్ధి చెయ్యలేకపోయాం. వరి అన్నం తినడం నాగరికం అనే ఒక అనారోగ్యకరమైన భ్రమ మన కొంప ముంచింది. గడ్డిమైదానాలను ఆధారం చేసుకుని బట్టమేక పిట్ట అనే పక్షి ఆ ప్రాంతాల్లోనే కాలక్షేపం చేస్తూ వచ్చింది. గడ్డిమైదానాలు అంతరించడం, దాని వేట సులభం కావడం తదితరాల వల్ల చివరికి నాలుగు పక్షులు మిగిలాయి. వన్యప్రాణి విభాగం శ్రద్ధ తీసుకోవడంతో మెల్లగా సంఖ్య పెరుగుతోంది. తూర్పుగోదావరి, విశాఖ జిల్లా అటవీ పర్వతాల్లో కొన్ని వృక్ష జాతుల మీద ఆధారపడ్డ పక్షుల సంఖ్య తరిగిపోయిందని పరిశోధకులంటున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పర్యావరణ శాఖ దీనిపై కొంత అధ్యయనం చేసింది. మైనా అంటే అందరికీ ఇష్టం. దానిచేత మాట్లాడించడం సులభం. ఇవాళ మైనాలు కూడా కనిపిస్తున్నాయా?

పక్షులే కాదు కొన్ని మత్స్య జాతులు కూడా మన తీరంలో అంతరిస్తున్నాయి. ఒక అరుదైన జీవ జాతి ఆవాసంలోంచి వెళ్లే సాగునీటి కాలువను గానీ, నిర్మించ తలపెట్టిన కర్మాగారం గానీ నిలిపేసి ప్రత్యామ్నాయాలు ఆలోచించడం నాగరిక ప్రభుత్వాల కర్తవ్యం. మన దగ్గర ఆ పరిస్థితి లేదు. గోదావరి పక్కనే పురుషోత్తమపట్నం (తూ.గో) వెలుపల సహజంగా ఏర్పడ్డ 1500 ఎకరాల సరస్సు ఉంది. ఇప్పుడు అది కుంచించుకు పోయింది. కొండల మధ్య కలువపూల దుప్పటి కప్పుకుని ఉండే ఈ సరస్సు కొన్ని వేల ఎకరాలకు నీరివ్వడమే కాక కొన్ని వలస పక్షులకు ఆవాసంగా ఉండేది. పుష్కర కాలువ అనే ఒక చిన్న సాగునీటి కాలువ కోసం దీన్ని 1/4 వంతు కప్పేశారు. ఈ జిల్లాలోనే ఏలేశ్వరం దగ్గర పెద్దచెరువు. శీతాకాలంలో వలస పక్షులు వస్తుంటాయి. గ్రామస్థుల కళ్లు కప్పి కొందరు యథేచ్ఛగా వేటాడటంతో అక్కడ శ్మశాన నిశ్శబ్దం రాజ్యమేలుతోంది.

ఒకప్పుడు రాయలసీమ, తెలంగాణ చెరువుల్ని చూస్తే కడుపు నిండిపోయేది. ప్రస్తుతం కడుపు తరుక్కుపోతుంది. రాజధాని నగరంలో 3086 చెరువులు ఉన్నట్లు నీటిపారుదల శాఖ వద్ద ఉన్న లెక్కలు చెబుతున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే 175కి మించిలేవు. మిగిలిన వన్నీ ఏమయ్యాయి? కబ్జాకోరల్లో చిక్కి అదృశ్యమయ్యాయి. చెరువులను కేవలం సాగునీటి జలాశయాలుగా చూడకూడదు. అవన్నీ బీలభూములు, జీవావరణ వ్యవస్థలూ. ఇళ్లు, వాణిజ్య సముదాయాల కోసం వాటిని పూడ్చడమేంటి? నెల్లూరు, చిత్తూరు (ఇక్కడ వీటిని సముద్రాలని పిలుచుకుంటారు) జిల్లాల్లో చెరువులు అనేకం. నేడు అవి ఏ స్థితిలో ఉన్నాయో అందరికీ తెలిసిందే.

చారిత్రక కాలం నుంచీ తెలుగు నేల ధాన్యాగారంగా ప్రసిద్ధి. ధాన్యకటకం, సాలిహుండం (ధాన్యాగారం) వంటి పేర్లలోని అంతరార్థమిదే. మన రాష్ట్రంలో కనీసం మూడు వందల రకాల వరి విత్తనాలు, చక్కటి పేర్లతో ప్రాంతీయ నైసర్గిక పరిస్థితులకు అనుగుణంగా ఉండేవి. ఈ విత్తనాలు, వైవిధ్యం, వాటి పేర్లతో ఉన్న భాష పోయి కొత్తవి

వచ్చాయి. చీడపీడలకి తట్టుకోగల జన్యుసామర్థ్యం ఉన్న వరి విత్తనాలు పోయి కృత్రిమ రసాయనాల మీద బతికేవి అవతరించాయి. అవే నేడు మనకు జీవనాధారమయ్యాయి. మన రాష్ట్రంలో వాడినన్ని ఆకుకూరలు దక్షిణ దేశంలో ఎక్కడా కనిపించవు. ఆరోగ్యంగా, చవకగా, రుచికరంగా భిన్నరకాల్లో దొరికే వీటి లభ్యత కూడా వచ్చే దశాబ్దంలో తరిగిపోయే పరిస్థితి ఉంది. గ్రామీణ ఉమ్మడి భూములు పోవడంతోనే వీటికి ముప్పు ఏర్పడింది. తీరాంధ్రలో ప్రత్యేక ఆర్థిక మండళ్ల కోసం వేలాది ఎకరాల పంట భూములను బలిపెడుతున్నారు. బొగ్గు విద్యుత్ కేంద్రాల కారణంగా గ్రామాలకు గ్రామాలే బూడిదమయమవుతున్నాయి. మరికొన్ని చోట్ల భూ అభివృద్ధి పేరుతో తాడిచెట్లు నరికేశారు. తీరం అంతా ఒకప్పుడు తాడిచెట్లు విపరీతంగా ఉండేవి. ఈ తాటితోపులు తుపాను గాలుల తీవ్రతను నిరోధించి లోతట్టు ప్రాంతాలకు రక్షణగా ఉంటాయి. వీటితో పాటు సరుగుడు తోటలు, మడ అడవులు కూడా తుపానులను ఎదుర్కొంటాయి. నేడు ఇవేమీ ఉండట్లేదు. అనకూడదు కానీ, ప్రకృతి వైపరీత్యం ఏదైనా సంభవిస్తే పరిస్థితి ఏంటి? గ్రామీణ, నగర ప్రాంతాల్లో విస్తరణ, అభివృద్ధి కారణాల విధ్వంసం జరుగుతోంటే... గిరిజన ప్రాంతాల్లో విలయం నెలకొంది.. గిరిజన వైద్యుల్ని వెజ్జులంటారు. ముఖ్యంగా పది రకాల మందు మొక్కల మీద వీరి వైద్యం ఆధారపడి ఉంటుంది. పెరట్లోనో, అయిదారు ఇళ్లు దాటితేనో విస్తారంగా దొరికే ఈ మందు మొక్కలు ఇప్పుడు కనిపించడం లేదు. అడవి లోపలికో, కొండల మీదకో వెళ్లాల్సిన పరిస్థితి. దీనికి తోడు అశ్వగంధ, సర్పగంధ, సరస్వతి ఆకు వంటివి వాణిజ్యపరంగా లాభసాటి కావడంతో కొన్ని మందుల పరిశ్రమల వారు, దళారీల సాయంతో టన్నుల కొద్దీ పట్టుకెళ్తున్నారు. ఈ లాభాల్లో గిరిజనులకి ఒక్కపైసా దక్కట్లేదు. కేరళలో గిరిజనులు, వారి వైద్యుల సహకారంతో పెద్ద పరిశోధనాలయాలే పనిచేస్తున్నాయి. అక్కడి గిరిజనులు లాభపడుతున్నారు. ఈ పని మన రాష్ట్రంలో ఎందుకు చేయకూడదు? ఇంకో చిత్రం.. గిరిజనులు మాంసానికి ఉప్పు కలిపి వెదురు బొంగుల్లో దాచుకుంటారు. ఇప్పుడు ఈ 'వెదురు మాంసం' కార్పొరేట్ సంస్థల కళ్లబడింది. ఆరు పెద్ద హోటళ్లు మారేడుమిల్లి ప్రాంతంలో దీనికోసం గుత్తేదారులను నియమించుకున్నాయి.

గిరిజన వైద్యులకీ, ఆయుర్వేద వైద్యాలయాలకీ, ఔషధ పరిశ్రమలకీ ప్రత్యక్ష సంబంధం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి తోచలేదు. కానీ మందు మొక్కల పెంపకంలో ప్రాంతీయ అటవీ పరిశోధనాలయ సంస్థ కృషి చేస్తోంది. అభివృద్ధి పనుల వల్ల నిర్వాసితులైన గిరిజనుల్లో వెజ్జులు కూడా ఉంటారు. కట్టబోయే జలాశయంలో చేపలు పట్టుకోమని చెప్పే బదులు వారి వైద్య నైపుణ్యాన్ని లాభసాటిగా ఉపయోగించడం మంచిది. వారందరికీ తేనెటీగల పెంపకంలో శిక్షణ ఇవ్వడం కూడా మంచి పనే.

మరోవైపు... దివిసీమ, కోనసీమ వంటి సారవంతమైన దీవులు; నెల్లూరు జిల్లాలో పులికాట్; పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో విస్తరించిన కొల్లేరు వంటి ప్రపంచ ప్రసిద్ధమైన సరస్సులు, తూ.గో. జిల్లాలోని కోరింగ మడ అడవులు ఆంధ్ర తీరాన్ని విలక్షణమైన జీవావరణ వ్యవస్థగా మార్చాయి. విశాఖ, గుంటూరు జిల్లాల్లోనూ కొద్ది మేరకు మడ ప్రాంతాలున్నాయి. ఈ మడ అడవులు ఉప్పునీరు, మంచినీరు కలిసే నదీ ముఖద్వారాల్లో పెరుగుతాయి. వీటి మిగతా ప్రత్యేకతలు అలా ఉంచితే, ఇవి ఉన్న చోట్ల మత్స్యజాతి బాగా ఉంటుంది. కోరింగ మడ అడవుల్లో పెరిగే చేపలే విశాఖ వరకూ విస్తరిస్తున్నాయి. అయితే, వివిధ కారణాలతో కోనసీమ కరిగిపోతోంది. ఒక పక్క ఉప్పునీరు భూగర్భజలాన్ని క్షారమయం చేస్తోంది. మరో పక్క గ్రామాలు, కొబ్బరి తోటలు నేలకోత వల్ల గోదావరిలో కలిసిపోతున్నాయి. కోనసీమ విధ్వంసం మొదలైంది. దీనిపై అధ్యయనం అవసరం.

దక్షిణ భారతంలో ఎక్కడా లేని అద్భుతమైన పక్షుల ఆవాస కేంద్రం గుంటూరుకి 6 కి.మీ. దూరంలోని ఉప్పలపాడులో కనిపిస్తుంది. కనీసం 70 పక్షి జాతులు సంవత్సరం పొడవునా ఇక్కడ కనిపిస్తాయి. వీటి సంఖ్య ఎక్కువ కావడంతో రెండు మూడు రకాల పక్షులు రాక తగ్గించాయి. ఇరుకైపోయిన ఈ ఆవాసాన్ని బాగా విస్తృతం చెయ్యాలి. చుట్టుపక్కల కొన్ని ఎకరాలు కొంటేనే గానీ ఇది ఎక్కువ కాలం ఉండదు. అటవీ, పర్యాటక శాఖలు కలిసి నిధులు సమకూర్చుకోవాలి. కృష్ణాడెల్టా అభివృద్ధి కోసం కేటాయించిన నిధుల్లో కొంత ఉప్పలపాడుకి కూడా కేటాయించారు కానీ ఆ మొత్తం సరిపోదు.

తడ నుంచి శ్రీకాకుళం వరకూ ఉన్న తీరం దాదాపు వేయి కి.మీ.లు. ఇది మన ప్రత్యేకత. బంగాళాఖాతంలో కలిసే రెండు అతి పెద్ద నదులు కూడా తెలుగు నేలకు



ప్రత్యేకమే. ఈ తీరం వేలాది మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తోంది. ఇప్పుడిది మందుల పరిశ్రమలతో కలుషితం అవుతోంది. చేపలు దొరకట్లేదు. ప్రత్యేక ఆర్థిక మండళ్లు వస్తే తీర సముద్ర జలాలు ఇంకా కలుషితమయ్యే అవకాశం ఉంది. విశాఖ సమీపంలోని భీమిలి ఒక అరుదైన జీవావరణ వ్యవస్థకు చిరునామా. పట్టణం బయట ఎర్రమట్టి దిబ్బలు, లోతైన ఎర్రని వాకలూ కనీసం లక్ష ఏళ్ల నాటివి. పరివాహ ప్రాంతంలో కురిసిన వాన నీటిని ఈ వాకలు మోసుకొచ్చి సముద్రానికి సమర్పిస్తాయి. ఉత్త వర్షపునీరే కాదు, సముద్రపు చేపలకు సూక్ష్మపోషక పదార్థాల్ని కూడా అందజేస్తాయి. వీటికోసం ఒక జాతి చేపలు తీరానికి సమీపంగా వస్తాయి. మత్స్యకారులకూ ఇది మంచి అవకాశం. నేడు ఈ చక్రం దెబ్బతింటోంది.

భౌగోళికంగా మనిషి ఎప్పుడూ జీవావరణ వ్యవస్థల మీదా, జీవవైవిధ్యం మీదా ఆధారపడే ఉంటాడు. ప్రాచీనులకు ఈ స్పృహ ఉండేది. అందుకే వాటిని ఈ భౌతికావరణంలోంచి ఉన్నతీకరించుకుని సభక్తికంగా ఒక పేగు బంధాన్ని ఏర్పరచుకున్నారు. మనిషితోపాటు అన్ని జీవరాశులకూ జీవించే హక్కు ఉందని భావించారు. నిజానికి మనిషికే ప్రత్యేకమైన కేంద్రస్థానం ఇవ్వలేదు. కానీ, కాలప్రవాహంలో విలువల హననంలా... పర్యావరణ విధ్వంసం జరుగుతోంది. కూర్చున్న కొమ్మను నరుక్కుంటున్న అవివేకం ఎప్పటికైనా అంతమే కోరుతుంది. అందుకే తెలుగు నేలను కబళిస్తోన్న విధ్వంసాన్ని ఆపేందుకు ప్రతి తెలుగు వాడూ నడుం కట్టాలి.

తల్లావజ్ఝల పతంజలిశాస్త్రి,
సాహితీవేత్త,
పర్యావరణ ఉద్యమకారులు,
కాకినాడ. 94407 03440

ప్రకృతి ఘోష

కత్తి పండును కోసినట్టు
తన దారిని తాను చీల్చుకుంటూ పోతుంది
నది

దాహం తీరని సముద్రం
అవినీతిలా నదుల్ని మింగుతుంది

కనబడని తన రెండో మొహాన్ని
సముద్రంలో వెతుకుతూనే ఉన్నాడు
చంద్రుడు

ఎంత దుర్మార్గంగా వాడినా
నీరు గాయపడటం లేదు
నవ్వుతుందో ఏడుస్తుందో కూడ తెలియడం
లేదు

ఎవరూలేని ఇంట్లో కూడా
సూర్యకాంతి ప్రసరిస్తోంది
వెలుగు నామీద పడి
నీడగా నాచిత్రాన్ని గీస్తుంది

తనను పెంచి పోషిస్తున్న వారిని
పత్రాలతోనూ పూలతోనూ పళ్లతోనూ
పూజిస్తూనే ఉంది చెట్టు

పక్షులు వాలడానికి వీలుగా
చెట్లు పైపైకిలేస్తూనే ఉన్నాయి

ఎన్ని పూల పుట్టిన రోజో ఈరోజు

రోజంతా పూలని, కొండల్నీ చూస్తూ
నేను మేఘాలమీద ఉన్నట్టుంది

మేఘాల్లా నా యాత్ర కూడ ఒక జీవితం
కొట్టుకుపోయిన మేఘాలు తిరిగొస్తాయా
మేఘాల నదిలో ఈదగలనా

నన్నుచూసి
ఆకాశం అరుస్తుంది మెరుస్తుంది
దిగువన నాకు అంతా
అర్థమయిందనుకుంటోంది

అంత ప్రచండ వర్షాన్ని భూమి తాగేస్తోంది
అరవకుండా రాళ్లమీదపడి శబ్దం చేస్తుంది
రోడ్డు మీద వంతెనలా వర్షం నది

ఎక్కడున్నా ఎలా ఉన్నా ఇంటి సముద్రానికి
కాళ్ల నది తీసుకుపోతోంది

నిశ్శబ్దంగా నిజాన్ని దాస్తూ
బాధల్ని తెలియనీయకుండా
వర్షంతోబాటు ఏడుస్తూనే ఉంది ప్రకృతి

గాలి, చెట్లు
ఒకదాన్నొకటి హత్తుకుని ఓదార్చుకుంటు
న్నాయి

ఎన్ని వసంతాలు చూడటానికి పుట్టానో
పుట్టినచోటే చావడానికి నేను చెట్టునికాదు

భాగ్యం కొద్దీ
నేనెటునుంచి ఎటుపోయినా
చూస్తున్న కొద్దీ లెక్కలేనన్ని అద్భుతాలు
నా ధన్యవాదాలు నన్ను విముక్తుణ్ణి చేస్తాయా

- ముకుంద రామారావు
హైదరాబాద్. 99083 47273

శ్రుతిలయలు

గుండె 'లయ' తప్పుతోంది... ప్రవర్తన 'శ్రుతి' మించుతోంది... అప్పుడప్పుడూ అందరి నోటా అప్రయత్నంగా వచ్చే మాటలివి. ప్రేమ భావనతో ఉక్కిరిబిక్కిరయ్యే హృదయాన్ని వర్ణించడానికో, అల్లరి పిల్లాడి చేష్టలను నిరసించడానికో ఈ పద ప్రయోగం చేస్తాం. బాగుంది... ఇంతకూ శ్రుతిలయలంటే ఏంటి? సంగీత పారిభాషిక పదాలైన వీటి ప్రత్యేకతలేంటి?

మానవ మస్తిష్కాన్ని, దాన్ని ధరించిన శరీరాన్ని బ్రహ్మానందానుభూతికి చేర్చే అద్భుత వాహనం సంగీతం. 'శ్రుతి ర్మాతా లయః పితా' అనేది సంగీతశాస్త్ర సంప్రదాయం. సంగీత శిశువుకు శ్రుతి తల్లి. లయ తండ్రి. బిడ్డలు ఎదిగి ప్రయోజకులవటంలో తల్లిదండ్రుల పాత్ర ఎంత ఉంటుందో... ధ్వని వినసొంపుగా మారి సంగీతంగా అలరించడంలో శ్రుతిలయలకంత ప్రాధాన్యం ఉంది.

మన భాషలో శ్రుతి, శృతి అనే రెండు పదాలు కనిపిస్తాయి. వీటి ఉచ్చారణ దాదాపు ఒకేలా ఉంటుంది. కానీ, రెండింటి అర్థాలు మాత్రం వేరు. పదప్రయోగం చేసేటప్పుడు ఈ విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి. శ్రుతి అంటే వేదం, చెవి, వినికిడి అనే అర్థాలున్నాయి. ద్రవ పదార్థాలను మరగబెట్టడమన్న అర్థంలో 'శృతి'ని ఉపయోగించాలి. సంగీత పరిభాషలోని పదం 'శ్రుతి' మాత్రమే.

వేదమంత్రాలను పఠించేటప్పుడు ఉదాత్తం, అనుదాత్తం, స్వరితం అనే మూడు స్వరాలను అనుసరిస్తారు. అందుకే వేదం మనకు అర్థం కాకపోయినా... ఆ పఠనం మనసుకు ఆహ్లాదం కలిగిస్తుంది. ఈ స్వర స్థానాలనే సంగీతంలో మంద్ర, మధ్యమ, తారస్థాయిలుగా మలిచారు. ఈ సంబంధంతోనే 'శ్రుతి' సంగీత పరిభాషలోకి వచ్చింది.

'లయం' అంటే - నాశనం, ఆలింగనం, కలిసిపోవడం. దీన్నుంచే 'లయ' పుట్టింది. శివుడు లయకారుడు. సృష్టిస్థితుల దశలు సంపూర్ణం కాగానే శివుడు తాండవం చేస్తూ సమస్తాన్ని తనలో లయం చేసుకుంటాడన్నది ఓ నమ్మిక.

సృష్టిలోని జీవ నిర్జీవ పదార్థాలన్నీ తమ విధులు, కర్తవ్యాలు సుసంపన్నం కాగానే భగవంతునిలో లయమైపోతాయని మన ప్రాచీన గ్రంథాలు చెబుతాయి. ఈ ప్రక్రియ అంతా ఒక పద్ధతి ప్రకారం దశలవారీగా జరుగుతుంది. ఇలా జరిగే క్రమానికి సమ పరిమాణంలో ఉన్న గతి, సంచారం, నిర్దిష్టమైన నడక ఉంటాయి. శ్రుతి కలిసిన ఈ గతి పోకడ శ్రోతల పారవశ్యపు హృదయాల్లోకి పాటతో పాటు లయమైపోతుంది. బ్రహ్మానందానుభూతికి లోనైన శ్రోతల అంతశ్చైతన్యం పరమేశ్వరుడిలో లీనం కావడానికి ఏర్పరచిన మోక్షమార్గాన్ని 'లయ' సుగమం చేస్తుంది. లయ గతిలేని వట్టి పాటకు ఈ సామర్థ్యం లేదు. సంగీత గాన విధానానికి 'లయ' కీలకం కాబట్టే తాళగతికి 'లయ' అనే పేరు పెట్టారు.

మన భారతీయ సంగీత విశేషం ఏంటంటే.. శ్రుతిలో లయ ఉంటుంది. లయలో శ్రుతి ఉంటుంది. వీటి పరస్పర ప్రేమానుబంధం విడదీయరానిది. అది అర్ధనారీశ్వర తత్వం. శ్రుతి ప్రకృతి అయితే లయ పరమేశ్వరుడు. ఈ రెండింటి సంలీనమే అలౌకిక పరమానందం.

శ్రుతిలో లయ ఉండటమంటే... శ్రుతి నుంచి ఏర్పడిన స్వరాలు, రాగాలు ఒక నియమానుసారం ప్రదర్శితమవ్వడం. రాగాలాపన అంటే ఆ రాగ పరిధిని అతిక్రమించకుండా, లక్ష్యం చెడకుండా క్రమశిక్షణను పాటించడం. అది లయతత్వం.

లయలో శ్రుతి అంటే... లయ వాద్యంలో జతులు, గతులు వినిపిస్తున్నప్పుడు సన్నని షడ్జమస్వరం దానితో జతకడుతూ సాగిపోవడం. భారతీయ వాద్యాలైన మృదంగం, తబల, పఖ్వాజ్, కంజీర తదితరాల ద్వారా దీన్ని గమనించవచ్చు.

శ్రుతి, లయలు కేవలం శాస్త్రీయ సంగీతానికేకాక లలిత జానపద సంగీతాలకూ అనువర్తిస్తాయి. పండితులు శాస్త్రీయ సంగీతాన్ని, పామరులు జానపద గేయాలను విని ఆనందపడతారు. శాస్త్రీయంతో పరిచయం లేని, జానపద సంగీతం తెలియని వారు మధ్యేమార్గాన్ని ఎంచుకున్నారు. శాస్త్రీయంలోని శ్రుతి, రాగ, లయ

లను కొంత, జానపదంలోని ఉదాత్త శ్రావ్యమైన బాణీల పోకడను కొంత సమ్మిళితం చేస్తూ లాలిత్య ధోరణిలో ఒక కొత్త గాన పద్ధతిని రూపొందించుకున్నారు. అదే లలిత సంగీతం. క్రమేణా ఇది అన్ని వర్గాల వారినీ సంతోషపెట్టే దశకు చేరుకుంది.

జానపద కళల్లో 'బుర్రకథ' గొప్ప కథా గాన కళాత్మక ప్రక్రియ. దీనిలో ప్రధాన కథకుడు ఎడమ భుజంమీద పెట్టుకునే 'తంబుర' చెవి దగ్గర 'శ్రుతి' వినిపిస్తూ ఉంటుంది. కుడిచేతిలోని తాళాలు లయను పోషిస్తుంటాయి కొందరు జానపద గాయకుల చేతుల్లో ఉండే ఏక్‌తార శ్రుతికి, చిడతలు లయకు సంకేతాలు. సంక్రాంతి హరిదాసుల మెళ్లో వేలాడే చిటివీణియ శ్రుతి సౌందర్యాన్ని అందిస్తుంది. ఎడమచేతిలోని చిడతలు లయగతులను పాటిస్తాయి.

జానపద గీతాల ఆలాపనలో ఆర్భాటం ఉండదు. సున్నితమైన శ్రుతి మాధుర్యం, ఉత్సాహవంతమైన లయగతుల పోకడలు కనిపిస్తాయి, వినిపిస్తాయి, మురిపిస్తాయి. అసలు ఏ సంప్రదాయపు పాటకైనా శ్రుతి, లయలు అంతర్లీనంగానో, ప్రస్ఫుటంగానో సాగుతూనే ఉండాలి. లేకపోతే రుచి ఉండదు. వినేవారికి రసానందమూ కలగదు. ఈ రెండింటితో పాటు సంగీత పరిభాషలో తరచుగా వినిపించే మరో పదం... గమకం.

'గమక'మంటే ఒక స్వరం తన ముందున్న/ వెనకనున్న స్వరంలో కొంత శబ్దాన్ని గ్రహించి, తనలో కలుపుకుని ఒక కొత్త సౌందర్యాన్ని ఆవిష్కరించడం. ఇది పది రకాలని శాస్త్రం చెబుతోంది. గమకం శాస్త్రీయ సంగీతానికి ఆయువుపట్టు. లలిత సంగీతంలో దీని అవసరం అంత ఎక్కువగా ఉండదు. కానీ, కొన్ని భావాత్మకమైన పదాలను పాడేటప్పుడు దీంతో చాలా పని ఉంటుంది.

జానపద సంగీతంలో 'గమకం' ఉండదని చెప్పడానికి వీల్లేదు. సాధారణంగా పాడుకుంటూ వెళ్లినప్పటికీ గాయకుడి ప్రతిభా సామర్థ్యాలను బట్టి ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధంగా లీలగానైనా ఉంటుంది. కొన్ని ఆవేశ ఉద్వేగ సందర్భాల్లో గాయకుడికి తెలియకుండానే అప్రయత్నంగా బాణీలోనూ రావచ్చు, సుదీర్ఘ రాగాలాపనలోనూ రావచ్చు. గమకం వచ్చినా దోషమేమీ కాదు. రాకుంటే లోపమూ కాదు. అయితే, గమకం ఉండి తీరాలన్న నిబంధన మాత్రం ఏదీలేదు.

ఏ శాస్త్ర పరిభాషలోని పదాలనైనా 'అర్థం చేసుకోవడం' జ్ఞానానికి చిహ్నం. ఆ శాస్త్రాన్ని వ్యాఖ్యానించేటప్పుడో, ఉపయోగించుకునేటప్పుడో... ఎప్పుడో ఒకప్పుడు ఈ జ్ఞానం తప్పకుండా కరదీపికలా దారి చూపుతుంది. లక్ష్యం వైపు నడిపిస్తుంది.

డా॥ ఎం.పురుషోత్తమాచార్య
నల్గొండ. 93966 11905

కథలే వాడి నేస్తాలు

ఆంగ్ల మాధ్యమం చదువులపై తల్లిదండ్రుల్లో మోజు పెరుగుతున్న రోజులవి. 2000 సంవత్సరం. మా బాబుకు కూడా మూడేళ్లు రాగానే ఆంగ్ల బడిలోనే చేర్పించాం. కానీ అక్కడ వాడికి తెలుగును అలవాటు చేయట్లేదని తెలిసింది. చాలా బాధపడ్డా. అందుకే, ఇంటి దగ్గర నేనే ఆ పని చేయాలని నిర్ణయించుకున్నా. చందమామ రావెతో ప్రారంభించి నాకు వచ్చిన పాటలు, పద్యాలు, సామెతలను నేర్పా. బొమ్మరిల్లు, బాలమిత్ర లాంటి పుస్తకాలను తీసుకొచ్చి కథలు చదివి వినిపించే దాన్ని. వాటిల్లోని పదాలకు అర్థాలను విడమర్చి చెప్పేదాన్ని. అలా వాడికి తెలుగుపై ప్రేమ పుట్టింది. పదో తరగతిలోకి వచ్చేసరికి ఊళ్లోని గ్రంథాలయం నుంచి మల్లాది, రావిశాస్త్రి, కొ.కు. మధురాంతకం, ముళ్లపూడి వారి రచనలను తెచ్చుకుని చదవడం ప్రారంభించాడు. అంతే కాదు మా ఇంటి అరుగు మీద వాడి స్నేహితులందరినీ కూర్చొబెట్టుకుని వాడు చదివిన కథలను చెప్పేవాడు. ఈ మధ్యనే చిన్నచిన్న రచనలు చేయడం కూడా ఆరంభించాడు.

- చిక్కాల రత్నకుమారి,
రామచంద్రాపురం,
తూర్పుగోదావరి జిల్లా

గోడు

సంతోషికి విపరీతంగా ఆకలేస్తుంది... రాత్రి నుంచి మెతుకు ముట్టకుండా అట్లా పడి ఉన్న అత్తను చూస్తుంటే మనసు కరిగి నీరవుతోంది. అత్త తినకుండా తానెలా తినాలి? ధైర్యం చేసి "అత్తమ్మా... లేచి ఒక ముద్ద అన్నందినను, నా మీద కోపం అన్నం మీద చూపకు. ఇంటికి పెద్దదిక్కువి. నువ్వే అట్లుంటే నేను నా పిల్లలు ఏమైపోవాలె." సంతోషి మళ్లీ మళ్లీ బతిమిలాడింది.

"అద్దు బిడ్డా నన్ను గిట్ల బతిలాడకు. నా కొడుకు సచ్చిపోయిన్నాడే నేను సచ్చుంటే ఎంత మంచిగుంటుండే. బగమంతుడు గియన్ని సూడనీకే నన్ను బతికిచ్చిండు. నా కాలు సెయ్యి పడిపోయిన్నాడే నా పాణం తీస్కపోనుంటివి దేవుడా! సిన్న వయసుల్నే మగడు సచ్చినా, అవ్వగారింటికి బోకుంట నా కోడలు నాకాడనే ఉంటనన్నదని సంబరపడ్డ... పెద్దకొడుకు నా కోసరం బొంబాయి ఇడిసి పెట్టి రాకున్నా ఈ ముసలి కాలానికి కొడుకైనా కోడలైనా నువ్వే అనుకుని ఏమి మురిసినా మురిసిన. ఎంత నాట్కమాడినవే. అత్తను నేను ఈడనే ఉన్న. పెండ్లి కెదిగిన ఆడబిడ్డున్నది. కడుపున బుట్టిన ఇద్దరు ఆడిబిల్లలున్నరని గూడ చూడకుంట ఎవర్ని మరిగినవే కడుపు దెచ్చుకున్నవు.... ఏమి దెల్వని దాని తీరు ముచ్చోలే నా ముంగటనే దిరుగుతున్నవ్... అయ్యో అత్తమ్మా నేను ఆగలేక పోతున్నానంటే... ఏ అయ్యనన్న బతిలాడి మారు మనువు చేసేదాన్ని గదే. గింత అన్నాలమేడనన్నా ఉన్నదా? ఇంటిపరువు గంగల గలిపినవ్ గదే." గుండెలు బాదుకుంటూ ఏడవసాగింది భూమవ్వ. ఈ తుపాను సంతోషి ముందు ఊహించిందే అయినా... తెలియని నిస్సహాయతతో తల వరిగింది. మౌనమే శరణ్యమయ్యింది.

అంతలో జడివానలా పెద్ద ఆడపడుచు మంగవ్వ వచ్చింది. వస్తూ వస్తూ నలుగురు పెద్ద మనుషులను వెంట తెచ్చింది. కాళ్లు వణుకుతున్నా తమాయించుకుని నిలబడింది సంతోషి. "మా అమ్మ మా చెల్లె మాకు భారం కాదు వాళ్లకు తిండి పెట్టే వంకతో నువ్వు తిరుగుళ్లు మరిగినావా" అంటూ రంకెలు వేసింది. "అయ్యో ఏమన్నుంటే మాతో జెప్తే నీ బతుకునే ఏదో ఒకదారి జేస్తుంగాని ఇదేం పనులవ్వో" అన్నారు ఒకరు... "వాడెవడో జెప్తే ఇప్పటికైనా మాట్లాడుదాం. తిరుగుడేనా. పెండ్లి జేసుకుంటనన్నడా" ఇంకొకరు. వంచిన తల ఎత్తలేదు, జవాబు చెప్పలేదు. చెంపలపై నీరు జారుతూనే ఉంది... చెప్పలేని నిస్సత్తువతో కళ్లు తిరుగుతున్నా తమాయించుకు నించుంది.

"ఏమి దెల్వనట్లు ఎందుకా దొంగేడ్పులు? ఏమన్న సిగ్గున్నదా అసలు తప్పు చెయ్యకుంటనన్న వుండాలె. చేసినంక ఇజ్జత్ కోసమన్నా కడుపు దీపించుకోవాలె గాని జబర్దస్గ తిరుగుతాంది... సీ. మనిషి జల్మేనా గది" అని ఒకరు. ఒకరి తరువాత ఒకరు నోటికి వచ్చినట్లు మాట్లాడారు. "అమ్మా నీ కోడలి మంచితనం మా బాగున్నది గాని, ఇగ మా ఇంటికి రా మాతోనే ఉందువుగాని" అన్నది మంగమ్మ. కొంగులో ముఖం దాచుకుని రోదించింది గాని భూమవ్వ కదలలేదు. అలాగని కోడల్ని క్షమించలేదు. తాము విసిరిన శూలాలకు సంతోషి మోములో చిమ్మిన కన్నీరు ధారగా కారుతుంటే ఇంకేం చెయ్యలేక సణక్కుంటూ నిష్క్రమించారు వాళ్లు.

* * *

నులక మంచంపై అమాయకంగా పడుకున్న పిల్లలిద్దరినీ చూస్తుంటే గుండెలోని దుఃఖం గండితెగి చెంపల గుండా గుండెపైకి పాకింది. అట్లా ఎంతసేపు ఏడ్చిందో. ఎత్తిపోతలతో తీరే దుఃఖం కాదది. ఊటబాయిలో ఊరే జల. ఏదో చెప్పాలని ఉన్నా ఎవరికీ ఏమీ చెప్పలేని నిర్వేదం ఆమెలో. ఓ పక్కన కూర్చుని భూమవ్వ రాగం తీస్తూనే ఉంది. సంతోషికి విపరీతంగా ఆకలి వేయసాగింది. కళ్లు తిరుగుతున్నాయి. అంతకంతకూ ఆకలి పెరిగి ఇక నిలవలేకపోతుంది. కించపడుతూనే కళ్లు తుడుచుకుని లేచి కంచంలో అన్నం పెట్టుకుని తినసాగింది. కాస్సేపటికి భూమవ్వ పడుకోవడం చూసి నిట్టూర్చింది. పెద్దవాళ్లిద్దరప్పుడు ఇంత ఆకలి వెయ్యలేదు. ఏం మాయో ఇపుడు విపరీతంగా ఆకలేస్తోంది. సిగ్గు మరిచి తినాల్సి వస్తోంది. ఆ సార్ "బాగా తిను



సంతోషి నువ్వు ఆరోగ్యంగా ఉండాలి. పండంటి బిడ్డను కనాలి." అంటూ ఎన్నో పండ్లు కొనిస్తున్నాడు. కాని పిల్లల ముందు వాళ్లకు పెట్టకుండా తినాలంటే సిగ్గనిపిస్తోంది. తినకుండా ఉండాలంటే అమ్మో... అట్లెట్ల సార్ ఊరుకోడు కదా! ఆలోచిస్తూనే కాస్త నడుం వాల్చింది. కడుపులో బిడ్డ కదిలినట్టైంది. కన్నుల్లో నీరు తిరిగింది.

చూరులో చేరిన పిచ్చుకలు కిచ కిచమంటూ... సవ్వడి చేస్తున్నాయి. చుట్టమెవరో వచ్చి పలుకరించినట్టనిపించి అంత దుఃఖంలోనూ చివ్వున తలెత్తి చూసిందామె. ఎక్కడ నుంచి తెస్తున్నదో



చిటికెలో ఎగిరెళ్లి ధాన్యం నోట కరుచుకువచ్చి ఓపికగా పిల్లలకు తినిపిస్తోంది తల్లి పిచ్చుక ఆ దృశ్యాన్ని అపురూపంగా చూస్తుంటుంది సంతోషి. ఈ మధ్య వాటిని గమనించడమే ఓ వ్యాపకమయ్యిందామెకు. మొదట్లో తన ఇంటచేరి రొద పెడుతున్న ఈ పిచ్చుకల ఉనికి తగని చిరాకు కలిగించేది సంతోషికి. అవి పుల్లాపీచు తెచ్చుకుంటూ గూడు కట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న కొద్దీ ఇల్లంతా చెత్త తెచ్చి పోస్తున్నాయంటూ విసుగ్గా పీకేసేది. తన బాధలో తానుంటే ఆ కిచ కిచలు తలనెప్పిగా అనిపించేవి. అప్పుడే పడుకున్న పిల్లలు నిద్రలేస్తారేమోనని చిరాకు పడేది. గూడు కోసం తెచ్చి పేర్చిన చెత్తంతా పారబోసి అలా పనిలో పడేదో లేదో మళ్లీ గుట్టలా తెచ్చిపడేసేవి. ఓ పది రోజులు తాను ఆ పుల్లాపీచులను పారెయ్యబోవడం అవి మళ్లీ మళ్లీ గూడు కట్టడానికి శ్రమించడం చూసి "ఏంది సంతోషి గట్లజేస్తవ్. పిల్లలను గని సాకేటందుకే గవి గూడు గడ్తయి. నువ్ గట్ల తీసిపారెయ్యకు... నీ ఇంట్ల గూడు గట్టుకుని దాని గుడ్లు పొదుగుకున్నంతట్లనే నీ మూటా ముల్లె ఏంబోదు తియ్" అత్త కసరితే నిజమే కదా అనిపించింది. అదంతా గుర్తుకు వచ్చి కళ్లు తుడుచుకుంటూ వాటి వంక పరీక్షగా చూస్తూ ఆలోచనలో పడింది.

ఇప్పుడా గువ్వ తన పిల్లలకు ధాన్యం తినిపిస్తోంది. ఆ పిచ్చుకను చూస్తే తనను తాను చూసుకుంటున్నట్టుంది సంతోషికి.

లోపల బిడ్డ మరింత కదులుతోంది. తన కడుపును గూడుగా చేసుకుని పెరుగుతున్న ఆ చిన్న ప్రాణిపై అప్పుడే అనురాగం కలుగుతోంది. అంతలో బానయ్య గుర్తుకొచ్చి మళ్లీ కళ్లు నిండాయి. జీవితమంటే ఏమిటో తెలియకముందే అతనితో బంధం కలగా ముగిసిపోయింది. పెళ్లయిన అయిదేళ్లకే విపరీతంగా తాగి తాగి కన్నుమూశాడు బానయ్య. అకస్మాత్తుగా భవిష్యత్తు అంధకారమైంది... అమ్మలేని పుట్టింట అడుగుపెట్టి, తండ్రికి, అన్నకు భారం కావాలనిపించలేదు. చదివిన తొమ్మిదో తరగతి చదువు దేనికీ పనికి రాలేదు. ఏడుపు తప్ప మరో దారి కనపడలేదు. తోడు గురించి ఆలోచించాలో, జరుగుబాటు గురించి ఆలోచించాలో తెలియని అయోమయపు దుఃఖంలో మునిగిపోయింది. గుండె రాయి చేసుకుని మొండిగా బతుకీడవడం అలవాటు చేసుకుంది.

ఆకలి దుఃఖించే సమయాన్ని ఆమెకివ్వలేదు. ఆమె మనసు మాటేమోగాని పిల్లల కడుపు బాధ కోసం కూలి పనులకు పరుగులు పెట్టవలసి వచ్చింది. ఆ గువ్వ పిట్టలా తానూ పిల్లల కోసం రెక్కలు సాచి బతుకు పోరాటానికి పరుగులు తీసింది. కోడల్ని కూతురిలా చూసుకుంటూ అత్త ఆమెకు అమ్మలా అండగా నిలిచింది. ఆడపడుచు యాదమ్మ సంతోషికి మరో కూతురయ్యింది.

ఒక సంవత్సరం పాటు అత్తా కోడళ్లు నానా తంటాలు పడి కూలీనాలీ చేసుకుంటూ... అతి కష్టంగా బతుకీడ్చుకొచ్చారు. బానయ్య కర్మ కోసం ఇంటి మీద తెచ్చిన అప్పులు తీరనేలేదు. ఆడపడుచు యాదమ్మ తన వయసు గుర్తు చేస్తూ మూలచేరింది. సంతోషపడాలో దుఃఖపడాలో తెలియని అయోమయంలో ఉండగా భూమవ్వకు పక్షవాతం కమ్మి మంచం పట్టింది. సంతోషి నెత్తిన పిడుగు పడ్డట్టయ్యింది. "అత్తకేమన్నయితే పరిస్థితేంటా" అని వణికిపోయింది. ఆమెకెలా వైద్యం చేయించాలో అర్థం కాక కుమిలిపోయింది. అమ్మలా ప్రేమించడమే కాదు కనురెప్పలా కాపాడుకుంటోంది. అంతటి అత్త అండగా ఉంటేనే తన బతుకు ఇలా ఉంది ఆమె లేకపోతే... తలచుకుంటేనే భయంతో వణికిపోయింది.

ఇప్పటికే "నీ పిల్లలను అన్నగారింట్లో ఇడిసిబెట్టు, నిన్ను మారుమనువు చేసుకుంటానని" ఒకడు. "నువ్వు ఊ అను నిన్ను రాణి లెక్క జూసుకుంట, నీ దరిద్రమంతా దీరుస్త" అని ఒకడు... "ఏంది నీ కండ్లకు నేను అన్నలేనా, గంత పతివ్రతవా" అని ఒకడు ఎవరికీ చెప్పుకోలేక అందరినీ తప్పించుకుంటూ అత్త అండతో మొండిగా బతుకుతున్నది. ఆమె లేకపోతే ఇంకేమనున్నదా! ఏమైనా సరే అత్తమ్మ బతకాలి అనుకుంటూ తాకట్టు పెట్టిన ఇంటి మీదే మరింత సొమ్ము వడ్డీకి తెచ్చి వైద్యం చేయించింది. ఆమెకు ప్రాణహాని లేకుండా బయటపడింది. కానీ లేచి పనులు చేసుకునే పరిస్థితి కనుచూపు మేరలో కనిపించలేదు.

మూడు నెలలు ఎంత గడ్డుగా గడిచాయో తెలియదు. తల్లికి బాగుండలేదని

తెలిసి బావయ్య అన్న వెంకన్న అతి కష్టం మీద బొంబాయి నుంచి వచ్చి చూసివెళ్లాడు. ఓ రెండు రోజులుండి రెండు వేలు చేతిలో పెట్టి వెళ్లలేక వెళ్లాడే తప్ప తల్లిని తీసుకెళ్లే ప్రయత్నం చేయలేదు. అతని ఆర్థిక పరిస్థితి అలాంటిది. కొడుకునన్న హక్కుతో బావగారు అత్తను తీసుకెళ్తే దిక్కులేని దాననయిపోతానని భయపడ్డ సంతోషి వెంకన్న తన తల్లిని తీసుకెళ్లనందుకు ఒకింత సంతోషపడింది. అతనిచ్చిన రెండు వేలను పదివేలుగా భావించినా రెండు రోజుల్లో అవి రెండు వందల్లా ఖర్చయిపోయాయి. గడ్డు రోజులు మొదలై రోజులు భారంగా గడుస్తున్నాయి.

అంతలో సంతోషి వదినకు ఆరోగ్యం బాగుండలేదన్న వార్త అందింది. తండ్రిని, అన్నను చూసి కూడా చాలా కాలమైందని అత్త గురించి పిల్లల గురించి యాదమ్మకు వంద జాగ్రత్తలు చెప్పి బయల్దేరింది. రెండు రోజులుండి వద్దామనుకున్న సంతోషి వదినకు తోడుగా ఆసుపత్రిలో ఉండాల్సి వచ్చి నాలుగు రోజులైనా రాలేకపోయింది. అక్కడ చాలా కాలానికి కలిసిన దూరపు చుట్టం పార్వతక్కకు తన పరిస్థితంతా చెప్పుకుని ఏడ్చింది. ఆమె మొదట కాస్త ఓదార్చి ఊరుకుందిగానీ మరుసటి రోజు తనను వెదుక్కుంటూ వచ్చి ఒక ఉపాయం చెప్పింది. సంతోషికి అసలు విషయం అర్థం కావడానికే చాలాసేపు పట్టింది. అర్థమయ్యాక కాళ్ల కింద భూమి కదిలిపోతున్నట్టు వణికిపోయింది. "చాల్లే అక్కా ఇట్లాంటి పనులు నాతోని కాదంటే కాదని" తెగేసి చెప్పింది. ఎప్పుడెప్పుడు వచ్చి ఇంట్లో పడదామా అన్నట్లు ఇల్లు చేరి పిల్లలను దగ్గరకు తీసుకుని పడుకుంది. ఎంత మరచిపోదామనుకున్నా పదేపదే పార్వతి అన్న మాటలు గుర్తుకు వచ్చి గుండెల్లో చలి పుట్టేది. అమ్మో ఇంకేమైనా ఉందా అనుకుని తల విదుల్చుకుని మామూలు జీవితంలో పడిపోయింది.

రోజులు అతిభారంగా గడుస్తున్నాయి. రోజురోజుకీ భూమవ్వ మరింత నీరసించి పోసాగింది. సంతోషికి ఇంటికి పెద్ద దిక్కును కాపాడుకోవాలన్న తపనే తప్ప... తెచ్చుకుంటున్న కూలి డబ్బులతో ఇంటి అవసరాలు తీరడం లేదు. పిల్లలు అర్ధాకలితో పడుకుంటున్నారు. పిల్లలనెలా బతికించుకోవాలో తెలియని అయోమయంలో ఆమె ఉండగానే ఇల్లు తాకట్టు పెట్టుకున్న సేటు వచ్చి ఇచ్చిన గడువు దాటి పోయిందని డబ్బులు కట్టి ఇల్లు విడిపించుకొమ్మని లేదంటే ఇల్లు జప్తు చేసుకుంటానని గొడవ పెట్టి వెళ్లాడు. సంతోషి మనసు దుఃఖంతో పొంగిన సంద్రమయ్యింది. తోడులేకున్నా కూడు తిన్నా తినకున్నా తమ మాన ప్రాణాలను ఓ కప్పుకింద కాపాడుతూ ఆ మట్టిగోడల గూడే తమని రక్షిస్తోంది. అదే లేకుంటే ఎక్కడుండాలి? అంతే సంతోషికి అకస్మాత్తుగా తెగింపు వచ్చేసింది. మర్నాడే సేటును కలిసి కొంత గడువు అడిగింది. అత్తకు,

పే 'స్కేల్'

జీతం దుప్పటి
ఎంత గింజుకున్నా చాలదు
అయితే తలో
లేకపోతే కాళ్లో
బయటుండాల్సిందే
అవసరాల దోమకాట్లు
భరించాల్సిందే.

ఆడపడుచుకు జాగ్రత్తలు చెప్పి అన్నగారి ఊరు బయల్దేరింది.

పార్వతిని కలిసి "నువ్వు చెప్పిన పనికి ఒప్పుకుంటున్నా కాని నాకు మాత్రం వెంటనే ఎంతో కొంత డబ్బులు కావాలి" అని తలవంచుకు చెప్పింది. చెప్పిందే గాని చెంపలపై నీరు జలజల రాలాయి... "నువ్వేం బాధపడకు సంతోషి. ఈ మధ్య ఇట్లా చాలామంది చేస్తున్నారు. ఇది తప్పేం కాదని" అలా చేస్తున్న ఎంతో మంది గురించి చెప్పి ధైర్యం చెప్పే ప్రయత్నం చేసింది. ముందు కళ్లు తుడుచుకో డాక్టరును కలుద్దామంటూ బయల్దేరింది... డాక్టరు భార్గవి ఎన్నోవిధాల సంతోషిని పరీక్షించి, ఎన్నో ప్రశ్నలు వేసి, ఎన్నో విషయాలు వివరించి ఓ జంటను పరిచయం చేసింది. తల వంచుకుని వాళ్లు చెప్పిన మాటలు విని అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పింది. తన సమ్మతిని తెలియజేసింది. వారం రోజులు రకరకాల వైద్యపరీక్షలు చేయించుకుంది... ఎన్నెన్నో కాగితాల మీద సంతకాలు చేసింది. డాక్టరు సమక్షంలో వారిచ్చిన కొద్దిపాటి సొమ్మును తలవంచుకు తెచ్చుకుంది. సేటుకు కొంత సొమ్ము కట్టి వచ్చి సొమ్మసిల్లినట్టు వాలిపోయింది.

ప్రపంచంలో ఇలా కూడా జరుగుతున్నాయన్నది ఆమెకు ఊహకు కూడా రాని విషయం. ఇప్పుడు అనుభవంలోకి వచ్చింది. మనసు పరిపరివిధాలుగా కలవరపడుతుండగా పదిహేను రోజులకోసారి డాక్టరును కలిసింది. మూడో నెలలో నెల తప్పింది... నెలవు నిలిచింది. తలవంచుకుని వాళ్లకు కావాల్సిన కబురందించింది. కేశవరావు, దీపలు సంబరపడిపోయారు. సంతోషిని అపురూపంగా చూసుకోసాగారు. ఇప్పుడు అత్తమ్మ తనను అనుమానిస్తుంటే మనసు విలవిల్లాడి పోతున్నా... ఆమెకు ఈ విషయం చెప్పి నచ్చజెప్తే అర్థం చేసుకుంటుందన్న నమ్మకం లేదు. నీ పాపపు సొమ్ము ముట్టనన్నదని బావగారే నెలనెలా ఆమె వైద్యానికి డబ్బు పంపిస్తున్నారని అబద్ధం చెప్పి మందులు తెచ్చిస్తున్నది సంతోషి.

కానీ రానురాను తన పరిస్థితి తనకే వింతగా ఉందామెకి. బిడ్డను కని ఇచ్చేయ్యాలన్న ఆలోచన కొత్తగానూ భయంగానూ బెంగగానూ ఉంది. తన గురించి లోకమంతా ఏమంటారో ముందే ఊహించింది కనుక ఏమన్నా అనుకోనిమ్మని మొండికేసింది. నెలలు గడుస్తున్న కొద్దీ అన్నా వదిన, ఇరుగు పొరుగు చూస్తున్న చూపులు, అంటున్న మాటలు భరించడం అలవాటు చేసుకుంటోంది. అప్పుడప్పుడు కేశవరావు కారులో వచ్చి పండ్లు, మందులు తెచ్చిచ్చి వెళ్లడం తన ఆరోగ్యం గురించి వాళ్లంతా ఎంతో శ్రద్ధ వహించడం కొత్తగా ఉంది... ఊర్లో వాళ్లంతా బాగా డబ్బున్న వాడినే పట్టిందని చెవులు కొరుక్కోవడం ఇబ్బందిగానే భరిస్తోంది. కడుపులో పాప అప్పుడప్పుడు వలయాలు తిరుగుతోంది. తల చేతికి తగులుతోంది. ఆ తలపై

చెయ్యేసి "నేను నిన్ను కడుపుల మోస్తున్నా... నేను నీకు అమ్మనుగాను బిడ్డా కాని నువ్వు మాత్రం మా అందరి బతుకులు నిలబెట్టిన అమ్మతల్లివి." అనుకుంది.

* * *

రోజులు గడుస్తున్న కొద్దీ పుట్టబోయే పాప గురించిన ఆలోచనలు ఎక్కువవుతున్నాయి. ఇంకా కళ్లు తెరవని పాపాయి మీద మమకారం ఎక్కువవుతంది. పుట్టిన వెంటనే ఇచ్చేసెయ్యాలన్న ఆలోచనకు పాపభీతి కలుగుతోంది. ఇవ్వక తనకేం హక్కు ఉందని మిన్నకుంటున్నది. ఒప్పందం గుర్తుకొచ్చి నిగ్రహించుకుంటోంది. వాళ్లిచ్చే సొమ్ములతోనే కదా తన ఇల్లు నిలిచింది. అత్తా ఆడబిడ్డా పిల్లలకు కడుపు నిండా తిండి పెట్టగలుగుతున్నదని సంతోషపడుతోంది. నెలనెలా వాళ్లిస్తున్న డబ్బులు తనది అమ్మతనం కాదని అద్దె కడుపని గుర్తు చేస్తున్నాయి. బిడ్డను ఇచ్చేటప్పుడు తాను గుండెను రాయిగా చేసుకోవాలని... ముందు నుంచే తనను తాను కఠినంగా మలుచుకుంటోంది. పుట్టబోయే బిడ్డకు దీపమ్మే తల్లి అని మనసుకు నచ్చజెప్పుకుంది. తమకు చెందే బిడ్డ కోసమో ఏమో సంతోషిని దగ్గరుండి చూసుకుంటామని వాళ్లింట్లోనే ఉండమన్నారు... "ఈ భారం మోస్తోంది నా బిడ్డల కోసమే. వాళ్లను వదిలి నేను ఎక్కడకూ రానయ్యా" అంది.

తనకు అందబోయే సొమ్ముతో కొన్ని బాకీలు తీరతాయి. ఇల్లు నిలుస్తుందని సంతోషంగానే ఉందామని ప్రయత్నిస్తున్నా సంతోషి మనసు సంఘర్షిస్తూనే ఉంది. ఇపుడామె ఆలోచన ధోరణి కాస్త మారింది. ఇది డబ్బు కోసమే చేసిన పనే అయినా పుట్టబోయే బిడ్డ తనబిడ్డ కాదనడానికి మనసొప్పడం లేదు. అసలు కాన్పంటేనే మరో జన్మ అంటారు. చావు అంచులదాకా పోయి బిడ్డను కంటున్నా "నా రక్తాన్ని పంచుతూ నా కడుపున పెంచుతున్నా, నేనే జన్మనిస్తున్న. ఇప్పుడు ఈ బిడ్డ నీ బిడ్డ కాదు పొమ్మంటే వదులుకోవాల్సిందేనా" ఆమె మనసు దుఃఖించింది. "వదులుకోక ఉన్న బిడ్డలనే పెంచలేక కష్టాలు పడుతుంటే. ఈ బిడ్డను ఎట్ల పెంచుత?" కించపడింది. "ఒకేళ ఈ కాన్పుల నేనే పోతే నా పిల్లలు అనాథలైపోతారు కదా ఈ పనికి ఒప్పుకుని తప్పు చేసిన్నా?" ఆ ఊహకే వణికిపోయింది. రకరకాల ఆలోచనలతో ఉండుండి నిండుతున్న సంతోషి కళ్లను చూసి... "ఓ ఆడదానిగా నీ బాధను అర్థం చేసుకోగలను సంతోషి. తల్లిని కాలేకపోయిన నాకు బిడ్డను కని ఇస్తున్నావు. దేవుడు నీకు మేలు చేస్తాడు... మనసును ప్రశాంతంగా ఉంచుకో సంతోషీ... నీకు ఎప్పుడు చూడాలనిపిస్తే అప్పుడు వచ్చి చూద్దువుగాని, ఎక్కువగా ఆలోచిస్తే బీపీ పెరిగితే కష్టం" అంటూ ధైర్యం చెప్పింది దీప. నెల రోజులుగా పార్వతి సంతోషికి సాయంగా ఉంటోంది.

* * *

సంతోషికి పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి... బంధువులెవరికో సీరియస్‌గా ఉందని వెళ్లిన కేశవరావుకు పార్వతి ఫోన్ చేసింది. ఎందుకో ఎంతకూ ఫోన్ కలవలేదు. చేసేదేం లేక ఇరుగు పొరుగు సహాయంతో ఆమెను ఆసుపత్రిలో చేర్చింది. పదే పదే కేశవరావుకు ఫోన్ చేస్తూనే ఉంది. కానీ కలవడం లేదు. నెప్పులు శరీరాన్ని బాధిస్తుంటే... పేగు తెగుతున్న బాధను సంతోషి అనుభవిస్తోంది. కొన్ని గంటలు తీవ్రంగా బాధపడ్డ సంతోషి పండంటి బిడ్డను కన్నది. నీరసంతో కళ్లు మూసుకుపోతున్నా ఆత్రంగా బిడ్డవంక చూసుకుంది... చేతికందని చందమామలా తోచాడు వాడు. ఆ బిడ్డ ఇక తన దగ్గర ఎంతోసేపు ఉండడన్న భావనతో... ఓపికనంతా కళ్లలో నింపుకుని కళ్లు మరింత విప్పార్చుకుని మురిపెమారా చూసుకుంటోంది. అప్పుడే పూసిన గులాబి మొగ్గలా ముద్దుగా ఉన్నాడు పాపడు.

రెండు రోజులు గడిచినా కేశవరావు దంపతుల జాడ తెలియరాలేదు. డాక్టర్ భార్గవికేం చేయాలో పాలుపోలేదు. సంతోషి మాత్రం మరో లోకంలో ఉంది. ప్రపంచంలో ఏం జరుగుతోందో తెలియని ఆ పాపడు మాత్రం సంతోషి వడి వెచ్చని గూడయి హాయిగా ఆడుతున్నాడు. ఏ వాయిద్యమూ అనుకరించలేని సరికొత్త రాగాలు ఆ చిన్ని నోట వినిపిస్తున్నాడు. బిడ్డను అపురూపంగా చూసుకుంటూ పాలు పడుతోంటే ఆమె కన్నుల్లో నీరు జారుతోంది. ఆ చిన్ని పెదవులు పాల చుక్కలను చప్పరిస్తుంటే... నా మనసునే కాదు... నా గుండెను కూడా ఎండబెట్టుకోవాలె గదా కొడుకా అని దుఃఖపడింది.

"ఏంజేసుడు దేవుడా! వాళ్లు ఎప్పుడు రాంగనే అప్పుడు బిడ్డను వాళ్లకు అప్పజెప్పి నా బతుకులోకి నేను వెళ్లిపోత. అత్తమ్మా! ఇగనా డూటీ అయిపోయింది. ఇంటిని నిలబెట్టిన, నిన్ను కాపాడుకున్న... ఇగ ఇంటికే వస్తున్న నేను ఎప్పటి సంతోషినే." మనసులో తలపోస్తూ కళ్లు తుడుచుకుంటుంది... పదే పదే బిడ్డను గుండెలకు హత్తుకుంటుంది. పేగు పంచిన నేను వీడ్ని బెంచలేనా, భగవంతుడా! నాకు ఈ బిడ్డను సాకేంత ప్రేమ, ఈ రెక్కల్లో ఓపికా ఉన్నా, అన్న మాటకు కట్టుబడాలె గదా. బిడ్డను మరింత పదిలంగా గుండెలకదుముకుంది. డాక్టర్ భార్గవికి ఆ దృశ్యం ఎంతో అపురూపంగా తోచింది. ఇరువురూ లాభపడ్డ ఇలాంటి ఎన్నో కేసులు చూసినా భార్గవికి పిల్లల కోసం అంత పరితపించిన కేశవరావు దంపతులు ఎంతకూ రాకపోవడంతో ఒకింత కలవరపడింది. సాయంత్రమైనా కేశవరావు జాడ తెలియకపోవడంతో ఆమె మనసు కీడు శంకించసాగింది. వాళ్లకేమైనా ప్రమాదం జరిగితే సంతోషి పరిస్థితి ఏమిటా అని ఆందోళన పడిపోయింది.

ఊయలలో బాబును పడుకోబెట్టి పైకి చెప్పలేని అలజడితో అదిరిపోతూ తలవంచుకు కూర్చున్న సంతోషి ఏదో అలికిడికి తలెత్తింది. ఎదురుగా నమ్మశక్యం కాని దృశ్యం. ఒక వంక తనకు కృతజ్ఞతలు చెపుతూ సంతోషంగా బిడ్డను ఎత్తుకుని ముద్దులాడుతున్న కేశవరావు దంపతులు. అది కాదు అంతకంటే అపురూపమైన మరో దృశ్యానికి పులకించిపోయింది సంతోషి. యాదమ్మ సాయంతో కాలు ఈడ్చుకుంటూ తన వంక నడిచి వస్తోంది భూమవ్వ. సీతను తన వెంట తీసుకెళ్లడానికి వచ్చిన భూదేవిలా...

సమ్మెట ఉమాదేవి
కొత్తగూడెం 98494 06722

పిల్లల స్థాయికి ఎదగాలి!

'చిలుకు ఛిలాట్ – ములుకు ములాట్... గువ్వా దెబ్బ చూసుకో' అని పాడుతూ గురి చూసి బొంగరాన్ని కొట్టే తెలుగింటి పిల్లాడు నేడు ఎలుక(మౌస్)లతో సావాసం చేస్తున్నాడు. 'ఆకు – అల్లం – సూది – సుద్ద' అంటూ ఒకచోట కాలునిలవకుండా పరిగెత్తే బుజ్జోడు ఇప్పుడు కాలుకదపకుండా 'ఆటలాడుతున్నాడు'. పాట సంగతి దేవుడెరుగు మాటనూ మర్చిపోయి రంగుల తెరపై తుపాకీగుళ్లు పేల్చేస్తున్నాడు.

మనవైన ఆటపాటలకు దూరంగా ఎదుగుతున్న నవతరం చివరికి [illegible] తెలుగు బాలసాహిత్యం నేడు ఏ స్థితిలో ఉంది?

అజంత భాషలోని అద్భుతమైన బాలసాహిత్యంపైన మొట్టమొదట పరిశోధన చేసి, దాని విస్తృతిని, విశిష్టతను చాటిన **ఆచార్య ఎం.కె.దేవకి** దగ్గర బాలల గురించి ప్రస్తావిస్తే... ఆమె గొంతు గద్గదమవుతుంది. ఇప్పుడు పిల్లలకు బాల్యమనేదే లేదంటూ ఆవేదన చెందుతారావిడ.

ప్రస్తుతం తెలుగులో వస్తున్న బాలసాహిత్యం, దానికి దక్కుతున్న ఆదరణ, బాలసాహిత్య సృష్టికర్తలు గమనంలో ఉంచుకోవాల్సిన విషయాలపై దేవకి... 'తెలుగు వెలుగు'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే....

ఓ తల్లి తన బిడ్డకు ఒక పేద కుర్రాడి కథను చెబుతోందట! ఆ పిల్లాడు తినడానికి తిండిలేక అల్లాడుతున్నాడంటూ చెప్పుకెళ్తోంటే మధ్యలో అబ్బాయి అడ్డుతగిలాడంట! 'ఏం... అతనికి అమ్మ లేదా' అని అడిగాడంట! "లేదు కన్నా" అని బదులిస్తే 'ఈ బిస్కెట్టును తనకివ్వు' అని తన చేతిలో ఉన్న బిస్కెట్టును అమ్మకిచ్చాడట! ఓ ప్రసిద్ధ రచయిత స్వానుభవంలోంచి చెప్పిన విషయమిది. బాలలపై 'కథ' ముద్రకు ఈ ఉదంతమే ఉదాహరణ. ఆకలితో ఉన్న వాడికి సాయపడాలన్న విషయం ఆ పిల్లాడికి అప్రయత్నంగా స్ఫురణకు వచ్చిందంటే అది కథ వల్లే కదా. బాలసాహిత్యం గొప్పతనమే అది.

చిన్నారుల్లో విచక్షణా జ్ఞానాన్ని, నైతికతను పెంచడానికి ఉద్దేశించిందది. కానీ, నేడెక్కడా పిల్లలకు కథలు చెప్పట్లేదు. మా చిన్నప్పుడు పాఠశాలలో చివరి గంటలో ఎవరో ఒక ఉపాధ్యాయుడు కథలు చెప్పేవాళ్లు. ఇప్పుడేమో ప్రతి నిమిషమూ ర్యాంకుల రొదే. ఇక పిల్లల్లో విలువలెట్లా పెరుగుతాయి?

ఆట ఆనంద సంకేతం. చెడుగుడు లాంటి ఆటలిప్పుడు కనపడటం లేదు గానీ, గతంలో పాటలు పాడుతూ మరీ వాటిని ఆడేవారు. అలాగే, ఆయాసం లేకుండా గడిపే పిల్లాడు. ఇప్పుడు పెద్దలకన్నా పిల్లలే ఎక్కువ ఆయాస పడుతున్నారు. మార్కుల బరువు మోయలేక. వెన్నెల రాత్రుల్లో ఆటల్లేవు. చేలగట్టున పాటల్లేవు. పట్నాలు, పల్లెలు అన్న తేడానే లేకుండా ఎక్కడ చూసినా పిల్లలకు అవస్థలే. ఒక్కమాటలో చెప్పాలంటే ఇప్పటి తరానికి బాల్యమే లేదు. అందుకే బాలసాహిత్యం ఉనికే రాష్ట్రంలో కనపడట్లేదు. ఒకవేళ అమ్మానాన్నలు ఏవైనా పాడించినా అవి 'రైమ్స్' మాత్రమే 'పాటలు' కాదు. తెలుగులో కొన్ని వేల బాలల గేయాలున్నాయి. ఇప్పుడవి ఎక్కడా వినిపించడం లేదు. అసలు అవి ఉన్నాయన్న సంగతి కూడా చాలామందికి తెలియదు. వాటిని తిరిగి వ్యాప్తిలోకి తీసుకురావాలి.

అంబాలు

అంబాలు మీద కుంబాలు
కుంబాలు మీద కుడితిబాన
కుడితిబాన మీద ఈరబలక
ఈరబలక మీద ఇనపగుండు
ఇనపగుండు మీద ఎదురుమోసులు
ఎదురుమోసుల్లో రేచుకుక్కలు

ఈ పొడుపు కథను విప్పండి చూద్దాం. (జవాబును చివర్లో చెప్పుకుందాం) ఒకప్పుడు ఇలాంటి వాటిని విప్పడానికి పిల్లలు ఉత్సాహం చూపించే వారు. బుద్ధికి పదును పెట్టే ప్రక్రియ ఇది. అంతే కాదు

భాషనూ నేర్పించే సాధనమిది. పొడుపు కథంటే ఓ సమస్య. దాన్ని విప్పడమంటే పరిష్కారాన్ని సాధించడం. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే పద్ధతిని బాలలకు నేర్పే విధానమిది. ఇప్పుడెక్కడైనా ఈ పొడుపుల విరుపులు కనిపిస్తున్నాయా? తెలుగులో ఉన్న అసంఖ్యాక పొడుపు కథలన్నీ ఏమయ్యాయి? ఎక్కడికీ పోలేదవి. తెలుగు వారు పట్టించుకోకపోవడంతో మూలనపడ్డాయి. వాటిని మళ్లీ అక్కునజేర్చుకుంటే... చిన్నారులను ఐక్యూ తరగతులకు పంపాల్సిన అవసరముంటుందా?

చిన్నారులకు అద్భుతరస కథలను చెబితే సృజనాత్మకత పెరుగుతుంది. వాటిలో వాస్తవిక దృష్టి లోపిస్తోందని భావిస్తే అసలుకే మోసం. రష్యాలో బాలసాహిత్యానికి అమితమైన ప్రాధాన్యమిస్తారు. మొదట్లో అక్కడ అద్భుతరస ప్రధానమైన కథలు విరివిగా వచ్చేవి. వాటి వల్ల పిల్లలు ఊహాలోకాల్లో విహరిస్తున్నారని అక్కడి ప్రభుత్వం ఆ కథలను నిషేధించింది. కొద్దికాలం తర్వాత ప్రభుత్వమే ఓ పరిశీలన చేయించింది. నిషేధం వల్ల పిల్లల్లో వాస్తవిక దృష్టి పెరగకపోగా సృజనాత్మక శక్తి తగ్గిపోయిందని తేలింది. ఉన్నది ఉన్నట్లుగా చెబితే పిల్లలు పట్టించుకోరు. ఏ విషయాన్నైనా, నీతినైనా కథ రూపంలో కల్పన జోడించి చెబితేనే ఫలితముంటుంది.



'భోజనం చేద్దువుగాని రా రా' అంటే పిల్లాడు రాడు. 'కన్నా... బువ్వ తింటానికి రా' అంటే వచ్చేస్తాడు. పిల్లలకు ప్రత్యేకమైన భాష ఉంది. వారివైన పదాలున్నాయి. బాలల కోసం రచనలు చేద్దామనుకునే వారు దీన్ని దృష్టిలో పెట్టుకోవాలి. చింతా దీక్షితుల కలం శక్తి అందరికీ తెలిసిందే. ఆయన రచనలను చదివిన వారు... అవి పిల్లలే రాశారనుకునే వారు. ముళ్లపూడి బుడుగూ మనకెప్పటికీ గుర్తుండే వాడే. అంతలా ఆయన చిన్నారుల భాషను ఉపయోగించే వారు. అలాంటి రచనలే పిల్లల మనసులను దోచుకుంటాయి. నేటి రచయితలు మాత్రం పిల్లల స్థాయికి దిగిరావట్లేదు. తమ పాండిత్యాన్నంతా ప్రదర్శించి మరీ రచనలు చేస్తున్నారు. అయినా... ఇప్పుడు పిల్లల కోసం కలం కదలించే వారు అతి తక్కువ. నేను పరిశోధన చేసే సమయంలో 60 - 70 మంది ఉండేవారు. ఇప్పుడెవరైనా రచనలు చేసినా వాటికి ఆదరణ ఉండట్లేదు. కర్ణాటకలో అయితే అక్కడి ప్రభుత్వమే 60 శాతం ప్రచురణలను కొంటుంది.

రచయితలను ప్రోత్సహిస్తుంది.. మన ప్రభుత్వం దీనికి చాలా దూరం. అందుకే తెలుగులో రాన్రానూ బాలసాహిత్య రచయితలు తగ్గిపోతున్నారు.

బాలసాహిత్యంలో సైన్సునూ మిళితం చేయాలి. శాస్త్ర సాంకేతిక విషయాలను కథలు, పాటల రూపంలో చెబితే పిల్లలకు తొందరగా అర్థమవుతాయి. గతంలో తెలుగులో ఈ కోణంలో ఎన్నో రచనలు వచ్చాయి. 'గాలులు రెండు కలుసుకుని నీళ్లుగా మారును ఏమిటవీ'... "ఉదజనీ, ఆమ్లజనీ కలిసి నీళ్లగ ఔనండీ", 'నీళ్లల్లోనే

లాలి లాలోయమ్మ లాలి మా యమ్మా అంటూ జోకొట్టినా.... ఊ ఊ ఉంగన్న - ఉగ్గుపాలు ఇందన్న అంటూ ఉగ్గ పట్టినా తెలుగు తల్లులకే చెల్లింది. బిడ్డకు పాటతో ప్రపంచాన్ని పరిచయం చేసి, కథతో లోకం పోకడను వివరించి, పొడుపు కథతో సమస్యకు పరిష్కారాన్ని వెతకడం నేర్పించడం ఆయమ్మలకు వెన్నతో పెట్టిన విద్య. అలా అమ్మ చేతుల మీదుగా పెరిగిన పిల్లాడు 'చింతాకు - పులగూర - తిందువు రారా' అని పాడుతూ సావాసగాణ్ని పిలుస్తాడు. 'ఓరోరి పాపడా - నీ ఒల్లెల్ల గుల్లరా - కారాకు పచ్చరా - నీ కండెంత తియ్యరా' అని పొడుపు విసురుతూ... దాన్ని విప్పితే మొనగాడివని సవాల్ చేస్తాడు. తర్వాత ఇద్దరూ ఆడుతూ పాడుతూ... పాడుతూ ఆడుతూ భుజం భుజం కలిపి తిరుగుతారు. ప్రకృతిని పెద్దబాలశిక్ష చేసుకుని చదువుకుంటారు. ఎదుగుతారు!

అమ్మ తర్వాతే ఏ అనుబంధమైనా. స్వగ్రామం తర్వాతే ఎంతటి నగరమైనా. ఈ విషయాన్ని ప్రభావవంతంగా చెప్పే బాలగేయమిది.

ఉన్న ఊరు విడిచి ఉండనేలేము
కన్న తల్లిని విడిచి ఘడియుండలేము
ఉన్న ఊరే నాకు చెన్నపట్నమ్ము
కన్న తల్లే నాకు కల్పవృక్షమ్ము

ఇలాంటి అపురూపమైన పదాల కూర్పులెన్నో తెలుగులో ఉన్నాయి. మరి వాటినెందుకు మనం మర్చిపోతున్నాం!

మన పొడుపు కథలెంత అందంగా ఉంటాయో! వీటిని విప్పడానికి ప్రయత్నించండి.

ఒంటి స్తంభం మేడమీద
ఒప్పగు చలువ పందిరి
చలువ పందిరి నీడల్లో
చల్లనీటి కుండలు

(కొబ్బరి బొండాం)

ఆరావళి పర్వతం మీద
అరవై అయిదు పనసచెట్లు
తిరిగి చూస్తే ఆకుల్లేవు
పూవులు పూయు కాయలు కాయు

(బ్రహ్మజెముడు)

నిప్పుంటుందని మీరెప్పుడైనా విన్నారా'.... "కడలి కడపులో నిప్పుంటుంది. అదే బడబాగ్ని" లాంటి సంభాషణల రూపంలో పాఠాలు చెప్పేవారు. ఇప్పుడు సైన్స్ ముచ్చట్లే చెప్పట్లేదు. చెప్పినా సాంకేతిక పదాలను ఆంగ్లంలోనే ఉంచేస్తున్నారు. ఇక పిల్లలు తెలుగులో నేర్చుకునేదేంటి?

గతంలో వారాలు, తిథులు, నక్షత్రాలు, అంకెలు లాంటి వాటిని పిల్లలకు పాటల రూపంలోనే నేర్పేవారు. 'ఆదివారము నాడు ఆవడలు పెరుగు...' తదితరాల ద్వారా అన్న మాట! ఇప్పుడేమో బట్టీవేయిస్తున్నారు. పాఠ్యపుస్తకాల్లో మార్పులు రావాలి. పిల్లల వయసును బట్టి పాఠాలను రాయాలి.

టీవీల్లో పిల్లల కోసం ఉద్దేశించే కార్యక్రమాల్లో సున్నితత్వం ఉంటోందా? శాడిజం, హత్యలు, దొంగతనాలు చూపిస్తున్నారు. వాటిని చూస్తే ఎదిగే చిన్నారులు భవిష్యత్తులో ఏమవుతారు? నైతిక విలువలు లేకుండా ఎంతటి జ్ఞానాన్ని సముపార్జించినా అదంతా వృథానే. పైగా ఇప్పటి సమాజంలో విలువల పతనాన్ని చూస్తున్నాం కదా! దానికి కారణం పిల్లలకు చిన్నతనంలో ఆ విలువలను రంగరించి పోయకపోవడమే. అందుకే బాలసాహిత్యాన్ని బతికించుకోవాలి. ప్రతి తెలుగువాడూ దానికి నడుంకట్టాలి.

ఇంతకూ మధ్యలో చెప్పిన పొడుపు కథ విప్పారా? సమాధానమిది... అంబాలు (పాదాలు), కుంబాలు (మోకాళ్లు), కుడితిబాన (పొట్ట), ఈరబలక (ఎదరొమ్ము), ఇనపగుండు (తల), ఎదురుమోసులు (వెంట్రుకలు), రేచుకుక్కలు (పేలు)

– తెలుగు వెలుగు బృందం

సహకారం: కాకర్ల వాసుదేవరావు, అనంతపురం

పాత తరానిది బందరు లడ్డు లాంటి బాల్యం. నేడంతా 'నూడిల్స్ యంగేజ్'. 'జానీ... జానీ... ఎస్ పప్పా' తప్ప 'బుడబుడ సంచి - బుడాయి సంచి' వంటి మాటలు పిల్లల నోటి నుంచి వినపడదు. 'లండన్ బ్రిడ్జ్ ఫాలింగ్ డౌన్' అంటూ దేశాంతరాల గురించి పాడతారు కానీ 'బాపట్ల పట్నం చూడరా బాబు' అని ఒక్క మాట కూడా అనరు. ఏం చేద్దాం!

అయితే, ఇందులో చిన్నారుల తప్పేం లేదు. వాళ్లు తడిసిన మట్టిముద్దల్లాంటి వారు. మనం ఏ రూపమిస్తే ఆ రూపంలోకి మారిపోయే వాళ్లు. నాగరిక చదువులని చెప్పి ఏనాడైతే మనం తెలుగును పక్కనపెట్టడం మొదలెట్టామో ఆనాడే వారు మన మట్టివాసనలకు దూరమయ్యారు.

మనం గొప్పగా పిల్లలకు నేర్పే రైమ్స్‌లో ఉండేవన్నీ ప్రతికూల భావనలే. అబద్ధాలు చెప్పడం నుంచి 'అన్నింటినీ' నేర్పించే సాహిత్యమది. మన తెలుగు బాలసాహిత్యం మాత్రం అనుబంధాల విలువ, జీవిత మాధుర్యం, నైతిక విలువలు తదితరాలకే అగ్రాసనమేస్తుంది. వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుంది.

పిల్లలే ఆమె లోకం

1974లో తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగును పూర్తి చేసిన దేవకి... 1979లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో తెలుగు రీడర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. తర్వాత తెలుగు విభాగాధిపతిగా, పాఠ్య ప్రణాళిక, దూర విద్య కేంద్రం సంచాలకురాలిగా పని చేశారు. కిందటేడాది నవంబరులో ఆచార్య హోదాలో పదవీ విరమణ చేశారు. బాలసాహిత్యంపై ఆమె చేసిన పరిశోధన వెలకట్టలేనిది. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో పర్యటించి, రచయితలతో మాట్లాడి వేలకొద్దీ బాల గేయాలు, పొడుపుకథలు, సామెతలను సేకరించారు. అనేకానేక విషయాలను విశ్లేషించి సమగ్రమైన పరిశోధన పత్రాన్ని సమర్పించారు. తర్వాత దాన్ని పుస్తకంగా ప్రచురించారు. ఇప్పటికీ బాలసాహిత్యంతో అనుబంధాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఇతర భాషల్లో పిల్లల కోసం వస్తున్న రచనలను, తెలుగు రచయితల సృజనలను ఎప్పటికప్పుడు తులనాత్మక అధ్యయనం చేస్తున్నారు. అంతేకాదు... బాలల గేయాలు, కథలు, నవలలెన్నింటినో రచించారు. మన రాష్ట్రంతో పాటు మహారాష్ట్రలో కూడా తెలుగు పాఠ్యపుస్తకాల రూపకల్పనలో భాగస్వాములయ్యారు. ముఖ్యంగా రాష్ట్ర సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డులో సంపాదకవర్గ సంచాలకులుగా ఉంటూ పాఠ్యపుస్తకాలను రాశారు. ఇంటర్మీడియట్ బోర్డులో కూడా సభ్యురాలిగా ఉండి పుస్తకాలను రూపొందించారు. సాహిత్య అకాడమీ సభ్యురాలిగా కూడా వ్యవహరించారు. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో పిల్లలకు సంబంధించిన విషయాలపై అనేక ప్రసంగాలు చేశారు.

ప్రేమ లేఖల పోటీలో
రూ.1116 గెలుచుకున్న లేఖ

పేగు బంధాన్ని మించిన అనుబంధం



అమ్మా నాన్నల్లాంటి అక్కాబావలకు,

మనసులోని విషయాలను చెప్పడానికి మొహమాటం అడ్డొచ్చినప్పుడు, లేఖ ఆ భావాలకు ప్రతిరూపమవుతుంది. ఇక ఆ లేఖ ప్రియతములకైతే రాసే ప్రతి అక్షరం ప్రాణప్రదమవుతుంది. ఈ లేఖ కూడా అంతే. మీపై నాకున్న ప్రేమకు అక్షరరూపమిది. మీరు మాకు దైవసమానులు. అమ్మానాన్న ఎలా ఉంటారో తెలియని పసితనంలో మాకు మీరే తల్లితండ్రులు.

బావా... మా అందరికీ జన్మనివ్వకున్నా దేవుడిచ్చిన నాన్న మీరు. అక్కకు, మీకు చిన్న వయసులోనే పెళ్లయింది కదా! ఏ అచ్చటా ముచ్చటా తీరక ముందే అమ్మ, ఏడాది తిరిగేలోగా నాన్న కూడా ఈ లోకం వదిలి వెళ్లిపోయారు. పిల్లల్ని అనాథల్ని చెయ్యొద్దనే నాన్న మాటకు కట్టుబడి మీ జీవితాన్నే మా కోసం ధారపోశారు. మీరూ.. ఒక్కగానొక్క కొడుకే. అల్లారు ముద్దుగా పెరిగారు. కావాల్సినన్ని ఆస్తిపాస్తులు. అన్నీ మాకోసం వదులుకున్నారు కదూ! ఆడపిల్లలు, కావాల్సిన వారందరికీ దూరంగా ఉంటే తెలుగు సంప్రదాయం ఒంట బట్టదేమోనని పొరుగు రాష్ట్రంలో చేస్తున్న ఉద్యోగాన్నీ వదులుకున్నారు. అయినవాళ్లందరినీ కాదనుకొని మమ్మల్ని అక్కున చేర్చుకున్నారు. బావమరుదులు, మరదళ్లే కావాలనుకుంటే ఆస్తిలో చిల్లిగవ్వ దక్కదనే బెదిరింపులను కూడా మీరు లెక్కచేయలేదు. సరికదా.. 'నా పిల్లలే నా ఆస్తి' అని చెప్పిన త్యాగమూర్తి మీరు.

"మనకు సొంత పిల్లలొద్దు. కంటే.. మన పిల్లల పట్ల స్వార్థంతో వీళ్లని సరిగా చూస్తామో.. లేదో. ఇక నుంచి వీళ్లే మన పిల్లలు"... అన్న మీ నిర్ణయాన్ని విని విస్తుపోందెవరు? "ఇంత మంది చిన్నపిల్లల్ని ఎలా పెంచుతారు. అందులోనూ నలుగురు ఆడపిల్లలు. ఇద్దరు మగపిల్లలు. వాళ్లని పెంచి పెళ్లిళ్లు చెయ్యటం తేలికనుకున్నారా"? అనే మాటలకు మీరెప్పుడూ భయపడలేదు. ఆప్తులంతా తలోకరినీ ఇమ్మని అడిగితే "వీళ్లందరూ మా పిల్లలు. ఎప్పటికీ మాకు భారం కారు" అన్నారు మీరు. వారెంతగా దిగ్భ్రాంతి చెంది ఉంటారు మీ సమాధానం విని. మీవంటి వారిని ఆదర్శంగా తీసుకుంటే ఈ లోకంలో అనాథలే ఉండరు కదా!

పిల్లలు తిన్నారా? ఎప్పుడూ.. ఇదే ధ్యాస. నాకేముంది తినటానికి అని ఏనాడూ అడిగిన పాపాన పోలేదు మీరు. అందుకే అనిపిస్తుంది.. కంటేనే నాన్నా? మీరుండగా...!

అక్కా.. చిన్నతనంలోనే అన్ని సరదాలనూ వదులుకుని లేని పెద్దరికంతో మాకు అమ్మయ్యావు. మాకు తెలిసి ఏనాడూ మేం నీతో ఒక దెబ్బ కూడా తినలేదు. మమకారం తప్ప. ఆఖరి దాన్నైన నాకు నిండా మూడేళ్లు లేవని ఎంత గారాబం చేశావు? అమ్మ కావాలన్న మారాం మరిచిపోయే దాకా ఎత్తుకొని కిందికి దింపేదానివి కాదు. ఎంత అల్లరి చేసినా కొట్టనిచ్చేదానివి కాదు. కొట్టరెందుకు? అని ఎవరైనా అడిగితే.. మా పిల్లలు అల్లరివాళ్లు కాదు. చెబితే వింటారని ఎంత చక్కగా సర్దిచెప్పేదానివి.

మమ్మల్ని ఎవరూ వేలెత్తి చూపలేని విధంగా పెంచారు. మంచిగా చదివించారు. ముఖ్యంగా పెద్దలపట్ల ఎలా మెలగాలో నేర్పించారు. ఉన్నంతలో గొప్పగా పెళ్లిళ్లు చేశారు. మా అదృష్టం కొద్దీ రూపాయి కట్నం ఆశించని మంచి అల్లుళ్లు దొరికారని మురిసిపోయారు. మమ్మల్నందర్నీ పిల్లలు, అల్లుల్లుగానే చెప్పుకున్నారు. అందరికీ పురుళ్లు పోసి, బారసాలలు చేయించారు. అలుపెరుగని శ్రమజీవుల్లా మీలో ఉన్న సహనాన్ని, ఓర్పును మాకు ధారపోశారు.

పండగొస్తోందంటే అల్లుళ్లందరికీ ముందుగానే కబురు చేస్తారు. మాలో ఏ ఒక్కరు రాకపోయినా కన్నీళ్లు పెడతారు. అందుకే నేమో మీ 'అల్లుళ్ల'ందరికీ మీరంటే అవ్యాజమైన భక్తి.

అక్కాబావా... మీరు పెద్దవాళ్లయ్యారు. మాదగ్గరకొచ్చి ఉండమంటే.. ఎవరింటికి వచ్చి ఉన్నా రెండో వాళ్లు పుట్టింటికి రావాలంటే ఇబ్బంది పడతారు. మాకు ఓపిక ఉన్నన్నాళ్లు మీరంతా వచ్చి వెళ్లండి. తరువాత మీరు కాక మాకెవరున్నారని సున్నితంగా తిరస్కరిస్తారు.

మాకనిపిస్తుంది.. మమ్మల్ని అనాథల్ని చేశానని దేవుడు పశ్చాత్తాపపడి మీ ఇద్దరినీ మా కోసం సృష్టించాడని! మీరందించిన ప్రేమాభిమానాలకు ప్రతిఫలమేమివ్వగలం! ఇచ్చేంతగా ఈ సృష్టిలో ఏమైనా ఉందా!

అందుకే, గుండె గుడిలో దేవతమూర్తులుగా ప్రతిష్ఠితమైన మీకు మనసారా నమస్కరిస్తూ... మీకు సేవ చేయగలిగే భాగ్యాన్ని కోరుకుంటూ... సెలవు ...

మీ... **చిన్నా**

తేనెలూరే 'తెనాలి' తెలుగు

హాస్య చమత్కారాలకు పెట్టింది పేరుగా జనసామాన్యంలో పేరుపొందిన తెనాలి రామకృష్ణుడు తెలుగు సాహిత్యంలో పదహారవ శతాబ్దికి చెందిన ప్రముఖ ప్రబంధ కవి. ఆయన కీర్తి సౌధానికి మూల స్తంభం వంటిది ఆయన రాసిన 'పాండురంగ మాహాత్మ్యం'. ఆయన తనదంటూ ఒక విచిత్ర శైలిలో పద్య రచన చేసిన ప్రౌఢ కవి. ఈ ప్రౌఢత్వాన్ని సూచిస్తూనే నేమో 'రామకృష్ణుడు సురారామగజము' అని రామాయణ కల్పవృక్షం అవతారికలో అన్నారు విశ్వనాథ సత్యనారాయణ. అంటే ఐరావతం వంటి వాడన్నమాట. తెలుగు సంస్కృత పదాల విచిత్రమైన పోహళింపు ఆయన శైలికొక వింత సొబగును సంతరింపజేసింది. "పాండురంగవిభుని పద గుంఫన"మన్న నానుడి తెలుగు సాహిత్యంలో సుప్రతిష్ఠితమైంది. పాండురంగ మాహాత్మ్య ప్రబంధాన్ని అంకితం పొందిన విరూరి వేదాద్రిమంత్రి - "తగ సంస్కృతము తెనుంగుగ జేయ, దెనుగు సంస్కృతముగ జేయంగ జతురమతివి" అని రామకృష్ణకవిని శ్లాఘించడంలోని అంతరార్థమిదేననిపిస్తుంది.

తెనాలి కవికి తెలుగు మీద మక్కువ ఎక్కువ. వందలాది తెలుగు పదబంధాలను ఆయన అందంగా తన ప్రబంధంలో అలవోకగా బంధించాడు. అది పాండురంగమాహాత్మ్య ప్రబంధానికొక విశిష్టతను కలిగించింది. ఆయనది ఎదురులేని మహేంద్ర కవితా విద్యాబలప్రౌఢి. విరూరి వేదాద్రి ఆయనకు ప్రబంధాన్ని రచించమని తాంబూలాన్నిచ్చాడు. ఆ తాంబూలంలోనే రామకృష్ణుడు తన సరస్వతిని చూపించాడు. "పలుకుం దొయ్యలి మోవి కాంతి కెనయౌ బాగాలు, నయ్యింతి చెక్కులబోలుందెలనాకుల, య్యువిద పల్కుల్ వంటి కప్రంపు బల్కులతోగూడిన వీడియం బొసగె నాకున్..." అన్నాడు. తన కవిత్వంలో తెలుగు కప్రపు పలుకుల సరస్వతి ఉంటుందని సూచించాడు. లక్ష్మీదేవిని గూడా సంస్కృతంలో కలిసిన తెలుగుతో- "తోబుట్టువయ్యెనే తులిత కాంచనవర్ణ వెలది వెన్నెలగాయు వేల్పునకును" అని వర్ణించాడు. శ్రీసూక్తం లక్ష్మీదేవిని "హిరణ్యవర్ణామ్" అంటుంది. రామకృష్ణుడు - "కాంచన వర్ణ వెలది" అన్నాడు. ఈ మిశ్రమ సమాసాన్ని రామకృష్ణుడు కావాలనే వాడాడు. అది ఆయన శైలి. ఆయన స్వభావం. ఇక్కడ చంద్రుడిని "వెన్నెలగాయువేలు"పన్నాడు. చతుర్ముఖ బ్రహ్మను "నలుమోములవేలుపు"గా, ఆయన వాహనాన్ని "అంచతెలిమావు"గా మురువుగా పేర్కొన్నాడు. పూర్వకవి స్తుతిలో వాల్మీకికి వందనాలర్పిస్తూ - "పుట్టకు బుట్టెడు వేళన్, దిట్టపు నునుపచ్చి పుట్టతేనియ చవితో, బుట్టెనన నమృతము ముట్టెడు పుట్టనిసువు" అన్నాడు. వేదాలు నేర్పించిన వ్యాసుని- "ఇట్టాడ రాని యాగమ

ఘట్టమునకు నడవయచ్చుకట్టిన మునిరాట్ప ట్టాభిషిక్తుడపముల పుట్టిన నెలవైన" వానిగా నుతించాడు. ఈయన పద్యాల్లో సరస్వతి మొదలు వ్యాసుని వరకు తెలుగు పదాల సొగసులను చూపించాడు. పలుకుందొయ్యలి - బాగాలు - ఇంతిచెక్కులు - తెలనాకులు - వీడియము - పుట్టతేనియ - పుట్టనిసువు - ఇట్టాడు - నడవయచ్చుకట్టు - మొద లైనవన్నీ తెలుగు పదాల వెలుగులు.

తెలుగు పలుకుబడుల సొగసులు

మొలక చీకటి జల జల రాల్పగా రాదె
నెరులు మించిన వీరి కురుల యందు

వెలదుల పొడవైన నల్లని కురులను పట్టు కుని దులిపితే చీకటి జలజల రాలుతుందిట.

కెరలించి యమృతము గిలకొట్టగా రాదె
ముద్దు చూపెడి వీరి మోములందు.

ఆ వనితలు అమృతాధరాలు. ముద్దులొ లికే వారి పెదవులందు అమృతాన్ని గిలకొట్ట వచ్చునట.

పచ్చి బంగారు కుప్పలు సేయగా రాదె
గబ్బు మీఱిన వీరి గుబ్బలందు.

ఆ గుబ్బెతల బంగారు రంగు వక్షోజా లను బట్టి పచ్చి బంగారాన్ని కుప్పలు చేయ వచ్చునట. అది కూడా పరిమళం కలిగిన బంగారాన్ని.

పండు వెన్నెల తేట బలియంపగా రాదె
నగవుగుల్కెడు వీరి మొగములందు

ఆ చంద్రవదనల నగవులొలికే మొగాల నుంచి పండు వెన్నెలలను గ్రహించవచ్చు నట.

మొలక చీకటులు - జలజల రాల్చు - నెరులు మించిన కురులు - కెరలించు - గిలకొట్టు - ముద్దు చూపెడి మోములు - పచ్చి బంగారు కుప్పలు - గబ్బు మీఱిన గుబ్బలు - పండు వెన్నెల తేట - బలి యంచు - నగవు గుల్కెడు మొగములు తెలుగు పలుకుల కుప్ప ఈ పద్యం.

ప్రమథగణాలు – తెలుగు వాలకాలు

బలుపాప తలచుట్టులలవరించినవారు (పన్న గధరులు)

లేత చందురుల దాలిచినవారు (చంద్రశేఖ రులు)

పునుక తమ్మంటుల బొలుచు వీనులవారు (కపాలకుండలులు)

నొసల మిక్కిలి చూపు గలుగువారు (ఫాలనే త్రులు)

బూది పొఁగ మేన బూది బూసిన వారు (భస్మగాత్రులు)

త్రిముఖాస్త్రముల గేల ద్రిప్పువారు (త్రిశూల పాణులు)

పులితోలు హొంబట్టు పుట్టముల్ గలవారు (శార్దూలచర్మాంబరులు)

కొమ్ముతేజులనెక్కి గునియువారు (వృషభవా హనులు)

వెండికొండ మీది ప్రమథులను తెలుగు వెలుగుల్లో ప్రకాశింప చేశాడు తెనాలి కవి.

పాండురంగమాహాత్మ్యంలోని అందమైన పద్యాలలో రామకృష్ణకవి చిన్నికృష్ణుని వర్ణిం చిన పద్యం ఒకటి. ఈ పద్యంలో శ్రీకృష్ణ మూర్తి అంతా తెలుగువాడే -

వెడద కన్నులవాని వేనామములవాని
వ్రేతల వలపించు వెరవు వాని
చిప్పకూకటివాని, చిన్ని నవ్వులవాని,
జెఱివిన మంచి పించియము వాని
బులుగు తత్తడివాని, బొడవుల తుదవాని,
బొక్కిటకెందమ్మి పూవు వాని
మినుకుటూర్పులవాని, మిసిమి మేతల వాని,
మెఱుగు చామనచాయ మేనివాని
దిస్సమొలవాని, పసి ద్రిప్పువాని
మురళిగలవాని మువ్వంక మురువువాని
విఠ్ఠలాధీశు దలచి తద్విపుల మహిమ
నొడువు బ్రామట్టి క్రీనీడ విడిది ప్రోడ

అందాల ప్రోవైన నందనందనుడు తెలుగు పదాలలో మరింత అందంగా కని పించాడు ఈ పద్యంలో.

పుండరీకుడు కృష్ణభక్తుడు. ఆయనకు సాక్షాత్కరించిన చిన్ని కృష్ణుని రూపాన్ని తెలుగు పలుకులలో రూపు కట్టించాడు. తెనాలి కవి మాటల సొబగులు స్వయంగా కనాలి. చిన్ని కృష్ణుడి తలపైన చిక్కమొక్కటి ఉందని

'మునుమీనగుట, బట్ట, మునులు వైచిన
బత్తి వల వోలె జిక్క మౌదల దలార్ప'

అని వర్ణించారు. శ్రీమహావిష్ణువు దశా వతారాలలో తొలి అవతారం చేప. చేపను పట్టాలంటే వలవేయాలి. కనుక విష్ణువనే మహామీనాన్ని పట్టడానికి మునులు భక్తి అనే వల వేశారా అన్నట్లుగా చిన్ని కృష్ణుని తల మీద చిక్కం ఉందన్నాడు రామకృ ష్ణుడు. అట్లాగే నారాయణుని చేతిలో శంఖాన్ని

'వెలితిగా జవి గొన్న వెన్నముద్దయుబోలె
శంఖంబు వామ హస్తమున దనర'

సగం తిని రుచి చూచి అర చేత దాల్చిన వెన్నముద్దవలె శంఖం ఉందని వర్ణించారు.- అందమైన ఊహకు అపురూప మైన భాష .

ఇంతకూ ఆ చిన్ని కృష్ణుడెవరంటే - "మందప్రోయాంద్ర కూరిమి ప్రాని పండు" గొల్లల మందలోని అందగత్తెల కంది వచ్చిన ఇష్టమైన ప్రేమఫలం.

పుండరీకుడు పుండరీకాక్షుని దర్శించి పులకలెసగిన మేనితో స్తుతించిన పద్యం నిండా తెనాలి కవి తెలుగు పలుకుబడులు వినాలి.

పాదలు నీ పొక్కిట పువ్వు కాన్పున గదా
పెనుమాయ పిల్లలు బెట్టుటెల్ల

శ్రీమహావిష్ణువు పొక్కిటి పువ్వు నుంచి జన్మించిన బ్రహ్మ మాయతో నిండిన సకల లోకాలను సృష్టించాడు.

పొడము నీ మొదలి యూర్పుల నేర్పుల కదా
చదువు సంధ్యలు గల్గి జనులు మనుట

విష్ణువు నిశ్వాసాలే వేదాలు. అవి ప్రపంచానికి తొలి చదువులు.

కెరలు నీ యడుగు దామరల తేనియ గదా
పాపంపు పెనురొంపి పలచనగుట

శ్రీమహావిష్ణువు పాదం నుంచి గంగ జనించింది. ఆ గంగ లోకుల పాప పంకి లాన్ని కడిగి వేసింది.

పొసగు నీ తెలిచూపు పస గదా యిది రాత్రి
యిది పగలను మేర లెఱుగబడుట

విష్ణువు చంద్రసూర్యనేత్రుడు. ఆయన చూపుల వలనే కదా పగలు రాత్రుల తేడాలు తెలుస్తున్నవి.

వేదాలు వర్ణించిన విరాట్పురుషుని విశ్వ రూపాన్ని తేట తెలుగు పలుకుల వెలుగులో తేట తెల్లంగావించాడు రామకృష్ణకవి. ఆపై పుండరీకుడు చేసిన దశావతారస్తోత్రం నిండా ఉన్న తెలుగు పలుకుబడులను బండ్ల కెత్తవ చ్చును. అంతవాడింతవాడని దనుజాంతకుని ఇంతగా వర్ణించినా తనివితీరని తెలుగుకవి రామకృష్ణుడు సంగ్రహంగా చేసిన దశావ తార స్తుతి నిండా తెలుగు పలుకులు సొగ సులీనాయి.

నీటిలో జివుకక నిలచి క్రుమ్మరుపూన్కి (మత్స్య)

కఠిన కర్పరపు చుక్కాని బిగువు (కూర్మ)
దంష్ట్రనెత్తిన మహీతలపు గాడుపు జీర (వరాహ)
యురుదారకలనయందుదయమగుట (నారసింహ)
పరులకు దనకట్ల బలిమి చూపు విధంబు (వామన)
పులిమిన నెత్రు గుగ్గిలపు నూనె (పరశురామ)
ద్వీపాంతరమునకు దెగువమై జనుపెంపు (రామ)
చేముట్టు నాగంటి జీవితగులు (బలరామ)
సొగతాగము మాలిమి శాస్త్రసరణి (కృష్ణ)
వల్లు వల్లన చిత్రధావనము గల్గు (కల్కి)

ఓడనొక పక్క - భవాబ్ధిని దాటించే భగవంతుడైన విష్ణుడను ఓడనొక పక్క చూపిన పద్యమిది.

పౌండరీక తీర్థమునందున్న నందుని లేబట్టి (నందనందనుడు) ప్రాలేయనగము పట్టి (పార్వతీదేవి)కి వర్ణించి చెప్పిన పద్యంలోని పదాల పోహళింపు ఇంపు కలిగింది.

నిడివాలు గనుచూపు నిగిడినబోనెల్ల
బీటెండ రేయెండ బెండ్లియాడు
నిశ్వాస పవనంబు నెలకొన్నచో నెల్ల
బ్రామిన్కు నెత్తారు లాము కవియ
పొక్కింటి తమ్మిపుప్పొడి యొల్కలోనెల్ల
బ్రహ్మాంకురంబులు పొదుకొనగ
అడుగులేజగురాకులంటినచో నెల్ల
వివిధ తీర్థశ్రేణి వెల్లవొడువ

శ్రీమహావిష్ణువు నేత్రద్వయం సూర్యచంద్రులు. సూర్యుడు కాసే బీటెండ, చంద్రుడు కురిసే రేయెండ. రెండూ కలిసి బెండ్లియాడినట్లుంటాయి. విష్ణువు నిశ్వాసాలు వేదాలు కాబట్టి ఒక్కసారి ఆయన నిశ్వసిస్తే పరిమళాలు పరుచుకుంటాయి.

స్వామి నాభి కమల రజం నుంచి బ్రహ్మాండాలు పుట్టుకొస్తాయి. నారాయణుడు కాలుమోపిన చాలు గంగాదినదులు ఉప్పొంగుతాయి. నిడువాలుగనుచూపు - బీటెండ రేయెండ - పెండ్లియాడు - నెత్తావులు - పొక్కిలి తమ్మిపూవు - పుప్పొడి - అడుగులేజిగురాకులు.. మొదలైన తెలుగు పదాల వెలుగుల వెల్లువ ఈ పద్యం.

పాండురంగమాహాత్మ్యం మూడో ఆశ్వాసంలో నిగమ శర్మోపాఖ్యానం ప్రబంధం మధ్యలో హృదయస్థానంలో ఉంది. అంటే ఆయువుపట్టులో ఉందన్నమాట. తెనాలికవి తెలుగుతనమంతా ఈ ఆఖ్యానంలో నిలువెత్తు వెలుగుగా దర్శనమిస్తుంది. నిగమశర్మ "ప్రాసగు విత్తువంటి నెటపాటు కులం"లో పుట్టినవాడు. "వేదముల్ బొసిన గాదె శాస్త్రముల పుట్టిల్లు. కలాకలాపముల్ డాసిన రచ్చగా" - అచ్చమైన తెలుగు నేల బ్రాహ్మణుడిగా కథలోకి వస్తాడు. ఇకపై కథలో అంతా తెలుగు పలుకుల జడివాన. నేలవేల్పుగులము, గొనబుంబ్రాయపు దేజుకూన, పులుగడుగంగబడ్డనునుముత్యము, మీనుమీసము వోలె నుండు జందెము, మోవిపల్లొత్తులు, నేతిబీరకాయ, వంకపొరక బాటు, ఈదుగీసినరీతి, మిండవడ్డి, గువ్వకుత్తుక, కనుగీటినంతలోన, ఇంతలునంతలునగు సంతానము, చంటవెంటసందడి, ఏరా తమ్ముడ, ఎన్నాళ్లనోయుండి, పిల్లి శీలము, చిల్కచదువులు, తమ్ముగుట్టినోరు లేని తొడువలు, తేనెపూసిన కత్తి, పడకకు జెప్పక, ముక్కర, ఆడుబిడ్డ, ఊచముట్టుగ, ఎడ్డితనపుగయ సేతలు, కంచంతకాపురము, ఆకు మఱుంగుపిందె, ముంగిటబందిట రాగట్టుక్కలు వత్తిడుకొని... ఇంకా కాపు కోడలి కామవికారాలు, జాతరలో జానపదుల తీరుతెన్నులు వంటి వాటిలో తెలుగు పలుకుబడులు కుప్పతెప్పలుగున్నాయి. తమ్ముడి తలలో పేలు చూస్తూ, తమ్ముడిని చక్కదిద్దాలని మంచి మాటలు చెప్పిన నిగమశర్మ అక్క తెలుగువారిళ్లల్లో ఆడపడుచుగా కనిపిస్తుంది.

తెలుగు పలుకులలో విలయహరి

"జలధి వీచీవాత్య జలిదాకెగాయని యక్కున యందంద యదిమి యదిమి"

సముద్రపు గాలుల చలి తాకిందని అక్కున చేర్చుకొని హత్తుకొనుట

"ప్రామట్టి యాకొత్తు రాయిడి పొందెగాయని సన్న పొత్తుల నునిచియునిచి"

- వటపత్రశాయికి ఒళ్లు వత్తుకు పోయిందని మృదు వస్త్రాలపై పడుకోబెట్టడం.

"వాపోయి వాపోయి పసివాడి యూకట బెగడెగాయని యుగ్గు వెట్టి వెట్టి"

- పసివాడు ఏడ్చి ఏడ్చి అలసిపోయి ఆకలితో ఉన్నాడని ఉగ్గుపెట్టడం.

"పెనుచీకటులుగ్రమ్మ పెన్ బైట వసియించి వెఱచెగాయని పుల్ల
విఱిచి విఱిచి"

- అంతులేని చీకటిలో ఆరుబైటన బెదిరిపోయాడని రక్షలు చేయడం.

మంచి లక్షణాలు పుట్టు మచ్చవాడు (శ్రీవత్సాంకుడు) నేత్రములు విప్పనట్టి యా నెత్రుకందు (కళ్లుతెరవని పురిటిగుడ్డు)గా ప్రళయ శ్రీహరి కనిపిస్తాడు.

భగవంతుడి తత్వాన్ని తేటతెల్లం గావించిన పద్యం...

మహితపుణ్యులైన మద్భక్తవరులకు
గానివాడు నాకు గాని వాడు
భాగవతుల నన్ను భావించి యొకటిగా
గన్నవాడు నన్ను గన్నవాడు

ఇవేకాక, "పెనుగంప తొడుగు లీడ్చిన మొల్కసనియయ్యె గగనంబులో రాయు కాననములు", "కడులావు మానిసి కాలరాచిన చీమ చాలయ్యె బశ్వాది జంతుపంక్తి" వంటి పద్యాల్లోని పెనుగంప తొడుగు లీడ్చుట - మొల్కసని - గగనముతో రాయు కాననములు - కడులావు మానిసి - కాలరాచిన చీమల చాలు... వంటి తెలుగు పలుకుబడుల ఉపమానాలు కనిపిస్తాయి.

తెనాలి కవిత్వంలో 'తెలుగు సామెతలు'

పువ్వులు ముడిచిన యంగళ్లనె కలకల వీడెవల్ల నవ్వ గట్టెలు మోసెన్

'పూలమ్మిన అంగట్లో కట్టెలమ్మినట్లు' అనేది సామెత సామాన్యరూపం. బాగా బతికినవాడు చెడిపోయి తక్కువ పనులకు పాల్పడినప్పుడు ఈ సామెత వాడతారు.

సాలగ్రామ ఖనిన్ జనించును గదా జాత్యల్ప పాషాణముల్

సాలగ్రామాలు పుట్టిన గనిలో గాజురాళ్లు పుట్టాయని సామెత. మంచి వంశంలో పనికిమాలిన వాళ్లు పుట్టారని ఇందులో భావం.

కర్ణునౌదలనె భారత సంహిత నిల్చు చాడ్చునన్

'కర్ణుడి నెత్తిమీదనే భారతం అంతా నడిచింది' ఈ సామెతర్థం. జరిగినదంతటికీ ఒక అమాయకుణ్ణి కారణంగా చూపించే సందర్భం.

గుడి నుండి గుడి రాళ్లు దీయు కరణి

'గుడి నుంచి గుడి రాళ్లు పీకినట్టు' అని సామెత. వెనుక నుంచి గోతులు తవ్వే విషయంలో ఈ సామెత వాడతారు. మనిషికి తెలియకుండానే అతని పతనానికి కారణం కావడమన్నమాట.

పెచ్చు పెరిగెట్టిదియు హెచ్చి పేర్చుటెల్ల స్రగ్గుటకె

'ధర హెచ్చుట తగ్గుట కొరకే' అనేది సామెత. పెరుగుదల శాశ్వతం కాదని భావం.

గుడి మింగెడు వానికి తలుపులప్పడములు

'గుడిని మింగే వాడికి లింగం ఒక లెక్కా' అని సామెత. లింగానికి బదులు తలుపులు అప్పడాలు అని ప్రయోగించారు. ఇది వేరే సామెతేమో! ఏమైనా ఉద్ధతుడి ఔద్ధత్యం ఒప్పుకొంటున్నట్లు.

బొందితోన కైలాసము జేరజూచెడు

'బొందితో కైలాసం' అనేది నానుడి. త్రిశంకు కథ ఇందులో దాగి ఉంది. అత్యాశ పనికి రాదని భావం.

ఔదల గొఱవింగొని గోక దివురు కుమతి

'నెత్తి మీద కొరివి పెట్టుకుని కోక చుట్టుకుంటుందని' భావం. మతిలేనివాళ్ల హావభావాలకు ఇది తార్కాణం.

రామకృష్ణుని కవిత్వమంతా వైభవంగా పాండురంగ మాహాత్మ్యంలో ప్రభలు వెలారుస్తుంది. ఆ రచనావిధానం, ఆ పద ప్రయోగ నైపుణ్యం, ఆ సామెతల సమయోచిత ప్రయోగం, అన్నింటిని మించి ఆ తెలుగు పలుకుబడుల సొగసులు ఆయనను మహాకవిగా ప్రకాశింపజేశాయి. ఈ ప్రబంధాన్ని పట్టుకునూపితే తెలుగు పలుకు బడులు జలజలా రాల్తాయి. రామకృష్ణ కవి శారద రూపం. ఆయన సాంద్ర కీర్తీశ్వరుడు.

డా॥ కావూరి పాపయ్యశాస్త్రి
పద్యకవి, విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు,
ఖమ్మం. 98484 21964

సరదా... సరదా... సాహిత్యం

"చదివిన విన్నా జనులందరికి చక్కగ
తెలిసితె వ్రాతా
మెదడు చించుకొని నిఘంటులన్నీ
వెదికించిందే రోతా"

అన్నారు 'తాతాజీ'గా సాహిత్య లోకంలో ప్రసిద్ధులైన తాపీ ధర్మారావు. వాడుక మాటలతో భావాలు ప్రకటించడమే సరైన రాత అని కూడా అన్నారు. ఇవాళ అది విశేషం కాదు గానీ, 1950 దశాబ్దంలో ఆ మాట అనడం సాహసమే. అవును, తాపీ ధర్మారావు మరో పేరు సాహసమే.

సమాజంలో గానీ, సాహిత్యంలో గానీ తరతరాల నుంచి స్థిరపడిపోయిన ఆచారాలుంటాయి, సంప్రదాయాలుంటాయి. హేతుబద్ధమైన మార్పు లేకపోతే అవి గిడసబారిపోతాయి. వాటిని తోసిరాజని, కొత్తదారి వెయ్యాలంటే కొత్తచూపు, సామాజిక అవగాహన, సాహిత్య సాంస్కృతిక విషయాలపై అధికారం కావాలి. బరంపురంలో 1887లో పుట్టి, శ్రీకాకుళ సీమలో పెరిగిన ధర్మారావు ఎస్.ఎ. చదివి, పాశ్చాత్య సామాజిక శాస్త్ర వికాసాన్ని గమనించారు. వలసవాదం ప్రవేశపెట్టిన ఆధునిక దృక్పథంతో ఇక్కడి సమాజాన్ని, సాహిత్యాన్ని పరిశీలించారు. వ్యావహారిక భాషోద్యమ నిర్మాత గిడుగు రామ్మూర్తి పంతులు శిష్యుడిగా తెలుగు భాష పరిణామం గురించి కొత్త ఆలోచనలు చేశారు.

'దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు', 'పెళ్లి - దాని పుట్టుపూర్వోత్తరాలు', 'ఇనపకచ్చడాలు' అనే పుస్తకాల ద్వారా తాపీ వారు మన సాంఘికాచారాల వెనుక శాస్త్రీయ మూలాల్ని అన్వేషించారు. మానవ నాగరికత ప్రస్థానంలో మతం, వివాహం, స్త్రీ పురుష సంబంధాలు మొదలైనవి నిర్వహించిన పాత్రని నిర్ధరించే ప్రయత్నం చేశారు. (ఆ ప్రయత్నాన్ని పునఃమూల్యాంకనం చెయ్యాల్సిన అవసరం కూడా ఉంది.)

కొత్తపాళీ, సాహిత్య మొర్మొరాలు అనే పుస్తకాలు తాపీ వారు చేసిన అపూర్వ పరిశీలనని తెల్పుతాయి. వెనుకటి రోజుల్లో పక్షి ఈకల్ని సిరాబుడ్డిలో ముంచి రాసే 'పిట్టకలాలు' ఉండేవి. అవి పాతదనానికి గుర్తు తర్వాత కాలంలో పాళీలతో మెత్తగా రాసే కలాలు వచ్చాయి. కనుక 'కొత్తపాళీ' కొత్త ఆలోచనల సరికొత్త రాతలకి సంకేతం. ఇక మరమరాలు/మొరమొరాలు/మొర్మొరాలు చిరుతిండికి పనికొచ్చేవి. తేలిగ్గా అరిగేవి. 'సాహిత్య మొర్మొరాలు' ప్రాచీన సాహిత్యంలో ఆహ్లాదకర విషయాల మీద రాసిన చిన్నచిన్న సరదా వ్యాసాలు. (నిజానికి సాహిత్య మొర్మొరాలు అనేది దుష్ట సమాసం) ఈ రెండు పుస్తకాలూ సామాన్య పాఠకుల్లో సాహిత్యాభిరుచిని పెంపొందిస్తాయి.

వ్యావహారిక భాషోద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన తాపీవారు ఒకరి ఉద్దేశం ఇంకొకరికి తెలపటానికే భాష ఏర్పడిందని, ఆ ఉద్దేశాన్ని ఎంత చక్కగా బోధపడేట్టు చెప్పగలిగితే అది అంత చక్కటిభాష అవుతుందని నమ్మారు. ప్రజలేమో 'చెట్టు నీడన కూర్చున్నాడు' అంటుంటే, కవులేమో 'వృక్షచ్ఛాయను విష్ణుండయ్యెను' అన్నారు. పండిత సభలకే పరిమితమయ్యారు. కనుక తాపీవారు తాపీగా చెట్టునీడలో కూర్చోటానికే ఇష్టపడ్డారు. కవుల భాష 'అందరికీ తెలిసేటట్టుండాలి' అని ఒక వ్యాసం రాశారు కొత్తపాళీతో.

వెనకటి కవులు, పండితులు 'సంస్కృత పంజరం'లో తెలుగును బంధించారని తాతాజీ ఆరోపించారు. వాడుకలో లేని భాష, వ్యాకరణం, అనవసర వర్ణనలు, కవి సమయాలు, బంధ గర్భ రచనలు నింపి కవిత్వాన్ని ప్రజలకి దూరం చేశారని విమర్శించారు. 'తెలుగు కవి, రచయిత తెలుగు ప్రజల జీవితంలో ఉండి రాయాలి' అని నిగ్గు తేల్చారు. వెనకటి పదాలు, పాటలు, ద్విపదలు, యక్షగానాలు, కథలు మొదలైన దేశీ ప్రక్రియల్లో తేలిక మాటల్లోనే గొప్ప గొప్ప భావాలు వెలువడ్డాయని గుర్తించి, దేశీ కవిత గుప్పించిన పాల్కురికి సోమనాథుడు వంటి కవులను మెచ్చుకొన్నారు. (బసవ పురాణంలో బెజ్జమహాదేవి, గొడగూచి కథలు

రెండూ ఒకటిగా భ్రమించి పొరపడ్డారు)

భాషలో బండిరాలు, అరసున్నలతో పాటు 'సంహరింపబడెను' మొదలైన బడు (కర్మలో) ప్రయోగాల్ని, 'రాముడి యొక్క పుస్తకం' మొదలైన కృత్రిమ విభక్తి ప్రయోగాల్ని తాతాజీ తప్పుపట్టారు. భాషా పరిణామం గుర్తించని వ్యాకరణాలు నిర్జీవమైనవని తూలనాడారు. ఈ వరసలోనే 'సూరి మరణం లేక బండి రా పల్లకీ' అనే అపహాస్య నాటిక గూడా రాశారు. గ్రాంథిక భాషనర్థం చేసుకోవటానికి కొన్ని సూత్రాలను, నియమాలను ఏర్పరచిన చిన్నయసూరి బాలవ్యాకరణానికి ఒక పరిధి, పరిమితి ఉండవచ్చు. అంతమాత్రాన ఆ వ్యాకరణమే నిర్జీవమనటం అతివాదమే. అంతేకాదు. తాపీవారితో సహా ఎందరో వ్యావహారిక భాషావాదులు చిన్నయసూరి 'నీతిచంద్రిక' లోని వచన రచనా నైపుణ్యాన్ని అందుకోలేకపోయారు.

ప్రాచీన కావ్యాల్లో సంప్రదాయబద్ధంగా వ్యాఖ్యానాలు రచించిన పండితులు ఆ కవుల స్వాతంత్ర్యాభిలాషని, కళాదృష్టిని గుర్తించలేకపోయారని ఆరోపించారు తాపీ వారు. చేమకూర వేంకట కవి విజయ విలాసానికి హృదయోల్లాస వ్యాఖ్యతో వ్యాఖ్యానాలకే కొత్త ఒరవడి దిద్దారు. కవుల ఊతపదాలని, వ్యర్థపదాలని తూర్పారబట్టిన చేతితోనే వాళ్ల వాడిన చక్కని లోకోక్తుల్ని పైకెత్తి చూపారు. కావ్యావతారికల్లో ఆనవాయితీగా మారిన కవుల స్వప్నాలు, కుకవి నిందలు, పుష్పలావికా వర్ణనలు మొదలైన వాటిని నిరసించిన కలంతోనే తిక్కన, పోతన, చేమకూర రచనల్లో విశేషాంశాలను మెచ్చుకొన్నారు.

సాహిత్యం గంభీర విషయమే కావచ్చు. అయితే అందులో మాత్రం సరదాలకు తావుండదా? ఈ ప్రశ్న తాతాజీకి తగిలింది. 'సాహిత్య మొర్మొరాలు'లో ఆయన 'వెనకటి కావ్యాల్లోని' చిన్న చిన్న విషయాలను మాత్రమే ఎత్తుకొని 'వినోదంగా చదువుకో తగినట్టు' వివరించారు. 'కృష్ణుడి శిరసును సత్యభామ తన్నిందా?' అన్నది తాతాజీ చేసిన ఒక సరదా చర్చ. 'లతాంతాయుధు కన్నతండ్రి శిరమచ్చో వామపాదమ్మునన్ దొలగం ద్రోచెలతాంగి' అని చెప్పాడు. ముక్కు తిమ్మన పారిజాతాపహరణంలో ఎడమ కాలితో కృష్ణుడి తల పక్కకి నెట్టింది సత్యభామ. ఆ తర్వాతేమో కృష్ణుడు 'నను భవదీయదాసుని మనంబున నెయ్యపు గిన్కపూని తాచినయడి నాకు మన్ననయ' అన్నాడు. 'తాచుట' అంటే కాలితో తన్నడమే గదా? అయితే ఈ తాపు ఆ కుహనా గోపాలుడి తలలో పుట్టిందే కానీ సత్యభామ చేసిన మర్యాద కాదని తేల్చారు తాపీ వారు.

'తాంబోలం యిచ్చేశాను. యిహ తన్నుకు చావండి' అన్నాడు కన్యాశుల్కంలో అగ్నిహోత్రావధానులు, తాంబూలానికి అంత ప్రాధాన్యం ఉంది మరి. భారతదేశపు భిన్నత్వంలో ఏకత్వానికి తాంబూలం రుజువన్నారు తాతాజీ. ఎక్కడెక్కడో పుట్టిన తమలపాకు, వక్క, సున్నం- ఈ మూడిటిని కలిపి మన నోరు పండించిన తాంబూల మూల పురుషుడికి జేజేలు పలికారు. అంతటితో ఆగకుండా పెద్దన 'ప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పురవిడెము', వరూధిని వేసుకొన్న అతి కర్పూర తాంబూలం, శ్రీనాథుడి 'తములపాకుల బేరము' ఇట్లా చాలా 'కవితా తాంబూలాలు' మనకందించారు. అందులో ఒకటి దండి, కాళిదాసుల తాంబూల సరసం. ఆ ఇద్దరు మహాకవులూ వీధిన వెళ్తున్నప్పుడు ఒక అరుగు మీద అమ్మాయిని దండి అడిగాడు "తూర్ణ మానీయతాం చూర్ణం, పూర్ణ చంద్ర నిభాననే" అని. పున్నమి చంద్రుడి వంటి ముఖం గల అమ్మాయీ! నాకు సున్నం తేవమ్మా అని అర్థం. వెనువెంటనే ఆ అనుష్టుప్ శ్లోకం పూరిస్తూ కాళిదాసు ముక్తాయించాడు "పర్ణాని స్వర్ణ వర్ణాని, ఆకర్ణాయతలోచనే!" అని. చెవులదాకా సాగిన పెద్ద కన్నులు గలదానా! బంగారు వన్నెగల తమలపాకులు గూడా తెమ్మని అర్థం. ఆ అమ్మాయి ముందుగా కాళిదాసుకి తమలపాకులిచ్చి, ఆ తర్వాత దండికి సున్నం ఇచ్చింది. ముందుగా అడిగిందేమో దండి. అందుకు సరసమైన కారణం చెప్పారు తాపీవారు. ఏమిటంటే దండి మూడు అణాలే ఇచ్చాడు. కాళిదాసు నాలుగణాలిచ్చాడు! కావాలంటే శ్లోకం చూడండి. (ఈ శ్లోకాన్ని 'కర్ణాంతాయతలోచనే' అని తప్పుగా ఉదాహరించారు తాపీ వారు)

మంచి పుస్తకం

పెద్దన గారి వరూధిని ప్రవరుడిని ఆకర్షించటానికి కల్లబొల్లి ఏడ్పులు ఏడ్చింది. తిమ్మన గారి సత్యభామ కృష్ణుడి మీద కోపంతో లేతమామిడి చిగుళ్ల మెక్కిన కోకిల గొంతుతో ఏడ్చింది. భట్టుమూర్తిగారి గిరిక విరహంతో ఏకంగా కాంభోజీ రాగంలోనే ఏడ్చింది. ఈ ముగ్గురిని పోల్చిన తెనాలి రామలింగడు "అల్లసాని వాడు అటు ఇటుగా ఏడ్చాడు. ముక్కు తిమ్మన ముద్దు ముద్దుగా ఏడ్చాడు. భట్టుమూర్తి బావురుమని ఏడ్చాడు" అని తూకం వేశాడని ఒక కథ. ఈ 'మూడేడుపుల ముచ్చట్లు' చక్కగా వివరించారు తాతాజీ.

ఈ వ్యాసాలన్నీ మొదట తాపీవారే స్థాపించిన కాగడా, జనవాణి పత్రికల్లో వెలువడినవే. పత్రికా రచనలో ఆయనది కొత్తదారి. "ఆంధ్ర విశారద" బిరుదు పొందిన ఈ అభ్యుదయవాది 1943లో తెనాలిలో జరిగిన ప్రథమాంధ్ర అభ్యుదయ రచయితల మహాసభకి అధ్యక్షత వహించారు. మాలపిల్ల, రైతుబిడ్డ, ద్రోహి, రోజులు మారాయి మొదలైన చలన చిత్రాలకు కూడా రచన చేసిన తాపీ ధర్మారావు బహుముఖ ప్రజ్ఞాశాలి.

డాక్టర్ పాపినేని శివశంకర్
గుంటూరు, 85008 84400.

చదువుల సారం జ్ఞానం

"విద్యనిగూఢ గుప్తమగు విత్తము, రూపము పూరుషాళికిన్
విద్య యశస్సు, భోగకరి, విద్యగురుండు, విదేశబంధుడున్,
విద్య విశిష్ట దైవతము, విద్యకు సాటి ధనంబు లేదిలన్,
విద్య నృపాల పూజితము, విద్య నెరుంగని వాడు మర్త్యుడే!"

భర్తృహరి సుభాషితాన్ని ఏనుగు లక్ష్మణ కవి ఎంత సొగసుగా చెప్పినా చదువుకోనివాడు మరణించిన వాడితో సమానం అని కూడా హెచ్చరించాడు. చదువు తరగని గని. ఎంత జ్ఞానం సంపాదించినా దాన్ని ఎంత మందికి ఉచితంగా పంచినా అది తరిగిపోయేది కాదు. దొంగలు దోచగలిగేదీ కాదు.

మూడు రకాల వారికి బంగారు పంట పండుతుందట. శూరులు, విద్య నేర్చుకున్న వారు, ఇతరులను సేవించగలిగిన వారికి అంతా సిరులపంటే. ఇతరులను సేవించడాన్ని వదిలేసినా, మొదటి రెండు ఆచరించదగిన ఆదర్శాలే. చదువంటే చాలామంది పెద్ద పెద్ద డిగ్రీలు అనుకుంటారు. కచ్చితంగా అదీ చదువే. కానీ అసలు చదువు డిగ్రీలకు పరిమితమైంది కాదు. డిగ్రీలు లేకపోయినా విద్యావంతులు అయిన వారు ఉండొచ్చు. ఇప్పుడైతే విద్యాహక్కుచట్టం లాంటివి వచ్చాయి. కాని చదువుకోవాలన్న ఆసక్తి మిక్కుటంగా ఉన్నా బడికో, కళాశాలకో వెళ్లలేక స్వయంకృషితో చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకున్న వారికి కొదవలేదు. ఉన్నత విద్యను అందుకోగలిగి గొప్ప వాళ్లయిన వారూ ఉన్నారు.

చదువు సిద్ధాన్నంలాంటిది. సొంతంగా అనుభవం లేకపోయినా అనేక విషయాల మీద అపారమైన అనుభవం సాధించడానికి ఉన్న ఏకైక మార్గం చదువే. అందుకే అధ్యయనాన్ని మించిన ఆయుధం లేదంటారు. అనుభవం అందరి జీవితాల్లోనూ ఉంటుంది. కానీ జీవితానుభవం కొందరికి మాత్రమే సొంతం అవుతుంది. జీవితానుభవం సంపాదించడానికి పుస్తకాన్ని మించింది ఏదీ లేదు.

చదువంటే పాఠ్యపుస్తకాలు చదవడమే, మంచి మార్కులు తెచ్చుకోవడమేనని చాలా మంది అనుకుంటూ ఉంటారు. జీవనోపాధి కోసమే చదువు అన్న అభిప్రాయం మన మదిలో పాతుకుపోయినందువల్ల ఇష్టమైన ఉద్యోగమో, వృత్తో ఎన్నుకోవడం అనివార్యం అయినందువల్ల పాఠ్యపుస్తకాల అధ్యయనానికే ప్రాధాన్యం ఇవ్వడం అసహజమూ, అనవసరమూ కాదు. చాలామంది తల్లిదండ్రుల్లో ఈ మధ్య ఈ ధోరణే కనిపిస్తోంది. తమ పిల్లలు కథల పుస్తకాలో, పిల్లల పత్రికలో చదివితే క్లాసు పుస్తకాలు చదువుకోక అవెందుకు అని గద్దిస్తుంటారు. అసలు చదువు ఎక్కడ వెనుకబడి పోతుందోనని వారి భయం. అంతే! అయితే పాఠ్యపుస్తకాలతో పాటు ఇతర సాహిత్యం కూడా ఎక్కువగా చదివితే మన దృక్పథం మారుతుంది. మన దృష్టి విశాలం అవుతుంది. అప్పుడు అసలు చదువు ఇంకా త్వరగా బుర్రకెక్కుతుంది. చాలామంది తల్లిదండ్రులకు ఈ విషయంలో అనుభవం లేక, తమ పిల్లలు చదవకూడని పుస్తకాలు చదివి ఎక్కడ పాడైపోతారో అన్న బెంగటిల్లుతుంటారు. ఇతర పుస్తకాలు చదివే తమ పిల్లలను అడ్డుకుంటుంటారు.

ఈ రోజుల్లో జ్ఞానం సంపాదించడానికి పుస్తకం ఒక్కటే మార్గం కాదు. ఈ మాట వాస్తవమే అయినా పుస్తకాన్ని మించిన నేస్తం మరొకటి లేదు. పుస్తకం ప్రతిఫలం కోరదు. పుస్తకం ఆస్వాదించగలిగిన వారికి కావల్సిన రసానుభూతి కలిగిస్తుంది. దోసిళ్ల కొద్దీ జ్ఞానాన్ని దోచుకున్నా అభ్యంతరం చెప్పదు. అది ఇగిరి పోయేదీ కాదు, తరిగి పోయేదీ కాదు. అక్షరానికి ఉన్న విలువ అలాంటిది. అసలు అక్షరం అంటేనే క్షరం కానిది- నాశనం లేనిది అని అర్థం. ఏ గ్రంథమైనా అక్షర క్రీడే.

ఇటీవల జ్ఞానపీఠ్ పురస్కారాన్ని సాధించుకున్న రావూరి భరద్వాజ మాధ్యమిక పాఠశాల కన్నా పైకి వెళ్లలేకపోయారు. అంతమాత్రాన ఆయనకు చదువు లేదని కాదు. డిగ్రీలు లేవనే అర్థం. అవి సంపాదించడానికి ఆయనకు వీలు చిక్కలేదు. అలాగని నిరాశపడకుండా స్వయంకృషితో చదువుకుని మంచి రచయితగా రాణించడమే కాక జ్ఞానపీఠ్ అవార్డు సాధించి తెలుగువారికే వన్నె తెచ్చారు.

ఇలాంటి వారు మన చుట్టూ

చాలామంది ఉండేవారు. ఇప్పటికీ ఉన్నారు. సాహిత్యంతో, నాటక రంగంతో ఏమాత్రం సంబంధం ఉన్నవారైనా షేక్స్‌పియర్ పేరు వినే ఉంటారు. ఆయనను నాలుగో తరగతి పట్టభద్రుడు అని ఎద్దేవా చేస్తారు. ఆ తర్వాత చదువుకోకపోవడం ఆయన సృజనాత్మక శక్తికి ఆటంకం కాలేదుగా! "డిగ్రీలు లేని పాండిత్యంబు వన్నెకురాని పాడు కాలాన బుట్టి..." అని విశ్వనాథ సత్యనారాయణ ప్రసిద్ధ పరిశోధకుడు మల్లంపల్లి సోమశేఖరశర్మ గురించి చెప్పడంలో అంతర్యం స్వయంకృషితో సాధించిన విజయానికి పట్టం గట్టడమే.

90వ పడిలో ఉన్న సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు తెలుగు మీదే కాక ఆంగ్లం మీద కూడా ఆధిపత్యం సంపాదించడానికి కారణం చదువు మీద శ్రద్ధే. ప్రసిద్ధ రచయిత, సాహిత్య విమర్శకుడు, దార్శనికుడు, చిత్రకారుడు, తెలుగులో తొలి రాజకీయ కార్టూనిస్టు, బతుకుదెరువు కోసం అనేక పనులు చేసి పత్రికా రచయిత అయి సంపాదకుడి స్థాయికి ఎదిగిన రాంభట్ల కృష్ణమూర్తికి ఉన్న విద్యార్హతల్లా అయిదో తరగతి మూడు సార్లు తప్పడమే. అక్కడితో ఆయన పాఠశాల విద్య ఆగిపోయింది కాని విద్యాభ్యాసం ఆగిపోలేదు. తెలుగు, ఆంగ్లం, సంస్కృత భాషలను స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. ఉర్దూతో తగుమాత్రం పరిచయం ఉంది.

అంతెందుకు బడికెళ్లే వీలు లేక చదువు ఆపేయక తప్పనివారు కొందరైతే బడికెళ్లడం ఇష్టం లేకో, బడి చదువుల వల్ల పెద్ద ప్రయోజనం లేదని అనుకున్నందువల్లో మానేసినా చదువు కొనసాగించిన వారు అనేక మంది కనిపిస్తారు. అలాంటివారు అన్ని రంగాల్లోనూ తారసపడతారు.

మధ్యలో చదువు ఆపేసి వివిధ రంగాల్లో రాణించిన వారు ఎంతో మంది. డెల్ కంప్యూటర్ల కంపెనీకి అధిపతి అయిన డెల్ 19వ ఏట చదువు ఆపేశాడు. నిజానికి ఆయన చదువు ఆగలేదు. అలా ఆగి ఉంటే కంప్యూటర్ విజ్ఞానంలో అంతగా రాణించేవాడే కాదేమో!

ప్రపంచంలోనే అతి పెద్ద వాహనాల కంపెనీకి అధిపతి అయిన హెన్రీ ఫోర్డు కనీసం పాఠశాల విద్యను కూడా పూర్తి చేయలేదు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ కూడా కళాశాల చదువుకు స్వస్తి చెప్పిన వాడే. అమెరికాకు ఆరవ అధ్యక్షుడైన ఆండ్రూ జాక్సన్‌కు చదువులేదు. సౌందర్య సాధనాల తయారీలో 'మేరీ కే' సంస్థను స్థాపించిన 'మేరీ కే ఆశ్' కూడా కళాశాల విద్య మానేసిన కోవలోకే వస్తారు.

అమెరికాలో మొట్ట మొదటి కోటీశ్వరుడైన జాన్ డి. రాక్ ఫెల్లర్ సీనియర్ బడి మానేసిన వాడే. చరిత్రకు తెలిసినంత వరకు ఆయనే అత్యంత సంపన్నుడు. వ్యాపార రంగంలోనూ, కళారంగంలోను రాణించడానికి డిగ్రీలు, నియత విద్య అంతగా అవసరం లేకపోవచ్చు అని సరిపెట్టుకున్నా వారందరికీ విద్యాగంధమే లేదని కాదు.

ప్రసిద్ధ నాటక రచయిత జార్జ్ బెర్నార్డ్‌షా 14వ ఏట బడికెళ్లడం మానేశాడు. ఆ చదువు వల్ల ఫలితం లేదనుకున్నాడు. కానీ ఆయన డబ్లిన్‌లోని నేషనల్ గాలరీలో గంటల తరబడి గడిపి తన జ్ఞాన దాహార్తిని తీర్చుకుని క్రమంగా తానే రచయిత అయిపోయాడు.

విజ్ఞాన శాస్త్రాన్ని కథలుగా మలచి చెప్పిన హెచ్ జి వెల్స్ కూడా 11వ ఏట చదువు మానేస్తే, జాక్ లండన్ 13వ ఏట బడి చదువుకు స్వస్తి చెప్పాడు. రాబిన్సన్ క్రూసో పేరు వినని వారు అరుదు. కాని ఆ గ్రంథం రాసిన, ఆంగ్లంలో తొలినవలా రచయిత అయిన డేనియల్ డీ ఫోకు విద్వత్తు లేదు.

రష్యన్ రచయిత మాగ్జిం గోర్కీదీ అదే పరిస్థితి. ఆయన 11వ ఏట అనాథగా మిగిలాడు. ఒక ఏడాదిపాటు అమ్మమ్మ దగ్గర పెరిగాడు. 12వ ఏటా ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. అయిదేళ్లపాటు రష్యా సామ్రాజ్యం అంతటా కాలినడకన తిరిగాడు. ఆ సమయంలోనే లోకాన్ని చదివి బోలెడు జీవితానుభవం సంపాదించాడు. ఆ అనుభవమే ఆయన రచనలకు ముడి సరుకైంది. అయితే గోర్కీ బతుకుదెరువు కోసం చిన్నచిన్న ఉద్యోగాలు అనేకం చేశాడు. ఒక రొట్టెల కంపెనీలో పని చేసినప్పుడు కాస్త తీరిక దొరికితే ఏదో పుస్తకం చదివేవాడు. అలా చదివినందుకు యజమాని తెగ తిట్టేవాడు. అయినా గోర్కీ చదివే అలవాటు మానుకోలేదు. చదువుకోవడం కోసం కొవ్వొత్తులు



దొంగిలించేవాడు. పుస్తకం అంటే ఆయనకు అంత ప్రేమ మరి! అందుకే మహారచయిత అయ్యాడు. స్వయంకృషితో జ్ఞానం సంపాదించాడు కనుకే "ఈ లోకమే నా విశ్వవిద్యాలయం" అనగలిగాడు.

అంత చదివిన గోర్కీ పుస్తకాలు చదవాలని సలహా చెప్పేవాడు. చదివి సొంతంగా ఆలోచించాలనేవాడు.

రెండు మహానగరాలు అన్న గొప్పనవల రాసిన చార్లెస్ డికెన్స్‌కు పన్నెండేళ్ల వయసున్నప్పుడు అప్పుల వాళ్లు ఆయన తండ్రిని జైలులో పెట్టించారు. అక్కడితో ఆయన జీవితం దుర్భరం అయిపోయింది. కానీ చదువు మీద శ్రద్ధ పోలేదు. కనుకే గొప్ప రచయితగా వెలిగాడు. మార్క్ ట్వేయిన్ కూడా 12వ ఏటనే తండ్రి చనిపోవడంతో చదువు ఆపేయాల్సి వచ్చింది. వీరందరూ బడికో, కళాశాలకో వెళ్లే అవకాశం లేకపోయినా చదువు మాత్రం ఆపలేదు.

చదవడం అంటే బండి ఇసుకను ఇటు నుంచి అటు పోయడం కాదు. చదివిన దాన్ని ఆస్వాదించగలగాలి. అందులో ఉన్న అంశాలను అర్థం చేసుకోవడంతో ఆగకుండా జీర్ణించుకోగలగాలి. అలా జీర్ణించుకున్నప్పుడే ఆ గ్రంథం మంచి చెడ్డలను వింగడించగలిగే నేర్పు అబ్బుతుంది. నచ్చిన పుస్తకాన్ని పదేపదే చదవాలన్న ఆసక్తి లేకపోతే చదవడం వల్ల ప్రయోజనమే లేదు అని 'ఆస్కార్ వైల్డ్' అనేవాడు.

చదువు బతుకుదెరువుకు బాటలు వేసే మాట నిజమే గాని, అది మాత్రమే దాని పరమార్థం కాదు. అంతకు మించిన లోకాన్ని పుస్తకం చూపిస్తుంది.

బడిమానేయడం ఎదుగుదలకు అడ్డంకిగా మారనక్కరలేదని నిరూపించిన వారు ఎంతో మంది ఉన్నారు. గొప్ప పండితులు కాకపోయినా ఎవరికీ తీసిపోని రచయితలుగా ప్రఖ్యాతి సంపాదించిన వారు అనేక మంది ఉన్నారు. తెలంగాణ నుంచి తొలి నవలా రచయిత అయిన వట్టికోట ఆళ్వారుస్వామి చిన్నతనంలోనే బతుకు బండి లాగాల్సిన అవసరం వచ్చినందువల్ల హోటల్లో క్లీనర్‌గా పని చేసేవారు. కానీ ఆయనలో చదువుకోవాలన్న ఆసక్తి అంతరించలేదు. చెప్పుకోదగ్గ విద్వత్తు లేకపోయినా 'ప్రజల మనిషి' నవలను సమర్థంగా రాయగలిగారు. ఆయన చేపట్టని సాహిత్య ప్రక్రియే లేదు. శారద అనే కలం పేరుతో నవలలు రాసిన నటరాజన్ పుట్టుకతో తమిళుడు. దారీ తెన్నూ లేని జీవితం. ఆయన హోటల్ సర్వర్‌గా పనిచేశారు. కేవలం అధ్యయనం వల్లే ఆయనకు రచనా శక్తి చేకూరింది.



ఉనికి

నా ఉచ్ఛ్వాసలు నిశ్వాసలు
నీవై
నా తనువు మనసు
నీవై
నా ఉనికే ఇక నీవైనపుడు
నాలో నేను కోల్పోయి
నీలో'నే' మళ్లీ చిగురిస్తా

ఉదాహరణకు మనిషి జీవించడానికి పిండిపదార్థాలు, విటమిన్లు ఖనిజ లవణాలు అత్యవసరం. వీటిలో ఏవి తగ్గినా దాన్ని పోషకాహార లోపం అంటాం. ఇవన్నీ మాత్రల రూపంలో కూడా మనకు దొరుకుతాయి. కానీ ఈ సకల పోషకాలనూ అందించే మాత్రలు మాత్రమే మింగి బతకడం సాధ్యం కాదు. ఇవి జీర్ణం కావడానికి కొంత పీచు పదార్థం కూడా అవసరం. మనం తీసుకునే ఆహారంలో ఈ పీచు పదార్థంతో పాటే పోషకాలూ ఉంటాయి. ఆ పీచు పదార్థం లేకపోతే పోషక పదార్థాలు జీర్ణం కావు. అందుకే వైద్యులు ఈ మధ్యన పీచు పదార్థాలు ఉండే ఆహారం ఎక్కువగా తీసుకోండి అని చెబుతున్నారు.

పాఠ్య పుస్తకాలతో పాటు ఇతర ఉపయుక్త గ్రంథాలు సైతం చదవాలనడం అసలు పుస్తకాలు సులభంగా ఒంట బట్టడం కోసమే. ఇతర పుస్తకాలు చదవడం వల్ల లోకజ్ఞానం పెరుగుతుంది. దానివల్ల ఇంగిత జ్ఞానం అబ్బుతుంది. అది మన జీవనయానాన్ని సుఖమయం చేస్తుంది. అందుకే తల్లిదండ్రులకు ఓ విన్నపం! మీ పిల్లలను పాఠ్యపుస్తకాలే కాకుండా ఇతర పుస్తకాలు కూడా చదవమని ప్రోత్సహించడం అవసరం. అది కథో, నవలో, కవిత్వమో, జీవిత చరిత్రో, యాత్రాస్మృతో, ఒక నిర్దిష్ట అంశంపై రాసిందో, సామాజిక శాస్త్రమో అయినా సరే.

పరీక్షలు ముగిసిన తర్వాత చాలామంది విద్యార్థులు వినోదాత్మక కార్యక్రమాల మీదకు దృష్టి మళ్లిస్తారు. చదవాలనుకున్న చదువు పూర్తి అయిన తర్వాత చాలామంది తలమీద భారం దిగిపోయినట్టు ఆనంద పడిపోతారు. ఆ

తర్వాత పుస్తకం ముట్టుకుంటే ఒట్టు! వృత్తిలోనో, ఉద్యోగంలోనో స్థిర పడిపోయిన తర్వాత పుస్తకాన్ని పూర్తిగా పరిహరించే వారు బోలెడు మంది కనిపిస్తారు. మరికొందరు ఉద్యోగ విరమణ తర్వాత చదువుదాం లెమ్మని వాయిదా వేస్తారు. ఇంకా కొందరు చదవడానికి తమకు సమయం చిక్కదంటుంటారు. ఇది నిఖార్సయిన అబద్ధం. పుస్తకం ఏ రకంగానైనా చదవొచ్చు. కూర్చుని, పడుకుని, తింటూ, నడుస్తూ, బస్సులో, రైల్లో, పార్కులో ఎక్కడైనా చదవొచ్చు. దీనికి పుస్తకం అభ్యంతరం చెప్పదు. చదవడం శ్రమ కాదు - సేదదీరడానికి పుస్తకాన్ని మించిన ఉపకరణం లేదు అని గ్రహించగలిగితే ఈ సాకులన్నీ అటకెక్కుతాయి.

కొందరిని పుస్తకాల పురుగులంటుంటాం. ఇందులో కొంత వెటకారం ఉన్నా ఆ పుస్తకాల పురుగులు అనుకున్న వారే మహా మేధావులు. బ్రిటిష్ లైబ్రరీ చాలా పెద్దది. అందులో ఉన్న గ్రంథాలన్నింటినీ దాదాపుగా చదివేసిన వాళ్లు ఇద్దరే ఇద్దరు. మొదటి వ్యక్తి కార్ల్‌మార్క్స్, రెండోవారు డా॥ బి.ఆర్. అంబేద్కర్. మార్క్స్ మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేసిన తత్వవేత్త. అంబేద్కర్ అంటరాని వారి అభ్యున్నతి కోసం పాటుపడి స్ఫూర్తి ప్రదాతగా చరిత్రలో నిలిచిపోయారు.

గాంధీ, నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, పండిత మదన్ మోహన్ మాలవ్యా, సర్ సయ్యద్ అహమద్ లాంటి వారు అందరూ తమ తమ రంగాల్లో ఎంత ప్రావీణ్యం సంపాదించినా ప్రధానంగా పుస్తక ప్రియులే.

వయసు మీద పడిన తర్వాత కూడా చదవడం ఆరంభించిన వారూ ఉన్నారు. పరీక్షలు రాసి డిగ్రీలు సంపాదించిన వారూ కద్దు. అయితే చిన్నప్పుడే చదివే అలవాటు చేసుకుంటే అపారమైన అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చు. చిన్నతనంలో విద్యాభ్యాసం చేయాలి అని కాళిదాసు మేఘసందేశంలో చెప్పాడు. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠ్యపుస్తకాలు శ్రద్ధగా చదివేటట్టు చూడటంతో పాటు ఇతర పుస్తకాలు చదివే ఆసక్తి కలిగించాలి. చదివే అవకాశాలు లేకపోయినా ఆసక్తి వల్లే చదువుకుని రాణించిన వారందరికీ చిన్నప్పటి నుంచే ఆ లక్షణం ఉండేదని మరిచిపోకూడదు.

- భరణి, హైదరాబాద్



నిఘా విభాగం

నీతి వీడి నడుస్తూంది ప్రకృతి
నిఘా విభాగం తెరవండి!
ఉదయాద్రి శిఖరాలపై
ఉంచండి హాజరుపట్టిక
సకాలంలో ఉదయిస్తున్నాడా సూర్యుడు
సంతకం చేసి వెళ్లమనండి!
మందబుద్ధి చందమామ
మాటికీ జాగు చేస్తాడు
తేటు చూసి మోసపోక
లేటుమార్కు వెయ్యండి!
రుతుపవనాలు గతితప్పి వీస్తున్నాయ్
సమీరుడి సంజాయిషీ కోరండి!
మబ్బులు జబ్బు నటిస్తూ
మంద గమనాలు సాగిస్తున్నాయ్
వైద్య పరీక్షలు జరిపించి
బండారం బయటపెట్టండి!
ఎక్కడో నక్షత్రాలు
ఎదురెదురై ఢీకొంటాయట
భద్రతా చర్యల కోసం
బలగాన్ని పంపించండి!
ఉదధి తరంగాలు ఉరికి
ఊళ్ల మీద పడుతున్నాయ్
అదుపులోకి తీసుకోగలమని
అదిలించి బెదిరించండి!
పరీవాహ మార్గం దాటి
ప్రజల్ని మింగాయి నదులు
ఉప్పొంగి ప్రవహించడమే
తప్పని దండించండి!
చూస్తూ నిల్చోడమేకాని
చేసేదేమీలేని
సోమరి పర్వతరాలపై
చర్యను ప్రారంభించండి!

- బుడితి రామినాయుడు
విశ్రాంత ప్రభుత్వోద్యోగి, విజయనగరం

నేనెవరో - చెబుతారా!

ఇల్లలుకుతూ అలుకుతూ ఈగ తన పేరు మరిచిపోయింది. వెనకటికి ఏదో పాత కథలో - ఇప్పుడు ఇల్లు చక్కదిద్దుకుంటూ, దిద్దుకుంటూ మనిషి తన ఉనికినే మర్చిపోయాడు. తనెవరు? ఎట్లా ఉంటాడు? ఏం చేస్తాడు? ఎందుకు చేస్తాడు? - అసలు ఏవీ గుర్తులేవు.

మనిషి, తను మనిషన్న సంగతి మరిచిపోయి చాలా కాలమైంది. తనను తాను అన్వేషించుకోవడం ప్రారంభించాడు. రాత్రింబవళ్లు ధ్యానముద్రలో గడిపాడు.

గడ్డం పెరిగింది. కాని జ్ఞానోదయం కాలేదు. తానెవరో తెలుసుకోవడానికి మనిషి దేశం మీద పడ్డాడు. కనిపించినవారినల్లా అడగడం మొదలుపెట్టాడు. రోడ్డు పక్కన జరిగే ఎన్నికల ప్రసంగ సభ దగ్గర ఆగాడు.

"అయ్యా! తమరు దేశ నాయకుడిలా ఉన్నారు. కాస్తనేనెవరో గుర్తించి చెపుతారా?" అన్నాడు మనిషి. నాయకుడు చిద్విలాసంగా నవ్వి "నువ్వెవరైతే నీకెందుకు? నువ్వు నా ఓటువి. జేబులో నలిగిన నోటువి" అన్నాడు నల్లకళ్లద్దాల నుంచి నీలినీలిగా.

రైల్వే ప్లాట్‌ఫాం మీద గూడ్సు బండికి పంచె ఆరవేస్తున్న సన్యాసి కనిపించాడు. "ఆర్యా! శరణు శరణు. నేనెవరో ఏమిటో తెలుసుకోలేకున్నాను. అజ్ఞానిని కరుణించు స్వామి" అన్నాడు మనిషి. సన్యాసి కంగు తిన్నాడు. వెంటనే సంబాళించుకుని "ఓయీ నీవు హిమాలయమ్ములకు రమ్ము. అక్కడ జ్ఞాన మార్గం బోధించెదను. అప్పుడు గాని నీకు నువ్వెవరో తెలియదు" - అన్నాడు. మనిషి జేబులు చూసుకున్నాడు. "టీ తాగడానికే డబ్బుల్లేవ్. హిమాలయాల దాకా ఏం పోతా"మనుకున్నాడు. ఉస్సూరుమంటూ. అటూ, ఇటూ చూసేంతలో చిత్రం జరిగిపోయింది. సన్యాసిగారు బొల్లారం లోకల్ రైలు కదిలిపోతుండగానే ఎక్కేసి చక్కాపొయ్యారు. అంతకుముందు ఆరేసిన పంచ అతని భుజానికి వేలాడుతోంది. "ఏం మహిమ? ఎంత మనోనిబ్బరం" అనుకున్నాడు మనిషి తనలో తాను.

ఓడిపోయి విదేశాల నుంచి తిరిగొచ్చిన క్రికెట్ ఆటగాణ్ని అంతా చుట్టుముడుతున్నారు. 'అంత ముఖ్యమైన వాడైతే అతనికి తన సంగతి కొంచెమైనా తెలియకపోతుందా?' అని మనిషి గుంపులో జొరపడి అమాయకంగా అడిగాడు. "సార్.. నేనెవరో, ఏమిటో కాస్త గుర్తుపట్టి చెపుతారా?"

వ్యాపార ప్రకటనలో నవ్వినట్టుగా నవ్వి, ఉత్పత్తిదారుడు కొనుగోలుదారుని చూసినట్టుగా చూసి- "నువ్వెవరో నీకు తెలియదా? స్టేడియంలో, టి.వి. ప్రత్యక్ష ప్రసారాల్లో నన్ను చూస్తూ.. నువ్వు నా అభిమానివన్న సంగతి మరిచిపోయావా?" అని ఆటగాడు తన మెళ్లోని దండతీసి మనిషి మెడలోకి విసిరాడు. "దండ బాగానే ఉంది. అమ్ముకుంటే వంద రూపాయలైనా రాకపోవు" అనుకున్నాడు, మనిషి. లోలోపల కొంత సంతోషించాడు. ఇంతేచాలు అని అనుకుని పక్కకు చూశాడు. అతగాడి పక్కనే అతనికి కాబోయే భార్య ఉంది. ఆమె సినిమా తార. ఆమె అతనికన్నా నాలుగాకులు ఎక్కువ చదివినదానిలా అనిపించింది. ఆమె మీద నమ్మకం కుదరలేదు. క్రికెట్ ఆటగాడి లాగానే "మీరు నా విలువైన ప్రేక్షకుడు గారు కదా?" అని గొప్పగా నటించొచ్చు. ఎందుకులే! మరెవ్వరి దగ్గరికైనా పోతే మంచిది అని అక్కడి

నుంచి జారుకున్నాడు మనిషి.

దారిలో బార్‌లోకి, బ్యాంకులోకి, దుకాణం లోకి తొంగిచూశాడు. దేనిలోకి చూసినా "కస్టమర్ గారూ రండి.. రండి.. స్వాగతం! అనే పిలుపులు వినిపించాయి. ఎవడి గొడవ వాడిదే తప్ప, తన గొడవ వినే నాథుడే లేడే - అని మనిషి తీవ్రంగా బాధపడ్డాడు.

స్టాక్ ఎక్స్ఛేంజ్ దగ్గర చెదల పుట్టలా జనం కనిపించారు. వాళ్లంతా దేనికోసం ఎగబడుతున్నారో మనిషికి అంతుపట్టలేదు. అంతమందిలో ఒక్కడంటే ఒక్కడు తనను గుర్తు పట్టకపోతాడా - అని మనిషి గుంపులో చేరాడు. తొక్కిసలాటలో కింద పడ్డాడు. అతనిపై నుంచి షేర్సూ, డిబెంచర్సూ, బ్రోకర్సు, ప్రైమరీ - సెకండరీ ఇన్వెస్ట్‌మెంట్సూ.. అన్నీ కదిలిపోయాయి. మనిషి లేచి జుట్టు పీక్కుని, రోడ్డుకడ్డంగా నడవడం మొదలుపెట్టాడు.

పెద్దగా కారు మోత వినపడి, కుప్పకూలిపోయాడు. మనిషికి మెలకువ వచ్చేసరికి ఆటోమేటిక్ కారు వెనుక సీట్లో పడుకుని ఉన్నాడు. శాస్త్రవేత్త మనిషిని నిశితంగా పరిశీలిస్తున్నాడు.

"ఎవరయ్యా నువ్వూ? నా కారు కింద పడ్డావ్? నీకు బుర్రుందా? నీ కోసం, నీ బాగు కోసం కాదూ నేను జీవితాన్ని త్యాగం చేసింది? ఎంత పరిశోధన చేశాను? నీ జాతి అంతరించిపోతుందేమోనని టెస్ట్‌ట్యూబ్‌ల్లో కూడా నీ సంతతిని పెంచే ప్రయత్నం చేస్తున్నాను. నువ్వేమో నీ విలువ తెలుసుకోవు. ఈ ప్రకృతిలో నీ గొప్పదనం మరే జీవికుందో చెప్పూ?.. ఇంత పెద్ద శాస్త్రవేత్తను ఒక్కోసారి నాకే అంతుపట్టవు.. అది సరే- ఎవరయ్యా నువ్వూ?" - అని అడిగాడు శాస్త్రవేత్త. పెద్ద ఉపన్యాసం తర్వాత ఈ లోకంలోకి వచ్చి.

తన గురించి అన్నీ తెలుసంటున్నాడు. మళ్లీ ఏమీ తెలియనివాడిలా ఎవరని అడుగుతున్నాడు. ఏం సమాధానం చెప్పేది? - అని మనిషి లోలోన విసుక్కున్నాడు.

"అన్నీ తెలిసినవారు మీరే చెప్పాలి సార్! నేనెవరో ఏమిటో తెలియక, తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నాను."

"ఆం- అద్భుతం!" అని పెద్దగా నవ్వాడు శాస్త్రవేత్త. నువ్వా? లోతుకు వెళ్లి చెప్పాలంటే డీఎన్ఏ, ఆర్ఎన్ఏవు! బి-పాజిటివ్ బ్లడ్ గ్రూపువి!! అర్థమైందా మై డియర్ హోమో సేపియన్! ఈ భూమ్మీద నాగరిక జీవివి - అంతే!!"

మనిషికి ఏమీ అర్థం కాలేదు. త్వరగా బయటపడితే మంచిది. ఠకీమని చిటికెన వేలు చూపించినా శాస్త్రవేత్త కారు ఆపలేదు. "అదిగో ఆ మరుగుదొడ్లు వాడుకో"

"అబ్బే- అలా కాదు... దిగిపోతాను. దయచేసి నన్నొదిలేయండి."

"ఇక్కడి నుంచి నీ గమ్యస్థానానికి చేరతావా? తప్పకుండా వెళ్తావా? మళ్లీ దారి తప్పవు కదా?"

"అవును సార్ దింపేయండి." - కారు ఆగడం తోటే మనిషి రోడ్డున పడి పరుగులంకించుకున్నాడు. 'తను దారిలో ఉన్నది ఎప్పుడని? ఇప్పుడు తప్పడానికి!?"

తనకన్నా వేగంగా పరుగెత్తుతున్న జంతువేమై ఉంటుందా? అని ఆలోచిస్తుండగా మైదానంలో గడ్డి మేస్తున్న గుర్రం వెనక్కి తిరిగి చూసింది. "ఇహి.. హి.. హీ" అని సకిలించింది. మనిషి టక్కున ఆగిపోయాడు. ఒకానొకప్పటి కథలో ఈ సకిలింపు వినే కదా ఈగకు తాను ఈగననే విషయం గుర్తుకొచ్చింది. తనెవరో గుర్తురావడం ఎలా? తను ఈగ కాదు కదా? ఎందుకైనా మంచిది గుర్రాన్ని అడుగుదామనుకున్నాడు. కాని, "నా మీద డబ్బులు కాసేవాడివి. బతుకు కొల్లగొట్టుకునేవాడివి. నువ్వూ నీ బతుకూ నా కాళ్ల మీద ఆధారపడాల్సిందే" అని గుర్రం ఆటపట్టిస్తుందేమోనని ఒక్క క్షణం ఆగాడు మనిషి. గుర్రం హేళనగా సకిలించింది.

మనిషికి పిచ్చికోపం వచ్చి బడితె తీసుకుని గుర్రాన్ని బాదడం మొదలు పెట్టాడు. "కంచర గాడిదలక్కూడా లోకువైపోతే ఇంకెందుకూ బతికి" అనుకున్నాడు. కాసేపటికి పైకే అన్నాడు. గుర్రం వెంటపడి మళ్లీ బాదాడు.

"బాబూ పశుత్వం కాదు. మానవత్వం" అని కేకలు వినిపించాయి. సిగరెట్ పీలుస్తూ, చేతికర్ర ఊపుకుంటూ, శాలువా కప్పుకున్న పెద్దాయన కనిపించాడు.

"నువ్వు మానవుడివీ, మానవత్వం ఉండాల్సిన వాడివి కదా? ఆ నోరులేని జంతువు మీద నీకెందుకు కోపం?" ఆయన మాటలు వింటుంటే తను మానవుడిననే అనుమానం కలిగింది మనిషికి. "ఈ గుర్రం మీదేనా?" అడిగాడు ఏమనాలో తెలియక.

"అవును బాబూ. మా ముత్తాతల తాతలకు శ్రీకృష్ణదేవరాయలు ఓ గుర్రాన్నిచ్చారు. దాని సంతతే ఇది. అశ్వం - ఆశుకవిత్వం మా వారసత్వం. పాత వైభవానికి చిహ్నం. ఒక జ్ఞాపకం. తరతరాల వారధి. నా లేమితనానికి సారథి. నా ఈ కాళ్లనొప్పుల వృద్ధాప్యానికి ఔషధం" - అని అనగానే గుర్రం దగ్గరగా వచ్చి తల వంచుకుని నిలబడింది. కవి ప్రేమగా గుర్రాన్ని నిమిరాడు.

"మన్నించండి కవిగారూ. బహుశా నా మీద కోపం కూడా గుర్రం మీదే చూపించాను. నేనెవరో తెలుసుకునేందుకు పిచ్చివాడిలా తిరుగుతున్నాను. ఎవరికివారు, వారి కోణంలో నన్ను నిర్వచించారే గాని, నువ్వు మనిషివిరా అని చెప్పిన పాపాన పోలేదు. తమరు కరుణించారు. నేను మనిషన్న విషయం బోధపరిచారు" అన్నాడు మనిషి వినయంగా.

"మనిషిని మనిషిగా గుర్తించడమే... మనిషిని మనిషిగా కీర్తించడమే కవిగా నేను చేస్తున్న పని నాయనా. నిన్ను నువ్వు తెలుసుకుంటే ఈ విశాల విశ్వంలో నిన్ను మించిన శక్తి లేదు. నీకు ఆత్మస్థైర్యం కలుగు గాక!... ఏదీ ఒక్కసారి "మానవత్వం నిలుపుకుంటా. తోటి మనిషిని కలుపుకుంటా అని గొంతెత్తి చాటు బాబూ"- అన్నాడు కవి ఆశగా. తన కలలు ఫలించిన క్షణాలు ఆసన్నమైనాయన్న సంతోషంలో-

మనిషి తొందర పడ్డాడు- "మానవత్వం మంట గలిపెద. తోటి మనిషికి తాట ఒలిచెద" అని అరిచాడు. కవి బాధతో కళ్లు మూసుకున్నాడు- తప్పిపోయిన మనిషి దీన ఆర్తనాదం ఎక్కడి నుంచో సన్నగా వినిపిస్తూనే ఉంది.

డా॥ దేవరాజు మహారాజు
ఆచార్యులు, హైదరాబాద్.
99086 33949

పేద విద్యార్థుల
జీవితాలలో అభ్యుదయ క్రాంతి
విద్యార్థులకు ఫీజుల చెల్లింపు
రాష్ట్రంలో ప్రతి ఏటా 28,48,046 మంది విద్యార్థులకు రూ.3500 కోట్లతో ఉపకారవేతనాలు మరియు బోధనారుసుముల చెల్లింపు
స్కాలర్‌షిప్ పొందడానికి కుటుంబ ఆదాయపరిమితి లక్ష నుండి రెండు లక్షల రూపాయలకు పెంపు
2012-13కు గాను జనవరిలో రూ. 1951.45 కోట్లను విడుదల చేసిన ప్రభుత్వం
2008 నుండి చెల్లించాల్సిన బకాయిలు రూ. 8217 కోట్లను గత రెండేళ్లలో చెల్లించిన ప్రస్తుత ప్రభుత్వం
మెస్ చార్జీల పెంపుతో 8.20 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం
2013-14లో ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లకు రూ.6533 కోట్లను కేటాయించిన ప్రభుత్వం
శ్రీ దామోదర రాజనరసింహ ఉపముఖ్యమంత్రివర్యులు, ఉన్నత & సాంకేతిక విద్యాశాఖామాత్యులు
శ్రీ పితాని సత్యనారాయణ సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు
శ్రీ పి. బాలరాజు గిరిజన సంక్షేమ శాఖామాత్యులు
శ్రీ బసవరాజు సారయ్య బి.సి. సంక్షేమ శాఖామాత్యులు
శ్రీ సయ్యద్ మహ్మద్ అహ్మదుల్లా మైనార్టీ సంక్షేమ శాఖామాత్యులు
శ్రీ కె. పార్థసారథి మాధ్యమిక మరియు ఇంటర్మీడియట్ విద్యాశాఖామాత్యులు
డా॥ ఎస్. శైలజానాథ్ ప్రాథమిక విద్యాశాఖామాత్యులు
శ్రీ దానం నాగేందర్ కార్మిక, ఉపాధి, శిక్షణ & ఫ్యాక్టరీ, ఐటిఐ శిక్షణాసంస్థల శాఖామాత్యులు
శ్రీమతి డి.కె. అరుణ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు

బంగారు తల్లి

"పుడితే ఆడపిల్లగానే పుట్టాలి, ఆంధ్రప్రదేశ్‌లోనే పుట్టాలి"

– అన్న ఒక చెల్లి స్ఫూర్తితో...

నా అక్కలు, చెల్లెళ్ళ కుటుంబాలకు ఒక బహుమతి!

మీ ఇంట్లో ఆడపిల్ల పుట్టడం మీ అదృష్టంగా భావించే రోజులు రావాలని చాలాకాలంగా నాకొక ఆశ. నిజానికి ఇది ఇందిరమ్మ అనేకసార్లు వ్యక్తం చేసిన కోరిక. కాని, ఈ మధ్యనే నా కర్నూలు జిల్లా పర్యటనలో ఓర్వకల్లులో ఒక చెల్లెమ్మ ఈ మాటల్ని ఎంతో గర్వంగా చెప్పింది.

ఆడపిల్ల అంటే మన ఇంటి మహాలక్ష్మి.

ఎన్నో ఏళ్ళగా మన లోగిళ్ళు ఆనందంగా కనిపిస్తున్నాయంటే కారణం – మన ఇంటి ఆడపడుచులు. వాళ్ళ శక్తి సామర్థ్యాలు కేవలం వంటఇంటికే పరిమితం కాదనీ, అవకాశాలు కల్పిస్తే వాళ్ళు పురుషులతో సమానంగా విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాలలో కూడా రాణించగలరని, మన **'ఇందిరా క్రాంతి పథం'** నిరూపించింది. ఈ శక్తిని **ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ, రాష్ట్రపతిగా ప్రతిభా పాటిల్**, చాలామంది మహిళా ముఖ్యమంత్రులు రాజకీయాల్లో కూడా నిరూపించారు.



అందరికీ అమ్మ అంటే ఒక మహిళే. అమ్మని ప్రేమిస్తాం, గౌరవిస్తాం. కానీ మనకి ఆడపిల్ల పుడుతుందంటే భారం అనుకుంటామా! ఆర్థిక పరిస్థితులే కారణమయితే వాటిని మీరు అధిగమించాలి. ఆడపిల్ల భారం కాదనీ, ఇంటికి ఆధారపడదగిన మహాలక్ష్మి అనీ విశ్వసించాలి. మీకు ఈ శక్తిని కలిగించడం కోసమే ఓర్వకల్లులో చెల్లెమ్మ అన్న మాటలస్ఫూర్తితో ఇప్పుడు **'బంగారుతల్లి'** పథకాన్ని మీకు అందిస్తున్నాం.

జాతీయ స్థాయిలో జననాలతో పోలిస్తే, మన రాష్ట్రంలో ఆడ, మగపిల్లలజననాలమధ్య వుండాల్సిన నిష్పత్తిలో తేడా పెరుగుతోంది. ఆడపిల్లల్ని వద్దనుకునేవాళ్ళ వల్ల ఈ సమస్య ఏర్పడుతోంది. ఈ తేడాని ఇలాగే వదిలేస్తే అది అనేక చెడు పరిణామాలకు దారితీస్తుంది.

ఆరోగ్యవంతమైన పిల్లలు పుట్టాలి, ఆరోగ్యంగా పెరగాలి – అనే **'ఇందిరమ్మ అమృతహస్తం'** పథకాన్ని ప్రవేశపెట్టాం. దాదాపు మూడున్నర లక్షలమంది గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించే ఈ పథకం కోసం ఏటా రూ. 125 కోట్లు ఖర్చు చేస్తున్నాం.

ఆరోగ్యంగా ఆడపిల్ల పుట్టి, చదవాలి, ఎదగాలి, మీ కుటుంబానికి గర్వకారణం కావాలి. మీకు తెలుసు. ఆడపిల్ల పుట్టుక నుంచీ బాధ్యత తీసుకుంటూ ఇప్పటికే **'జననీ సురక్షా'** పథకం క్రింద పుట్టుక నాడే కాన్పుకయ్యే ఖర్చుని ప్రభుత్వం భరిస్తోంది. ఇంకా సుఖీభవ, ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలు, రాజీవ్ విద్యా దీవెన, 11, 12 తరగతులఉపకార వేతనాలు, డిగ్రీ చదువు కిచ్చే ఉపకార వేతనం రూపేణా ప్రతి ఆడపిల్లకీ రూ. 60,600లకు పైగా లబ్ధిచేకూరుతోంది.

ఇప్పుడు **'బంగారుతల్లి'** పథకం క్రింద మీ కుటుంబంలో పుట్టే ఇద్దరు ఆడపిల్లలకు జననం నమోదు దగ్గర నుంచి కాలేజీ చదువులు చదివే వరకు ఏటా ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించాం. ఆడపిల్లలు వయసుకు తగిన విధంగా అంగన్‌వాడీలో, తరువాత బడిలో, కళాశాలలో చేరి చదువుకోవాలి. చదువును మధ్యలో ఆపకూడదు. ఇందుకోసం వాళ్ళకు కాలేజి చదువులవరకు మొత్తం 55,500 రూపాయలు మేరకు ప్రోత్సాహకాలను అందించాలన్నదే 'బంగారుతల్లి' పథకం. 18 ఏళ్ళ వరకూ పెళ్ళి చేసుకోకుండా 12వ తరగతి (ఇంటర్మీడియట్) పూర్తిచేసిన ఆడపిల్లకి రూ.50,000 బహుమతి ఇవ్వాలని నిర్ణయించాం. అలాగే ఆపకుండా చదువుకుంటూ డిగ్రీ పూర్తి చేస్తే (21 ఏళ్ళు నిండే నాటికి) మరో రూ.50,000 బహుమతిగా ఇవ్వాలనీ నిర్ణయించాం. ఈ 'బంగారుతల్లి' పథకంలోని ప్రోత్సాహకాలన్నీ ఇప్పటివరకూ ఇస్తున్న ప్రయోజనాలకు అదనంగా లభించేవే.

అంటే, డిగ్రీ దాకా చదువుకునే పేద కుటుంబాల్లోని ప్రతి ఆడపిల్లకీ **'బంగారుతల్లి'** పథకంతో కలిపి లభించే మొత్తం ఆర్థికసాయం 2 లక్షల16 వేలరూపాయలకు పైమాటే. ఈ ప్రయోజనం అర్హతగల ప్రతి ఆడపిల్లకి ఖచ్చితంగా అందితీరేలా ఒక చట్టాన్ని కూడా తీసుకురానున్నాం.

గ్రాడ్యుయేషన్ దాకా 'బంగారుతల్లి' ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఆ డిగ్రీతో వాళ్ళు టీచర్లు కావచ్చు, బ్యాంకుల్లో ఆఫీసర్లు కావచ్చు, సివిల్ పరీక్షలు రాసి ప్రభుత్వంలో పెద్ద అధికారులు కావచ్చు... ఇంకా ఎన్నో అవకాశాలు.

చదువు అనేది ఉత్తమ జీవితానికి ఒక స్థిరమైన పునాది. పేదలజీవితాలకు వెలుగునిచ్చే తరగని నిధి. ఆ చదువు మీ ఇంట్లో ప్రతి ఆడపిల్లకీ లభించాలి.

ఇది మీ ప్రభుత్వం. మీ కుటుంబం సుఖ సంతోషాలతో వుండాలని కోరుకునే ప్రభుత్వం. ఆడపిల్ల ఇంటికి అందం. అమ్మానాన్నలకి ప్రేమని పంచి ఇచ్చే ఒక వరం. ప్రతి ఆడపిల్ల మీ కుటుంబాలకి **'బంగారుతల్లి'** కావాలనుకున్న ఇందిరమ్మ కలని నిజం చేద్దాం.

మనసారా కోరుకోండి – మీ అమ్మాయి కూడా 'బంగారుతల్లి' కావాలని.

'బంగారు తల్లి'కి జేజేలు.

మీ
ముఖ్యమంత్రి
కిరణ్ రెడ్డి
నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి

జారీచేసినవారు: సమాచార, పౌరసంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

అర్థాలే వేరులే!

"ఆడవారి మాటలకు
అర్థాలే వేరులే"

అనే పాతపాట సుపరిచితమే, అయితే ఇది పూర్తిగా నిజం కాదు. కొంతమంది పట్ల, కొన్ని సన్నివేశాల్లో మాత్రమే అది నిజం కావచ్చు. అసలు మాటలకే అర్థాలు వేరు. ఏ మాటనైనా సహజార్థంలో మాత్రమే కాదు అనేక అర్థాలుగా, అనేక విధాలుగా వాడతారు. ఆలంకారికులు మాటకి అర్థాలను ముఖ్యంగా మూడు రకాలుగా వివరించారు; - వాచ్యార్థం, లక్ష్యార్థం, వ్యంగ్యార్థం.

ఈ మాటల్ని వినగానే ఇదేదో పాతదనీ, సనాతనమనీ, వ్యాకరణం గోల అని అనుకుంటే పొరపాటే. మనం మాట్లాడే భాషకీ ఇవి అన్వయిస్తాయి. వాచ్యార్థం అంటే ఒక మాటకు గల సహజమైన, అసలైన అర్థం. జలం అంటే నీరు; పుష్పం అంటే పువ్వు- వంటివి! లక్ష్యార్థం అంటే సహజార్థం కాకుండా దానితో సంబంధం గల మరో అర్థం వస్తుంది. ఇక్కడ అసలైన అర్థం పొసగదు.

"ఇలా నేరుగా వెళ్తే సినిమా హాలు తగుల్తుంది" అన్నప్పుడు నిజంగా తగలదు. కనిపిస్తుందనే అర్థం. వాకిట్లో నుంచి కరేపాక్ కరేపాక్" అంటూ అమ్మేవ్యక్తి వెళ్తుంటే మనం "కరేపాకూ ఉండు, కరేపాకూ రా" అంటాం. కరేపాకు అమ్మేవాడా ఉండు, కరేపాకు అమ్మేవాడా రా అని కదా వీటి భావం!

ఇక మూడోది వ్యంగ్యార్థం. దీనినే ధ్వని అంటారు. ఇందులో సహజమైన అర్థం ఉంటుంది. దాంతోపాటే చమత్కారం, వేళాకోళం లేదా వ్యతిరేకమైన అర్థం కూడా ఉంటుంది. ఇది కవిత్వానికి చాలా ముఖ్యమే కానీ మనం రోజూ మాట్లాడే మాటల్లోనూ ఈ వ్యంగ్యార్థం ఉంటుంది. అందరూ చెప్పే ఉదాహరణ - "రాజుగారి రెండో భార్య మంచిది!" నిజమే - రెండో భార్య మంచిది అన్న అసలైన అర్థం ఉంది. కానీ- మొదటి భార్య మంచిది కాదన్న అర్థమూ ఉంది. ఇదీ వ్యంగ్యార్థం అంటే. ఎవరన్నా "మీరు ఫొటోలో చాలా బాగున్నారండీ" అన్నారనుకోండి ఇందులో రెండో అర్థం దాగి ఉంది - ఫొటోలో బాగున్నారు గానీ బయట బాగుండరని! అయితే అలా అన్నవాడికి ఆ ఉద్దేశం లేకపోవచ్చు. ఇలా ఒక విధంగా పలికితే మరొక విధంగా అర్థం వస్తుంది. ఇది భాషలోని పదప్రయోగాల లక్షణం.

కవిత్వంలోనైనా, వాడుక భాషలోనైనా ఒక మాటకి ఒకే అర్థం ఎప్పుడూ ఉండదు. సందర్భాన్ని బట్టి, సన్నివేశాన్ని బట్టి అర్థం వేర్వేరుగా ఉంటుంది. ఉదాహరణకి 'లెక్క' అనే పదం తీసుకుందాం-

"లెక్క చేశావా?"

"నీ దగ్గర లెక్క ఏవన్నా ఉందా?"

(డబ్బు)

"వాడు నాకో లెక్కా?"

"లెక్కించావా?"

అలాగే, 'మాట' అనే ఒక్క పదానికి వివిధ సందర్భాల్లో 20 పైగా అర్థాలున్నాయి. మచ్చుకు కొన్ని-

"వాళ్లిద్దరికీ మాటల్లేవు"

"వాడి మాట వాడిదే"

"మనలో మాట"

"ఒక్క మాటలో చెప్పు"

"ఆ పని చెయ్యటం మాటలు కాదు"

"మాటామాటా వచ్చింది"

"ఏ మాటకి ఆ మాటే చెప్పుకోవాలి"

"మాటంటే మాటే".

అలాగే ఒకనాడున్న అర్థం తర్వాత ఉండదు. దీనిని భాషాశాస్త్రంలో అర్థ విపరిణామం అంటారు. ఒకనాడు 'శ్రాద్ధం' అంటే శ్రద్ధగా చేసేది అనే అర్థం. శ్రీనాథుడు 'కోక' చుట్టుకున్నాడు. కోక అంటే చీర కాదు- ఒక వస్త్రం! ఉచితం అంటే తగినది, యోగ్యమైనది అని అర్థం. ఇవాళ ఆ అర్థం మారిపోయింది. 'రెండుకొంటే ఒకటి ఉచితం' అంటున్నారు. 'ధర్మం', అనే పదానికి న్యాయం, విధి, కర్తవ్యం అని అసలైన అర్థాలు. ఇవాళ 'ధర్మదర్శనం', 'ధర్మం చేయండి బాబూ' అంటూ వాడుతున్నారు.

"ఏడిశావ్, నువ్వేం చేస్తావ్"? అన్నప్పుడు 'ఏడిశావ్'కి అర్థం వేరు. 'వాడికి

నచ్చచెప్పలేక చచ్చాననుకో' అన్నప్పుడు నిజంగా చావలేదు గదా!

"బొక్కలో తోస్తా"

"జనగణమన పాడాడు"

"దద్ధోజనంగాడు"

"నీ దుమ్ము దులుపుతా"

"చూసుకుందామా"

- వీటి అసలర్థాలతో ఏమైనా సంబంధం ఉందా?

మనం వాడే తిట్లు కూడా ఇంతే.

"నీ నోట్లో పురుగులు పడ"

"నీ యిల్లు కాల్చ"

"నీ కడుపు కాల"

"రాచి రంపాన పెడ్తా"

ఇవి అసలైన అర్థాలను కాదని మరో అర్థంలో వాడుకలో ఉండే జాతీయాలు.

"కళ్లలో నిప్పులు పోసుకుంటాడు" అంటే ఈర్ష్య, అసూయ అనే అర్థం. 'పక్కలో బల్లెం' అంటే పక్కా ఉండదు, బల్లెమూ ఉండదు. 'ప్రమాదకరం' అనే అర్థం. "వాడు కథలంటే చెవి కోసుకొంటాడు" అన్నప్పుడు నిజంగా చెవి కోసుకోవడం ఉండదు. అంత ఇష్టం అనే అర్థం. అలాగే 'కళ్లకు కట్టినట్టు' అంటుంటాం. నిజానికి కళ్లకి కడితే ఏమీ కనిపించదు. కానీ స్పష్టంగా, సవివరంగా అనే అర్థంలో వాడతాం. బాగా వాడుకలో ఉన్న "చెవిలో పువ్వు" అనేది కూడా అంతే!

క్రియాపదాలు కూడా వేరే అర్థాలలో వాడటం తెలిసిందే - "వరుసలో పెట్టు, పెట్టుబడి, కనిపెట్టు, ఏమైనా పెట్టు..." మొదలైనవి.

'తిన్నాడు' అనే క్రియాపదం ఎన్ని అర్థాలో ఉందో చూడండి.

- అన్నం తిన్నాడు, కంగుతిన్నాడు, డబ్బు తిన్నాడు, గడ్డి తిన్నాడు.

ఇతర భాషా పదం విడినప్పుడు కూడా అర్థం మారుతుంది. మర్యాద అంటే 'హద్దు' అనే అర్థం. కానీ తెలుగు మర్యాద వేరు; ఖబర్ కాస్తా కబురు అయింది. తెలుగు 'కబుర్లు' వేరు. ఖబర్ అంటే వార్త మరి! 'జవాన్' అంటే యువకుడు - ఇతను సైనికుడయ్యాడు. తెలుగులో నౌకరయ్యాడు. ఇలా ఎంతో చెప్పవచ్చు. సారాంశం ఏంటంటే ఏ మాటకైనా 'అర్థం వేరులే' అనాలి. భాష ప్రజల కోసం. ప్రజల మనో భావాలను వ్యక్తీకరించడం కోసం. వ్యాకరణం, నిఘంటువులు ప్రజలకి అక్కర్లేదు. ప్రజా నిఘంటువు వేరు. దానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

డా. ద్వా.నా.శాస్త్రి,
రచయిత, సాహితీ విమర్శకులు,
హైదరాబాద్. 98492 93376

మింగీ అంగావిడతో వెంగేగలెంగేను నంగాయన

ఇంతకీ ఇది ఏమిటనుకుంటున్నారు? తర్కించుకునేందుకు అవధానంలో పృచ్ఛకుడు సంధించిన ప్రశ్నేం కాదు. కవుల కలం నుంచి జాలువారిన పదబంధం అంతకంటే కాదు. మరేంటి? అత్తాకోడళ్ల సంవాదం. తల్లి కుమారుడికి కోడలి గురించి చెబుతున్న వైనం. ఇలా అంటారా!

ఓ ఇంట అత్తాకోడళ్లు గొడవ పడ్డారు. ఆ తర్వాత కొంత సేపటికి కుమారుడు వచ్చాడు. జరిగిన విషయం కోడలి ఎదుటే కొడుక్కు ఆ తల్లి చెప్పుకోలేని పరిస్థితి. అలాగని ఊరుకోనూ లేదు. కోడలికి అర్థం కాకుండా కుమారుడికి మాత్రమే తెలిసేలా ఇలా 'మింగీ అంగావిడతో వెంగేగలెంగేను నంగాయన' అంటూ సంక్షిప్తంగా చెప్పింది. (మీ ఆవిడతో వేగలేను నాయన అని దీని అర్థం. ఇంతకీ ఇదేం భాష అనేగా మీ ఆలోచన. వాడుకలో దీన్ని 'గ' భాష అని అంటారు.

'క' తెలుసు... 'జ' గురించి విన్నాం... ఇదేంటి?

కరాకజు... లేదా జరాజజు అంటే అందరికీ తెలిసిందే రాజు అని. భాష కాకున్నా ఇలా పలికే ప్రక్రియను క, జ భాషలుగా వ్యవహరిస్తున్నాం. వీటికి పూర్తి భిన్నమైనది. కుటుంబ విషయాల్లో చమత్కారాలు... రహస్యాలను దగ్గరి వారికి తెలియజేసేందుకు ఈ 'గ' భాష వాడుకలో ఉంది.

వాక్య నిర్మాణం ఇలా...

ఉదాహరణకు రాజు పదాన్నే తీసుకుంటే రంగాజు అవుతుంది. మొదటి అక్షరం రా... రంగా అవుతుంది. ఎలా అంటే ర+ఆ=రా అయితే ర పక్కన 'ం' చేర్చి 'గ'కు రాలో ఉన్న దీర్ఘాన్ని జతపరుస్తారు. రెండో అక్షరం 'జు' ను యథాతథంగా చేర్చి రంగాజు అని పిలుస్తారు. అదే కీర్తి అనే పేరును తీసుకుంటే కింగీర్తి అవుతుంది. అదేలా గంటే మొదటి అక్షరం కీ కాస్తా కింగీ (కీలో గుడి దీర్ఘాన్ని 'గ'కు కలిపి దానికి మాత్రం గుడిని చేర్చుతారు.'ం' యథాతథం), రెండో అక్షరాన్ని యథాతథంగా జతపరుస్తారు

అదే రాగసముద్రం వంటి పెద్ద పదాల విషయానికి వస్తే 'రంగాగసముద్రం'... 'రంగాగసంగముద్రం..' అని మనకు వీలున్న విధంగా పదాలను మలచుకోవచ్చు.

ఒక్కసారి అర్థం చేసుకొని మాట్లాడేందుకు ప్రయత్నిస్తే ఉచ్చారణకు అనుకూలంగా పదాలు 'గ' భాషకు అనుకూలంగా వచ్చేస్తాయి. ఇంకెందుకు ఆలస్యం ఓసారి ప్రయత్నించండి. ఆ తర్వాత వరసయిన వాళ్లను ఆటపట్టించొచ్చు. ఇంకెందుకు ఆలస్యం ఓ పట్టుబట్టండి.

- **శ్రీనివాసరావు పొట్టి,** ఒంగోలు
80082 27099

సముద్రం

హోరున గాలి, కుండపోతగా వర్షం. మూడు రోజుల నుంచి ఇదే తీరు. ఆకాశం నల్లని మేఘాలతో భూమి మీదికి విరుచుకుపడింది. భూమి మీద అన్ని కాలుష్యాలనూ ప్రక్షాళన చేసే వరకు విశ్రమించకూడదని ఒట్టు పెట్టుకున్నట్టు వరుణుడు ప్రతాపం చూపిస్తున్నాడు. వాగులూ, వంకలూ, నదులూ గట్లు తెంచుకుని ఊళ్ల మీద పడ్డాయి. ఎక్కడ చూసినా విధ్వంసమే. కూలిన చెట్లు, తెగిన కరెంటు తీగలు, పగిలిన గాజుపెంకులు, కొట్టుకు పోయిన రోడ్లూ... ఊరంతా దారీ తెన్నూ లేని అడవిలా మారింది.

ఆ అడవి మధ్య నుంచి దారి చేసుకుంటూ నడిచి వస్తున్నాడు హరి. మనిషి పూర్తిగా తడిసిపోయి చలికి వణుకుతున్నాడు. నడక అలవాటు తప్పిపోవడంతో ఆయాస పడుతున్నాడు. వర్షంలో తడవడంతో తల దిమ్ముగా ఉంది. బురదలో నడవడం వల్ల పాదాలు చిరచిరలాడుతున్నాయి. అయినా ఈ ఇవేమీ అతని బుర్రకు చేరడం లేదు. అతని ఆలోచనల్లో కల్లోల సముద్రం ఎగసి పడుతోంది. "మల్లేష్‌కి ఏమీ కాకూడదు. అతను క్షేమంగా తిరిగి రావాలి" ప్రార్థనా పూర్వకంగా ఆకాశం వంక చూస్తూ అనుకున్నాడు హరి. తుపాను మొదలైన తర్వాత కొన్ని వందలసార్లు అతనీ మాట అనుకున్నాడు. అయితే అతని ప్రార్థనపై అతనికే నమ్మకం లేదు.

గుబగుబలాడే గుండెలతో హరి మరోసారి మల్లేష్‌ని, కల్లోల సముద్రాన్నీ గుర్తు చేసుకున్నాడు. మల్లేష్ వాళ్ల జట్టుతో కలిసి సముద్రం మీదకి వెళ్లిన రోజు అతనికి జ్ఞాపకం వచ్చింది. అదొక ప్రశాంతమైన రోజు. అలల హోరు కూడా లేని నట్టనడి సముద్రం. చిన్న మబ్బు జాడయినా లేని అనంతమైన నీలిరంగు ఆకాశం. ఈ రెండింటికీ మధ్య చిన్న మరపడవలో తను తోడుగా మరికొందరు మనుషులున్నా హరి ఏదో తెలియని నిగూఢమైన భయంతో వణికిపోయాడు. ఆ రోజున అతనికి మొట్టమొదటసారిగా అనిపించింది. తను తప్పుచేశానేమో అని. తిరిగి ఈ తుపాను రోజున అదే అపరాధ భావన అతన్ని కుంగదీస్తోంది.

ఉన్నట్టుండి హరి మనోఫలకం పైన తర్జని చూపిస్తూ కళ్లల్లో నిప్పులు కురిపిస్తూ, శాపనార్థాలు పెడుతూ అనంతవేణమ్మ ప్రత్యక్షమైంది. గంగ మల్లేష్‌ల పెళ్లి జరిగిన రోజు ఆవిడ తన మీద చేసిన వీరంగం గుర్తొచ్చింది. తన మీదకు ఉరికి చొక్కా పట్టుకుని గుంజుతూ, మోటుగా తిడుతూ ఆవిడన్న మాటలు ఇప్పటికీ హరి చెవిలో మార్మోగుతూనే ఉన్నాయి. "పెళ్లి చేయడమంటే అదేదో ఘనకార్య మనుకుంటున్నావేమో! పరాయోళ్ల పిల్లలకీ, ఆళ్ల పెద్దోళ్లకీ తెలీకుండా ముడెట్టేసి నువ్వేదో వీరేశలింగంలా గొప్పోడివై పోదామనుకుంటున్నావా? మంచి సంబంధం తీసుకొస్తాను, చెల్లి పెళ్లి చేత్తానూ అన్నావు. ఇదేనా గొప్ప సంబంధం? నీ సొంత చెల్లి అయితే ఇలాగే చేద్దువా? ఉన్నారు కదా, ఊళ్లో ఇద్దరు చెల్లెళ్లు ఈడి తోటోళ్లు ఎవరో ఒకర్ని తీసుకొచ్చి నీ చెల్లెల్నియ్యి చూద్దాం. ఆళ్లకి మాత్రం పై చదువులు కావాలి. ఐక్లాసు మొగుళ్లు రావాలి. ఇదిగో దీని లాంటోళ్లు మాత్రం అన్నాయమయిపోవాలి. ఒరేయ్ హరీ! రేపు ఈడికేదయినా జరిగి దాని బతుకు బండలైపోతే నీదే బాధ్యత గుర్తుంచుకో" అని ఏడుస్తూ వెళ్లిపోయింది.

అవును దీనికంతటికీ నేనే బాధ్యుణ్ణి. దిగులుగా తనలో తనే ముడుచుకుపోతూ అనుకున్నాడు హరి. వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. హరి ఆలోచిస్తూ నడుస్తున్నాడు, పరిసరాల స్పృహ లేకుండా. ఎవరో ఒక పెద్దాయన అతడిని దాటి వెళ్లిపోబోతూ ఆగి "బాబూ! ఎదర పెద్ద చెట్టు ఇరిగి పడిపోయింది. కరెంటు తీగలు తెగిపోయి ఏలాడుతున్నాయి. కొంచెం చూసుకుని ఎల్లు నాయనా" అని చెప్పి వెళ్లిపోయాడు. తానెవరో తెలియకపోయినా, దానివల్ల అతనికి పైసా కలిసొచ్చేది లేకపోయినా ఆ ముసలాయన చూపిన శ్రద్ధకి అతను కదిలిపోయాడు. ఈ మాత్రం మాటసాయం కూడా లేకుండా నట్టనడి సముద్రంలో చిక్కుకుపోయిన మల్లేష్ మళ్లీ గుర్తొచ్చాడు హరికి. ఎవరు చెబుతారు అతనికి "బాబూ! ముందు పెద్ద పెద్ద సుడిగుండాలున్నాయనీ, నోరు తెరచి మింగేసే లోతయిన అగాధాలున్నాయనీను. అసలింత పెద్ద తుపానును తట్టుకుని మల్లేష్ ప్రాణాలతో ఉండి ఉంటాడా? మూడు రోజుల నుంచీ గుండె మూలల్లోనే అణచేస్తున్న ప్రశ్న మళ్లీ మళ్లీ కొత్త బలంతో పుట్టుకొస్తోంది. "ఈడికేదయినా జరిగితే నీదే బాధ్యత"... అనంతవేణమ్మ ఆక్రోశం మనసు లోతుల్లో ప్రతిధ్వనిస్తోంది.

ఇల్లు దగ్గరవుతున్న కొద్దీ హరి నడక భారమవుతోంది. ఆశగా ప్రశ్నించే గంగ చూపులకు తానేం బదులు చెప్పగలడు? మల్లేష్ ఇంకా జాడ తెలియని జాలర్ల జాబితాలోనే ఉన్నాడనా? గాలింపు చర్యలకు వాతావరణం అనుకూలంగా లేదనా? ప్రత్యేక సహాయక బృందాలు పెదవి విరిచాయనా? మంత్రులూ, రాజకీయ నాయకులూ సానుభూతి ప్రకటనలు సిద్ధం చేసుకుంటున్నారనా? జవాబు దొరకని ప్రశ్నలతో హరి మనసు గజిబిజిగా తయారైంది. విరిగిపడిన నిద్రగన్నేరు చెట్టు కొమ్మల మధ్య దారి చేసుకుంటూ తమ వీధి మలుపు తిరిగాడు అతను.

"హరీ! ఏమైనా తెలిసిందా?" గబగబా గేట్ దగ్గరకు వచ్చి ఆత్రుతగా అడిగాడు విశ్వనాథ్. మౌనమే అతనికి సమాధానమైంది. కాసేపటికి ముందే మీ ఇంటికి వెళ్లి వచ్చాను. నువ్వు ఉదయాన్నే లేచి సమాచారం కోసం కంట్రోల్ రూమ్‌కి వెళ్లావని చెప్పింది సుజాత. నిన్న సాయంత్రం మనం వచ్చేశాక ఊళ్లో



వాళ్లంతా వచ్చి కంట్రోల్ రూం ఇంఛార్జిని కొట్టారట కదా. సరైన సమాచారం ఇవ్వడం లేదని. వాళ్లు మాత్రం ఏం చేయగలరు? వాళ్లేమైనా దేవుళ్లా? కరెంటు లేదు. ఫోన్లు పనిచేయడం లేదు. రేడియో ఆపరేటర్లు సరిపడా లేరు. చివరికి హెలికాప్టర్లయినా సముద్రం మీదికి పోలేని పరిస్థితి. ఈ సమయంలో ఎవరు మాత్రం ఏం చేయగలరు? అయినా, ఎవరి జీవితానికి ఎవరు బాధ్యులు. మనం మల్లేష్‌కి ఎన్నిసార్లు చెప్పలేదు. కనీస జాగ్రత్తలు తీసుకో, వాతావరణ సూచనలు పాటించు అని ఎప్పుడైనా విన్నాడా? ఇప్పుడిలా ప్రాణం మీదికి తెచ్చుకున్నాడు"... చెప్పుకుపోతున్నాడు విశ్వనాథ్. ఇంకెప్పుడైనా అయితే హరి విశ్వనాథ్‌తో వాదనకు దిగేవాడే. కాని ప్రస్తుత సమస్య చర్చలూ, వాదనల స్థాయి దాటిపోయిందని అతనికనిపించి వెళ్తానన్నట్టు మౌనంగా తలూపి బయలుదేరాడు.

"అన్నట్టు హరీ! అసలు విషయం మర్చిపోయాను గంగ వాళ్లమ్మగారు, అదే, అనంతవేణమ్మ వచ్చారు. మీ ఇల్లు తెలియక వెతుక్కుంటుంటే బాబిగాణ్నిచ్చి పంపించా. పెద్దావిడ, ఆవిడేదో కోపంలో రెండు మాటలన్నా పట్టించుకోకు, ఆవిడ సంగతి నీకు తెలియందేం కాదు. ఎంతయినా ఆడపిల్ల తల్లి..." విశ్వనాథ్ ఇంకా ఏదో చెప్పబోతూ హరి గిరుక్కున తిరగడంతో ఆగిపోయాడు. ఆవిడొచ్చిన విషయం తెలియగానే హరి మొహం జీవం లేనట్టు తెల్లగా పాలిపోయింది. తూలుతున్న అడుగులతో గేట్ తీసుకుని లోపలికి వచ్చి అక్కడే ఉన్న కుర్చీలో నీరసంగా కూర్చుండి పోయాడు. "హరీ! ఏమైంది కళ్లు తిరుగుతున్నాయా? అసలు పొద్దున్నుంచీ కాఫీ అయినా తాగావా? కంగారుగా అడుగుతూ మంచినీళ్లు తెచ్చి ఇచ్చాడు విశ్వనాథ్. పది నిమిషాల తర్వాత అతడిచ్చిన కాఫీ తాగి కొంచెం తేరుకుని "ఈ పరిస్థితుల్లో ఆవిడకు నా మొహం ఎలా చూపించను విశ్వా" బేలగా అడిగాడు హరి.

"ఇలా జరుగుతుందని కలగన్నామా! మీరు బాగుంటారనే ఉద్దేశంతో ఎలాగైతే ఆవిడ దగ్గరుండి మీ పెళ్లి జరిపించిందో అలాగే మనం కూడా మంచి మనసుతోనే గంగా మల్లేష్‌ల పెళ్లి చేశాం. అదీ గంగ నిద్రమాత్రలు మింగేస్తేనూ. అయినా విధిరాతను ఎవరు తప్పించగలరు? వాళ్ల కుటుంబంలో ఒకరి తరువాత ఒకరికి ఇలా జరగడం ఏదైనా శాపమేమో ఎవరికి తెలుసు?" విశ్వనాథ్ మాటలు అంత బాధలోనూ హరికి నవ్వు తెప్పించాయి. విధిరాత, శాపం అంటూ విశ్వనాథ్ వేదాంత ధోరణిలో మాట్లాడటం, తను మాటిమాటికీ ఆకాశం వంక చూస్తూ మొక్కుకోవడం తమ స్వభావాలకు పూర్తిగా విరుద్ధం. చూడబోతే ఈ తుపాను తమ విలువలను నమ్మకాలను సమూలంగా మార్చడానికే వచ్చినట్టుంది. అనుకున్నాడు హరి. అయినా, విశ్వనాథ్ తాము చేసిన పనిని ఏదో విధంగా సమర్థించుకోవడానికి ఇలా మాట్లాడుతున్నాడే కాని, ఏదో ఒక రోజు ఈ పరిస్థితి వస్తుందని అనంతవేణమ్మ ఆనాడే చెప్పింది. చందమామ కథల్లో సిద్ధుడు మాయాదర్పణంలో భవిష్యత్‌ను చూపించినట్టు ఈ తుపాను విలయతాండవాన్ని ఆవిడ గంగ, మల్లేష్‌ల పెళ్లికి ముందే ఈ మిత్రుల కళ్లకు కట్టినట్టుగా ఆవిష్కరించింది.

గంగా మల్లేష్‌ల పెళ్లికి కొన్ని రోజుల ముందు ఆ విషయం మాట్లాడటానికి విశ్వనాథ్, జయ, వెంకటలక్ష్మి, నాగబాబు, అనంతవేణమ్మను కలిశారు. అప్పటికే ఈ పెళ్లి గురించి రెండు మూడుసార్లు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆవిడతో మాట్లాడి కాదనిపించుకోవడంతో హరి, సుజాత దీనికి దూరంగా ఉండిపోయారు. అయితే ఈ పెళ్లికి తానెందుకు అభ్యంతరం చెబుతుందో వాళ్లకి కూడా తెలియాలి అన్నట్టు ప్రత్యేకంగా వారికి కబురుపెట్టి పిలిపించి ఈ భేటీలో కూర్చోబెట్టారావిడ. ఒక్కటి కూడా పొల్లుపోకుండా ఆ రోజు ఆవిడన్న మాటలన్నీ హరి మరోసారి గుర్తు చేసుకున్నాడు.

"బాగుందయ్యా నేను కాదంటానని మీకు తెలుసు. పైగా ఎందుకు

కాదంటున్నానో కూడా మీకు తెలుసు. తెలిసి కూడా మీరంతా వచ్చి ఈ పెళ్లి విషయం కదలేశారంటే నాతో తాడోపేడో తేల్చుకుందామనే వచ్చారన్న మాట. సరే అది తేల్చుకునే ముందు నేనో సబబు మాట అడుగుతాను చెప్పండి. తన కూతురు నారచీరలు కట్టుకుని రాముడితో పాటు వనవాసానికి వెళ్తుందని, అక్కడ రావణుడికి చిక్కి నానాబాధలు పడుతుందని, శీలాన్ని నిరూపించుకోవడానికి అగ్గిలో దూకాల్సి వస్తుందని, ఇంత చేసినా చివరికి అడవుల పాలవుతుందని జనకుడికి ముందే తెలిసుంటే సీతారాముల కల్యాణం జరిగేదా? ఏమో జనకుడైతే ఏం చేసి ఉండేవాడో కాని, నేను ఆ స్థానంలో ఉంటే మాత్రం విశ్వామిత్రులకు, రామలక్ష్మణుల వారికి ఓ నమస్కారం పెట్టి ఇక దయచేయండి స్వామీ, నా కూతురి బతుకులో నిప్పులు మాయదారి తుపాను నా పసుపుకుంకాల్ని తీసుకుపోయింది. ఎలాంటి చావంటే అది, అయిదేళ్లు కాపురం చేసిన నేనే ఆయన్ని గుర్తుపట్టలేకపోయాను. ఏసుకున్న గుడ్డలూ, ఒంటి మీదున్న రచ్చరేకులూ చూసి పోల్చుకోవలసి వచ్చింది. అప్పటికీ ఏదో ఆశ ఆయన కాదేమో అని. ఆ మాట పైకి చెబితే వచ్చే డబ్బులు కూడా రావని భయం. తలచుకుంటే ప్రాణం నీరైపోతుంది. ఇక నా బాధల సంగతి చెప్పక్కర్లేదు. తినడానికి తిండిలేక, ఉండటానికి సరైన ఇల్లు లేక, అవసరానికి నిలబడే మనుషుల్లేక నేను పడ్డ కష్టాలు కుక్కలు కూడా పడవు. దీన్ని చదివించడానికి బుట్ట నెత్తి మీద పెట్టుకుని ఇల్లిల్లూ తిరిగి చేపలమ్మాను. లంకల్లో సారా కాశాను. చివరికి ఇదిగో ఆ ఆయిలు కంపెనీ వోళ్ల దయ వల్ల ఈ మెస్ పెట్టుకుని ఏదో ఇలా గట్టెక్కాం. ఇప్పుడైనా

మాట్లాడితే ఎంత 'లాభమో'!

మాతృభాషలో మాట్లాడే వాళ్లకు రాయితీలు... దుకాణాల్లో, వాణిజ్య సముదాయాల్లో, భోజనశాలల్లో, ఆఖరికి ఆస్పత్రుల్లో కూడా. రెండేళ్ల నుంచి తైవాన్‌లో ఈ పద్ధతి అమలవుతోంది. అక్కడి స్థానిక భాషలను కాపాడుకోవడానికి 'తైవాన్ మదర్ టంగ్ అలయెన్స్' చేస్తున్న ప్రయత్నాల్లో భాగమిది. తైవాన్‌లో ఆది నుంచి జపనీస్, చైనీస్ భాషల ప్రభావం ఎక్కువ. ఆ రెండు దేశాల రాజకీయ ఆధిపత్యంలో నలిగిపోయిన తైవాన్‌లో స్థానిక భాషలు (హొక్లో, హక్కా..) తీవ్ర అణచివేతకు గురయ్యాయి. విద్యా వ్యవస్థ నుంచి పరిపాలన వరకూ ఎక్కడా వాటికి కనీస ప్రాతినిధ్యం లేదు. పది పన్నెండేళ్ల కిందటి వరకూ ఇదే పరిస్థితి. దాంతో మాతృభాషల్లో మాట్లాడే వారు కూడా తక్కువైపోయారు. ఈ పరిస్థితిలో మార్పు తేవాలనుకున్న భాషాభిమానులు, సంస్థలు కలిసి ఒకే సంఘంగా ఏర్పడ్డారు. వివిధ ప్రచార, ప్రోత్సాహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పోయ్యొద్దు అని చెప్పి ఉండేదాన్ని. ఇప్పుడూ మీకదే చెబుతున్నాను.

జీవితంలో ఎలాంటి బాధనైనా భరించవచ్చు కాని సముద్రం మీదికెళ్లిన మొగుడు ఎప్పుడొస్తాడో, అసలు వస్తాడో రాడో తెలీక పడే బాధ నారాయణ స్వామీ! అటువంటి బాధ పగోళ్లకి కూడా రాకూడదు. చెబితే తెలిసే బాధ కాదమ్మా అది. నేను స్వయంగా అనుభవించాను కాబట్టి నాకు తెలుసు. మా పెళ్లైన ఐదేళ్లలోనే నేను రెండు భయంకరమైన తుపానులు చూశాను. మొదటిసారి వలలు తెగిపోవడం, బోటు దెబ్బతినడం ఇలాంటి చిన్న చిన్న వాటితోనే ఎలాగో గడిచింది. రెండోసారి ఆ నీడ పట్టున కూచ్చుని రెండు ముద్దలు తిని రామా, కృష్ణా అనుకుందాంరా నాయనా అనుకుంటుంటే ఈ సమస్య తెచ్చిపెట్టింది. పోనీ తెలీని పిల్లా అంటే అన్నీ తెలుసు. విషయం తెలిసిన్నాటి నుంచీ నాతోపాటు ఎన్నో బాధలు భరాయించింది. దీని గాచ్చారం కాకపోతే అన్నీ తెలిసి కూడా ఆడిని చేసుకుని మళ్లీ ఆ నట్టేట్లోకే ఎందుకు పోతానంటాది!

సరే, ఇంత వరకూ వచ్చాక ఏం అనుకుని ఏం లాభం నా మర్యాద నిలబెట్టుకోవడానికి చివరి అవకాశం ఇద్దామని మీరిలా వచ్చారని నాకు తెలుసు. మీ గౌరవం కాపాడుకోవడానికి నేనూ ఓ అవకాశం ఇస్తాను. వాళ్ల పెళ్లి నేనే చేస్తాను. బేండుమేళం, బంతి భోజనాలు, పెళ్లి ఖర్చులూ అన్నీ నేనే పెట్టుకుంటాను. కానీ ఒక్క షరతు. ఈ రోజు నుంచి మల్లేష్ వల, బోటు, సముద్రం అన్నీ వదిలెయ్యాలి. దీని పెళ్లి కోసం నేను దాచిన డబ్బు ఓ ఎనభై వేలు దాకా ఉంటాది. దానికి సాయం ఏ మాత్రమో బంగారం ఉంది. దాన్ని పెట్టుకుని ఇక్కడే ఏ కిళ్లీకొట్టో పెట్టుకోవచ్చు. మీరు దానికి సరేనంటే నేను బేపనాయనతో మాట్లాడతాను."

సరిగ్గా ఈ భేటీ ముగిసిన వారం రోజులకి మావిడాడ వేంకటేశ్వరస్వామి గుళ్లో గంగా మల్లేష్‌ల పెళ్లి జరిగిపోయింది. వాళ్ల నాన్న పేరు మీదున్న సొసైటీ బాకీలు తీర్చడానికే నాలుగు సంవత్సరాలు పడుతుందని అంతవరకూ ఎవరికి ఇష్టం ఉన్నా లేకపోయినా సముద్రం మీద వేట తప్పదని మల్లేష్ తేల్చేయడం, ఎటూ తేల్చుకోలేక గంగ ఆత్మహత్యకు ప్రయత్నించడం, వాడితో పెళ్లి కంటే అది చావడమే మేలు అని అనంతవేణమ్మ భీష్మించుకుని కూర్చోవడం లాంటి పరిణామాలన్నీ అందుకు దారితీశాయి. అటు అనంతవేణమ్మ పట్ల కృతజ్ఞత, ఇటు మల్లేష్‌తో స్నేహం ఈ నేపథ్యంలో పెళ్లి విషయంలో ఎలా వ్యవహరించాలనేది ఆలోచించి నిర్ణయం తీసుకోవడానికి కూడా హరి, సుజాతలకు వీలు చిక్కలేదు. అప్పటికీ సుజాత అంటూనే ఉంది. "చివరిగా ఒక్కసారి అత్తయ్యతో మాట్లాడదాం హరి. ఆవిడ సరే అనకుండా మనం ఇందులో జోక్యం చేసుకోవద్దు. అసలు, తనకిష్టం లేకుండా గంగ పెళ్లి చేసుకుందనే బాధకంటే ఆ పెళ్లి మనం జరిపించడమే ఆవిడను బాగా గాయపరుస్తుంది." అని కానీ ఏం చేయాలి? ఎలా చేయాలి? అని ఆలోచించేలోపే జరగాల్సింది జరిగిపోయింది.

పరిస్థితులు చేయి దాటిపోయినప్పుడు చాలామంది తమను తాము ఊరడించుకునేందుకు 'అలా జరగాలని రాసిపెట్టి ఉంది. మనమేం చేయగలం' తరహా పలాయనవాదాన్ని ఆశ్రయిస్తారు. హరి బుద్ధి మాత్రం అందుకు అంగీకరించడం లేదు. కానీ ఒక కోణంలో ఆలోచిస్తే క్రమపద్ధతిలో

ఒకదాని తరువాత ఒకటి జరిగిన సంఘటనలన్నీ ఈనాటి పరిస్థితికి దారి తీశాయని, ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇదంతా ముందే రాసిపెట్టి ఉందని హరికి స్ఫురించి తుళ్లిపడ్డాడు. కొన్ని సంవత్సరాల క్రితం విశ్వనాథ్, తనూ కలసి రిలయన్స్ ఆయిల్ ప్లాంట్ నిర్మాణం కోసం కింది స్థాయి ఉద్యోగులుగా ఆ మారుమూల బెస్తపల్లెలో అడుగుపెట్టడం ఈ సంఘటనల క్రమంలో మొదటిదని అతనికనిపించింది. ఆ పల్లెలో హైస్కూల్ చదువు దాటిన ఒకే ఒక్కడు మల్లేష్‌తో పరిచయం, తమ వసతి భోజనాల కోసం అతను వాళ్ల దూరపు బంధువైన అనంతవేణమ్మ దగ్గరకు తీసుకెళ్లడం, అనంతవేణమ్మ కుటుంబంతో అనుబంధం, తన ప్రేమ కోసం సుజాత ఉన్నపళంగా ఇల్లు వదిలి వచ్చేయడం, తమ పెళ్లికి అనంతవేణమ్మ తోడ్పాటు, అక్కడే ఒక చిన్న గదిలో సుజాతతో సహజీవనం, ఈ నేపథ్యంలో మల్లేష్ గంగల మధ్య పెరిగిన సాన్నిహిత్యం ఇవన్నీ హరి మనోఫలకం మీద కదలాడాయి. జ్ఞాపకాలతో మనసు బరువెక్కింది. నెమ్మదిగా విశ్వ వాళ్లింటి నుంచి బయటకొచ్చాడు. తన ఇంటి వైపు అడుగులు వేశాడు. మరికాసేపట్లో ఇల్లు చేరతాడనగా అనంతవేణమ్మ తమ ఇంటి గేటు తీసుకొని వడివడిగా నడుచుకుంటూ వెళ్లిపోవడం అతనికి కనిపించింది. బహుశా నేను ఎదురుపడటం ఇష్టంలేకే వెళ్లిపోతోంది కాబోలు అనుకొని గాఢంగా నిట్టూర్చాడు.

మల్లేష్ ఆచూకి గురించి గంగను ఏ విధంగా సముదాయించాలా అని మదన పడుతూ ఇంటిని చేరాడు హరి. మొహంలో బాధ కనపడకూడదు. గొంతులో నిరాశ ధ్వనించకూడదు అని తనను తనే హెచ్చరించుకుంటూ గడిచిన రెండు రోజులుగా గంగతో పాటు ఆమె దుఃఖానికీ, కన్నీళ్లకూ ఆశ్రయమిచ్చిన ఆ చిన్నగదిలోకి అడుగుపెట్టాడు హరి. ఆకృతి దాల్చిన ప్రశ్నార్థకంలా ముడుచుకొని బాధపడుతోందా అనేది అతను తేల్చుకోలేకపోయాడు. ఏది ఏమైనప్పటికీ తనకు తానుగా ఆమెను కదిలించి ఆమె ప్రశ్నలను, దుఃఖాన్నీ సమాధానపరిచే శక్తి తనకు లేదనిపించి హరి నిశ్శబ్దంగా వెనుదిరిగాడు.

కాస్త ఎంగిలిపడి సేదతీరిన తరువాత సుజాత "వేణత్తమ్మ వచ్చి వెళ్లింది హరీ. ఎంత నిబ్బరంగా ఉందో తెలుసా ఆవిడ? గంగకు తల దువ్వి జడవేసింది. దగ్గరుండి అన్నం తినిపించింది. తను చూసిన తుపాన్లతో పోలిస్తే ఇదొక లెక్కకాదు. అన్నట్టు మాట్లాడింది. చాలా ధైర్యంగా అనిపించింది ఆవిడ రావడం. మంచికైనా, చెడుకైనా ఇంట్లో పెద్దవాళ్లు ఉండాలంటారు అందుకే కాబోలు, మల్లేష్ రాలేదనే వార్తతో గంగ ఇల్లు చేరిన రోజు నుంచీ ఎంత గుండె కోత అనుభవిస్తున్నామో చెప్పాను. అది చెబుతున్నప్పుడు మాత్రం ఆపుకోలేక ఏడ్చేశాను. నాకే తెలీదు నా మనసులో అంత ఆందోళన గూడుకట్టుకుందని. రేపు మల్లేష్ వాళ్ల వాడకట్టు అంతా కలిసి నీలాలమ్మ గుడి దగ్గర చల్ల ఘటానికి శాంతి పూజలు చేస్తున్నారట, అందరూ క్షేమంగా తిరిగి రావాలని గంగను తీసుకుని అక్కడకు రమ్మని చెప్పి వెళ్లిపోయింది" అంది.

చీకటి, వర్షమూ పెనవేసుకున్న ఆ రాత్రి జవాబు దొరకని ప్రశ్నలతో, అంతూ దరీలేని నిరాశతో పెనుగులాడుతున్నాడు హరి. ఆ సాయంత్రం ఎదురైన ఒక ఘటన సృష్టించిన విస్ఫోటనం తాలూకు ప్రకంపనలవి. ఆ సాయంత్రం విశ్వనాథ్ కంగారుగా వచ్చి హరీ! ఓ సారి కలెక్టరేట్‌కి వెళ్లొద్దాం రా అంటూ పిలిచాడు. అతని కవళికల్లో ఏదో ప్రమాద సూచన స్ఫురించడంతో భయంతో వణికిపోతూ అతని వెంట నడిచాడు హరి.

కలెక్టరేట్‌కి అక్కడి నుంచి గవర్నమెంట్ ఆసుపత్రి మార్చురీకి తీసుకెళ్లాడు విశ్వనాథ్. నీళ్లల్లో నాని, ఉబ్బిపోయి జలచరాలు దాడి చేయడంతో ఛిద్రమైన ఆరు శిథిల దేహాలు చిందరవందరగా పడి ఉన్నాయక్కడ. మొదట చూసినప్పుడు ఆ ఆరు మృతదేహాల్లో కూడా మల్లేష్ పోలికలు కన్పించినట్లన్పించి హరి నిలువునా కరిగి నీరైపోయాడు. ఆ తరువాత విశ్వనాథ్ ఆసరాతో గుండె చిక్కబెట్టుకుని ఒక్కొక్క శిథిల దేహాన్ని చూసి మల్లేష్‌ది కాదని నిర్ధరించుకొని ఊపిరి పీల్చుకున్నాడు హరి ఎక్కడో ఒక అజ్ఞాత తీరంలో మల్లేష్ పోలికలతో ఉన్న ఒక శిథిల దేహం 'నన్ను గుర్తించు హరీ' అని పిలుస్తున్నట్టే అనిపించింది ఆ రాత్రంతా.

తెల్లవారింది. ముందు రోజు అనుకున్న దానికి భిన్నంగా నీలాలమ్మ గుడిని వెతుక్కుంటూ బయలుదేరాడు హరి. అతను వెళ్లేసరికి అక్కడ పూజలు పూర్తయ్యాయి. చల్ల ఘటాన్ని అభిషేకించిన పసుపు, కుంకాలను సముద్రంలో కలుపుతోంది గంగ. అంతకు ముందు ఆమె పూజ చేసిన చోట వెలిగించిన దీపాలు గాలికి రెపరెపలాడు తున్నాయి. వాటిని చూస్తుంటే మల్లేష్ గుర్తుకొచ్చాడు హరికి. ఆ వెంటే రాత్రంతా కలవరపరిచిన శిథిల దేహం జ్ఞాపకాలు. అతని మనస్సులో చెలరేగుతున్న అలజడికి నేపథ్య సంగీతంలా ఎదురుగా సముద్రపు ఘోష. ఇన్నేళ్లుగా పనిపాటల పేరుతోనో, విందు వినోదాల పేరుతోనో హరి చాలా సమయం సముద్రం ముంగిట గడిపాడు. కానీ అప్పుడెప్పుడూ తలెత్తని ప్రశ్నలెన్నో అతని మనస్సులో పుట్టుకొస్తున్నాయి. ఈ సముద్రపు ఘోష మనుషులకు ఏం చెప్పాలనుకుంటోంది? ఎగిసిపడి తీరానికి తలబాదుకునే ఆ కెరటాలు మానవాళికి అందించే సందేశం ఏమిటీ? తనకు తానే ప్రశ్నించుకున్నాడు హరి. ఆ క్షణం చావు, పుట్టుకల రహస్యాన్ని తనలో దాచుకున్న ప్రకృతి విరాట్ స్వరూపంలా సముద్రం అతనికి గోచరించింది. ఆ విరాట్ స్వరూపం ముందు అణుకువగా చేతులు జోడించి నిలబడ్డాడు.

సత్యయుగం నుంచి ఇప్పటి వరకూ ఎందరో దేవతలు, మనుషులు, రాక్షసులూ సముద్రం ముందు ఇలాగే అర్థిస్తూ నిలుచున్నారు. వారిలో కొందరికి అమృతం దొరికితే మరికొందరికి హాలాహలం లభించింది. కొందరికి విలువైన రత్నాలు లభిస్తే మరికొందరికి కేవలం గులకరాళ్లే దొరికాయి. మరి ఈ విరాట్ స్వరూపిణి హరికి ఏం ప్రసాదించబోతుంది? చావా? బతుకా? ఈ రెంటికీ అతీతమైన జితేంద్రియత్వమా???

అది కాలమే నిర్ణయించాలి.



హేమాచల శ్రీరమణ ప్రసాద్
కామరాజుపేట, తూర్పుగోదావరి.
94907 86388

కవులకది త్రివేణి సంగమం

నెట్ సంచారం

నువ్వొక పచ్చని చెట్టయితే
పిట్టలు వాటంతట అవే వచ్చి వాలేను...!

యాకూబ్

కవి కలం..
కన్నీళ్లకు ధైర్యాన్నిస్తుంది...
చెదిరిన మనస్సుకు సాంత్వన కలిగిస్తుంది.
విప్పారే ఊహకు రెక్కలనిస్తుంది...
కొత్త సృష్టిని స్వప్నిస్తుంది.
బతుకు భయాన్ని పోగొడుతుంది...
ఆశల సౌధానికి సొంతదారును చేస్తుంది.

ఇలాంటి కలాలను, వాటిని కదిలించే కవులను కలుసుకోవాలంటే 'కవి సంగమా'నికి వెళ్లాలి. ఫేస్‌బుక్ వేదికగా వారు చేసే అక్షరపూజలో భాగస్వాములవ్వాలి.

అనకాపల్లి కుర్రాడో కవిత రాస్తాడు. అమెరికా అబ్బాయి స్పందిస్తాడు. విశాఖ వనిత ఓ అక్షర శరం సంధిస్తుంది. భాగ్యనగరపు ఆడపడుచు దానికి మరింత పదును పెడుతుంది. సరిహద్దుల్లేని కవి సంగమమది. గట్టుకు కట్టుబడకుండా సాగే కవితా ప్రవాహమది. అదే... ఫేస్‌బుక్ 'కవి సంగమం'. తెలుగు కవిత్వమంటే ఇష్టపడే వాళ్లు, అభిమానించే వాళ్లు, పిచ్చిగా ప్రేమించే వాళ్లకది త్రివేణి సంగమం.

అంతర్జాల ప్రపంచంలో ఫేస్‌బుక్ సంచలనం గురించి తెలియని వారుండరు. సరదా సందేశాలకే కాదు సామాజిక రుగ్మతలపై గళమెత్తే చైతన్యానికీ అది వేదిక. ఈజిప్టులో విప్లవాగ్నులు రగిల్చినా, ఢిల్లీ 'నిర్భయ' కోసం యువతరాన్ని కదిలించినా దానికే చెల్లింది. అలాంటి స్వేచ్ఛా గళ ప్రపంచంలో తమదైన కవనాన్ని గానం చేస్తున్నారు వందల మంది తెలుగు వారు. 'కవి సంగమం' పేరిట ఒక బృందంలా ఏర్పడి (ఫేస్‌బుక్ గ్రూప్) కవితా సేద్యం సాగిస్తున్నారు.

నా మాటలు సాటువుల సందళ్లు
సామెతల సందిళ్లు
నా పాటలు సెమట పూల పందిళ్లు
చలిమంటల కుందిళ్లు
....
మట్టి గుండెచప్పుడు నా భాష
మర్మమెరగని మోటుదనం నా యాస
యాస నా నేల శ్వాస
....

ఉత్తరాంధ్ర మట్టిబిడ్డ గంటేడ గౌరునాయుడు అక్షరాల్లోని మట్టివాసనలు మదిని పులకరింపజేస్తాయి.

చెమ్మెక్కిన సిరా చుక్క
సంద్రమై పొంగగలదు. సరిహద్దులు దాటగలదు
.....
పదునెక్కిన సిరా చుక్క
కొడవలై మెరవగలదు. కుతంత్రాన్ని కోయగలదు.
......

నాలుగు చుక్కలు నువ్వు కూడా చిందించు అంటూ కిరణ్ గాలి రాసిన ఈ అక్షరాల్లో ఆవేశం అనంతం.

కొన్ని పసి బంధాలు
అమ్మానాన్నలను ఫొటోలలో చూస్తూ
తప్పక పంచుతున్న బంధువుల ప్రేమలో
మాటలకో చేతలకో గాయాలైతే
కన్నీళ్లతో కడుక్కొంటూ సర్దుకుంటున్నాయి
......

గద్వాల వాసి చాంద్ ఉస్మాన్ మాటల్లోని ఆవేదనను అర్థం చేసుకున్న వారు విధివంచితులైన అనాథ పిల్లలను

అపూరూపంగా చూసుకోరూ!

ఇవన్నీ కూడా కవి సంగమంలో పురుడుపోసుకున్న కవితలే. ఇంతటి బరువైన అక్షరాల కూర్పులే కాదు మనసులను చక్కిలిగిలి పెట్టే చక్కటి పదాలూ ఈ ఫేస్‌బుక్ 'గోడ'పై కనిపిస్తాయి.

కవి సంగమం వేదికగా రాతలో కొత్త ప్రయోగాలూ జరుగుతుంటాయి. ఖమ్మానికి చెందిన శ్రీనివాసు గద్దపాటి సృజించిన ఈ హైకూను చూడండి. గిరిజనుల వెతలను నాలుగు మాటల్లో ప్రభావవంతంగా చెప్పారాయన.

పొమ్మనలేక
పొగబెడుతున్నారు
పాపం కొండోడు!

అలాగే, సుదర్శన్ 'సుప్రెక్కలు' కూడా అల్ప పదాల్లో అనల్పార్థ రచనకు ఉదాహరణగా ఉంటాయి.

ఆడపిల్లను పుట్టనివ్వండి...
రాయిని ఆడది చేసే రాముడెవడూ
లేడు...!

కవిత్వానికి యువత దూరమవుతోందని, సాహితీ వేదికలపై 20 - 30 ఏళ్ల మధ్యలోని వారెవరూ కనిపించట్లేదన్న అపవాదును తొలగించేందుకు కవి యాకూబ్ మదిలో మెదిలిన ఆలోచన నుంచే 'కవి సంగమం' పుట్టింది. కిందటేడాది ఫిబ్రవరి 9వ తేదీన ప్రారంభించిన ఈ ఫేస్‌బుక్ బృందంలో ఇప్పుడు 1200 మందికి పైగా సభ్యులున్నారు. ఆర్థికంగా ఏమాత్రం స్థిరపడని యువతరానికి పుస్తక ప్రచురణ చాలా భారమైన విషయం. అందుకే ఫేస్‌బుక్‌లోని 'తక్షణ ప్రచురణ' సదుపాయంపై దృష్టి పెట్టి ఈ బృందం ప్రారంభమైంది. కవులను, కవిత్వాన్నీ ఒక దగ్గరకు చేర్చే ప్రయత్నం కాబట్టి దీనికి 'కవి సంగమం' అని నామకరణం చేశారు. భిన్న వాదాలుండవచ్చు, విభిన్న భావజాలాలు ఉండవచ్చు కానీ దానిని వ్యక్తీకరించేటప్పుడు మాత్రం కవిత్వపు వాసన ఉండాలి. వ్యక్తీకరణలో ప్రత్యేకతను అలవరచుకోవాలి అనే ఆశయాన్ని చెప్పేందుకు 'కవిత్వం కావాలి కవిత్వం' అనే ఏక వాక్య ఎజెండాని ఉపశీర్షికగా ఎన్నుకున్నారు.

అంతర్జాల గ్రూపుల్లో కవిత్వం అంటే తోచింది రాసేస్తారు, శ్రద్ధగా రాయరు అనేవి అపవాదులు. ఈ రోజు ఇక్కడ రాసిన వారు రేపెక్కడ రాస్తారో అన్న సందిగ్ధాలు. రాస్తున్న వారి ధోరణుల్లో ఏ ఇద్దరి పాఠశాల ఒకటి కాకపోవడం లాంటి ఇబ్బందులు. అయినా... త్వరత్వరగా పాఠకులకు అందుబాటులోకి రావడమనే సానుకూల అంశాన్ని సాధనంగా మలచుకుని 'కవి సంగమం' దినదిన ప్రవర్ధమాన మవుతోంది. యునికోడ్ తెలుగు అక్షరాల్లోకి కవిత్వాన్ని ఒద్దికగా ఒంపేసి 'కవి సంగమం' బృందానికి వడ్డించే ఔత్సాహిక కవులకు... 'రుచి'ని వెంటనే చెప్పేసే మిత్రులు కోకొల్లలు. ఎక్కడో ఖమ్మం నుంచి ఒక కవిత పోస్టు అయితే దానికి బ్రూనే నుంచి ఓ లైక్ వచ్చేస్తుంది. వైజాగ్ నుంచి వ్యాఖ్య వస్తుంది. వ్యాఖ్యలపై ప్రతివ్యాఖ్యలు వస్తాయి. ఇదంతా కళ్లముందే కొన్ని నిమిషాల వ్యవధిలోనే. కవికి/ రచయితకు స్నాతకోత్తర సన్మానం చేయించుకున్న సంతృప్తి కలుగుతుంది. అదే సమయంలో... కొందరు సీనియర్ కవులు కవిత్వపు మెలకువలను బోధించేందుకు ఫేస్‌బుక్ గోడనే నల్లబల్లగా ఉపయోగిస్తారు. పులికొండ సుబ్బాచారి లాంటి పెద్దలూ సూచనలందిస్తారు. అందరూ పక్కపక్కనే కూర్చొని మాట్లాడుకున్నంత వెసులుబాటుతో ఒకరితో ఒకరు సంభాషించుకుంటారు. బహుశా అదే రచయిత పుస్తకాన్ని చదివేప్పుడు కూడా ఇలా ప్రశ్నలు అడిగే అవకాశం ఉండదేమో. మరోపక్క తెలుగు అక్షరాలను ఎలా పోస్టు చేయాలి, పోస్టు తాలూకూ యూఆర్ఎల్‌ను ఎలా కాపీ చేసుకుని తిరిగి ఉపయోగించుకోవాలి వంటి సాంకేతిక సలహాలను వేరెవరో చెబుతుంటారు. రచనారంగంలో పట్టు ఉండి సాంకేతికంగా ఇప్పుడిప్పుడే తొలి అడుగులు వేస్తున్న వారికి ఇవి ఉపయోగపడతాయి. శ్రీశ్రీ కంఠస్వరంతోనే వారి కవిత్వం ఉన్న యూట్యూబ్ వీడియోను ఒకరు బృందానికి చూపిస్తారు. ఉచ్చారణలోని నైపుణ్యం గురించి ఇంకొకరు వివరిస్తారు. అది ఎదిగే కవికి ఉత్తేజాన్ని కలిగించే పాఠంగా పనికొస్తుంది. అరుదైన చిత్రాలూ, గొప్ప పుస్తకాలూ వాటి వెనుక జరిగిన కృషిని వివరిస్తూ, వాటిని లింకులుగా ఇదే గ్రూపు గోడలపై సందర్భానుగుణంగా మెరుస్తుంటాయి. అప్పుడప్పుడూ వాదనలూ, వ్యతిరేకతలూ, నచ్చకపోవటాలూ అన్నీ ఉంటాయి. ఆత్మీయ దారంగానే అవన్నీ అల్లుకునే ఉంటాయి. అందుకే చాలామంది సీనియర్ కవులు కూడా చెప్తారు... సాయంత్రంకల్లా ఈ గ్రూపులోకి ఒకసారి వచ్చి పలకరించకపోతే ఏదో కోల్పోయినట్లు ఉంటోందని. అది కేవలం కంప్యూటరు ముందు కూర్చున్నట్లు కాకుండా

పచ్చని చెట్టు ఒకటుంటే పిట్టలు వాటికవే వచ్చి వాలుతాయి. కవిత్వాన్ని ప్రచురించే చోటు ఒకటుంటే కవిత్వమూ దానికదే వచ్చి చేరుతుంది. పత్రికల్లో సాహిత్యానికి అంతగా చోటు ఉండదు. స్పందనా వెంటనే తెలీదు. పత్రిక ఒక కవిత ప్రచురిస్తే తొంభై తొమ్మిది కవితలు తమవంతు కోసం ఎదురు చూస్తుంటాయి. మరి కవులు తమ భావోద్వేగాన్ని కాగితమ్మీద కవిత్వంగా పరుచుకున్నాక నలుగురితో పంచుకోవడమెలా..?

సరిగ్గా ఈ అవసరమే ఓ 'కవిసంగమ'మై ఫేస్‌బుక్‌లో సందడి చేస్తోంది.

కవి సంగమ ముత్యాలు

గద్దలొస్తున్నాయి పారిపోండి
ఇవి కోళ్లు తినే గద్దలు కాదు
భూములు తినే గద్దలు
దాచి పెట్టుకోండి
మీ భూములన్నీ
ఏ సెజ్ గంప కిందో
వీటి చూపు చాలా పెద్దది
ఎక్కడ దాక్కున్నా పట్టేస్తాయి
నీ కడుపు కొట్టేస్తాయి
అందుకే దాపెట్టుకో
సెజ్ కింద కాకపోతే కనీసం
శ్మశానం కిందైనా
చచ్చాక కాల్చటం కోసం
మిగులుస్తున్నారు ఊరికి ఉత్తరాన
ఆరడుగులు
అది కూడా నీ మీద ప్రేమతో కాదు
దెయ్యం అనే భయంతో

\- మోహన్ రావిపాటి

పరిచయస్తులు, స్నేహితులూ, కుటుంబ సభ్యుల మధ్య కూర్చున్న అనుభూతిని కోల్పోకూడదనే తపన.

భద్రంగా బ్లాగులోకి

గ్రూపులో రాసుకునే రాతలకు కాలపరిమితి ఉంటుంది. కొన్ని రోజుల తర్వాత వాటిని మళ్లీ వెతకాలంటే ఇబ్బంది తప్పదు. అదే ఒకే కవివి వరుసగా కావాలంటే మరీ కష్టం. అందుకే, ఫేస్‌బుక్‌లో కవులు ప్రచురించుకున్న కవితలను మళ్లీ వేరుగా మరో బ్లాగులోకి తరలిస్తున్నారు. అది మరింత విస్తృతమై 'కవిసంగమం.కాం' పేరుతో ఇ-పత్రిక రూపంలోకి మారింది. దీనిలో ప్రముఖుల రచనలను శీర్షికలుగా చేర్చుతూ మరింత నిండుదనాన్నీ సమగ్రతనూ చేకూర్చారు.

దూరాలు చెరిగాయి

ఎప్పుడూ అంతర్జాలంలోనే ముచ్చట్లు చెప్పుకునే ఈ బృందసభ్యులు... ఒకసారి నిజంగానే కలుసుకుంటే ఎలా ఉంటుందనే ఆలోచనతో ఆగస్టు 15, 2012న హైదరాబాద్ ఇఫ్లూ విశ్వవిద్యాలయంలో సమావేశమయ్యారు. అప్పటికే పుస్తకాలు ప్రచురించుకున్న వారు, అప్పుడప్పుడూ పత్రికల్లో రాసేవారూ, కేవలం 'కవి సంగమం' నుంచే కవులుగా ఎదిగినవారు అందరూ తమ కవితలను అక్కడ వినిపించారు. ఈ కార్యక్రమానికి బెంగాలీ కవి సుబోధ్ సర్కార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సమావేశం తర్వాత బృంద సభ్యుల మధ్య చనువు పెరిగింది. కవిత్వం రాయటం, కవిత్వంపై చర్చించటం మరింతగా పెరిగాయి.

ప్రసిద్ధ కవుల నుంచి స్ఫూర్తిని పొందేందుకు తమిళ అక్షర హాలికుడు చేరన్ రుద్రమూర్తిని ఆహ్వానించి మలి సమావేశాన్ని నిర్వహించారు. అతిథి నుంచి కవిత్వపు నైపుణ్యాన్నే కాకుండా సమకాలీన సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై స్పందించేందుకు కలానికి ఎంత పదునుండాలో అర్థం చేసుకున్నారు. ఈ స్ఫూర్తితోనే అప్పుడప్పుడూ కాకుండా క్రమం తప్పకుండా కలుసుకోవాలనే కొత్త విధానానికి తెర లేచింది. దానిలో భాగంగానే లామకాన్ సమావేశాలు ప్రారంభమయ్యాయి.

నెలనెలా సమావేశం

రాసింది జనానికి వినిపించే సత్తా కవిలో పెరగాలనే తపనతో కవి సంగమం ఓ

కవి సంగమ ముత్యాలు

పదో తరగతిలో
నీకిద్దామని రాసిన ప్రేమలేఖ
మొన్న మన నానిగాడు
చించేసేవరకూ
నా పుస్తకాల్లోనే...
అప్పటి
భయాన్ని ప్రేమగా కప్పుకుని...
గుర్తుందా
వృత్తలేఖినితో గీసినట్లుండే కళ్లింత
చేసుకుని
రెండు జడల్నీ చేతులతో వెనక్కి
నెట్టుకుంటూ నువ్
నన్నెలా పిలిచేదానివో.

- డా॥ వంశీధర్‌రెడ్డి

తృప్తి

అనుకూల వతియైన
ఆడదానితో
తీసిన కునుకు
ఆల్చిప్పలో పడిన
స్వాతికార్తె
చినుకు

ప్రేమ...

అధికారానికి
లొంగనిది
ఆశలు చూసి
పొంగనిది
ఆప్యాయతకు
నది
అదే ప్రేమను
మహానది!!

వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. అదే 'లామకాన్ సిరీస్'. ముగ్గురు యువ కవులు... అందులో ఒకరు తప్పనిసరిగా కవయిత్రి, వారికి తోడు మరో ఇద్దరు సీనియర్ కవులు... వీరితో ప్రతి నెలా హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ లామకాన్‌లో వేదిక ఏర్పడుతుంది. వారి వారి కవితా గానాలతో ఓ కవిత్వపు సాయంత్రం గడుస్తుంది. మళ్లీ ఈ కార్యక్రమం ఫొటోలూ, వీడియోలూ అన్నీ గ్రూపులోకి వచ్చేస్తాయి. వేర్వేరు ఊళ్లలో ఉండి కార్యక్రమానికి హాజరు కాలేని వారికి అనుభూతులను పంచుతాయి. ఈ ఏడాది జనవరి 27న జరిగిన మొదటి కార్యక్రమానికి నగ్నముని, వసీరా లాంటి చేయితిరిగిన కవులతో యువకవులు కిరణ్ గాలి, మెర్సీ మార్గరెట్, చింతం ప్రవీణ్‌లు గళం కలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ జరిగిన 'సిరీస్'ల్లో నిఖిలేశ్వర్, పులిపాటి గురుస్వామి, వరవరరావు, డా॥ కాసుల లింగారెడ్డి, దేవీప్రియ, విమల, బీవీవీ ప్రసాద్, కోడూరి విజయ్‌కుమార్ లాంటి సీనియర్ కవులు పాల్గొన్నారు. వారితో క్రాంతి శ్రీనివాసరావు, జయశ్రీ నాయుడు, నందకిషోర్, యజ్ఞపాల్ రాజు, శాంతిశ్రీ, చాంద్‌ఉస్మాన్, నరేష్‌కుమార్, మిరాజ్ ఫాతిమా, అనిల్‌డానీ, .సీవీ సురేష్, వనజ తాతినేని, బాలు వాకదాని లాంటి నవతరం ప్రతినిధులు వేదికను పంచుకున్నారు. ఈ సమావేశాల వల్ల అహంకారాలు ప్రేమలోకి దూకి ఆత్మహత్య చేసుకుంటున్నాయి. అలసత్వపు లోయల్లోంచి నైపుణ్యాలు పైపైకి వస్తున్నాయి.

అక్షరాన్ని అచ్చులో చూసుకోవాలనే తపన కవిలో ఉంటుంది. అందుకే 'కవి సంగమం' సంవత్సర ప్రయాణానికి గుర్తుగా మెరుగైన కవిత్వాన్ని సంకలనంగా తీసుకురావాలనుకున్నారు. 144 మంది కవితలను ఏరికూర్చి, కవుల సంక్షిప్త పరిచయాలతో 'కవి సంగమం 2012 కవిత్వం' పుస్తకాన్ని విడుదల చేశారు. దీని ముందుమాటలో సతీష్ చందర్ ఇలా అంటారు.. 'పదం పక్క పదం ఉంటేనే ప్రతి పదానికీ అస్తిత్వం. వెరసి అపూరపమైన కవిత్వం. అందుకే కిందకు జారిన ప్రతి మనిషికీ క్రమం తప్పకుండా కవిత్వం పట్టిద్దాం'.

అక్షరానికి అందలమేస్తూ... నవతరం ప్రతిభకు హారతిలిస్తున్న 'కవి సంగమం' లాంటి ప్రయత్నాలు మరిన్ని జరగాలి. అమ్మభాష గొప్పదనాన్ని మరింతగా చాటాలి.

కవి కవిత్వం రాయటానికే కాక కవుల్ని కలవటానికి, వారి కవిత్వం వినటానికి కూడా ఇష్టపడతాడు. అందుకొక వేదిక అవసరం. ఈతరం ఆలోచనంతా నెట్, వెబ్‌సైట్, ఫేస్‌బుక్‌ల చుట్టూ తిరుగుతోంది. కాబట్టి తన ఇష్టం, ఈతరం అభీష్టం కలిపి యాకూబ్ సృష్టించిన వేదికే 'కవి సంగమం'. అన్వర్-ఉల్-ఉలూమ్ కళాశాలలో అధ్యాపకుడైనా, కవిగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర ఉన్న వారు యాకూబ్. ఖమ్మం జిల్లా రొట్టమాకు రేవు నుంచి మొదలైన యాకూబ్ కవితా ప్రస్థానం 'కవి సంగమం'తో కొత్త మలుపు తిరిగింది. చిన్నా, పెద్దా అని కాకుండా ఏ కాస్త భావసంపద ఉన్నా తన 'కవి సంగమం'లో చోటు కల్పిస్తారాయన. చక్కని వేదిక ఉన్నందున కవిత... కవితా రాలి కవిత్వ సముద్రమే కావాలి. అమ్మ భాషకు కొత్త కిరీటాలు తొడగాలి.

కవి సంగమ ముత్యాలు

ఎప్పట్లానే...
రోజుని భుజానేస్కుని
రోడ్డెక్కాడు రాములు!!!
మొదలెట్టిన చోటికే
తిరిగొస్తానని తెలిసీ
నిన్నటికి దూరంగా
వెళ్లాలనే ప్రయత్నంలో
ఐస్బండిని నెట్టుకెళ్తూ

- చైతన్య శంకర్

కట్టా శ్రీనివాస్,
ఉపాధ్యాయుడు, హైదరాబాద్,
98851 33969

మార్పు

అణువంత
అనారోగ్యం చాలు
అందం
ఆనందం



స్పర్శ

అలసిన
తనువులని తట్టి లేపుతుంది
సొలసిన
హృదయాలను స్పృశిస్తుంది

సమాధానమేది?



సమాజం
ఓ పజిల్
జ్ఞానమే
జవాబు

ఇట్లు నాన్న!

ఓ తండ్రి ఆలోచన... తన కొడుక్కి లోకం గురించి చెప్పాలని! మనుషుల మనస్తత్వాలను వివరించాలని! అమ్మభాషలోని అమ్మతనాన్ని గుర్తుచేయాలని! విజేతల వ్యక్తిత్వాలను పరిచయం చేయాలని! ప్రపంచ విజ్ఞానాన్ని అందివ్వాలని! సామాజిక అంశాలపై చైతన్యం కలిగించాలని!

ఇవన్నీ చేశాడు ఆ నాన్న! అలా అని ఒళ్లో కూర్చోపెట్టుకుని చెప్పలేదు. చెప్పలేడు కూడా. ఎందుకంటే అబ్బాయి ఎక్కడో వందల కి.మీ.ల దూరంలో ఉన్నాడు. మరి ఎలా తన ఆలోచనను ఆచరణలోకి తెచ్చాడు? ఆలోచించండి! ఊసులు చెప్పే ఉత్తరం గుర్తొచ్చిందా! దాంతోనే! రోజుకో లేఖ చొప్పున వరసగా ఏడొందలకు పైగా రాశాడు ఆ కన్నతండ్రి. నాన్న మనస్సును అర్థం చేసుకుని, ఆ ఉత్తరాల్లోని ఆత్మను ఆవాహన చేసుకున్నాడా పుత్రుడు.

స్వాతంత్రోద్యమం ఉధృతంగా నడుస్తున్న రోజులవి... జవహర్‌లాల్ నెహ్రూ కారాగారంలో ఉన్నారు. అక్కడి నుంచి తన పదేళ్ల కూతురు ఇందిరకు ఉత్తరాలు రాశారు. ప్రపంచ చరిత్రను అలతి అలతి అక్షరాల్లోకి కుదించి చెప్పారు. ఆ లేఖల ప్రభావంతోనే ఎదిగారు ఇందిర. తర్వాతర్వాత నెహ్రూ ఉత్తరాలు పుస్తక రూపంలోకి వచ్చి లోక ప్రసిద్ధమయ్యాయి. అందరికీ తెలిసిన విషయమే ఇది.

అయితే, నాటి నెహ్రూ రాతల స్ఫూర్తితో ఓ తెలుగింటి నాన్న కూడా కలం పట్టాడు. తమిళనాడులో చదువుకుంటున్న తన పదకొండేళ్ల బాబుకు రోజుకు కొంత విజ్ఞానాన్ని అందించాడు. రెండు చేతులతో దాన్ని అందిపుచ్చుకున్న ఆ అబ్బాయి ఇప్పుడు విద్యా సంబంధిత పోటీల్లో విజేతగా నిలుస్తున్నాడు.

సోమిరెడ్డి... నల్గొండ జిల్లా మఠంపల్లి మండలంలోని బక్కమంతుల గూడెం వాసి. 1994 గ్రూప్2 పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచిన వ్యక్తి. ఆబ్కారీ శాఖలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. తర్వాత తోటి గ్రామస్థులను చదువు వైపు నడిపించారు. ఊళ్లో గ్రంథాలయం, పోటీ పరీక్షల పుస్తకాల నిధిని ఏర్పాటు చేశారు. ఆయన స్ఫూర్తిని అందిపుచ్చుకున్న యువత గ్రూప్-1, గ్రూప్-2, పోలీస్, రెవెన్యూ, ఉపాధ్యాయ ఉద్యోగాలను సాధించారు.

అయితే, సోమిరెడ్డి మనసులో మాత్రం ఏదో వెలితి. ఆబ్కారీ శాఖలో ఇమడలేకపోయారు. అనారోగ్యమూ కొంత ఇబ్బంది పెట్టింది. మరోవైపు, నేటితరం చిన్నారులకు మెరుగైన విద్య అందట్లేదన్న బాధ. వెరసి, ఉద్యోగానికి దీర్ఘకాలిక సెలవు పెట్టారు. 2012లో కోదాడలో తేజ విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారు.

మూడేళ్ల కిందటి మాట. సోమిరెడ్డి కుమారుడు ధనుష్ ఆరో తరగతిలో ఉన్నాడప్పుడు. తమిళనాడులోని

కాంచీపురంలో ఉన్న రిషివ్యాలీ పాఠశాలలో చదువుతున్నాడు. అంత దూరంలో ఉన్న అబ్బాయితో రోజూ మాట్లాడలన్న ఆశ సోమిరెడ్డిది. ఎంతైనా నాన్నప్రేమ కదా. ఫోనులో పలకరిస్తే తనివి తీరదు. పైగా పాఠశాల వాళ్లూ ఒప్పుకోరు. పైపెచ్చు ఫోనులో అయితే... ఎలా ఉన్నావ్ కన్నా! అన్నం తింటున్నావా సరిగ్గా! లాంటి సాధారణ మాటలే దొర్లుతాయి. అది కాదు కావాల్సింది ఆ తండ్రికి. తన మాటల వల్ల బిడ్డకు ఓ నాలుగు మంచి విషయాలైనా తెలియాలి. అవి తనకు ఎప్పుడో ఒకప్పుడు... ఎక్కడో ఓ చోట ఉపయోగపడాలి. ఇదే అనుకున్నారాయన. ఆలోచించారు. ఓ మెరుపు మెరిసింది. ఉత్తరం జ్ఞప్తికి వచ్చింది. అప్పుడే మొదలైంది లేఖా రచన. రెండు విద్యా సంవత్సరాల పాటు, ధనుష్ ఏడో తరగతి పూర్తయ్యే వరకూ (తర్వాత అబ్బాయి స్వస్థలానికి వచ్చేశాడు) నిరంతరంగా సాగిందా వెల్లువ.

సమకాలీన, పర్యావరణ, జీవవైవిధ్య, వైజ్ఞానిక అంశాలు, లోకం పోకడను మార్చిన ఆవిష్కరణలు, లోకనాయకుల జీవిత విశేషాలు, చారిత్రక వ్యక్తుల మూలాలు, తెలుగు తీయందనాలు, సైన్సు పరిశోధనలు, ఆటలు... ఇలా సోమిరెడ్డి ఎంచుకున్న అంశాలన్నీ దేనికదే విభిన్నమే. రోజుకొక విషయాన్ని తీసుకోవడం, దాని గురించి పోస్టు కార్డుపై సూటిగా, స్పష్టంగా రాయడం, కాంచీపురం చిరునామాకు ఆ ఉత్తరాన్ని జాగ్రత్తగా పంపడం... ఆగస్టు, 2010 నుంచి ఏప్రిల్, 2012 వరకూ సోమిరెడ్డి దినచర్య ఇదే. ప్రతి ఉత్తరంపై ఆయన ఏదో ఒక బొమ్మ వేసేవారు. 'ఈనాడు' హాయ్‌బుజ్జీలో వచ్చే హాస్యోక్తులను ఉట్టంకించే వారు. సందర్భానుసారం సూక్తులు, ప్రముఖుల మాటలను గుదిగుచ్చేవారు. ఒక్కో లేఖ రచనకు పదిహేను నిమిషాల నుంచి గంట వరకూ వెచ్చించే వారు. దినపత్రికలు, పుస్తకాలు, అంతర్జాలం నుంచి విషయ సేకరణ చేసి, దాన్ని అలతి అలతి తెలుగు పదాల్లోకి కూర్చే వారు.

నాన్న పంపే ఉత్తరాలతో పాఠశాలలో ధనుష్‌కు ఓ ప్రత్యేక గుర్తింపు వచ్చింది. తనకు వచ్చే లేఖల కోసం మిత్రులు, ఉపాధ్యాయులు కూడా ఎదురుచూసే వారు. తెలుగు తెలిసిన వాళ్లు వాటిని అడిగి తీసుకుని మరీ చదివే వాళ్లు. వచ్చే ఉత్తరాలు తెచ్చే స్ఫూర్తితో తానూ 'రాయడం' ప్రారంభించాడు ధనుష్. నాన్నకు వారానికో లేఖ చొప్పున పంపేవాడు. పాఠ్యపుస్తకాలతో పాటుగా విషయ బోధన చేసిన నాన్న ఉత్తరాలతో ఆ కుర్రాడి విజ్ఞానస్థాయి విస్తరించింది. రాష్ట్రస్థాయిలో జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన సైన్స్ క్విజ్‌లో రెండో స్థానంలో నిలిచాడు. 'హిందూ' దినపత్రిక ఆధ్వర్యంలో జరిగిన 'యంగ్ వరల్డ్ క్విజ్'లో కూడా జయకేతనం ఎగరవేశాడు.

ఈ నాన్నలేఖలు ఇప్పుడు 'ఇట్లు... నాన్న'గా పుస్తక రూపంలోకి వచ్చాయి.

నేర్చుకున్నా

ఎంత పెద్ద విషయాన్ని అయినా సులువుగా, సరళంగా, స్పష్టంగా ఎలా రాయాలో నేర్పాయి నాన్న లేఖలు. తరగతి పుస్తకాల్లో లేని ఎన్నో అంశాలుంటాయి వాటిలో. వేరే రాష్ట్రంలో ఉన్నా తెలుగును మర్చిపోకుండా ఉన్నానంటే ఈ ఉత్తరాల వల్లే.

- ధనుష్

అన్నీ లాభాలే

బాబుకు దూరంగా ఉన్నానన్న భావనను తగ్గించాయి ఈ ఉత్తరాలు. వాడిలో తెలుగుపై పట్టును, విజ్ఞానాన్ని పెంచాయవి. ఉత్తరాలను చదవటం అలవాటు కావడంతో పుస్తక పఠనం వైపు ఆకర్షితుడయ్యాడు. పరిశీలన శక్తి, విమర్శనా దృక్పథం అలవడ్డాయి.

- సోమిరెడ్డి

చదువుల్లో 'తేజ'ం

సోమిరెడ్డి కలల పాఠశాల అయిన 'తేజ విద్యాలయం'లో బోధన విభిన్నంగా ఉంటుంది. పాఠాలన్నింటినీ నాటక రూపంలోకి మార్చి చెబుతారు. దాంతో వాటిపై పిల్లలకు ఇష్టం పెరుగుతుంది. అలాగే, తరగతి గదితో మాత్రమే కాక ప్రకృతితో కూడా అక్కడి చిన్నారులకు అనుబంధం ఉంటుంది. వారానికి ఒకసారి 'దూరపు నడక'కు వెళ్తారు. అందులో భాగంగా చుట్టూ ఉన్న పర్యావరణాన్ని అధ్యయనం చేస్తారు. అలాగే, వ్యవసాయం చేసే పద్ధతిని కూడా విద్యార్థులకు నేర్పిస్తారిక్కడ. పాఠశాలకు దగ్గరగా ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రంలో.. తరగతికి ఒక 'మడి'ని ఇచ్చి విత్తనాలు వేయడం నుంచి అన్నింటిపై అవగాహన కల్పిస్తారు. ప్రతిరోజూ ఉదయం 'సత్సంగ్' పేరిట విద్యార్థుల మధ్య చర్చలు నిర్వహిస్తారు. వేదిక భయం పోవడానికి ఇది ఉపయోగపడుతుంది. కథలు, కవితలు, నాటకాలు, లేఖలు, వ్యాసాలు రాయడం, చిత్రలేఖనాల్లోనూ పిల్లలను ప్రోత్సహిస్తారు. సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి ఇవి ఉపయోగపడతాయి.

పాఠకులనూ ఆకట్టుకుంటున్నాయి.

ఉత్తరాలు పుస్తకంలో పుటలుగా మారడం వెనక ఆసక్తికర విషయం ఉంది. ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో జరిగే 'బాలోత్సవ్' గురించి అందరికీ తెలిసిందే. 2011లో జరిగిన ఆ ఏటి ఉత్సవానికి వెళ్లారు సోమిరెడ్డి. అక్కడకు వచ్చే చిన్నారుల్లో లేఖా రచనపై ఆసక్తి కలిగించాలన్న ఉద్దేశంతో తన ఉత్తరాలను తీసుకెళ్లారు. అక్కడ వాటిని మెదక్ జిల్లా జహీరాబాద్‌కు చెందిన డా॥ విజయలక్ష్మి చూశారు. ఆవిడకు అవి బాగా నచ్చాయి. వాటి నకలును తనకివ్వల్సిందిగా సోమిరెడ్డిని అడిగారు. ఆయన ఉత్తరాలను స్కాన్ చేసి సీడీలో వేసిచ్చారు. విజయలక్ష్మి దగ్గరకు చేరిన ఆ సీడీ తర్వాత 'కొత్తపల్లి' పత్రిక వ్యవస్థాపకులు సుబ్బరాజు దృష్టిలోకి వచ్చింది. అందులోని ఉత్తరాల విలువను గ్రహించిన ఆయన వాటిని పుస్తకంగా అచ్చు వేయించారు. దానికి మంచి స్పందన వచ్చింది. దాంతో తేజ విద్యాలయం ఆధ్వర్యంలో పునర్ముద్రించారు.

అమ్మభాషపై పట్టు పెంచే సాధనం లేఖా రచన. భావ వ్యక్తీకరణలో స్పష్టతను సాధించడానికీ ఇది దోహదపడుతుంది. ఈ రచనకు ఉండే శక్తిని గుర్తించి, ఆ శక్తిని ఉత్ప్రేరకంలా మార్చి, అబ్బాయిలో జ్ఞానతృష్ణను పెంచిన సోమిరెడ్డి ఆలోచన అనుసరణీయం. బిడ్డల భవితకదే అభ్యుదయం.

(సోమిరెడ్డి: 99493 51038)

బి.స్టాలిన్, నల్గొండ
షంషుద్దీన్, కోదాడ

సింత సిగురు సిన్నదానా!

అతడు: సింత సిగురూ సిన్నదానా!
సిలిపి కళ్లా పిల్లదానా!!
సింత సిగురూ కోసి
పెట్టేదా?...కూ
సింత సాయం సేసిపెట్టేదా??జ్ఞ

ఆమె: గొడ్లుకాసే కుర్రవాడా!
కొంటె సూపుల పిల్లగాడా!!
మాటిమాటికి
నాటకాలొద్దూ..ఇం
తోటి సాయం నాకు ఏం వద్దూ!!

అతడు: సెట్టు పయినా పిట్ట వుందీ
పిట్టసెంతా బుట్ట వుందీ
బుట్టలోనా సిగురు వుండాదీ...ఆ
పిట్టకెంతో పొగరు వుండాదీ!!

ఆమె: సెట్టు పక్కన సేను వుందీ
సేను గట్టున దున్న వుందీ
దున్న సక్కగ కొవ్వి
వుండాదీ...ఎద
టున్న వాళ్లని కుమ్ముతుండాదీ!!

అతడు: ఆమె సింతకి పులుపు సాజం
వయసు వాళ్లకి వలపు సాజం
సింత అంటే నోరు వూరుద్దీ...నీ
సెంతవుంటే సుకము దొరుకుద్దీ!!

ఆమె: బళ్లొకెడితే సదువు వచ్చూ
ఒళ్లు కొవ్వితె మదము ఎచ్చూ
సింత తింటే పళ్లు పులిసేను..నా
సెంత వుంటే పళ్లు రాలేను!!

అతడు: పళ్లు రాలా ఏరుకుంటా
పదిలంగా దాసుకుంటా
తిట్టికొట్టిన తిరిగిపోబోనే...నీ
కిట్టమయితే లగ్గమెడతానే!!

ఆమె: ఎన్ని తిట్టిన గాలి కేగునె
దున్నపోతుకు వాన లాగనె
తొందరగ నే లగ్గమూ
పెడతా...మును
ముందుగా నీ బరతమూ
పడతా!!

అతడు: మాట కవునూ మాట తెగులూ
నీటి కవునూ నాసు తెగులూ
బరత మెందుకు పట్టెదవు
లేవే...నను
బరత అనుకొని సెట్టు దిగిరావే!!

ఆమె: యాడి కెళ్లిన ఎంట బడతవు
జీడి లానే అంటి ఇడవవు
బెట్టు యిడిసీ సెట్టు
దిగినారా...నను
సెట్టబట్టగ గట్టు దిగిరారా!!

- అలపర్తి వెంకట సుబ్బారావు
నందివెలుగు, గుంటూరు జిల్లా
08644 241366

ఆశకెంత వయస్సు

వెయ్యేళ్ల
ఆశ
నూరేళ్ల
ఆయుష్షు

నా కుటుంబం

కలం
శ్రీమతి
కవితలు
పిల్లలు

మాట్లాడు నాన్నా!

నా హృదయంలో చిరంజీవైన నా బాబు శివశంకర్‌కు కన్నీటితో రాసిన లేఖ

ఈ లేఖ నీకు చేరదని తెలుసు. అయినా నీకు ఉత్తరం రాయాలనిపించింది. నువ్వు ఏ లోకంలో ఉన్నా దీని సారాంశం నీకు అర్థమవుతుందని నా చిన్న ఆశ. నువ్వు దేవుడి దగ్గరకు వెళ్లి సరిగ్గా ఆర్నెల్లు కావస్తోంది. అంతా నువ్వు మాకు దూరమయ్యావని అంటున్నారు. కానీ వాళ్లకేం తెలుసు! నువ్వు మా హృదయాల్లో శాశ్వత విశ్రాంతి తీసుకుంటున్నావని!

నువ్వు పుట్టినప్పుడు మా ఆనందానికి అవధుల్లేవు. నిన్ను నా చేతుల్లోకి తీసుకుని ఎంతో మురిసిపోయాను. వంశోద్ధారకుడు పుట్టాడంటూ అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, అత్తయ్య, మావయ్యలు సంబరపడ్డారు. సంతోషంతో బంధువులందర్నీ పిలిచి పండుగ చేశాం. ఇక నువ్వు పెరిగి పెద్దవాడవుతావనీ, ఇల్లంతా కలియ తిరుగుతూ అల్లరి చేస్తావనీ, అక్కతో గిల్లికజ్జాలు పెట్టుకుని నీ చిలిపి చేష్టలతో, ఇల్లంతా నిత్య కళ్యాణం పచ్చతోరణంలా కళకళలాడుతుందనుకున్నాం. కానీ అదంతా ఓ కలగానే మిగిలింది. మా ఆశలు అడియాశలయ్యాయి. ఏ జన్మలో ఏ పాపం చేశామో! ఇప్పుడు ఈ శోకసంద్రంలో మునిగిపోయాం.

మూడు నెలలవుతున్నా నీలో ఉలుకూ, పలుకూ లేకపోవడంతో ఆందోళనపడ్డాం. ఆసుపత్రిలో చూపిస్తే నీకు బుద్ధి లోపించిందనీ, జీవితాంతం మంచానికే పరిమితమవుతావన్నారు. ఆ రోజే మా గుండెలు పగిలిపోయాయి నాన్నా! ఆ రోజు రాత్రంతా నీ ఉయ్యాల పట్టుకుని గుండెలవిసేలా ఏడ్చాం. ఎప్పటికీ నా ఒడిలో ఆడుకునే పసివాడిగానే మిగిలిపోతావనే బాధను సంతోషంగానే మలచుకున్నాను. నీకు సపర్యలు చేసినకొద్దీ నీపై ప్రేమ రోజు రోజుకీ ఎక్కువే అయ్యింది. కంటికి రెప్పలా చూసుకుంటూనే నువ్వు బాగు పడతావన్న చిరు ఆశతో తిరగని గుడి లేదు. వెళ్లని ఆసుపత్రి లేదు. మాకు దక్కాలని ఎందరు దేవుళ్లని వేడుకున్నానో. కానీ ఏ దేవుడూ కనికరించలేదు.

నాన్నా... అమ్మ ప్రతిక్షణం నిన్నే తలచుకుంటోంది. నీ ధ్యాసలోనే ఉంటోంది. నీ బట్టలు, ఉయ్యాలని తదేకంగా చూస్తూ, తడిమి తడిమి చూస్తూ కన్నీరు పెడుతోంది. ఇప్పుడు నీ బట్టల అల్మారా మొత్తం నీ ఫొటోలతో నింపేసింది. నువ్వు కలలోనైనా కనిపించి అమ్మని ఏడవొద్దని చెప్పురా!

'తమ్ముడెక్కడున్నాడని, నాతో ఆడుకోవటానికి తోడు పంపించ'మని అక్క అడుగుతోంది. ఎప్పుడు వస్తావా అని ఎదురు చూస్తోంది. నువ్వు దేవుడి దగ్గరికి వెళ్లావంటే మనమూ అక్కడికే వెళ్దామంటోంది. తను తినే చాక్లెట్లు, బిస్కెట్లు, ఐస్‌క్రీమ్‌ల్లో కొంత నీకూ పక్కన పెడుతోంది. తన బొమ్మలన్నీ నువ్వు వచ్చిన తర్వాత నీకు ఇస్తానంటోంది. తనకేం కొన్నా తమ్ముడికీ కొనిపెట్టాలని ప్రతిసారీ మారాం చేస్తోంది. చిన్నది కదా పాపం! తనకు నీ విషయం తెలియదు.



పోన్లే నాన్నా కనీసం రోజూ నువ్వు నా కల్లోకైనా వస్తున్నావు! ఈ మధ్య ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉంటున్నావు. నిన్ను కాపాడుకోలేకపోయిన నా నిస్సహాయత మీద అలకా! ఎన్నో దీర్ఘవ్యాధులకు మందులు కనిపెట్టినా... నీ చిన్న ప్రాణాన్ని కాపాడలేకపోయిందని 'వైద్యం' మీద కోపమా? కలలోనైనా నీ ముద్దు ముద్దు మాటలు వినాలనీ, నీతో బుడి బుడి అడుగులు వేయించాలని ఉబలాటపడుతున్నాను.

అందుకే నువ్వు మాట్లాడు నాన్నా! నువ్వు ఎక్కడున్నా సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను. నా కోరికలన్నీ తీరుస్తావు కదా! నాన్నా...

నీ నాన్న

- ప్రభాకర్,

కొండూరు, వరంగల్.



నెట్టెక్కితే గట్టెక్కినట్టే!

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నెట్ పరీక్ష జూన్ 30న జరుగబోతోంది. వివిధ శాస్త్రాలు, భాషలు ఐచ్ఛికాంశాలుగా దేశవ్యాప్తంగా వేలాది అభ్యర్థులు ఈ పరీక్ష రాస్తారు. స్నాతకోత్తర విద్య అనంతరం రాసే ఈ పరీక్షలో అర్హత పొందడం ప్రతిష్ఠాత్మకం. పరిశోధనకు ఉపకార వేతనం పొందడం, అధ్యాపక వృత్తికి అర్హత సాధించడం స్నాతకోత్తర విద్యార్థులకు ఒక మధుర స్వప్నం. దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపక పదవులకు ఈ పరీక్షలో విజయం సాధించడం ఒక ముఖ్య అర్హత.

తెలుగు ఐచ్ఛికాంశంగా పరీక్ష రాసి మంచి మార్కులు సాధించి ఉపకార వేతనం లభించక పోయినా అధ్యాపకులుగా అర్హత సాధించినవారికి కూడా తిరుగుండదు. ఈ పరీక్ష కోసం చేసే సాధన డి.ఎల్/జె.ఎల్ పరీక్షలకు కూడా చాలా ఉపయోగపడుతుంది. ఉపకార వేతనానికి ఎంపికైన వారు నెలకు ఇంచుమించు పదిహేడు వేల రూపాయలు, ఇతర అలవెన్సులు (భత్యం) పొందుతారు. గతేడాది నుంచి ఈ పరీక్షా విధానంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఐచ్ఛికాంశంలో వ్యాసరూప ప్రశ్నలు తొలగించి బహుళ వికల్ప ప్రశ్నలను (మల్టిపుల్ ఛాయిస్ క్వశ్చన్స్) ప్రవేశపెట్టారు. దాదాపుగా ఎంఏ లో చదివిన విషయాలే ఉంటాయి కాబట్టి సంబంధిత గ్రంథాలను కూలంకషంగా చదివితే చాలు. అసలు ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయటమే అధ్యాపకునికి, పరిశోధకునికి ఉండాల్సిన ముఖ్య లక్షణం కదా!

ఇక నెట్ పరీక్షలో మొత్తం మూడు ప్రశ్నపత్రాలుంటాయి. మొదటిది అన్ని ఐచ్ఛికాంశాల వారికీ ఉండే ఒకే ప్రశ్నపత్రం. దీన్లో బోధనా పద్ధతులు, పరిశోధనా నైపుణ్యాలపై అభ్యర్థికి గల సాధారణ విషయ పరిజ్ఞానాన్ని పరీక్షిస్తారు. రెండు, మూడో ప్రశ్నపత్రాలు ఐచ్ఛికాంశంలో ఉంటాయి. ప్రశ్నా విధానం మారినా సిలబస్(పాఠ్యాంశాలు) యథాతథంగానే కొనసాగుతోంది.

సామాన్య భాషాశాస్త్రంలో భాగంగా భాష పుట్టుక, భాషాశాస్త్రం దాని చరిత్ర, కుటుంబాలు, ధ్వని శాస్త్రం, వర్ణం, పద నిర్మాణం, వాక్యం, ఆదాన ప్రదానాలు, మాండలిక భాషలను అధ్యయనం చేయాలి. ఆధునిక తెలుగు భాషలో మాండలికాలు, వాటి నిర్మాణం, వచనం, సర్వనామాలు, విశేషణాలు, క్రియలు, వాక్యనిర్మాణం వంటి అంశాలను లోతుగా పరిశీలించాలి.

సాహిత్య విమర్శలో భాగంగా కావ్యశరీరం, కావ్యాత్మ, పదం-అర్థం, రీతి, ధ్వని, వక్రోక్తి, రససిద్ధాంతం, ఔచిత్యవాదం, అలంకార శాస్త్ర నిర్మాతలు, వికాసం చదవాలి. వివిధ ఆలంకారికుల వాదాలను సవివరంగా అధ్యయనం చేయాలి.

తెలుగు సాహిత్య క్రమ వికాసం సాహితీ ప్రక్రియల్లో భాగంగా పురాణం, ఇతిహాసం, కావ్యం, ప్రబంధం, లఘుకృతులు, యక్షగానం, హరికథ, నాటకం, నవల, కథానిక; ఆధునిక ప్రక్రియలైన యాత్రా చరిత్ర, స్వీయచరిత్ర, జీవిత చరిత్ర వ్యాసం, లేఖ, డైరీ, మ్యూజింగ్స్, వచన కవిత, మినీ కవిత, ఖండకావ్యం మొదలైన ప్రక్రియలపై పట్టు సాధించాలి.

తెలుగు సాహిత్య అధ్యయనంలో భాగంగా భారత రచన - చారిత్రక, సామాజిక, మత పరిస్థితులు, నన్నయ-రాజరాజనరేంద్రుడు, మొదటి అనువక్తగా నన్నయ ధోరణి, అతని కవితా లక్షణాలు, తిక్కన వ్యక్తిత్వం, హరిహరనాథ తత్త్వం, నాటకీయత, రసాభ్యుచిత బంధం, తిక్కన స్థానం-అనువాద విధానం, ఎర్రన అనువాదం, మహాభారతంలో సామాజిక రాజకీయ పరిస్థితులు, శాంతరసం అధ్యయనం చేయాలి. భాగవతం అనువాదం అందులోని సంస్కృతి, కళలు, పోతన అలంకారాలు, భాగవత ప్రాముఖ్యత, భక్తి పారవశ్యం, వైష్ణవం, ఆధునిక పాశ్చాత్య విష్ణుభక్తిని పరిశీలించాలి.

ప్రబంధ యుగ ప్రాధాన్యత, 18 వర్ణనలు, ప్రబంధాల పుట్టుక, నేపథ్యం, అష్టదిగ్గజాలు, మనుచరిత్ర, వసుచరిత్రలు, ఆముక్తమాల్యద, పారిజాతాపహరణం, పింగళి సూరన కళాపూర్ణోదయం, క్షేత్ర మాహాత్మ్యాలు, ద్వ్యర్థి కావ్యాలు, కథా కథనం మొదలైన వాటిని చారిత్రక దృష్టితో చూడాలి.

సంస్కృత అధ్యయనంలో మన దేశంలో సంస్కృతానికున్న ప్రాముఖ్యం, వైదిక వాఙ్మయ రీతులు, వాఙ్మయ విభాగాలు, వ్యాకరణ నిఘంటు కర్తలు, నాటకాలు, కవులు, గద్యకావ్యాలు, కథాకావ్యాలు, అలంకార శాస్త్ర గ్రంథాల మీద పరిచయం పెంచుకోవాలి. తెలుగు నాటకం, నవల, కథల పుట్టుక, పాశ్చాత్య ప్రభావం, వీరేశలింగం, ధర్మవరం, కోలాచలం, చలం, బాపిరాజు వంటి వారివి చదవాలి. కన్యాశుల్కం పుట్టుక, గురజాడ నవీనత, అనంతర కాలంలో నాటక వికాసం, నాటిక, ఏకాంకిక, భాష, నవలపై సామ్యవాద, జాతీయోద్యమ ప్రభావాలు, మనో విశ్లేషణ, బుచ్చిబాబు చైతన్య స్రవంతి, స్త్రీల నవలలు అనువాదాలు, వివిధ వాదాలు గుర్తుపెట్టుకోవాలి.

చాలామంది అభ్యర్థులు పెద్దగా పట్టించుకోని జానపదానికి ఈ సిలబస్‌లో ఎక్కువ స్థానం ఇచ్చారు. జానపద విజ్ఞానం, నిర్వచనం, విభాగాలు, మౌఖిక జానపద సాహిత్య శాఖలు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ నేపథ్యం, సంచార జాతుల జీవనరీతులు, వివిధ జీవన విధానాల్లో జానపదచ్ఛాయలు, జానపద వైజ్ఞానికులు, కళలు, మతం, నీతి నేపథ్యంలో జానపద సమాజ నిర్మాణం, ఆటవిక, గ్రామీణ, నాగరిక తారతమ్యాలు జానపదగేయాలు, మాతృపూజ, వస్తు, జంతు పూజ, మాయలు, నిషేధాలు, జానపదుల ప్రచార సాధనాలు, గ్రామీణ రాజకీయ ధోరణులు, జానపద విజ్ఞానాన్ని భద్రపరచడం మొదలైనవి కూలంకషంగా అభ్యసించాలి. ఇక భారతీయ సంస్కృతి, రాజులు, ప్రముఖుల సేవ, లలిత కళలు, మతాలు, సిద్ధాంతాలు, దేవాలయాలు, ఆట పాటలు, స్త్రీలు, పాశ్చాత్య ప్రభావం ఈ అంశాలు కూడా చదవాలి. రెండో ప్రశ్నపత్రంలో వంద మార్కులకు 50 ప్రశ్నలుంటాయి. ఒక్కోదానికి రెండు మార్కులు. గంటన్నర సమయం.

ఘటికాచల మాహాత్మ్య కావ్యకర్త ?

(ఎ) తెనాలి రామకృష్ణుడు (బి) నంది తిమ్మన
(సి) అల్లసాని పెద్దన (డి) రామరాజభూషణుడు

- సమాధానం: (ఎ)

నిశ్చయ, హేతువాక్యాలను ప్రశ్నగా ఇచ్చి రెండింటి పరస్పర సంబంధంలో తప్పొప్పులను గుర్తించమని కొన్ని ప్రశ్నలుంటాయి.

'ని' కళాపూర్ణోదయం పద్యరూపంలో ఉన్న నవల.
'హే' అందులో అష్టాదశ వర్ణనలు ఉన్నాయి కనుక.

(ఎ) 'ని' సరికాదు 'హే' సరైంది.
(బి) 'ని' 'హే' రెండూ సరికాదు.
(సి) 'ని' సరైంది 'హే' సరికాదు
(డి) 'ని' 'హే' రెండూ సరైనవి.

- సమాధానం: (సి)

కాలక్రమాన్ని బట్టి సరైన వరుసను నిర్ణయించే ప్రశ్నలను గమనించాలి.

ఈ గ్రంథాల్లో వరుస క్రమాన్ని సూచించండి?

(ఎ) కుమారసంభవం, పారిజాతాపహరణం, కేయూరబాహుచరిత్ర, విజయవిలాసం
(బి) కుమారసంభవం, కేయూరబాహుచరిత్ర, పారిజాతాపహరణం, విజయవిలాసం
(సి) విజయవిలాసం, కేయూరబాహుచరిత్ర, పారిజాతాపహరణం, కుమారసంభవం
(డి) కేయూరబాహుచరిత్ర, పారిజాతాపహరణం, కుమారసంభవం, విజయవిలాసం

- సమాధానం: (బి)

ఇచ్చిన విషయాలను జతపరచమని కొన్ని ప్రశ్నలుంటాయి.

స్థూల అవగాహన (కాంప్రహెన్షన్) అంశంలో ఒక పేరా గ్రాఫు ఇచ్చి దానిలో విషయాలు ప్రశ్నలుగా ఇస్తే సరైన సమాధానం గుర్తించాలి.

చివరకు ఉండే మూడో ప్రశ్నపత్రంలో 75 ప్రశ్నలు 150 మార్కులుగా ఉంటాయి. సమయం రెండున్నర గంటలు. ఈ ప్రశ్నలు రెండో ప్రశ్నపత్రం మాదిరిగానే ఉంటాయి. అయితే వీటి ద్వారా అభ్యర్థుల విషయ అవగాహనను పరిశీలిస్తారు. చాలామంది అంతగా దృష్టి సారించని అంశాలపై కూడా ప్రశ్నలు సంధించవచ్చు.

కింది సంవత్సరాల్లో క్రమాన్ని పాటించండి?

(ఎ) విజయ, వికృతి, నందన, ఖర
(బి) వికృతి, ఖర, నందన, విజయ
(సి) ఖర, నందన, విజయ, వికృతి
(డి) నందన, విజయ, ఖర, వికృతి

- సమాధానం: (బి)

ఇలా వివిధ విషయాలను, వివిధ కోణాల్లో ప్రశ్నిస్తున్నారు. వివిధ గ్రంథాల్లోని పాత్రలు, వాదాలు, స్వభావాలు, వ్యాకరణం, విమర్శ వంటి అంశాల్లో పారిభాషిక పదాలు మొదలైనవి క్షుణ్నంగా అభ్యసించాలి. పైన ఉదాహరించిన ప్రశ్నలు గత పరీక్ష (డిసెంబరు-12)లోనివి. ఆ దృక్కోణంలో ఎం.ఎ పూర్తి పాఠ్యాంశాల్ని (సిలబస్) సంపూర్ణంగా అధ్యయం చేస్తే విజయం తథ్యం

రచ్చ సుమతీదేవి, హైదరాబాద్,
sumathi.racha@gmail.com

కాదేది ప్రశ్నకనర్హం!

త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలు జరుపుతోందన్న వార్తల నేపథ్యంలో, డీఎస్సీలో ఎస్జీటీ నియామకాలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇరవై వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాల భర్తీ జరుగబోతోంది. వీటిలో 15 వేలకుపైగా ఎస్జీటీ ఉపాధ్యాయుల పోస్టులున్నట్లు సమాచారం. ఇటీవల కాలంలో ఈ ఉద్యోగాల భర్తీ భారీస్థాయిలో ఉండటం వల్ల డి.ఎడ్ చేసే వారి సంఖ్య అత్యంత గణనీయంగా పెరిగింది. 2013లో డైట్‌సెట్ ప్రవేశ పరీక్షకు నాలుగు లక్షల 65 వేల దరఖాస్తులు వచ్చాయంటే ఆ ఉద్యోగానికి ఎంత ప్రాధాన్యత ఉందో తెలుస్తోంది.

ఎస్జీటీ ఉపాధ్యాయ నియామక పరీక్షలో 'తెలుగు'కు అన్ని పాఠ్యాంశాల (సబ్జెక్టుల)తో సమానంగా 12 మార్కులున్నాయి. తొమ్మిది మార్కులు తెలుగు పాఠ్యాంశాలకు, మూడు మార్కులు తెలుగు బోధనా పద్ధతులకు కేటాయించారు. ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయుడు ఆంగ్లం తప్ప మిగతా అన్నీ పాఠ్యాంశాలు తెలుగు మాధ్యమంలోనే బోధించాలి కాబట్టి ఉపాధ్యాయుడికి మాతృభాష తెలుగుపై చక్కని పట్టు ఉండాలి. మాతృభాషపై పట్టులేకపోతే ఏ పాఠ్యాంశాన్నైనా సమగ్రంగా బోధించలేం. మాతృభాషలో ఒక గంటలో నేర్చుకునే అంశం ఇతర భాషలో నేర్చుకోవడానికి నాలుగు గంటల సమయం పడుతుందని మహాత్మాగాంధీ పేర్కొన్నారు. అందుకే ఎస్జీటీ కోసం తెలుగు భాష, పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులపై ప్రత్యేక దృష్టితో అధ్యయనం చేయాలి.

తెలుగు పాఠ్యాంశాలు

ఆరు నుంచి పదో తరగతి వరకూ తెలుగు వాచకాలను లోతుగా అధ్యయనం చేయాలి. ప్రధానంగా ఆయా పాఠ్యాంశాల్లోని పాత్రలు, నేపథ్యం, పూర్వాపర విశేషాలు, ఇతివృత్తాలు, సందర్భ వాక్యాలు, విశేషాంశాలను దృష్టిలో పెట్టుకుని అభ్యసనం చేయాలి. పదో తరగతి పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

ప్రత్యేక లక్షణాలు కలిగిన రచనా సమాహారాన్ని ప్రక్రియ అంటారు. పదో తరగతిలో ప్రతి పాఠ్యాంశం ఏదో ఒక ప్రక్రియకు సంబంధించిందే.

పాఠ్యభాగం	ప్రక్రియపేరు	కవి/ రచయిత్రి
మాతృవేదన	ఇతిహాసం	నన్నయ
జడివాన	వర్ణన	ఎర్రన
ప్రవరుని స్వగతం	ప్రబంధం	అల్లసాని పెద్దన
సుభాషితాలు	శతకం	శతక కవులు
సందేశం	ఆధునిక పద్యం	తుమ్మల సీతారామమూర్తిచౌదరి
ఓరుగల్లు	గేయకవిత	పుట్టపర్తి నారాయణాచార్యులు
గీతాంజలి	అనువాద కవిత	చలం
తామసి	ఆధునిక పద్యకవిత	దాశరథి కృష్ణమాచార్యులు
స్ట్రీట్‌చిల్డ్రన్	వచన కవిత	మహెజబీన్
బొండు మల్లెలు	కథానిక	చాగంటి సోమయాజులు
అంపకాలు	గల్పిక	కొడవటిగంటి కుటుంబరావు

రిప్‌వాన్‌వింకిల్	వైజ్ఞానిక కల్పనా వ్యాసం	అయ్యగారి వీరభద్రరావు
చేనేత దృక్పథం	వార్తావ్యాఖ్య	గోరాశాస్త్రి
వదరుబోతు	పీఠిక	రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ
రంగస్థలంపై సమయస్ఫూర్తి	హాస్యరసం	స్థానం నరసింహారావు
ఊతపదాలు - వ్యర్థపదాలు	సాహిత్య విమర్శ వ్యాసం	తాపీ ధర్మారావు
నా విషయం	ఆత్మకథ	సంగం లక్ష్మీబాయి
బారిష్టర్ పార్వతీశం నవల		మొక్కపాటి నరసింహశాస్త్రి

ఇతిహాసం, పురాణం, ప్రబంధం, శతకం, నవల, కథానిక, గల్పిక, వార్తావ్యాఖ్య, పీఠిక, వ్యాసం, స్వీయచరిత్ర, జీవితచరిత్ర ప్రక్రియలపై సమగ్రంగా అభ్యసనం కొనసాగించాలి. ఆయా పాఠ్యాంశాలు ఏ పాఠ్యభాగం నుంచి గ్రహించారు. ఆ గ్రంథాలకు మూలగ్రంథాలను తప్పనిసరిగా అధ్యయనం చేయాలి.
గతేడాది ఎస్జీటీ పరీక్షలోని ప్రశ్నలను విశ్లేషిస్తే...

నార్ల వెంకటేశ్వరరావు గారి ఈ రచన, ప్రక్రియా రూప సహితంగా సరైంది (ఆ)

అ. నరకంలో హరిశ్చంద్రుడు - వ్యాససంపుటి
ఆ. కొత్తగడ్డ - నాటికా సంపుటి
ఇ. సీతజోస్యం - శతకం
ఈ. మూడుదశాబ్దాలు - నాటకం

సహజంగా అధ్యయనం చేసేటప్పుడు కవి పేరు అతని రచనలపైనే దృష్టి సారిస్తాం. ఆ రచన ఏ ప్రక్రియకు చెందిందో ఆ వైపుగా అభ్యసనం చేయం. 2012లో అడిగిన పై ప్రశ్నను చూస్తే హేతువాది నార్ల వెంకటేశ్వరరావు నాలుగు రచనలు ఏ ప్రక్రియకు చెందినవో తెలియకపోతే పై ప్రశ్నకు సమాధానం గుర్తించలేం. కనుక ప్రతి రచనకు ప్రక్రియ ఏదో తెలుసుకోవాలి. ఆ రచనకు మూలం కూడా అధ్యయనమే. ఈ కోణంలో కూడా ప్రశ్నలు అడగొచ్చు.

శ్రీనాథుడు రచించిన 'భీమఖండం' కావ్యానికి మూలం (ఈ)

అ. శివపురాణం ఆ. లింగపురాణం
ఇ. మార్కండేయ పురాణం ఈ. స్కాంద పురాణం

శ్రీనాథుడు 'కాశీపట్టణ విశిష్టత' పాఠ్యభాగం 'భీమఖండం' నుంచి గ్రహించింది. దీన్ని 'భీమేశ్వర పురాణం' అని కూడా అంటారు. ద్రాక్షారామ భీమేశ్వరుని గురించి వర్ణించిన క్షేత్ర మాహాత్మ్య కావ్యం. ఈ కావ్యాన్ని శ్రీనాథుడు ప్రౌఢ నిర్భరవయః పరిపాకంలో రచించాడు. శ్రీనాథుడు ఈ గ్రంథాన్ని తన బంధువైన బెండపూడి అన్నయామాత్యునికి అంకితమిచ్చాడు. శ్రీనాథుడు బంధువుకి అంకితమిచ్చిన ఒకే ఒక గ్రంథం భీమఖండం.

శ్రీనాథుడు ఎక్కువ గ్రంథాలను స్కాంద పురాణం మూలంగా చేసుకునే రచించాడు. భీమఖండం కూడా స్కాంద పురాణం మూలంగా చేసుకునే రచన చేశాడు. శ్రీనాథుని రచనలు, అంకిత విశేషాలను కూడా అధ్యయనం చేయాలి.

శ్రీనాథుని రచనలు	అంకితం
మరుత్తరాట్చరిత్ర (అలభ్యం)	మామిడి వేమన
పండితారాధ్య చరిత్ర (అలభ్యం)	మామిడి ప్రెగ్గయ్య
శృంగార నైషధం	మామిడి సింగన
హరవిలాసం	అవచి తిప్పయ్యశెట్టి (బాలసఖుడు)
కాశీఖండం	వీరభద్రారెడ్డి
శివరాత్రి మాహాత్మ్యం	ముమ్మడి శాంతయ్య
పల్నాటి వీరచరిత్ర	చెన్నకేశవస్వామి

ఇలా అందరి కవుల రచనలు, ప్రక్రియా విశేషాలు, మూల రచనల విశేషాలు, అంకిత విశేషాలు, కాల విశేషాలు అధ్యయనం చేయాలి.

వ్యాకరణం

'వ్యాక్రియంతే వ్యుత్పాద్యంతే శబ్దాః' అని వ్యాకరణ శబ్దానికి వ్యుత్పత్తి.
* శబ్దాలను శాసించేది వ్యాకరణం.
* భాష స్వరూప స్వభావాలను వివరించేది వ్యాకరణం.
* భాషలో సాధు అసాధు ప్రయోగాలను వివరించేది వ్యాకరణం.

తెలుగు భాషలో రాసిన మొట్టమొదటి వ్యాకరణం నన్నయ రాసిన ఆంధ్రశబ్ద చింతామణి. ఈ వ్యాకరణం సంస్కృతంలో రాశారు. తెలుగుభాషకి తెలుగులో రాసిన తొలి వ్యాకరణం ఆంధ్ర భాషా భూషణం. ఈ వ్యాకరణకారుడు మూలఘటిక కేతన. తెలుగు భాషకి ప్రామాణిక వ్యాకరణం చిన్నయసూరి బాలవ్యాకరణం.

వ్యాకరణంలో భాగంగా ఉచ్చారణ, ధ్వని, ధ్వన్యుత్పత్తి స్థానాలు, పదం, ప్రాతిపదిక, ప్రత్యయం, భాషాభాగాలు, పదం, అర్థాలు, నానార్థాలు, పర్యాయపదాలు, వ్యుత్పత్యర్థాలు, పదం - పరిమాణం, ప్రకృతి వికృతులు, మాండలిక విజ్ఞానం, అర్థ విపరిణామం, తత్సమం, తద్భవం, దేశ్యం, గ్రామ్యం, అన్యదేశ్యం, వాక్యభేదాలు, సంధులు, సమాసాలు, అలంకారాలు, ఛందస్సు, వ్యాకరణ పరిభాషను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.

2012 ఎస్జీటీ ఉపాధ్యాయ నియామక పరీక్షలో అడిగిన ప్రశ్నలను పరిశీలిద్దాం.

'నాలో అభ్యుదయ భావాలు వర్ధిల్లబడ్డాయి' అనే కర్మణి వాక్యానికి కర్తరి రూపం (అ)

అ. అభ్యుదయ భావాలు నాలో వర్ధిల్లాయి
ఆ. నాలోనూ అభ్యుదయ భావాలే వర్ధిల్లాయి.
ఇ. అభ్యుదయాలే భావాలుగా వర్ధిల్లాయి.
ఈ. నాలోనే అభ్యుదయ భావాలు వర్ధిల్లేవి

కర్త ప్రధానమైన వాక్యం కర్తరి వాక్యం. కర్మ ప్రధానమైన వాక్యం కర్మణి వాక్యం. కర్మణి వాక్యంలో 'బడు' అనే ప్రత్యయం చేరుతుంది. సంస్కృత భాషా ప్రభావం వల్ల కర్మణి ప్రయోగాలు తెలుగు భాషలోకి ప్రవేశించాయి. కర్మణి ప్రయోగాలు తెలుగు భాషకి సహజం కావు. సంస్కృత భాషకే అవి సొంతమైనవన్న

అంశాలపై అభ్యర్థికి పరిజ్ఞానం ఉండాలి.

నువ్వు నాతో 'నువ్వు మంచి వాడివి' అని అన్నావు అనే ప్రత్యక్షానుకృతి వాక్యానికి, పరోక్షానుకృతి రూపం (ఆ)

అ. నేను నీతోనే, మంచి వాడినని అన్నావు
ఆ. నువ్వు నాతో, నేను మంచివాడినని అన్నావు
ఇ. నువ్వు నాతో, నీవు మంచివాడవని అన్నావు
ఈ. నువ్వు నాతో, మంచివాడిగా ఉంటానన్నావు.

వాక్యాలకి సంబంధించి రెండు ప్రశ్నలు తప్పనిసరిగా అడిగే అవకాశం ఉంది. వాక్యాల్లో భాగంగా వీటిపై దృష్టి సారించాలి.

* సామాన్య వాక్యం
* సంశ్లిష్ట వాక్యం
* సంయుక్త వాక్యం
* నామ్నీకరణం
* ప్రత్యక్షానుకృతి వాక్యం
* పరోక్షానుకృతి వాక్యం
* సకర్మక వాక్యం
* అకర్మక వాక్యం
* సామర్థ్యార్థక వాక్యం
* సందేహార్థక వాక్యం
* ప్రశ్నార్థక వాక్యం
* నిశ్చయార్థక వాక్యం
* విధ్యర్థక వాక్యం
* అనుమత్యర్థక వాక్యం

బోధనా పద్ధతులు

తెలుగు బోధనాపద్ధతుల్లో భాగంగా అధ్యయనం చేయాల్సినవి.

* భాష
* మాతృభాష
* మాతృబోధన లక్ష్యాలు
* ఆంధ్రసాహితీ సంగ్రహం
* బోధనాభ్యసన ఉపకరణాలు
* భాషానైపుణ్యాలు
* ప్రణాళికారచన
* బోధనా పద్ధతులు
* మూల్యాంకనం
* వనరుల వినియోగం - సహపాఠ్య కార్యక్రమాలు

ఈ విభాగం నుంచి అనువర్తిత ప్రశ్నలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. కాబట్టి తెలుగు అకాడెమీ వారి డీఎడ్ తెలుగు బోధనా పద్ధతులు క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. ఈ విభాగం నుంచి 2012 పరీక్షలో అడిగిన ప్రశ్నల తీరు గమనిద్దాం.

ఉపవాచకం నందలి భాషాస్థాయి ఈ విధంగా ఉండాలి(ఇ)

అ. విద్యార్థులు చదువుతున్న తరగతి కంటే కింది స్థాయిలో కానీ, చదువుతున్న తరగతి స్థాయిలోనైనా ఉండాలి.
ఆ. విద్యార్థులు చదువుతున్న తరగతి కంటే పైస్థాయిలో కానీ, చదువుతున్న తరగతి స్థాయిలోనైనా ఉండాలి.
ఇ. విద్యార్థులు చదువుతున్న తరగతి కంటే కింది తరగతి స్థాయి ఉండాలి.
ఈ. విద్యార్థులు చదువుతున్న తరగతి కంటే పైతరగతి స్థాయిలో ఉండాలి.

మొదట భాషలో గుర్తించిన ప్రధాన సామర్థ్యాలు, ఉపసామర్థ్యాలు క్రమంగా ఇలా ఉండాలి. (ఈ)

అ. ప్రధాన సామర్థ్యాలు - 95, ఉపసామర్థ్యాలు - 9
ఆ. ప్రధాన సామర్థ్యాలు - 4, ఉపసామర్థ్యాలు - 80
ఇ. ప్రధాన సామర్థ్యాలు - 5, ఉపసామర్థ్యాలు - 90
ఈ. ప్రధాన సామర్థ్యాలు - 9, ఉపసామర్థ్యాలు - 95

తెలుగు పాఠ్యాంశాల చివర విశేషాంశాలపై ప్రత్యేక దృష్టి కోణంలో అభ్యసనం చేయాలి. సాహితీ ప్రక్రియలు, కవులు - రచనా విశేషాలు, వ్యాకరణ విజ్ఞానం, బోధనా పద్ధతులు అన్ని అంశాలకు సమాన ప్రాధాన్యతనిచ్చి అధ్యయనం కొనసాగించాలి. 'కాదేదీ ప్రశ్న కనర్హం' అనే విషయం గుర్తుపెట్టుకొని అభ్యసనం ప్రారంభించండి.

- సాయి

సహజీవని

నా ఇంట్లో
ఆ మూల సజ్జపై ఉన్న స్థలం
కబ్జా చేసిందో పిచ్చుక
అంతేకాకుండా
ఏ రూపశిల్పిని సంప్రదించిందో కాని
రెమ్మలతో.. పుల్లలతో
చూడచక్కని గూడు కట్టుకుంది
నా అద్దాన్ని దాని అందం చూసుకోవడానికి
వాడుకుంటోంది
కిటికీ రాజమార్గంలోంచి
తోచినప్పుడు రావడం.. పోవడం
నా ఇల్లో పక్షి సత్రమైపోయింది
ఇప్పుడు దానికోసం ఎదురుచూసే
రెండు పిల్లలు కూడానూ..
ఇసంటా రమ్మంటే ఇల్లంతా నాదేననడం
ఇదేనేమో?
మొత్తం సంసారమే పెట్టేసింది
నిశ్శబ్దాన్ని ఇష్టపడే నాకు
వాటి కువకువలు ఇబ్బంది పెట్టేస్తున్నాయ్
ఇల్లు శుభ్రం చేస్తున్నప్పుడల్లా
గూటిని తీసిపారెయ్యాలనుకుంటాను..
కానీ ఎందుకో.. చేతులు రావు
అదేంటో..
ఇప్పుడిప్పుడే వాటితో సహజీవితానికి
అలవాటు పడుతుంటే
ముందు రెక్కలొచ్చిన పిల్లలు
ఎగిరిపోయాయి
తర్వాత నాలుగు రోజుల నుంచీ
తల్లి పిచ్చుకా గూటి గడప తొక్కలేదు
ఏమైందో పాపం!
బోసిపోయిన గూడు
నా మనసుని బోలు చేసింది!

ప్రతాప వెంకట సుబ్బారాయుడు
సికింద్రాబాద్, 93939 81918

ప్రేమ లేఖల పోటీలో
రూ.1116 గెలుచుకున్న లేఖ



ప్రియమైన అక్షరానికి...

చిన్నప్పుడెప్పుడో... అమ్మ ఒడిలో ఆటలాడుకున్నప్పుడో, నాన్న చిటికెన వేలు పట్టుకుని నడక నేర్చుకుంటున్నప్పుడో సరిగ్గా గుర్తు లేదుగానీ, తొలిచూపులోనే భలే నచ్చేశావ్. చిక్కటి చీకటిలో వెన్నముద్దలు ఆరేసినట్టు, నల్లటి పలకపై తెల్లగా మెరిసిపోతూ విచిత్రంగా కనిపించావ్. అప్పుడే తొలిసారి నీ మాయలో పడిపోయుంటా. 'అ' అమ్మ, 'ఆ' ఆవు అంటూ మొదలైన నీతో పరిచయం ఇంకా లీలగా నా కళ్లముందు మెదులుతూ ఉంది. 'ఎప్పటికైనా మన కడుపు నింపేవి ఈ అక్షరాలే బుజ్జికన్నా...' అని అమ్మ లాలనగా అంటుంటే - 'అ, ఆ లేమైనా వండుకొని తింటామా?' అనుకొనేవాడిని. అప్పటి నా మట్టి బుర్రకు అంతే అర్థమైంది మరి. గుణింతాలూ, నుడికారాలూ, కథలూ, పద్యాలూ, పురాణాలూ, పాఠాలూ అంటూ నన్ను నా జీవితంలోకి పరుగులు పెట్టించావు. ఓ స్నేహితునిలా, ప్రేయసిలా...!

కనికి కొన పట్టుకొని 'అ'ని దిద్దుతున్నప్పుడు అమ్మే గుర్తొచ్చేది. బడికీ, ఇంటికీ ఉన్న దూరాన్ని తగ్గించేసి - మా అమ్మని నా పక్కనే కూర్చోబెట్టేది. ఇది మాత్రమే కాదు. ఒక్కో అక్షరమై నువ్వు నా మనసులో ముద్రించుకుపోవడానికి ఒక్కో కారణం ఉంది.

'శ్రీ' అచ్చం నటరాజుని ప్రతిరూపంలా తోచేది. ఎన్నిసార్లు దండం పెట్టానో...?

'శ' అయితే పల్లెదనం నడుమొంపులా చూడగనే గబుక్కున ఆకర్షించేది. ఇంకెన్నిసార్లు సిగ్గు పడ్డానో...?!

'ఠ'లోని ఠీవే వేరు. శివుడి కంఠంలో దాక్కున్న గరళంలా గంభీరంగా కనిపించేది.

'గ' అయితే కొన కత్తిరించిన గుత్తొంకాయలా నిగనిగలాడిపోయేది.

'తి' తిరున్నాళ్లలో కొన్న జంతికలా దర్శనమిస్తే - పండక్కి అమ్మ చేసే బెల్లం జిలేబిలా 'ఋ' ఊరించేది. ఇంకోసారి పట్టాలపై దూసుకెళ్లే రైలింజనులా మారిపోయేది. అచ్చులు బెల్లమచ్చులైపోయి - హల్లులు నేతి హల్వాల్లా మారిన తియ్యని జ్ఞాపకాలు కోకొల్లలు. ఇలా ఒక్కో అక్షరంతో ఒక్కో అనుభూతిని మిగిల్చావు. అందుకే నువ్వంటే అంత ప్రేమ.

నిన్ను ఎన్నెన్ని రూపాల్లో దర్శించుకునే భాగ్యం దక్కిందో..?! శ్రీశ్రీ సన్నిధిలో శ్రామిక రక్తాక్షరివై పొంగిపోయేదానివి. తిలక్ దగ్గర వెన్నెలలో ఆడుకొనే అందమైన ఆడపిల్లలా మారి అల్లరి చేసేదానివి. సినారె నట్టింట్లో మాత్రం సంక్రాంతి ముగ్గులా ఎంత సంప్రదాయబద్ధంగా కనిపించావో...? చలం కలం ప్రవాహంలో నీకెన్ని కొత్త ఒంపులొచ్చాయో...? పింగళి పలుకుల్లో, వేటూరి వర్ణనల్లో నీ జిలుగులూ, వెలుగులూ చూడతరమా?! నిన్ను నింపుకొన్న కవిత్వం సాయంత్రపు చిరుగాలిలా హాయిని పంచితే కథ సూర్యోదయంలా మేల్కొల్పేది. ఇంతింత సౌందర్యాన్ని కేవలం చూస్తూ మురిసిపోతూ ఉండటం ఇష్టంలేక ప్రేమించడం మొదలు పెట్టా. 'సున్నా'ని చూస్తే మాత్రం కాస్తో కూస్తో జాలేస్తూ ఉంటుంది. అక్షరమాలలో ఒంటరిగా నిలబడే అదృష్టం లేక, బిక్కుబిక్కుమంటూ ఇంకో అక్షరం పంచకి చేరుతుంది కానీ... అది లేకపోతే పదాలకు సంపూర్ణ సౌందర్యం ఎక్కడుంది? పదాల అర్థాలు మార్చేసే నేర్పరి, గడసరి.

నీ సుగంధం, నీ సోయగం అప్పుడూ ఇప్పుడూ ఒకేలా ఉంది. మేం మాత్రం చాలా మారిపోయాం. అమ్మలాంటి నిన్ను అడుగడుగునా నిర్లక్ష్యం చేశాం. పరాయి పదాల మధ్యన ఇరికించి కలుషితం చేశాం. నీ మాధుర్యాన్ని గత వైభవంగా విడిచిపెట్టి మరో మోజులో పాకులాడాం. ఇంతకాలానికి మెల్లగా కళ్లు తెరుస్తున్నాం. బడిలో నిన్ను దిద్దుకొన్నట్టే ఇప్పుడు మమ్మల్నీ, మా తప్పుల్నీ సరిదిద్దుకొని మళ్లీ తెలుగుదనాల గుమ్మంలోకి అడుగుపెడుతున్నాం. ఎప్పటిలా మమ్మల్ని నీ దరి చేర్చుకొంటావనీ, ప్రేమగా లాలిస్తావనీ ఆశిస్తూ...

- అన్వర్, హైదరాబాద్

మాతృభాషలకు మరణశాసనం

ప్రవాసాంధ్రులకు తెలుగుపై మమకారం ఎక్కువ. మన రాష్ట్రంలో తెలుగుకు దక్కుతున్న ఆదరణ కంటే అమెరికా గడ్డపై దానికి అందుతున్న సత్కారాలధికం... ఈ మాటలను తరచూ వింటున్నాం. వినడమే కాదు అమెరికాలోని తెలుగు వారి మాతృభాషాభిమానాన్ని కళ్లారా చూస్తున్నాం. తమ పిల్లలకు తెలుగు నేర్పడానికి వారు చేస్తున్న కృషిని తెలుసుకుంటున్నాం. బాగుంది. మరి అమ్మభాషపై వారిలో ఈ స్థాయిలో అభిమానం ఉండటానికి కారణమేంటి? సొంతగడ్డకు దూరంగా ఉండటమేనా? లేదా అమెరికాలోని కాలమాన పరిస్థితులు ప్రవాసాంధ్రులను తమదైన భాష వైపు నడిపిస్తున్నాయా? భూతల స్వర్గంలా భావించే అమెరికాను భాషాపరంగా పరిశీలిస్తే ఎంతటి భయంకర వాస్తవాలు కనిపిస్తాయి?

స్టాన్‌ఫోర్డ్ లా స్కూల్ (అమెరికా) విద్యార్థి రోహిత్ కుమార్... 'ది హఫింగ్టన్ పోస్ట్' పత్రికలో రాసిన ఈ వ్యాసాన్ని చదవండి. పై ప్రశ్నలన్నింటికీ సమాధానం లభిస్తుంది. ఎప్పుడో తాతల తండ్రుల కాలంలో అమెరికాలో స్థిరపడ్డ ఉత్తర భారతీయ కుటుంబానికి చెందిన రోహిత్ మాటల్లో అమెరికా అసలు రూపం దర్శనమిస్తుంది.

ఊహ తెలిసిన తర్వాత ఈ ప్రపంచానికి నన్ను నేను పరిచయం చేసుకుంది హిందీలో. అది ఉత్తర భారత దేశ భాష. కానీ, నేను ప్రాథమిక పాఠశాలలో చేరాక పరిస్థితి మారిపోయింది. అక్కడ నా భాషపై జాలిపడేవాళ్లు ఎక్కువయ్యారు. ఆ వాతావరణంలో ఎక్కువ సమయం గడపడం వల్ల నేను నా అమ్మభాషకు దూరమయ్యా. తరాల తరబడి మా జాతి నాలుకలపై నాట్యం చేస్తూ వస్తున్న అక్షరాలను మర్చిపోవడం మొదలుపెట్టా. క్రమంగా నా మాతృభాష మెదడులోని చీకటిపొరల్లోకి వెళ్లిపోయింది. చివరికి... అమెరికాలోని వలసదారుల పిల్లల మాదిరిగానే ఆంగ్లంలో మాత్రమే ధారాళంగా మాట్లాడగలిగే స్థితికి చేరుకున్నా.

కలిసికట్టుగా పనిచేసే వివిధ శక్తుల కారణంగానే అమెరికాలోని వలస జాతులు తమ భాషలను పోగొట్టుకున్నాయి. ప్రసార మాధ్యమాలు, విద్యావ్యవస్థ, ఉద్యోగావకాశాలు... అన్నీ ఈ భాషా విధ్వంసంలో పాత్రధారులే. వీటన్నింటికీ మించి వలస జాతి ప్రజల సొంత గొంతులను కత్తిరించిన మారణాయుధం మరొకటుంది. అదే శతాబ్దాల తరబడి జుగుప్సాకరమైన వారసత్వ సంపదగా వస్తున్న సామ్రాజ్యవాదం. దీని వల్లే శ్వేత జాతేతర ప్రజలందరి మనస్సుల్లో సొంత సంస్కృతులు, భాషలపై తృణీకారభావం మొదలైంది. తమవైన కట్టు బొట్టు, మాటలు అనాగరికమైనవన్న విషభావనను వలసదారులందరిలోనూ నింపింది ఈ సామ్రాజ్యవాదం.

ప్రజలను విభజించి, వారికంటూ సొంత అస్తిత్వం లేకుండా చేసి, తమ అధికార చట్రంలోకి తెచ్చుకోవడానికి సామ్రాజ్యవాదులు అమలు చేసిన వ్యూహం... భాషా విధ్వంసం. ఒక జాతికి సొంత గొంతు అంటూ లేకుండా చేసి... తమ పలుకునే వారి మాటగా మార్చి తమలో 'కలిపేసుకున్నారు' సామ్రాజ్యవాదులు. ఇక్కడ కలిపేసుకోవడం అంటే... ఆ జాతి మూలాలను ఛిద్రం చేయడం. ఈ పద్ధతిలోనే అమెరికా భూమిపుత్రులను (నేటివ్ అమెరికన్స్) వారి తెగల నుంచి వేరు చేసి తెచ్చి ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో పడేశారు. అక్కడ వారి అమ్మభాషలను మాట్లాడుకోనీయకుండా కట్టడి చేశారు. ప్రస్తుత తరం వలసదారుల వారసులు (నాతో సహా) తమ వారసత్వ సంపద(భాష)కు దూరమవ్వడానికి కారణం... ఇప్పటికీ అమెరికన్ పాఠశాలల్లో అమలవుతున్న భాషా సామ్రాజ్యవాద పద్ధతులే. అయితే, గతంలోలా ఇవి బహిరంగంగా కనపడటం లేదు.

భాష అనేది మన ఆలోచనలకు ఒక రూపమిస్తుంది. మన మీద మనకు, ప్రపంచం మీద మనకు ఓ దృష్టిని ప్రసాదిస్తుంది. ఏ జాతికి సంబంధించిన భాష అయినా మానవ జీవితాన్ని తనదైన దృష్టికోణంలో ఆవిష్కరిస్తుంది. జాతికంటూ ఓ ప్రత్యేకతను తెచ్చిపెడుతుంది. నేను నా హిందీని కోల్పోయినప్పుడు... నా ప్రజలతో సంబంధాలను కూడా కోల్పోయాను. వారితో నన్ను అనుసంధానించుకునే

అవకాశానికి దూరమయ్యా.

మాతృభాషంటూ లేకపోతే ఏ జాతీయుల మధ్యా ఎలాంటి గాఢానుబంధమూ అభివృద్ధి చెందదు. భాషకు దూరమైతే మనదైన సమూహం నుంచి కూడా దూరమైపోతాం. కేవలం వ్యక్తులుగా మిగిలిపోతాం. అలాంటప్పుడు మనకు ఒక అమెరికన్‌తో ఉండే బంధమే సాటి హిందీ వ్యక్తితో కూడా ఉంటుంది. అది చివరికి ఒక జాతిగా మనల్ని బలహీనులను చేస్తుంది. అమెరికాలో ఇప్పటి వరకూ జరిగింది ఇదే.

మనం ఇప్పటికీ స్వచ్ఛమైన, సమానత్వపు వ్యవస్థకు దూరంగా బతుకుతున్నాం. వ్యవస్థతో పనిపడ్డ ప్రతిసారి శ్వేతజాతేతర ప్రజలకు పక్షపాతంతో కూడిన అనుభవాలే ఎదురవుతున్నాయి. ప్రతిసారి, ప్రతిచోటా ఇదే దుస్థితి. అర్థ, అధికార బలాలు మనకు తక్కువ. సామాజిక, రాజకీయ అధికారానికి మనం దూరంలో ఉన్నాం. స్వచ్ఛమైన తిండి మనకందదు. పట్టణాల్లోని కాలుష్యభరితమైన ప్రాంతాల్లో మనం నివసించాలి. కలుషితమైన నీటితో దాహం తీర్చుకోవాలి. ఇవన్నీ మనం మనదైన అస్తిత్వాన్ని కోల్పోవడం వల్ల అనుభవిస్తున్న కష్టాలు. సొంత భాషను పోగొట్టుకోవడం వల్లే మనం విడిపోయాం. అమ్మభాషను కాపాడుకోవడం ద్వారా మాత్రమే మనం శక్తివంతమైన సమూహంగా ఎదగగలం. మన భాష మనల్ని ఒకే జట్టుగా కలిపి ఉంచుతుంది. మన వారితో మన భాషలో మాట్లాడటం ద్వారా మన సంస్కృతిని సజీవంగా ఉంచుకోగలం. ఇదే మనకు గర్వకారణం. ప్రస్తుతం అమెరికాలోని మన పరిస్థితి బాగుపడాలంటే భాషను బతికించుకోవడం ఒక్కటే మార్గం.

నాలాంటి వలసదారుల పిల్లలందరినీ శ్వేత జాతి సంస్కృతిలోని అల్పసంఖ్యాక వర్గాల వారిగా జమకడుతున్నారు. చారిత్రకంగా చూసినా, ప్రస్తుత కాలమాన పరిస్థితుల దృష్ట్యా చూసినా... ఇక్కడి సమాజాన్ని యురోపియన్ అమెరికన్ సంస్కృతికి ఆలవాలంగా మార్చినట్లు కనిపిస్తోంది. మేం వెనకబడిన వారమని, మా సంస్కృతులు తక్కువ స్థాయివనే మాటలు తరచుగా వినిపిస్తున్నాయి.

నేను బర్కిలీలో కళాశాల జీవితాన్ని ప్రారంభించినప్పుడు హిందీని తిరిగి నేర్చుకోవడం ప్రారంభించా. హిందీ

కాటేస్తే...?

కట్నం
కోబ్రా
కాటేస్తే
కాటికే!

తరగతులకు వెళ్లా. తర్వాత భారతదేశానికి ప్రయాణమయ్యా. అక్కడికి వెళ్లాక ఆర్నెల్ల పాటు వేరే ఆలోచనను దరిచేరనీయకుండా హిందీని మాత్రమే శ్వాసించా. ధ్యానించా. కలలో కూడా దాన్నే ఉచ్చరించా. దాంతో నా భాషలో నేను మళ్లీ ధారాళంగా మాట్లాడగలిగే స్థాయిని అందుకున్నా. మాతృభాషతో అనుబంధం ఉన్నప్పుడు మాత్రమే మన సంస్కృతిని సరిగ్గా అర్థం చేసుకోగలం. మనదైన సంస్కృతిలో దాగున్న విజ్ఞానమంతా భాషతోనే మనకందుతుంది. నేను హిందీని తిరిగి తెచ్చుకున్నాక నా జీవితం వర్ణరంజితమైంది. నా ఆలోచనలు మారాయి. అది ఎలా అంటే చిన్న ఉదాహరణ చెప్పుకోవాలి. హిందీలో నిన్న, రేపులను చెప్పడానికి ఒకే పదం వాడతారు. 'కల్' అని. అంటే, కాలమనేది ఆద్యంతాలకు అతీతంగా చక్రంలా పరిభ్రమిస్తూ ఉంటుందనేగా. ఆంగ్లం మాత్రమే వచ్చినవాడికి ఈ తత్వంలోని వాస్తవం బోధపడదు. ఎందుకంటే వారి సంస్కృతి రేఖామాత్రమైంది.

పురాతనమైన, చారిత్రకమైన నా సంస్కృతితో తిరిగి నన్ను నేను అనుసంధానించుకున్నా. అది నాకు గొప్ప మానసిక బలాన్నిస్తోంది. ఏ వలసజాతి అమెరికన్ అయినా తన సంస్కృతితో, సమూహంతో బంధాన్ని కొనసాగించడానికి ఉపయోగపడే ఉత్ప్రేరకంగా అమ్మభాష పని చేస్తుందని అనుభవపూర్వకంగా తెలుసుకున్నా.

ప్రజల్లో మార్పు వస్తేనే పాలకుల్లో మార్పు

భాషా శాస్త్రంలో పలు పుస్తకాలు రాశారు. భాషావేత్తగా ఖ్యాతి పొందారు. భారతీయ భాషలకు సంబంధించి పరిశోధన, విద్యాబోధన, ప్రభుత్వ విధానం వంటి అంశాల్లో దశాబ్దాల అనుభవం గడించారు. ఆయనే ఆచార్య కస్తూరి విశ్వనాథం. మైసూరులోని భారతీయ భాషా సంస్థ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ – సి.ఐ.ఐ.ఎల్)లో ప్రధానాచార్యులుగా, ఉపసంచాలకులుగా పనిచేసి పదవీ విరమణ పొందారు. తెలుగు భాష ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తెలుగు వెలుగు'తో చర్చించారు.

తె.వె. మీరు భారతీయ భాషా సంస్థలో పని చేస్తున్నపుడు తెలుగు అభివృద్ధికి అక్కడ ఎలాంటి కృషి జరిగింది?

కస్తూరి: (అ) ఉత్తరాది రాష్ట్రాల్లో ముఖ్యంగా హర్యానాలో తెలుగును మూడో భాషగా బోధించే విద్యాలయాలు ఉండేవి. కానీ తెలుగు తీసుకునే విద్యార్థులు తక్కువ. దాంతో ప్రత్యేకంగా తెలుగు ఉపాధ్యాయులను నియమించేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వెనకాడేవి. ఈ పరిస్థితిని తప్పించేందుకు భారతీయ భాషా సంస్థ ఒక ప్రతిపాదన చేసింది. దాని ప్రకారం ఆయా రాష్ట్రాల్లోని స్థానిక ఉపాధ్యాయులకే తెలుగు నేర్పించే కోర్సులను ప్రవేశపెట్టాం. ఇది పదిహేనేళ్లు నిర్విరామంగా సాగింది. గత పదేళ్లుగా కాస్త మందగించింది.

(ఆ) కేంద్రీయ విద్యాలయాల్లోని విద్యార్థులకు మూడేళ్లపాటు మాతృభాష చదువుకునే సదుపాయం ఉంటుంది. వీరికి తెలుగు వాచకాలు తయారు చేశాం.

(ఇ) పరాయి రాష్ట్రాల్లోనో, దేశాల్లోనో ఎక్కువకాలం గడిపిన వారికి మాతృభాషాజ్ఞానం క్షీణిస్తుంది. వారికోసం 'పునశ్చరణ తరగతులు' ఏర్పాటు చేస్తున్నాం. వీటిలో తెలుగు ఉంది.

(ఈ) భాషల మధ్య బాంధవ్యాలను పరిశోధనాత్మక పద్ధతిలో విశ్లేషించడం కూడా మా ఉద్దేశాల్లో భాగం. ఈ క్రమంలో తెలుగుకూ ఇతర భాషలకు మధ్య సంబంధాలపై ఎన్నో పరిశోధనలు జరిగాయి, జరుగుతున్నాయి.

తమిళ, తెలుగు, కన్నడ భాషలను ప్రాచీన భాషలుగా గుర్తించాలన్న ప్రతిపాదనల పుట్టు పూర్వోత్తరాలేమిటి?

అసలు ఈ ప్రాచీన భాష హోదా అనే ప్రతిపాదన పుట్టింది తమిళ భాష కోసమే. దీని వెనుక రాజకీయ కారణాలున్నాయి. ఒక రుజువు చెప్తాను. సంస్కృతానికి దీటైన భాష తమిళమనీ, కాబట్టి సంస్కృతానికి ఇచ్చినట్టు తమ భాషకు ప్రాచీన భాష హోదా కావాలనీ తమిళులు పట్టుబట్టడంతో ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. కానీ చిత్రమేమిటంటే తమిళానికి ఈ హోదా వచ్చేనాటికి సంస్కృతానికి ఇంకా ఆ హోదా లేనే లేదు. ఈ సంగతి ప్రభుత్వానికి తర్వాతే తెలిసింది. తమిళానికి ఇచ్చిన ఏడాది తర్వాత

సంస్కృతానికి అధికారికంగా ఈ హోదా ఇచ్చారు. అప్పటి యూపీఏ ప్రభుత్వంలో డి.ఎం.కె భాగస్వామ్య పార్టీ. దాని అధ్యక్షుడైన కరుణానిధి భాషాభిమానం అందరికీ తెలిసిందే. ఆయన కేంద్రంపై చాలా ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ సంగతి అప్పటి ఓ కేంద్ర మంత్రే స్వయంగా నాతో చెప్పారు. కరుణానిధి వారానికో లేఖ రాసేవారట. మారన్ రోజూ ఫోన్ చేసేవారట. ఇలా వాళ్ల నాయకుల చొరవ వల్లే తమిళానికి ఈ హోదా సాధ్యమైంది. మన నాయకుల జడత్వం వల్ల మనకు చేజారిపోయేదే. కాని ప్రజల్లో కాస్తో కూస్తో చలనం రాబట్టి దక్కింది. అయితే హోదా దక్కితే చాలదు కదా. పనులు జరగాలి. పనులు జరగాలంటే చిత్తశుద్ధి గల నాయకులు కావాలి. తమిళనాడుకు కరుణానిధి ఉన్నారు. మనకు భాషాభిమానం గల నాయకులెందరున్నారు?

భాషాభిమానం ఉన్న నాయకులు కరవయ్యారన్నది నిజం. పరిస్థితిలో మార్పునకు ఏం చేయాలి?

మన నాయకుల నిర్లక్ష్యంపై ఎంత చెప్పుకున్నా కంఠశోషే అవుతుంది. నిజానికి ఇపుడు మైసూరులో ఉన్న భారతీయ భాషా సంస్థ అసలు మన రాష్ట్రంలోనే ఏర్పాటు కావాల్సింది. 1969లో కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా దీన్ని హైదరాబాదులో పెడతామంటూ కేంద్రం నుంచి ఒక ప్రతిపాదన వచ్చింది. కానీ బ్రహ్మానందరెడ్డి అప్పట్లో చెన్నారెడ్డి లేవనెత్తిన అసమ్మతిని ఎదుర్కొనే ప్రయాసలో ఉన్నారు. తాత్కాలిక వసతి చూపించటంలోనూ, కేంద్రానికి నిర్ణయం తెలియజేయడం లోనూ ఆలస్యం జరిగింది. ఈ లోగా సంస్థ మైసూరుకు తరలిపోయింది. అది మనకు దక్కి ఉంటే ఇపుడు ఈ ప్రాచీన తెలుగు భాషాధ్యయన కేంద్రాన్ని ప్రత్యేకంగా ఇక్కడ ఏర్పాటు చేసుకోవడమన్న ప్రసక్తే ఉండేది కాదు. వర్తమానంలో చిన్న నిర్లక్ష్యం దీర్ఘకాలికంగా ఎలాంటి ప్రభావం చూపిస్తుందన్న దానికిది ఒక ఉదాహరణ.

నాయకులు కదలాలంటే ముందు ప్రజల్లో కదలిక రావాలి. కర్నాటకలో భాషా సంస్కృతుల రక్షణకు ప్రజా సంఘాలు ఉన్నాయి. 'కర్నాటక రక్షణ వేదిక' అనే సంఘం ఉంది. ఆ సంఘ సభ్యులు కన్నడంలో పేర్లు పెట్టని దుకాణాల బోర్డులపై తారు పూస్తారు. ఇలాంటివి అక్కడ ఓ అరడజను సంఘాలున్నాయి. ఇవన్నీ ప్రతి ఏడాది నవంబరు నెలలో 'రాష్ట్రావతరణ మాసం'గా ఉత్సవాలు జరిపి హడావుడి చేస్తాయి.

వాటిలో సభ్యుల సంఖ్య కూడా వేలల్లో ఉంటుంది. అక్కడ ఆర్టీవో కార్యాలయానికి వెళ్లినా, కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లినా

దృష్టి

వృత్త పరిధిలోనివి
కనుచూపులు
పరిధేలేనివి
మనసు చూపులు

దరఖాస్తులన్నీ కచ్చితంగా కన్నడంలోనే నింపాలి. భాషలో చొరబడే ప్రతీ ఆంగ్ల పదానికి బదులు కన్నడ పదాల్ని వెతికి అమల్లోకి తెస్తారు. దీని కోసం ప్రత్యేకంగా డెబ్బైమంది ఉద్యోగులతో ఒక అనువాద విభాగం పని చేస్తుంది. వీరి అనువాదాలు చూస్తే నవ్వొచ్చే సందర్భాలూ లేకపోలేదు. కానీ ప్రజలు కొంత కాలానికి అలవాటు పడిపోతారు. మనవాళ్లు మాత్రం ఇలాంటి ప్రయత్నం ఏం చేసినా వెంటనే 'వింటానికి బాలేదు' అంటారు. పదం ఎంత కొత్తగా ఉన్నా వాడుకలో చెవికింపుగా మారే అవకాశం ఉందని గ్రహించరు.

ప్రాచీన భాషల హోదా దక్కిన వాటి అభివృద్ధికి 'ప్రాచీన భాషాధ్యయన కేంద్రా'లంటూ కేటాయిస్తున్నారు. మన భాషకూ ఒకటి ఏర్పాటు కానుంది. దీని వల్ల తెలుగుకు కలిగే ప్రయోజనమేమిటి?

ఈ అధ్యయన కేంద్రం ఏర్పడితే మన ప్రాచీన తెలుగు సాహిత్య సంపదకు మంచి ప్రయోజనం కలుగుతుంది. ఇప్పుడు వ్యవహారంలో ఉన్న తెలుగుకు ప్రాచీన కావ్యాల్లో కనిపించే తెలుగు మాతృక. కానీ తరాలు మారేకొద్దీ ఆ ప్రాచీన భాషతో మనకు అనుబంధం సన్నగిల్లుతోంది. నేటి తరంలో దాన్ని అర్థం చేసుకోగలిగేవారు అరుదు. వీరంతా ఇంగ్లిషు బడుల్లో రైమ్స్ వల్లె వేసిన వారు. వాటిలో నీతి అనేదేమీ ఉండదు. మన ప్రాచీన సాహిత్యం నైతికంగా ఎంతో బలవర్ధకమైంది. అలాంటి ప్రాచీన సాహిత్యాన్ని కనుమరుగవకుండా కాపాడుకోవడం, అధ్యయనం ద్వారా దాని పట్ల అవగాహనను పెంపొందించడం, దానికీ ఆధునిక తరాలకీ మధ్య పటిష్ఠమైన వారధిని ఏర్పరచటం... ఇవీ ఈ భాషాధ్యయన కేంద్రం మౌలిక ఆదర్శాలు. వీటినే ఒక నినాద రూపంలో "పరిరక్షణ, పరివ్యాప్తి, పరిపోషణ" (To preserve, promote and propagate) అని అంటున్నారు.

మన తెలుగు సంస్థ ఇప్పటికే పని చేస్తూండాల్సింది. మొదట దాన్ని మైసూరు లోని భారతీయ భాషా సంస్థలో భాగంగా ఏర్పాటు చేయాలనుకున్నారు. 2011 నవంబరు 17న ప్రారంభోత్సవం కూడా అయ్యేదే. ఇంతలో మైసూరులో వద్దు, మన రాష్ట్రంలోనే కావాలి అన్న వివాదం మొదలైంది. కేంద్రం దానికీ తలూపింది. మన పాలకులు మాత్రం ఇంకా స్థలాన్ని కేటాయించలేకపోయారు. కనీసం తాత్కాలిక వసతిని చూపించలేకపోయారు.

ప్రాచీన తెలుగు భాషాధ్యయన కేంద్రాన్ని మైసూరు నుంచి ఇక్కడికి మార్చడం పట్ల మీరు సుముఖత వ్యక్తం చేయలేదు. ఎందుకు?

ఇది కేంద్రప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం. దీనికి నిధులు విడుదల కావాలన్నా, బిల్లులు మంజూరవ్వాలన్నా అనుమతులు కేంద్రం నుంచే లభించాలి. తమిళాన్ని చెన్నైకి తరలించిన తరువాత కూడా కేంద్రం ఈ పనులన్నీ మైసూరులోని భారతీయ భాషా సంస్థ (సి.ఐ.ఐ.ఎల్) ద్వారా చేసింది. దీనిపై సంతకాలు అక్కడి అధికారులే చేయాలి. మొదట అనుకున్న ప్రకారం మన ప్రాచీన తెలుగు భాషాధ్యయన కేంద్రం మైసూరులోనే ఏర్పాటై ఉంటే ఇవన్నీ సులభంగా, ఆలస్యం

కాకుండా అయ్యేవి. ఆ తర్వాత తమిళ విషయంలోలాగా రాష్ట్రానికి తరలించి ఉండవచ్చు.

అదీగాక మైసూరులో ఇప్పటికే అధునాతన సౌకర్యాలున్నాయి. ఆధునిక భాషా ప్రయోగశాల, ఇండోరు స్టూడియో, ఎడిటింగు విభాగం, ప్రివ్యూ థియేటరు, సమావేశ మందిరాలు ఉన్నాయి. ఆధునిక సౌకర్యాలు కలిగిన ముద్రణాలయం కూడా ఉంది. సిద్ధంగా ఉన్న ఇన్ని సౌకర్యాలు వదులుకోవడం ఎందుకన్నది నా ప్రశ్న. అంతేకాక, కార్యకలాపాల్లో రాజకీయ ప్రమేయం అధికమై తెలుగు అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయాలకు పట్టిన గతే పట్టి ఈ కొత్త సంస్థ కూడా నశించిపోతుందని నా భయం.

కానీ తమిళులు మార్చుకున్నారు కదా?

2004లో తమిళానికి ప్రాచీన భాష హోదా వచ్చింది. తర్వాత మూడేళ్ల వరకూ వారి భాషాధ్యయన కేంద్రం కూడా మైసూరులోనే ఉంది. అపుడు కరుణానిధి చొరవతో "సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్" అని పేరు మార్చుకుని తమిళనాడుకు తరలివెళ్లింది. ఆయన స్థలాన్నివ్వడమే కాదు, తనను దానికి అధ్యక్షుని (ఛైర్మన్)గా నియమించుకున్నారు. ఆ హోదాలో ఆయనకో గది కూడా ఉండేది. తరచూ అక్కడికి వచ్చి వెళ్తూండేవారు. ముఖ్యమంత్రే స్వయంగా వెళ్లి కూర్చుంటే పనులెందుకు కావు. మొదట్లో చాలా చురుకుగా పనులు సాగాయి. అయితే తరువాత ప్రభుత్వం మారగానే అది మూలపడింది.

కార్యాలయం చెన్నైకి మారింది గానీ, వారి కరపత్రాలు, పుస్తకాలు అన్నీ ఇటీవలి వరకూ మైసూరులోని భారతీయ భాషా సంస్థ ముద్రణాలయంలోనే ముద్రితమవుతూ ఉన్నాయి. వారి నిధులన్నీ ఇక్కణ్నుంచే వెళ్తున్నాయి. కొత్త స్థలానికి మారిన వెంటనే సౌకర్యాలు సమకూరడం కష్టం. పైగా తొలి ఏడాది (2008-09)లో మిగిలిన చివరి మూడు నెలలకు తెలుగుకు మంజూరైన నిధులు 25 లక్షలు. దీంతో కొత్త ప్రదేశంలో ఏ మాత్రం సౌకర్యాలు సమకూర్చుకోగలరు? అందుకే తెలుగు కేంద్రం కూడా తమిళంలాగానే కుదురుకునే వరకూ మైసూరులో ఉండి, తర్వాత మారితే బాగుండేదని నాకనిపిస్తుంది.

ప్రాచీన భాషాధ్యయన కేంద్రం నిధులతో పాఠ్య పుస్తకాల నవీకరణ జరగాలని కొందరు, తెలుగును ఆధునీకరించాలని కొందరూ అభిప్రాయపడుతున్నారు. ఏ దిశగా అభివృద్ధి జరిగితే బాగుంటుందను కున్నారు?

అసలు ప్రాచీన భాషాధ్యయన కేంద్ర నిధులేమిటో తెలుసుకోకుండా ఎవరి గానీ, ప్రాచీన భాష అభివృద్ధికి నిర్దేశించిన నిధుల్ని మళ్లించాలనడం సమంజసం కాదు.

ఇప్పటిదాకా ఎన్ని నిధులు కేటాయించారు?

నిధుల కేటాయింపులు ప్రతీ ఏటా జరుగుతూనే ఉన్నాయి. 2009-10 ఆర్థిక సంవత్సరానికి ఒకటిన్నర కోట్లు, 2010-11కు మూడు కోట్లు, 2011-12కు నాలుగున్నర కోట్లకు ప్రతిపాదనలు పంపాం. నిధుల కేటాయింపు కూడా జరిగింది. ఈ నిధులు కన్నడకు, తెలుగుకూ ఉమ్మడిగా

[illegible]
అనుమతి లభించింది. కానీ స్థల కేటాయింపు, నియామకాలు, మరే ఇతర అభివృద్ధి జరగలేదు. ఆలస్యమెక్కడ?

నాయకుల అలసత్వమే ఆలస్యానికి ప్రధాన కారణం. ఈ ప్రాచీన భాషాధ్యయన కేంద్రానికి 36 మంది దాకా నియామకాలు జరగాలి. వీరిలో ప్రముఖంగా కేంద్ర ప్రభుత్వమూ - భారతీయ భాషా సంస్థ కలిసి ఉమ్మడిగా నియమించే ఒక అధ్యక్షుడు ఉంటాడు. ఆయన కింద రాష్ట్ర ప్రభుత్వం సిఫారసుతో ఏర్పడిన ఏడెనిమిదిమంది సభ్యుల ప్రాచీన భాషా మండలి ఉంటుంది. పరిశోధన, అధ్యయనాలు చేయగలిగిన అయిదారుగురు ఆచార్యులు ఉంటారు. ఇరవై మందికి పైగా కార్యాలయ ఉద్యోగులు ఉంటారు. ప్రస్తుతానికి వీరి ఎంపిక గానీ, భాషామండలి నియామక ప్రక్రియ గానీ మొదలయ్యే సూచనలే కనుచూపు మేరలో లేవు.

2008లో కన్నడకూ తెలుగుకూ ఒకేసారి ప్రాచీన భాష హోదా
[illegible]
చూడలేదు. రాష్ట్రప్రభుత్వం తరపునుంచే రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు ఒక్కోదానికి రెండేసి కోట్లు నిధులిచ్చారు. మనవాళ్లు నిధులివ్వడం అటుంచి, మంజూరవుతున్న కేంద్ర ప్రభుత్వ నిధుల్నే సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

అభిప్రాయాలు వారు వెల్లడిస్తున్నారు. తెలుగు వాచకాల నవీకరణ, తెలుగు ఆధునీకరణ... వీటి సంగతి చూడటానికి తెలుగు అకాడమీ, తెలుగు విశ్వ విద్యాలయాలున్నాయి కదా. తెలుగు అకాడమీ 1968లో ఏర్పడింది. దాని ఆదర్శాల్లో తెలుగు ఆధునీకరణ, తెలుగు మాధ్యమంలో బోధనకు వాచకాల తయారీ ఇవన్నీ ముఖ్యమైనవి. అది సక్రమంగా పని చేయటం లేదన్నది ఒక వాదన. అపుడు దాన్ని సక్రమంగా పని చేసేట్టు చూడాలి కేటాయించారు. ప్రస్తుతం వేర్వేరు కారణాల వల్ల రెండు భాషల్లోనూ పనులు జరగటం లేదు. ముఖ్య కారణం సిబ్బంది, సమర్థులైన అధికారుల కొరత. రెండు భాషలకు భాషా మండళ్లు గానీ, అనుమతించిన నియామ కాలు గానీ జరగలేదు. మనం మైసూరులో అధ్యయన కేంద్రం వద్దన్నాం. కానీ మన రాష్ట్రంలో ఎక్కడ పెట్టాలో స్థలం చూపించటం లేదు. కార్యాలయం లేకుంటే నియామకాలూ ఉండవు. కాబట్టి వచ్చిన నిధులు వచ్చినట్టే వెనక్కి వెళ్లిపోతున్నాయి.

ఈ నిధుల పేరుతో గత మూడేళ్లలో 2, 3 సదస్సులు జరిగాయంతే. ఇలా నిధుల నిరుపయోగం వల్ల మనకి వాటి అవసరం లేదనే అభిప్రాయం కేంద్రానికి కలుగుతుంది. భవిష్యత్తులో కేటాయింపులు తగ్గుతాయి.

తెలుగులోకి వచ్చి చేరుతున్న ఆంగ్ల పదాల వాడకాన్ని నిరోధించేందుకు ఎలాంటి కృషి జరిగితే బాగుంటుంది? ఈ విషయంలో పత్రికల పాత్ర ఎలా ఉండాలనుకుంటున్నారు?

పత్రికలు పదాల్ని ప్రజలకు అలవాటు చేయగలవు. కానీ కొన్ని స్థిరపడిపోయిన పదాల్ని అలాగే వదిలేయడం మంచిది. ఎన్నో ఆంగ్ల పదాలు ఇప్పటికే తెలుగై పోయాయి. న్యాయ వ్యవస్థలో చాలా ఉర్దూ పదాలు స్థిరపడి పోయాయి. జామీను, అమీనా, వకీలు, జమాబందీ, దరఖాస్తు... ఇలాంటి ఉర్దూ పదాలెన్నో తెలుగైపోయాయి. ఈ పాత వాటిని అలాగే వదిలేయటం మంచిది. కొత్తగా వచ్చి చేరే పరభాషా పదాల్ని ఆపగలగటమే మనం చేయగలిగింది. కొన్ని పత్రికలు ఆంగ్ల పదాల్ని నివారించటం కోసం ఆ స్థానంలో ఉర్దూ పదాల్ని తెచ్చి చేరుస్తున్నాయి. కానీ ఒకటి అర్థం చేసుకోవాలి. పత్రికలు హైదరాబాదులో తయారవుతాయి కనుక ఆ పదాలు అక్కడ వారికి మామూలుగానే వినపడవచ్చు. కానీ తయారైన పత్రికలు రాష్ట్రవ్యాప్తంగా చేరతాయి. అక్కడ వీటిని చదివేవారికి ఈ ఉర్దూ పదాలు అప్పటికే అలవాటైన ఆంగ్ల పదాల కంటే వింతగా తోస్తాయి.

అంతేకాక పత్రికలు చేస్తున్న ఇంకొక తప్పేంటంటే హైదరాబాదులో మాట్లాడే భాషే తెలుగు అనుకోవటం. ఆ పదాలను హైదరాబాద్ ఎడిషన్‌లో వాడితే అక్కడి పాఠకులకు అర్థమవుతాయి. కానీ ఇటు చిత్తూరు అటు శ్రీకాకుళం మాటేమిటి? తెలుగులో ఇప్పటికే ఉండి ప్రజల్లో నానుతున్న పదాలను వదిలిపెట్టి వాటి స్థానంలో హైదరాబాద్ వాడుకలోని ఉర్దూ పదాలను చొప్పించే పద్ధతిని మార్చుకోవాలి.

మన రాష్ట్రంలో తెలుగు నేర్చుకునే విద్యార్థుల సంఖ్యని పెంపొందించటానికి ఎలాంటి మార్పులు అవసరం?

(అ) తెలుగు ఉపాధ్యాయులుగా సమర్థులైన వారుండాలి. ప్రస్తుతం చాలామంది ఉపాధ్యాయులకే సరైన తెలుగు రాదు. ఉపాధ్యాయుల శిక్షణ, ఎంపికల్లో అవకతవకలుండని వ్యవస్థ వచ్చినపుడే ఇది సాధ్యం.

(ఆ) పాఠ్యపుస్తకాల ప్రమాణాల్ని పెంచాలి. పాఠ్యపుస్తకాలు తయారు చేసేటపుడు, 'ఫలానా పదం పిల్లలకు అర్థం కాద'ంటూ దాన్ని మార్చి సులువైన పదం చేరుస్తుంటారు. పిల్లలకు తెలిసిందే నేర్పితే వారు కొత్తగా నేర్చుకునేదేముంది? వాళ్లకు అర్థం కాదంటూ మనం వారి స్థాయికి వెళ్తే ఇక ప్రమాణాలు ఎలా మెరుగవుతాయి. ప్రతీ



వారధి

మాటలు కరువైనచోట
మౌనం వారధి
దేహాలు దూరమైన చోట
స్పర్శ వారధి

తరగతికీ ప్రమాణాలు పెంచుకుంటూ పోవాలి. అర్థమయ్యేట్టు బోధించడమన్నది ఉపాధ్యాయుల పని.

(ఇ) ఉన్నత విద్యలో (ఇంజినీరింగ్, మెడిసిన్ లాంటి వాటిల్లో) తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారికి ఒక ఐదారు మార్కులు అదనంగా కలిపే ఏర్పాటు చేయాలి. దీని వల్ల విద్యామాధ్యమంగా తెలుగు ప్రాధాన్యత పెరుగుతుంది.

(ఈ) రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో కూడా తెలుగు మాధ్యమ విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వాలి. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఇప్పటికే ఇలా చేస్తున్నారు.

తల్లిదండ్రులు పిల్లల్ని ఆంగ్ల మాధ్యమంలో చేర్చడం పెరిగిపోతోంది. పాఠశాలల్లో తెలుగుకు చోటే ఉండటం లేదు. దీన్ని ఎలా నివారించాలి?

నిజానికి ఇంగ్లిషు మాధ్యమంతోనే చదువు ప్రారంభించడం పిల్లల అభివృద్ధి వేగాన్ని మందగింపచేస్తుంది. ఇది శాస్త్రీయంగా కూడా నిరూపితమైన అంశం. ఎవరికైనా ఒక భాష వచ్చు అంటున్నామంటే వారికి ఆ భాష విషయంలో నాలుగు నైపుణ్యాలు ఉన్నట్టు లెక్క:

1. విని అర్థం చేసుకోవడం 2. మాట్లాడగలగడం 3. చదివి అర్థం చేసుకోవడం 4. రాయటం

మాతృభాషలో చదువు ప్రారంభించే పిల్లలకు పాఠశాలలో చేరకముందే ఈ నాలుగు నైపుణ్యాల్లో రెండు అలవడి ఉంటాయి. వారు ఇంట్లో అమ్మానాన్నల వల్ల, చుట్టుపక్కల పరిసరాల వల్ల మాతృభాష ప్రయత్నపూర్వకంగా నేర్చుకోనక్కర్లేకుండానే మాట్లాడగలరు, విని అర్థం చేసుకోగలరు. కాబట్టి వారికి మిగతా రెండు నైపుణ్యాలూ సులువుగా అలవడతాయి. అంతేగాక, అప్పటికే పరిచయమున్న భాషలో నేర్చుకుంటే పాఠాలు తొందరగా గ్రహించడానికి ఉపయోగపడతాయి. దీనికి భిన్నంగా ఇంగ్లిషులో చదువు ప్రారంభించే పిల్లలు ఒకేసారి ఈ నాలుగు నైపుణ్యాలూ నేర్చుకోవాల్సి ఉంటుంది. పాఠాల్లో విషయాన్నే కాదు, ఆ విషయాన్ని తెలియజేసే భాషనూ కొత్తగా నేర్చుకోవాలి. అది కష్టమవుతుంది. వారి అభివృద్ధి నెమ్మదిస్తుంది.

ఉదాహరణకు ఒక ఇంగ్లిషు పాఠంలో (walking stick) అనే మాట వచ్చిందనుకోండి ఇది ఒక సంయుక్తపదం. మొదటిదానిలో ఏడక్షరాలు రెండో దానిలో అయిదక్షరాలు ఉన్నాయి. తెలుగులా అక్షరాలు తెలిసినా కలిపి చదవలేరు. మొదటి పదంలో 'l' పలక కూడదు. రెండో పదంలో 'k'కు బదులు 'ck'ను వాడాలి. ఇంతైనా ఉపాధ్యాయుడు అర్థం చెప్పేవరకూ అదేంటో తెలీదు. అదే పాఠం తెలుగులో ఉంటే 'చేతికర్ర' అని పిల్లవాడికి అర్థమవుతుంది. దానికి ఆంగ్లంలా బాగా అర్థం, ఉచ్చారణ నేర్పించాల్సిన పనిలేదు.

ఇంత చిన్న విషయాన్ని ప్రభుత్వం నుంచి తల్లిదండ్రుల దాకా ఎవరూ పట్టించుకోవటం లేదు. మాతృభాషలో విద్యార్జన విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుంది. దీన్ని ఎంత తొందరగా గ్రహిస్తే అంత మంచిది.

- తెలుగు వెలుగు బృందం

సాంఘిక విలువ

– రావూరి భరద్వాజ

ఏభై ఏళ్లకిందట 'కూనూరు'వాళ్లు శ్రీమంతులు. అప్పుడు వారి పేరు తెలియనివారంటూ ఆ చుట్టుపక్కల ఎవరూ లేరు. వారు భాగ్యవంతులు కావటమే ఇందుకు కారణమని కిట్టనివాళ్లు అంటూంటారు గానీ, అది నిజం కాదు. ముష్టి రెండు వందల ఎకరాల పల్లపు పొలం లోకంలో ఎంతమందికి లేదుగనక? వాళ్లందరికీ యిటువంటి కీర్తి ప్రతిష్ఠలు వొచ్చినయ్యా మరి? డబ్బును పెట్టెల్లో పెట్టి దాచుకోవటంగానీ వ్యాపారంలో పెట్టి పెంచడంగానీ వాళ్లు చేసివుండినట్లయితే ఏమయ్యేదో మనం చెప్పలేము. డబ్బు ఒట్టి పాపిష్టిది. దిక్కుమాలింది. అది మానవుడికి భౌతిక బంధనాలను అధికం చేస్తుంది. మనిషి చేత అన్యాయాలు చేయిస్తుంది; అక్రమాలు చేయిస్తుంది. అంచేత డబ్బుగల వాడు పుణ్యలోకాలకు అర్హుడు గాడు. 'కూనూరు' వంశీయులకు ఈ లోకం మీద కంటే, పరలోకాల మీద మమకారం జాస్తి. ఇక్కడున్న నాలుగు గడియలూ సుఖంగా గడపవొచ్చు. మరి చచ్చిన తరవాత సంగతి?

అందుచేత వారు- తుచ్ఛమైన - నీచమైన - దుర్మార్గమైన డబ్బును విచ్చలవిడిగా ఖర్చుబెట్టి, భౌతిక బంధనాలను పెద్దగా తెంపుకోసాగారు. సత్రాలు కట్టించారు. బావులు, చెరువులు తవ్వించారు. దేవాలయాలకు శాశ్వత మాన్యాలిచ్చారు. కొన్ని దేవాలయాలను స్వయంగా నిర్మించారు.

వారింటినిండా బంధువులుండేవారు. ఆ యింటోవున్న ఆవుపెయ్య వొకరోజు గడ్డి తినకపోతే, ఎనిమిది ఆమడల దూరాన వున్న నాలుగు తరాలనాటి బంధువ సకుటుంబ సపరివార సమేతుడై వచ్చేసి, నెల రోజులపాటు, ఆవుపెయ్య రక్షణ బాధ్యత తీసుకొన్న సమయాలూ వున్నయ్. తమ మీద ఇటువంటి 'ఆదరం' చూపించినందుకు గాను, ఆ కుటుంబానికి యథోచిత సత్కారాలు కూనూరు వారు చెయ్యటమూ కద్దు.

చలమయ్య గారు భూశయనం అలకరించబొయ్యే వరకూ 'ల'కేత్వమూ, 'ద'కు కొమ్మూ ఇవ్వలేదు. చావబొయ్యే ముందుగూడా, వొక బంధువు పెళ్లికి నూటపదహార్లు యివ్వమని కొడుకుకు సైగచేసి మరీ చచ్చాడు. అటువంటి ధర్మాత్ముడు చలమయ్య గారు. తండ్రి చచ్చిన తరువాత గూడా బసవయ్య - చలమయ్య గారి ఏకపుత్రుడు - తండ్రి సంప్రదాయాన్ని విడవలేదు. అయితే ఒకటి మాత్రం నిజం. చలమయ్య గారంత దొడ్డ హస్తం మట్టుకు కొడుకుది గాదు. కాస్త వెనకా ముందూ పారజూసేవాడు. అట్లా చూడటంలోనే, ఒకసారి వెనక్కు చూసినప్పుడు, తండ్రి చేసిన ఇరవై వేల రూపాయల అప్పు బసవయ్య కంటబడింది. ఈ అప్పు ఏ సందర్భంలో చేసిందీ వివరాలు తెలియలేదు. తండ్రి



గూడా అటువంటి అప్పు వున్నట్లుగా ఎప్పుడూ కొడుకుతో చెప్పినట్లు లేదు. బసవయ్య కాసేపు ఆలోచించాడు. తన తండ్రి అప్పు చెయ్యవలసిన అవసరం ఏమీ లేదు. చెయ్యలేదనటానికి ఆధారాలు గూడా ఏమీ లేవు. ఆయన తనతో చెప్పకుండానే అనేక కార్యాలు చేశాడు. అటువంటి వాటిల్లో ఈ 'అప్పు' గూడా ఒకటై వుండవొచ్చు.

బసవయ్య ఆలోచన చూసిన తరువాత బాకీదారుకు చలమయ్య గారి మేనమామ షడ్డకుడి పెద్దతల్లి ఆడబిడ్డ కొడుకు గారికి భయం పట్టుకుంది. ఏమిటీ ఈ నోటువేపు తెగ చూస్తున్నాడు? ఈ సంతకం ఫోర్జరీదని కనిపెట్టిచచ్చాడా ఏంటి? ఇరవై వేల రూపాయలు వొడుపుకొంటే, ఆ బాడవచక్క కాస్తా కొనుక్కుందామనుకొన్నాడు తను. వీడు వుండివుండి - వెధవ వాలకం చూస్తుంటే సున్నా చుట్టేటట్టేవున్నాడు. అంతగా పీక మీదికొస్తే నవ్వుతా చేశాలే బావా!" అని తోసిపారవెయ్యచ్చుననుకో. అసలు అది గాదుగా విషయం. కుర్రసన్యాసులకు వుంటుందని ఆ కాస్తా పొలం చెక్కా కొని పడేస్తే...



"మా నాన్న గారికి బాకీ చెయ్యవలసిన అవసరం కలగకూడదు మరి. కలిగిందని ఈ నోటే చెబుతోంది. నువ్వు మా బంధువుడివి. మా క్షేమాన్ని కోరే నువ్వు మా ఇంట్లో వుండి వున్నావని నేను నమ్ముతున్నాను. ఈ ఇరవై వేల రూపాయలు ఆ ధర్మాత్ముడు ఏ సత్రానికో 'కానుకగా' ఇచ్చి వుంటాడు. ఇప్పుడు నేనేమీ ఆయన గారిననను. చచ్చి స్వర్గలోకంలో వున్నాడా మహానుభావుడు... కానీ తప్పనిసరైంది. ఆయన గారి కడుపున పుట్టిన నేను అనటం భావ్యం కాదనుకో. తప్పడం లేదు. ఇరవై వేల బాకీ అక్షరాల నిజం. నువ్వుకాదూ కూడదంటే దమ్మిడీతో సహా కట్టాలి. నా మీద దయ వుంచి పదిహేను వేలు ఇస్తాను, తీసుకొని ఈ నోటును రద్దు చెయ్యి. అంతకంటే నిన్ను కోరదగిందేమీ లేదు" అన్నాడు బసవయ్య నోటును బాకీదారు చేతుల్లో పెట్టి.

బాకీదారు, మరొక పదివేలు ఎక్కువరాయనందుకు విచారించాడు.

నేను కటికి రొక్కం మీ నాన్నగారి చేతుల్లో పోశాను. వడ్డీ కూడా కట్టుకొంటే చాలా అవుతుంది. ఆయన గారు బతికున్నట్టయితే నాకీ కష్టముండేది కాదు. అసలు డబ్బు కోసమనే నేను మూడు నెలల నుంచి మీ ఇంట్లో కుటుంబంతో సహా వుంటున్నాను. అడుగుదాం అడుగుదాం అనుకుంటూనే ఆయన గారి ముఖం చూసి అడగలేకపోయేవాణ్ని. సరే, కానివ్వు. వడ్డీ మాత్రం తీసేసి నా అసలు నాకిప్పించు. నేను విచారిస్తూ తిరిగిపోవడం నీకు మాత్రం జయమా? స్వర్గంలో వున్న తండ్రి గారి ఆత్మ, నా విచారం తెలిసి ఎంత దురపిల్లుతుంది?... పిల్లలు గలవాణ్ని. నన్ను అన్యాయం చెయ్యటం న్యాయం కాదు. నిజానికి నిన్ను ప్రాధేయపడాల్సిన అవసరం నాకు లేదు. కోర్టులున్నాయ్. కాని, అంతదూరం పోవటం నాకిష్టం లేదు..."

పద్దెనిమిది ఎకరాలిచ్చి ఆ నోటును బసవయ్య గారు రద్దు చేసుకొన్నాడు. తండ్రి గౌరవం నిలబెట్టడం కోసం బసవయ్య చాలా ప్రయాసబడ్డాడు. మునుపటంత జాస్తిగా కాకపోయినా 'లేదు' అని మాత్రం కొడుకు అనటం లేదు. ఒక్కొక్క రాయి చొప్పున తీస్తే కొండలంటివి తరిగిపోతయ్. ఆస్తుల లెఖ్ఖేమిటి? బసవయ్య గారి ఆస్తులు కొండలు కావు మరి. ఆ ఆస్తిని వాళ్లు 'కీర్తి'గా మార్చుకొన్నారు. ఈ క్షణాన బసవయ్య గారికి మూడెకరాల పొలం - అదీ తాకట్టులో వుంది - మాత్రమే వుండొచ్చు. కానీ ఆయన గారికున్న కీర్తి అపారం. తండ్రిని మించిన చెయ్యి అనే పేరు గడించుకొన్నాడు. తండ్రికంటే ఎక్కువగానే భౌతిక బంధనాలను తెంచుకొన్నాడు. ఆస్తి తగ్గిపోయింది. దీంతోబాటే బంధువులూ తగ్గిపొయ్యారు.

శేషగిరి పుటకలకు బసవయ్య గారు చాలా బీద దశలో వున్నాడు. ఆయన చుట్టాల్ని పిలవలేదు కదా అని ఎవరూ బాధపడలేదు. అతి దగ్గరగా వున్న నలుగుర్నైదుగుర్ని మాత్రం పిలిచాడు పాపం! వాళ్లూ 'అనివార్య' కారణాల వల్ల రాలేకపోయారు. బసవయ్య చాలా హీనంగా బారసాల జరుపుకున్నాడు. ఇటువంటి స్థితి వొస్తుందని ఆయన ముందుగా ఊహించాడేమో మనకు తెలీదు అసలు, వచ్చినందుకు మాత్రం విచారించాల్సిన ప్రబలంగా విచారించలేదు.

శేషగిరి చదువు ఆరో తరగతితో ఆగిపోయింది. ఆపైన చదవటానికి పట్నం పోవాలి. బసవయ్య గారికి పంపిద్దామనే వుంది. కానీ డబ్బు - వెధవడబ్బు - పాపిష్టిది - అది లేదు. ఈ లోకం కేవలం డబ్బు మీదనే నడుస్తున్నట్టుగా ఆయనకు తోచసాగింది. ప్రతీ పనీ ప్రతీ వ్యవహారమూ ఆఖరికి పూజ చెయ్యడానికి కూడా 'అణా' కొబ్బరికాయ కావాలి. అణా! ముష్టి అణా! డబ్బును విచ్చలవిడిగా ఖర్చుపెట్టడం అంత ఆరోగ్యకరమైన విషయం కాదనే సత్యం అతనికి కొద్దికొద్దిగా తెలియరాసాగింది. లోగడ ఆయన దాతృత్వాన్ని అభినందించిన గుంపు, ఇప్పుడు ఆయనకు ఎదురుపడటానికే భయపడుతున్నారు. బసవయ్య కూటికి కూడా కటకటపడుతున్నాడని అందరికీ తెలుసు. ఏ క్షణాన్నయినా అతనికి తమ సహాయం అవసరం కావొచ్చు బసవయ్య గనుక పిచ్చివెధవ. దానాలనీ, ధర్మాలనీ, సత్రాలనీ, వశనకాడనీ సర్వం ధ్వంసం చేసుకొన్నాడు. పేరు ప్రతిష్ఠల కోసం, డబ్బును యింత ఇదిగా దుర్వినియోగం చేసినవాడు చివరికి కూటికి మాడి చావక ఏమవుతాడు?

ఇప్పుడు 'కూనూరు' వారిని గురించి చెప్పుకొంటున్న ధోరణి వేరు. చలమయ్య గారు బతికి వుండే పక్షంలో, తనను గురించి చెప్పుకొంటున్న వాదులకు దిగులుపడి కుళ్లిపొయ్యేవాడు. బసవయ్య విన్నాడు. కాని చేయగలిగిందేమీ లేదు. చేతులు కాలిపోయిన తరువాత ఎన్ని ఆకులు పట్టుకొంటే మాత్రం ప్రయోజనమేముంది? శేషగిరికి ఎవడో దౌర్భాగ్యుడు పిల్లనిచ్చాడు. ఇచ్చిన తరువాత ఆ పెద్దమనిషి పొందిన పశ్చాత్తాపానికి పరిమితి లేకపోయింది. తినడానికి తిండి లేదు. చెయ్యటానికి ఏ పనీ చేతకాదు. వానలో తడిసిన తరువాతగానీ గొడుగు విలువ తెలియదు. దరిద్రం అనుభవిస్తేనే గాని డబ్బు విలువ తెలీదు. బసవయ్య గారికి డబ్బు ప్రయోజనం తెలిసింది. అది తెలుసుకొన్న తరువాత ఆయన గారు ఎక్కువకాలం బతకలేదు.

ఎవ్వరూ తమ యింటికి రారు. ఎవ్వరూ పలకరు. అతి సన్నిహితులైన బంధువులు కూడా తమ బంధుత్వాన్ని తెగతెంపులు చేసుకున్నారు. ఒంటరిగాడు. దిక్కులేదు. తాత సంపాదించిన కీర్తి గానీ తండ్రి సంపాదించిన కీర్తిగానీ చిల్లిగవ్వ విలువ చెయ్యలేదు. ఆ కీర్తయినా యిప్పుడు శ్లాఘించే దిక్కు లేకుండా పోయింది.

"ఒట్టి నాప వెధవలు, పచ్చిగా వున్నప్పుడు భూమీ ఆకాశం పట్టేదా? ఒకటే దొయ్యటం! కాస్త ముందూ వెనకా చూసుకోనక్కర్లా?" అన్నారు కొంతమంది శేషగిరి దరిద్రాన్ని చూసి సానుభూతిగా.

"ఆయనిమానానికి ఆయన మంచి అనిపించుకున్నాడు. కానీ తన మంచి కోసం తన ముందు తరాల వాళ్ల జీవితాలకు దిక్కు లేకుండా చేస్తున్నాననే ఆలోచన లేకపోతే ఎట్లా?" అన్న వాళ్లూ వున్నారు.

దరిద్రం కుష్ఠువ్యాధిలాంటిది. అది రాకుండానే వుండాలి గానీ, వచ్చిన తరువాత ఆ వంశం యావత్తూ దాన్ని భరించక తప్పదు" అని కూడా కొంతమంది అన్నారు.

శేషగిరి అత్తవారు కొంచెం కలిగినవాళ్లు. అయినా శేషగిరి అత్తవారి నుంచి కించిత్తయినా సహాయం అపేక్షించలేదు. దినం గడిస్తే ప్రయోజనమేముంది? తరం గడవాలి.

యశోద అర్థికశాస్త్రం చదువుకోలేదు. ఆ పిల్లకు మార్క్సిజం అంటే ఏమిటో బొత్తిగా తెలీదు. ఆమెకు కావాలసినదల్లా మొదట తిండి. తరువాత శరీర సౌఖ్యం. భగవంతుడిచ్చిన ఆరోగ్యం, బలం వున్నంత వరకూ ఆ రెండోదాన్ని గురించి శేషగిరిని ఒత్తిడి చెయ్యదు ఆమె! కాని తిండి కావాలి ముందు.

మొదట్లో పస్తులు చెయ్యడానికి యశోద నిరాకరించింది.

'ఎక్కడన్నా సరే తీసుకురా!' అన్నది. 'అంతకాడికి పెళ్ళెందుకు చేసుకున్నా'వన్నది. 'మావాళ్లు నా గొంతు బలవంతాన కోశా'రన్నది. ఏడ్చింది. శేషగిరిని తిట్టింది, తను తిట్టుకుంది. వీటివేటికీ శేషగిరి వుడుక్కో లేదు. మరొక పరిస్థితిలో వుండినా ఈ మాటలు మహా కోపాన్ని తెప్పించవలసింది. మరి చాలా శాంతంగా యశోదకు జవాబు చెప్పాడు శేషగిరి.

బుద్ధి తక్కువయి చేసుకున్నాను, చెంపలు వేసుకొంటున్నాను; ఇక్కడ వుండమని నిన్ను నిర్బంధించే హక్కు నాకు లేదు. నీకిష్టమైతే వుండు, లేకపోతే నిరభ్యంతరంగా పోవచ్చు. నిన్ను పోషించగలిగిన తాహతు వచ్చిన రోజున నిన్ను పిలుచుకుంటాను. అప్పుడు నువ్వు రాకపోయినా విచారించను. ఎందుకంటే తిండి పెట్టలేని మనిషికి మరొక మనిషిని శాసించే హక్కు వుండదు" అన్నాడు శేషగిరి చాలా సాఫీగా!

ఈ అవకాశాన్ని యశోద వుపయోగించుకొన్నట్లయితే ఏం జరిగేదో తెలీదు; భర్త సమాధానం ఆమెకు కోపం తెప్పించింది. తాచుపాము మల్లే మండిపడ్డది. ఆమె కోపం ప్రదర్శించడానికి ఆ ఇంట్లో సరైన పాత సామాను గూడా లేదు.

శేషగిరి ఇంటికి రావటం తగ్గించాడు. వొచ్చినప్పటి నుంచీ భార్య పోరు అట్లా పోరు పెట్టే హక్కు ఆమెకున్నదని శేషగిరి అభిప్రాయం. అతను భార్య నోరు మూయించవచ్చు. గట్టిగా అరచో నాలుగు తన్నో ఆ పని చేయించగలడు. కానీ శేషగిరి భార్యనేమీ అనదలచుకోలేదు.

ఒక్కోసారి రెండు రోజులు గూడా రాడు. రానందుకు విచారపడే వాళ్లు కూడా లేరని అతని భావం. యశోద ఉన్నప్పటికీ తను ఇంటికి రానంత మాత్రాన వాపొయ్యే స్థితిలో వుండదని అతనికి గట్టినమ్మకం. కానీ జరిగేది వేరు. తిన్నా తినకపోయినా మనిషి ఆకారమన్నా కంటికి కనిపిస్తుంటే అదొక ధైర్యంగా వుంటుంది. తిండి తినలేదు. దాన్ని గురించి విచారించటం ఎటుకూడీ తప్పదు. యశోద తిండితోబాటు భర్తను గురించి కూడా విచారించసాగింది. శేషగిరంత ఖండితంగా ఆవిడ తెగతెంపులు చేసుకోలేదు.

ఒక రోజు యశోద వాకిట్లో నిలబడి వుంది. అప్పటికి రెండు రోజుల నుంచీ శేషగిరి ఇంటికి రావటం లేదు.

కథా భరద్వాజుడు

1927 జులై 5న కృష్ణా జిల్లా మొగులూరులో పుట్టిన రావూరి భరద్వాజ బాల్యం నుంచే జీవన సమరం చేస్తూ వచ్చారు. పిడికెడు మెతుకుల కోసం అల్లాడిపోయిన స్థితి నుంచి సాహిత్యంలో అత్యున్నత పురస్కారం జ్ఞానపీఠాన్ని అందుకునే స్థాయి వరకు అహరహం శ్రమించి అక్షరసేద్యం చేశారు. 1946 ఆగస్టు 26న ప్రజామిత్ర వారపత్రికలో తొలికథ 'విమల'తో ఆయన కథా ప్రస్థానం మొదలైంది. పాకుడురాళ్లు నవలతో రావూరి భరద్వాజ కలం బలం పుంజుకుని రచనా విశ్వరూపం చూపింది. కథలు ఊహల్లోంచి కాదు, జీవితం నుంచి, నిజంలోంచి పుట్టుకు రావాలనేది భరద్వాజ తత్త్వం. ఆయన రాసిన అన్ని కథలూ బతుకు పుస్తకం నుంచి కథాప్రవాహలై పాఠకుల హృదయాలకు చేరాయి. ఈ 'సాంఘిక విలువ'లోనూ అదే కనిపిస్తుంది. పేదరికం మనిషిని ఎంత దిగజారుస్తుందో, ధనవంతులైతే దిగజారిన వ్యవస్థ ఎంత గౌరవిస్తుందో చెప్పే దయనీయ వ్యధ ఈ కథ.

అందినచోటల్లా ఇదివరకే అప్పులు చేయటం వల్ల ఆ వీధిలో ఇక అప్పు పుట్టలేదు. ఈ రెండు రోజులూ ఆమె కేవలం మంచినీళ్లు మాత్రమే తాగి గడపకపోయినప్పటికీ, ఏ పూట కూడా కడుపునిండా తిన్న పాపానపోలేదు. శరీరం తేలిపోతున్నది. స్వరం క్షీణించిపోతున్నది. ఏమీ తోచక వాకిట్లో నిలబడి వుంది యశోద. ఎదురింట్లో నుంచి ఎవరో అరటి కాయలు తిని తొక్లు బైట పారేస్తున్నారు. వాటివేపు ఆపేక్షగా చూసింది. ఆమె ఆకలి రేగింది. కనీసం ఒక డజను అరటి కాయలన్నా వుంటే బాగుండుననిపించింది. అడక్కుండా వుండాలని గట్టిగా ప్రయత్నించింది. పాపం! ఆమెకు తెలీకుండానే ఆమె కాళ్లు ఎదురింట్లోకి నడిచినాయ్.

"అరటి కాయలు బాగుంటయ్" అన్నది యశోద అక్కడున్నాయనతో.

"చిన్నప్పుడు అరటికాయలు తెగ తినేదాన్ని" అన్నది కాసేపాగి.

"నెల రోజుల నుంచీ తిందామనుకున్నాను. వెధవది, వీలే చిక్కలేదు" అన్నది చివరికి.

అతను- అరటి కాయలు తింటున్న యువకుడు. ఆమె వేపు కాసేపు చూశాడు. ఆమెకెందుకో భయమేసింది, అతను చూస్తున్న పద్ధతికి. కాళ్లు వణికినై. చమటపోసింది. అటూ ఇటూ బెదురుగా చూసింది; పోబొయ్యి పోలేక ఆగిపోయింది పాపం!

"ఎందుకూ భయం? ఎవ్వరూ చూడరు. నాలుగు నిమిషాలు" అంటూ ఆ కుర్రవాడు వస్తున్నాడు. యశోద చూపులు బరువుగా కిందికి జారిన అతని జేబు మీద నిల్చాయి. అక్కడ నుంచి కదిలే లోపుగానే అతను కదలకుండా చేశాడు ఆమెని...

ఇంటికొచ్చింది. పగిలిపోయిన అద్దం చెక్కలో రేగిన జుట్టు సరిచేసుకుంది. పమిటతో కళ్లు, బుగ్గలు తుడుచుకుంది. ఎందుకో కళ్లలో నీళ్లు తిరిగినై. దగ్గర్లో వున్న పది రూపాయల నోటు గాలికి రెపరెపలాడింది.

సాయంత్రానికి శేషగిరి వొచ్చాడు. మనిషి తూలిపోతున్నాడు. నీరసంగా మంచానికి అడ్డం పడ్డాడు;

"అన్నానికి లేవండి" అన్నది యశోద చిల్లిచెంబుతో నీళ్లు పెట్టి.

ఆ అంటున్నది ఎవర్నో శేషగిరికి తెలియలేదు.

"మిమ్మల్నే! లేవండీ" అన్నది బిగ్గరగా యశోద.

"నన్నేనా? అన్నానికేనా?"

"అవును"

రెండు కూరలు, మజ్జిగతో అన్నం తిన్నాడు. తింటున్నంతసేపూ అతనికే సందేహమూ లేదు. తిన్న తరువాత కలిగింది.

"అప్పు తెచ్చాను" అన్నది యశోద బలవంతాన నవ్వు తెచ్చిపెట్టుకొని. ఆ తరవాత శేషగిరి ఆ విషయమై ఇంకేమీ మాట్లాడలేదు.

నాలుగు రోజుల తరువాత ఒకనాటి మధ్యాహ్నం శేషగిరి ఎందుకో ఇంటికొచ్చాడు. తలుపులు గడియ వేసి వున్నాయి. లోపలనుంచి ఎవరో బిగ్గరగా నవ్వుతున్నారు. క్షణకాలం తలవంచుకొని నిలబడి గిరుక్కున తిరిగి వెళ్లిపోయాడు. సాయంత్రం అతడు ఇంటికొచ్చేసరికి కొత్త చీరెతో, జరీ అంచుది, యశోద వాకిట్లో ఎదురైంది. అతనేమీ మాట్లాడలేదు. నిశ్శబ్దంగా భోంచేసి వాకిట్లో పడుకున్నాడు.

"ఇవిగో! ఈ ధోవతులు మీకు సరిపోతాయ్యేమో చూడండి?" అంది యశోద వొక పంచల జత శేషగిరికి అందిస్తూ.

అతను తీసుకోకుండానే భార్య వేపు తిరిగి "చూడటం అనవసరం. ఒక వేళ సరిపోయ్యే పక్షంలో - సరిపోతయ్యనుకో, ఏం లాభం?" అన్నాడు.

"మీకనే యిందాక తీసుకొన్నాను, పదహారు రూపాయల తొమ్మిదణాలకు. కట్టుకోండి" అంది యశోద ధోవతులు అతని భుజాన వేసి. పదినిమిషాలు శేషగిరి ఏమీ మాట్లాడలేదు. తలొంచుకొని ఆలోచించాడు. ముఖమంతా జేవురించింది. క్షణకాలం యశోద ముఖంలోకి తీవ్రంగా చూశాడు. ఆ చూపులకు తట్టుకోలేక యశోద లోపలికెళ్లింది.

ఇప్పుడు శేషగిరి ఆర్థికంగా ఏమాత్రం బాధపడటం లేదు. ఇటీవల ఇంటిని మరామత్తు చేయించాడు. అతనితో గ్రామంలోని ధనవంతులకు అనేకమైన రహస్యపు పనులు కావలసి వొస్తున్నాయి. ఎప్పుడూ అతను ఇంట్లో వుండడు. అయినప్పటికీ ఆ డబ్బు గల ఆసాములు వొస్తూనే వుంటారు. ఎక్కువగా రాత్రిళ్లు. వాళ్లకు కావలసిన పనులేంటో గంటల తరబడి ఒక్కొక్కసారి రాత్రిమొత్తమూ యశోదకు చెబుతూనే వుంటారు.

శేషగిరిని గురించి తలొక విధంగా అనుకొన్నారు. కొంతకాలంపాటు అతన్ని మనిషికి మల్లే చూడనివాళ్లు వున్నారు. అతని వెనుక పెద్దగా నవ్వారు, అతనికి వినపడేట్టు ఏమిటేమిటో సూటీపోటీగా అన్నారు. శేషగిరి వస్తుతః చాలా నెమ్మదస్తుడు. వీళ్ల మాటలకు పనులకు అతనేమీ వులుక్కోలేదు. అసలు వీళ్లతోటి అతనికి సంబంధం అనవసరం. చాటున తొంభైఆరు అనుకొంటారు. అట్లా అనుకొన్నందువల్ల తనకు మునిగిపోయేదేమీ లేదు అనుకున్నాడు శేషగిరి.

ఇట్లా వూరికినే వుండేకంటే ఏదో వ్యాపకం కల్పించుకోగూడదుటండీ" అంది యశోద ఒకనాడు.

"ఏం వ్యాపకం కల్పించుకొనేది? లేదు; దేన్నికైనా డబ్బు.. డబ్బు... కావాలి" అన్నాడు శేషగిరి ఎగరేస్తూ.

ఏదోవిధంగా చూసుకోవచ్చు, ఆ... సీతారామయ్య... అదే! పొగాకు వ్యాపారం చేస్తుంటాడే, భాగం కలవండి, ఒక్కడికీ వూపిరి తిరగటల్లేదుట, భాగస్తుడు కావాలన్నాడు."

సీతారామయ్య పావలా భాగం యిచ్చాడు. లాభం వొస్తే పంచుకొనేట్టు, నష్టమొస్తే మానుకొనేట్టు షరతు పెట్టింది యశోద. సీతారామయ్య బిరుసు మీసాల్లోంచి, యశోదను చూసి నవ్వాడు.

కాలం కలిసివచ్చింది. శేషగిరి వాటాకు పన్నెండు వేలు లాభం వచ్చింది. ఈలోపుగానే యశోద ఒక మగపిల్లవాణ్ని కన్నది. వాడు అచ్చంగా సీతారామయ్య పోలిక. కేవలం స్నేహధర్మం కింద పిల్లవాడికి నాలుగు వందల రూపాయలు చదివించాడు సీతారామయ్య.

శేషగిరి కాస్త పచ్చబడ్డాడు. చవక రేటులో పదెకరాల పొలం కొన్నాడు. సీతారామయ్యతో వ్యాపారం చేస్తున్నాడు. అతన్ని చూసి చాలా మంది

అసూయపడ్డారు. రకరకాలుగా చెప్పుకున్నారు. ఆ పదెకరాల పొలం శేషగిరి కొనటం కాదనీ కోటివీరయ్య గారు యశోదకు కొనిపెట్టాడనీ, కొంతమంది అన్నారు. అనటానికేం? కసిబోక సవాలక్ష అంటారు గిట్టని వాళ్లు. శేషగిరి ఎవరితోటీ సంబంధం పెట్టుకోలేదు; అతను ప్రత్యేకం, అతనిల్లు ప్రత్యేకం.

ఒక రోజున ఒక నాటకాల కంపెనీవాళ్లొచ్చి యాభై రూపాయల టిక్కెట్టు కొనమన్నారు శేషగిరిని.

"ఐదు రూపాయల్లో కుర్చీ టిక్కెట్టు వస్తుంటే యాభై రూపాయలెందుకూ?" అన్నాడు శేషగిరి.

"ఇది కేవలం దానంగా పరిగణించాలి. ఒకానొక బీద విద్యార్థి సహాయార్థం ఈ నాటకం ఆడుతున్నాం" అన్నారు కంపెనీ అవకాశాలుంటాయి.

నలుగురు పెద్దలూ కలిసి శేషగిరి ఇంటికి వొచ్చారు. శేషగిరి వాళ్లకు గొప్ప ఆతిథ్యమిచ్చాడు. వాళ్ల కృషిని అభినందించాడు.

"ఇటువంటి గొప్ప సంస్థకు వంద, రెండు వందలు చందా వెయ్యటం నాకాట్టే బాగుండలేదు. నాలుగు గదులు నేనే ఏకంగా కట్టిస్తాను" అన్నాడు శేషగిరి. అందరూ సంతోషించారు. 'తాతను మించిన చెయ్యి' అన్నారు.

హైస్కూలు ఫౌండేషన్ శేషగిరి చేతుల మీదుగా జరిగింది. ఆ రోజున అతన్ని పూలదండలతో అలంకరించారు.

"కూనూరు వారి సంగతి చెప్పవలసి వస్తే, ఎవరివల్లా కాదు. వీరి తాత - చలమయ్య గారు మహాదాత. అడిగిన అన్నాడు శేషగిరి లైబ్రరీ కార్యదర్శితో.

శేషగిరి దానాలు చెయ్యటం, చందాలివ్వడం ప్రారంభించాడు. అతని చుట్టాలకు అతని మీద 'అనురాగం' తిరిగి రాసాగింది. తరుచుగా వొచ్చి అతని యోగక్షేమాలు విచారించి పోతుంటారు. తాత, తండ్రుల సంప్రదాయం పోకుండా నిలబెట్టాడని అంతా చెప్పుకున్నారు.

శేషగిరి మాత్రం వొక సత్యం నేర్చుకున్నాడు. డబ్బు కావాలి. అది పాపిష్టిదే కావచ్చు. సంఘంలో గౌరవంగా బతకటానికి ఆ దిక్కుమాలింది అవసరం. మనకు హెచ్చుతగ్గులుగా గౌరవాన్ని ముట్టచెబుతుంది. అది సంపాదించిన విధానం మీద కంటే, సంపాదించిన పరిమాణం మీద సంఘదృష్టి వుంటుంది. డబ్బు గలవాడికి తెలియని

జమేనాఫ్

భాష తయార్!

మీరు సొంతగా ఒక భాషను తయారు చేయగలరా?

అదెలా సాధ్యం? అయినా... ఎవరైనా చేయగలరా అలా అని ఆలోచిస్తున్నారా? ఒక్కసారి ఆంగ్ల చిత్రం 'అవతార్'ను గుర్తుకు తెచ్చుకోండి. అందులో పండోరా గ్రహవాసులు మాట్లాడే 'మాట' అలా తయారైందే. అది ఏదో సినిమా కోసం సరదాగా చేసింది లేండి... పోనిద్దురూ అంటారా! కాదు... కాదు... ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకూ అలా తయారైన భాషలు 200 ఉన్నాయి. వీటిలో 20 లక్షల మంది నోళ్లలో నానే భాష కూడా ఉంది. దానిపేరు 'ఎస్పెరాంటో'. యూదు భాషావేత్త, వైద్యుడు అయిన ఎల్.ఎల్.జమేనాఫ్ 1887లో రూపొందించారు. లాటిన్, జర్మన్, ఆంగ్లం తదితర భాషలకు దగ్గరగా ఉంటుంది ఈ ఎస్పెరాంటో. లాటిన్, ఇటాలియన్, రొమేనియన్, ఫ్రెంచి తదితర భాషల మిశ్రమమైన 'ఇంటర్లిగ్వా' కూడా కృత్రిమ భాషే. ఇలాంటి వాటిల్లో మొట్టమెదటిది 17వ శతాబ్దంలో తయారైంది.

వాళ్ళు.

శేషగిరి నిశ్శబ్దంగా ఇంటిలోకెళ్లి వొచ్చి వంద రూపాయల కాగితం కంపెనీవాళ్లకిచ్చాడు. కంపెనీవాళ్ల ముఖం వికసించింది. "చిత్తం! మీరూ అమ్మగారూ నాటకానికి తప్పని సరిగా రండి. మీరు రాకపోతే మాకు బొత్తుగా వుత్సాహమే వుండదు" అన్నారు కంపెనీ వారు.

తరువాత ఏవో చందాలు వచ్చాయి. అందరికంటె ఘనంగా శేషగిరి ఇచ్చాడు. ఆ వూళ్లో హైస్కూలు వుంటే బాగుంటుందని కొంతమందికి తోచింది. వూళ్లో చదువుకుంటున్న పిల్లల్లో చాలా మంది పెద్ద చదువులకు బస్తీలకు పోతున్నారు. వూళ్లోనో ఒక హైస్కూలుంటే ఈ శ్రమ తప్పుతుంది. ఇంకా ఎక్కువమంది చదువుకోటానికి వాళ్లకు లేదన్న పాపాన పోలేదు. అనేకమైన దానధర్మాలు చేసి కాలధర్మం చెందారు. వీరి తండ్రి బసవయ్య గారు కూడా తండ్రి గారి సంప్రదాయాన్ని వొదలలేదు. ఆ తండ్రికి తగిన కొమారుడనిపించుకుని దాటిపొయ్యాడు. ప్రస్తుతం శేషగిరి గారు. పులి కడుపున మేకపిల్ల పుట్టదనే సామెత వీరి పట్ల రుజువయింది. మన హైస్కూలుకు నాలుగు గదులు కట్టిస్తామని మాట యిచ్చారు. కట్టిస్తారు గూడాను. మన లైబ్రరీ మరీ పాడైపోయింది. విజ్ఞాన ప్రసారానికి లైబ్రరీలు ముఖ్యంగా అవసరం. దాన్ని పునరుద్ధరించే బాధ్యత గూడా శ్రీ శేషగిరి గారే వహించాలి" అని వొకాయన వుపన్యాసమిచ్చాడు.

"నాలుగు వందలు వేసుకోండి" విషయాలుండవు. అన్ని కళలనూ నిర్దేశించగలడు.

అతనికి 'ధ'కు 'ద'కు వున్న భేదం తెలీకపోవచ్చు. కానీ కావ్యాలను విమర్శిస్తాడు. ఒక కథారచయితకు, ఎట్లా కథలు రాయాలో నేర్పగలడు. సినిమా అంటే ఏమిటో అతనికి అర్థం కాని మాట నిజం. కానీ సినిమాను గురించి తెగ వుపన్యసించగలడు. డబ్బుగల వాడి వాగుడు 'అభిభాషణ' అవుతుంది. వాడికేక 'ఉద్ఘాటన' అవుతుంది. డబ్బు గలవాడు ఈ లోకంలో కానిదేమీ లేదు. రాజకీయాలు, సాహిత్యం, చిత్రలేఖనం అన్నీ డబ్బున్నవాడికి తెలుస్తాయి. మనిషికి కావలసింది 'విజ్ఞానం' కాదు, డబ్బు. పాపిష్టిది దిక్కుమాలింది అయిన డబ్బు!

పిల్లను బడతా...
సేప పిల్లను బడతా



అతడు: పిల్లను బడతా, సేప పిల్లను బడతా,
పిల్లను వలపన్నీ నా వల్లో పెడతా!
కౌగిల్లో వాలే ఓ మంతరమేస్తా!

ఆమె: ఎయ్యరా మావా వల ఎయ్యర మావా!
చేపల వేటకు నీ వల ఎయ్యర మావా!
వలచే, పలు వేటల వల ఎయ్యరా మావా!

అతడు: నీ వాలు సూపుల్లో సేపలు మెరిశాయి
నీ బుగ్గల నిగ్గులకు నీళ్ళే నిగనిగలాడాయి
నడుం వంచకే రంగీ, రంగుల విల్లవుతావు
బానమేసి పేనం తోడేస్తాడే కంతిరోడు- ॥ ఎయ్యరా మావా!

ఆమె: ఏటివాటం సూసి, నీటివాలు సూసి
నావకు ఆవల యీవల మచ్చెం అలికిడి సూసి
వల ఎయ్యర వగలమారి జాలారి మావా!
వలపగిలి పోవాల, వలపురగిలి పోవాల!! పిల్లనుబడతా!

అతడు: ఇంగిలాయి, రాగండి, మోసు, మట్టగిడస
జల్ల, సిత్ర, సందవ, పొలస, మార్కు, గొరక
గోదాట్లో సేపలన్ని, నీ ముంగిట పోస్తానే
సుక్కటి పొడిసేయాలకు, సుక్కేసు వత్తానే- ॥ ఎయ్యరా మావా!

ఆమె: కొరమీను, రొయ్యయితే ఏపుడు సేసిపెడతా
బొచ్చ బొమ్మిడాలు, పులుసు వొండిపెడతా

అతడు: సేపల్లో లేదు నీ సేతుల్లో వుందిలే
పిత్త పరిగలే ముత్యాలవుతయి నువు తాకితే - ॥ ఎయ్యరా మావా!

- కనగాల జయకుమార్
గుంటూరు. 93913 85178.

పదం పద్యం పట్టి నిలిచెను...!



పద్యం తెలుగువారికి వరం. ముద్రణా యంత్రాలు లేని రోజుల్లో తాళపత్ర గ్రంధాల్లోనూ, ఆ తరువాత ముద్రణా యంత్రాలు వచ్చిన తొలి రోజుల్లో లభించిన కవుల కావ్యాలు, పద్యాలు - శిలాశాసనాల్లో నాటి రాజుల, జమీందారుల కీర్తులూ, అపకీర్తులను మన కళ్లముందు నిలబెట్టిన నిలువెత్తు సత్యాలు. నాటి సమాజానికి ప్రతిబింబాలు. జరిగిన సంఘటనలకు సాక్ష్యాలు.

పదో శతాబ్దపు మలిభాగంలో జానపదుల వరకే ఉన్న తెలుగు పదాలను ఏరుకుని- ఒక కావ్య నిర్మాణానికి పునాది వేసిన ఘనత నన్నయభట్టుకు దక్కింది. అప్పటి చాళుక్య రాజైన రాజరాజనరేంద్రుడు పంచమవేదంగా వినుతికెక్కిన మహాభారతాన్ని తెలుగులో అనువదించమని అర్థించాడు.

"జననుత కృష్ణద్వైపాయన ముని వృషభాభి
హిత మహాభారత బద్ధ
నిరూపితార్థమేర్పడ తెనుగున రచియింపు
మధిక ధీయుక్తి మెయిన్"

అని నన్నయ రాసిన ఈ పద్యం రాజరాజనరేంద్రుని కీర్తిప్రతిష్ఠలను గ్రంథస్తం చేసి చిరస్థాయిగా నిలిచేట్లు చేసింది.

కారణాలేవైనా 200 సంవత్సరాల పాటు మహాభారత రచన అర్థాంతరంగా ఆగిపోయింది. వినిపిస్తోన్న సత్యం శైవవైష్ణవుల తగాదాలతో మహాభారత రచన క్లిష్టమైంది. ఆ పరిస్థితుల్లో శివకేశవులను ఒకటిగా చేసి మహాభారత రచన కొనసాగించిన కీర్తి తిక్కనకు దక్కింది. శివకేశవులకు మూలవిరాట్టయిన హరిహరనాథుడు నా కలలో కనిపించి మహాభారత రచన కొనసాగించమన్నట్లు తిక్కన చెప్పాడు. ఆ సందర్భంగా చెప్పిన శ్లోకం... తిక్కన స్థానాన్ని కవిగానే కాక - ఒక సంస్కరణవాదిగా సమున్నతస్థానంలో నిలబెట్టింది. తెలుగు పదాలతో, నాటకీయ శైలితో, రసాభ్యుచిత బంధంగా తిక్కన మహాభారతాన్ని రచించాడు. దాని నిర్మాణానికి ఆయన చూపిన చొరవ, చేసిన ప్రతిజ్ఞ ప్రశంసనీయం!

రామాయణ, మహాభారతాలు రాసిన తిక్కనాదులు 'మహాభాగవతాన్ని' తనకు విడిచినందుకు ఎంతో సంతోషించాడు సహజ పండితుడు పోతన. ఈయన తెలుగు సాహిత్యంలో ఎంత నిరాడంబరుడో, ఎంత ధైర్యస్థైర్యాలు కలవాడో ఈ పద్యం తెలియజేస్తోంది.

'ఇమ్మను జేశ్వరాధములకిచ్చి పురంబులు
వాహనమ్ములున్
సొమ్ములు గొన్ని పుచ్చుకుని సొక్కి శరీరము
బాసి కాలుచే
సమ్మెట పాటులం బడక సమ్మతి శ్రీహరికిచ్చి
చెప్పెనీ
బమ్మెర పోత రాజొకడు భాగవతంబు
జగద్ధితంబుగన్'

అని అన్నాడు.

పోతనకు బావమరిదిగా చరిత్రపుటల కెక్కిన శ్రీనాథమహాకవి పద్యాలు... ఆయన తన కావ్యాలను ప్రభువులకు అంకితమిచ్చి, సొమ్ములు తీసుకొని, విలాసవంతమైన జీవితాన్ని అనుభవించినట్టు సాక్ష్యమిస్తున్నాయి. తనను ఆదరించిన కవులు అంతరించాక - పోషించే నాథుడు లేక శ్రీనాథుడెన్నో అవస్థలు పడ్డాడు. తెలుగు దేశమంతా పర్యటించాడు. అలా పర్యటించిన సందర్భంలో పల్నాటిసీమకు వెళ్లిన శ్రీనాథుడు సుష్ఠుకరమైన భోజనానికీ ఇబ్బంది పడినట్లు - ఆయనవిగా చెబుతున్న చాటువులు తేటతెల్లం చేస్తున్నాయి.

"చిన్నచిన్న రాళ్లు చిల్లర దేవుళ్లు
నాగులేటి నీళ్లు నాపరాళ్లు
సజ్జజొన్న కూళ్లు - సర్పంబులును తేళ్లు
పల్లనాటి సీమ పల్లెటూళ్లు" అని నాటి పల్నాటిసీమ దుస్థితిని కళ్లకు కట్టినట్లు వర్ణించాడు. ఇంకా ఆయన కోపం చల్లారలేదు.

"రసికుడు పోవడు పల్నా
డెసగంగా రంభయైన యేకులెవడకున్
వసుధేశుడైన దున్నును
కుసుమాస్త్రుండైన జొన్నకూడే కుడుచున్"

అన్నాడు. తాగటానికి నీళ్లు కూడా కరవైన స్థితిలో -

సిరిగల వానికి చెల్లును
తరుణులు పదియారు వేల తగ పెండ్లాడన్
తిరిపెముగ కిద్దరాండ్రా
పరమేశా! గంగ విడువు పార్వతి చాలున్!

అనగానే నీళ్లలేని ఆ నూతిలో నీళ్లు పడ్డాయట.. ఈ పద్యాలు శ్రీనాధుని కవితా శక్తిని నిరూపిస్తాయి. చివరి రోజుల్లో అష్టకష్టాలు పడి చనిపోతున్నపుడు కూడా -

దివజకవివరు గుండియల్ దిగ్గురనగ
అరుగుచున్నాడు శ్రీనాథుడమరపురికి

ఈ పద్యం అతన్ని సమున్నత కీర్తి శిఖరం మీద నిలబెట్టింది!

మనుమసిద్ధి ఆస్థానకవి తిక్కన. అతని సేనాని ఖడ్గతిక్కన. నిజానికి రణతిక్కన మహాశూరుడు. అయితే మనుమసిద్ధికి కాటమరాజుకూ జరిగిన యుద్ధంలో - సైన్యం కోల్పోయి ఒంటరైన ఖడ్గతిక్కన ఇంటికి రాగా - అతని ధర్మపత్నీ, వీరపత్నీ

అయిన చానమ్మ పలికిన పలుకులు -

"పగఱకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపు నాయకులెల్లన్
ముగురాడు వారమైతిమి
వగపేటికి జలకమాడ వచ్చినచోటన్"

అని యుద్ధం నుంచి వచ్చిన భర్తను నిరసించగా, తల్లి వడ్డన చేసింది. విరిగిన పెరుగు వేయగా, పెరుగు విరుగుటకు కారణమేమని ప్రశ్నించగా -

అసదృశముగ నరివీరుల
పస మీఱగ గెలవలేక పంద్రక్రియన్ నీ
వసివైచి తిరిగి వచ్చిన
పసులున్ విరిగినవి తిక్క! పాలున్ విరిగెన్!

అని పిరికిపందవై తిరిగి వచ్చిన నిను చూసి - పశువుల మనసు విరగ్గా - పాలు విరిగినవి - విరిగిన పాలు తోడుపెట్టగా మజ్జిగ విరిగినదని చెప్పగా - పౌరుషంగా రణతిక్కన కదనరంగానికి తిరిగి వెళ్లాడట! ఈ పద్యాలు రణతిక్కన - ఆయన భార్య, తల్లికి గల దేశభక్తినీ, పౌరుషాన్నీ చాటి చెప్పాయి.

రాజుల కాలంపోయి, జమీందారుల పాలన వచ్చింది. జమీందారులు కవులను పోషించారు. ఆయా సందర్భాల్లో జమీందారుల ఔదార్యాన్నీ, విక్రమాన్నీ, దానగుణాల్నీ కవులు వర్ణించిన తీరు ఆ జమీందారుల కీర్తిప్రతిష్ఠలను చిరస్థాయిగా చరిత్రలో నిలిపాయి. విజయనగర సంస్థానాధీశుడు పూసపాటి విజయరామ గజపతి ఆస్థానకవి ఆడిదం సూరకవి. పెద్దాపురం సంస్థానాన్ని దర్శించిన సందర్భంలో - అక్కడి ఆస్థానంలో తన రాజు గొప్పతనాన్ని వర్ణిస్తాడు. ఈ పద్యం ప్రసిద్ధమైంది. చమత్కార భరితమైంది.

"రాజు కళంకమూర్తి రతిరాజు శరీర విహీను డంబికా
రాజు దిగంబరుండు మృగరాజు గుహాంతర సీమ వర్తివి
భ్రాజిత పూసపాడ్విజయ రామనృపాలుడు రాజు గాక యీ
రాజులు రాజులా పెనుతరాజులుగాక ధరా తలంబునన్"

ఈ పద్యంలో కవి 'రాజు' శబ్దాన్ని అనేకార్థాల్లో వాడటం గమనార్హం. రాజు - చంద్రుడు, కళంకమూర్తి, రతిరాజు - మన్మథుడు, అంబికారాజు - శివుడు; మృగరాజు-సింహం; తరాజు-తూనిక వీళ్లంతా రాజులే అయినా ప్రతి వారిలోనూ ఏదో లోపం ఉంది ఒక్క విజయరామరాజు మాత్రం ఏ లోపం లేనివాడు అన్న కవి వాక్కుల్లో తన రాజుపట్ల గాఢాభిమానాన్ని తెలియజేస్తోంది. ఈ పద్యం వల్ల విజయరామరాజు కీర్తి దిగంతాలకు వ్యాపించింది.

ఇక - కవి చౌడప్ప పేరు వినని తెలుగు సాహితీపరులుండరు. మాట కటువుగా ఉన్నా - అందరూ చదువుకోటానికి అవకాశం లేకపోయినా ఉన్నది ఉన్నట్టు చెప్పే సాహసం గలకవి చౌడప్ప.

'పది నీతులు, పది బూతులు, పది శృంగారంబు
సభల చదివిన వాడే యధికుడు'

అంటాడు.

పురాణాలూ, కావ్యాలూ, ప్రబంధాలూ, శతకాలూ - సహస్రాధికంగా వచ్చిన తర్వాత రోజుల్లో కొత్తగా చెప్పటానికేం మిగల్లేదు. ఆ సమయాల్లో రాజుల్ని మెప్పించడానికి - రాణులతో కులికే రాజుల మెప్పు పొందడానికి కొంతమంది శృంగారం చిందించే పద్యాలను వినిపించి రాజుల మెప్పులు, సత్కారాలూ పొందటం ఆనవాయితీగా మారింది. వీళ్లకి శాస్త్ర పాండిత్యాల్లో ప్రతిభ అంతగా లేకపోయినా శృంగారపద్యాలు చెప్పి జీవనోపాధి గావించేవారు. దానిని కప్పి పుచ్చుకొని - వారే పండితులుగా, అధికులుగా చెలామణీ అవుతున్నపుడు కోపంతో చౌడప్ప పై పద్యాన్ని చెప్పి - ఆనాటి సభ - వాతావరణాన్ని మన కళ్లముందుంచాడు.

విజయనగర సంస్థానానికి చెందిన నీలాద్రిరాజు కోరిక మేరకు 'చంద్రరేఖా విలాపం' అనే ప్రబంధాన్ని కూచిమంచి జగ్గకవి రాశాడు. నిరాదరణకు గురై కోపంతో 'చంద్రరేఖా విలాపం' అనే అశ్లీల కావ్యాన్ని రాసి, ఆ రాజు చరిత్రలో అవమానాల పాలైనట్లు చేశాడు.

18వ శతాబ్దిలో పిండిప్రోలు లక్ష్మణకవి 'రావణ దమ్మీయం' అనే ద్వ్యర్థి కావ్యం రాశాడు. ఈ కవి రామచంద్రపుర సమీపాన కుయ్యేరు నివాసి. ధర్మారాయుడనే వ్యక్తి ఈయన 24 ఎకరాల భూమిని హరించగా - కవి ధర్మారాయుని రావణునితో పోల్చి దూషిస్తూ రాసిన ఈ కావ్యంలో ఒక అర్థం స్వీయకథ - మరో అర్థం రామాయణాన్ని రమ్యంగా రాశారు.

"జ్యేష్ఠుడా! లక్ష్మణాగ్రజ క్షేత్రమీవు - వదలకుండెన మోసంబువచ్చు నింక!
చండ నిర్భీక వనచారి పిండిప్రోలి కవికుల వరుతో రిపుత ముఖ్యముగ వలదు!

ఇవి విభీషణుడు రావణునితో రామాయణార్థంలో - జ్యేష్ఠుడా! అన్నా, రావణా! లక్ష్మణాగ్రజ క్షేత్రము - సీతను; ఈవు, వదలకుండిన, మోసంబువచ్చు! ఇక మీద; చండనిర్భీక - యమదూతల్లా భయంలేని, పిండి - కోతిమూకకు, ప్రోలికి - లంకకు అవికులవరుతో (అవి-సూర్యుడు) సూర్యవంశ శ్రేష్ఠుడైన రామునితో, రిపుత- వైరం, ముఖ్యంగా వలదు అని పిండిప్రోలు లక్ష్మణకవి కథగా - జ్యేష్ఠుడా - అన్నా; లక్ష్మణాగ్రజ క్షేత్రము - బ్రాహ్మణుడైన లక్ష్మణకవి క్షేత్రం - ఈవు వదలకున్న మోసం వస్తోంది. చండ - నిర్భీకు - కవన (కవియ్యచారి), పిండిప్రోలు కవి కులవరునితో - శత్రుత్వం వస్తుంది.

ఇలా ద్వంద్వార్థాలతో ధర్మానాయకుని చెడ్డపేరును గ్రంథస్థం చేశాడు లక్ష్మణకవి.

ఇలాగే దుర్భాక వేంకటేశ్వరశాస్త్రి, విష్ణుభట్ల సుబ్రహ్మణ్యేశ్వర కవి, వేములవాడ భీమకవి, తిరుపతి వేంకటకవులు కూడా పలు సందర్భాల్లో అద్భుతమైన పద్యాలు చెప్పారు.

గద్యంలో ఎంత తిట్టినా, ఎంత పొగిడినా నిలవని మాటలను ఛందోబద్ధం చేస్తే శాశ్వతంగా నిలుస్తాయి. అందుకే - బలవంతంగా నట్టనడి వీధిన బంధుగణం మధ్యలోనున్న కన్యను చేపట్టబోయిన రాజు కథను అక్షరరూపం చేస్తూ మహాకవి గురజాడ రాసిన -

పట్టమేలే రాజుపోయెను
మట్టి కలిసెను కోట పేటలు
పదం పద్యం పట్టి నిలిచెను కీర్తులపకీర్తుల్

వంటి వాక్యాలు చిరస్మరణీయాలు!



పి.వి.బి.శ్రీరామమూర్తి,
విజయనగరం.
94400 59067

'అది' కాదు

“ఇబ్బుడు షెప్పుండ్రా ఏమయ్యిందో,” అరగంట నుంచీ అరుగుమింద కుదురుగా కూకోలేక ఆ పక్కకీ, ఈ పక్కకీ తూలతా, పడతా లేస్తా ఉండి శివరాకరకి మాట్లు (మాటలు) తడుంకుంటా అడిగిన రాజారెడ్డోరు. మాట్లు తడుంకుంటా ఉండాడంటే రెడ్డోరికి మాట్లు రాకా గాదు, రెడ్డోరు నత్తోడు గాదు. ఇంగా బారడు పొద్దుండంగానే రెండు కాయిలు (సీసాలు) మందేసినాడంతే.

“ఈడు నా ఆడదాన్ని గొడవ సేసేసినాడన్నా” - రెడ్డోరి ముందల గుంపుగూడిన జనంలో ఒగడు తన పక్కనుంచే ఒగాయమ్మని సూపిస్తా చెప్పీ చెప్పంగానే.

“ఇంత మందుండారు ఈడు అంటే ఎట్టా దెలస్తాదిరా ఎర్రోడా” - హుంకరించిన రెడ్డోరు మొందు మత్తులో మాట్లు తడుంకొంటా.

“దో.. ఆల్లల్లో ఆ గీతల సొగ్గుడ్డేసుకోనున్నా (చొక్కావేసుకోనుండ్లా) వాడే” అంటా రోంత (రవ్వంత) ఆ పక్కగా ఉండేటోల్లలో ఒగన్ని సూపిచ్చిన ఎర్రోడు. గీతల సొగ్గుడ్డోన్ని, వానికి ఆ పక్కా, ఈ పక్కా ఉండేటోల్ల ఒగ ఆరు మందిని ఎగాదిగా సూసి “ఎవుర్రా



ఈల్లంతా” - అడిగిన రెడ్డోరు.

“ఈల్లది ఆడేణ్ణో నంద్యాలంటన్నా” - బదుల్సెప్పిన ఎర్రోడు. సొగం అర్తమై సొగం అర్తంగాని రెడ్డోరు మొందు మత్తు ఆయప్ప తలకాయలేకి ఎక్కతా ఎక్కతా ఉండాది. “ఏంది.. నుంచి... నం..ది” నసిగినాడు.

“నంది గాదన్నా నంద్యాల పక్కోల్లంట”

“ఈ పక్కకి యాళో..షి.. నా..రం...ట”

“మదనపల్లిలో పెండ్లి సూసుకోని బండిని మనూరి ముందర దావకాడ బెట్టి నా ఆడదాన్ని సూసి ఏందేందో అన్న్యాడంటన్నా ఈ గీతల సొగ్గుడ్డోడు”.

గీతల సొగ్గుడ్డోని కల్లా (వైపు) తలకాయ తిప్పి వాని మొగంలోకి సూస్తా మొందు మత్తుకి కండ్లు మూసుకోనుండి పొయిన రెడ్డోరు ఆయప్ప మేలుకోనుండాడా, నిద్దరబోతా ఉండాడా అనేది ఎవురికీ అర్తంగాలా.

“అది గాదయ్య అసలుకు ఏం జరిగిందంటే” - ఏందో సెప్పబోయిన గీతల సొగ్గుడ్డోనికి ఎడం పక్కనుంచే ఇంగో నంద్యాలోడు.

“ఏంది గాదురా ఎదవ నా కొడకా” అంటా రెడ్డోరి పక్కన్నే నిలబడుక్కోనుండే ఆయప్ప బామర్ది నల్లపరెడ్డి సర్సరా వొచ్చి అదిగాదన్నా అంటా అన్నోని దవడకు బట్టి ఒగటిచ్చే సరికి నంద్యాలోల్ల మొగాల్లో బొట్టు నెత్తర ల్యాకపాయ బయానికి. ఆడ వాని దవడకి పణ్ణేటుకి (పడిన వేటుకి) ఈడ ఎగిరి పడి కండ్లు దెరిశిన రెడ్డోరు “ఏంది రా” అంటా గెట్టిగా అరస్తా. ‘మనూరి ఆడదాన్ని అగుమానం సేసిందీగాకుండా మల్లా నోరు దెరుస్తావుండాడు బావా ఈడు”.

నంద్యాల్నుండొచ్చినోల్లు ఏందో మాట్లాడదామనుకొంటాండారు. గానీ సుట్టూరా సేరిన ఊరి జనాన్ని సూసి ఉచ్చలు బోసుకొంటాండారు. అదీగాకుండా ఎర్రంగా సింత నిప్పులాకెట్లుండే రెడ్డోరి మిడిగుడ్లు సూస్తావుంటే సింబాన్ని సూసినట్లుండాది వోల్లకి. ఏమ్మాట్లాడితే ఏం పెంటొస్తుందో ఏమో అనుకోని గుక్కిల్లు (గుటకలు) మింగతావుండారు. రెడ్డోర్ని, సుట్టూరా ఉండేటోల్లని సూస్తా. గీతల సొగ్గుడ్డోడైతే గడగడగడా వానికి పోతావుండాడు.

ఉన్నెట్టుండి ఎర్రోడు రెడ్డోరి కాడికి బిరబిరా పొయ్యి ముందుకొంగి ఆయప్ప కాల్లు మొక్కోని లేశి నిలబడి “న్నోవ్

రెడ్డెన్నా! దుడ్డో ఇరవై రూపాయిలుంటే ఈన్నా" అడగంగానే "థూ అడక్కతినే నా కొడకా రెడ్డోర్నడగతా ఉండావేందిరా దుడ్డు. దో.. ఆడ నిలబడుక్కోనుండ్లా.. బయిటూరోల్లు వాల్ల నడగబోరా సచ్చిన్నాకొడకా" - గుంపులోనుంచి ఎవురో అరసబట్రి. అంతే.. కండ్లు మూసి దెరిసేయాలకి గీతల సొగ్గుడ్డోని కాడికి సేరుకొనేసిన ఎర్రోడు - "ర్రేయ్! ఇరవై రుపాయిలీరా" అంటా గెట్టిగా అరిసేసరికి బయానికి గీతల సొగ్గుడ్డోనికి నోరు తిరగలా.

"నిన్నేందిరా అడిగేది" అంటా గీతల సొగ్గుడ్డోని పై జోబీలేకి సెయ్యిపెట్టి దుడ్డు పైకి పెరికి అంతా ఎత్తుకోని ఆన్నిండి ఎర్రోడు యాడికో పరుగో పరుగు.

"ఈ దొంగ నా బట్టతో నా మానమే పాయరామ్మా"... గీతల సొగ్గుడ్డోన్ని సూపిచ్చి ఉన్నెట్టుండి గెట్టిగా ఏడిశే పని బట్టిన ఎర్రోని పెండ్లాం లచ్చుమక్క న్యాలమీద గొంతి కూకోని (గొంతుక్కూకోని) నెత్తిపై సేతులు పెట్టుకుంటా.

"యాడసకుండా గమ్మునా ఉండే లచ్చుమక్కా" అంటా ఆయమ్మని వోదారిచ్చే పనిబట్టిన అమ్మలక్కలు.

"యాడసకుండా ఇంగేం జేసేదే రామక్కా. పుట్నింట్లో సమర్తయిన కాన్నిండీ నా మొగున్ని దప్ప ఇంగో మొగోని మొగమైనా సూసిండానా నువ్వే జెప్పు" - ఏడుపు నిలపని లచ్చుమక్క.

"సూసిండావంటా ఎవురు జెప్పినారే లచ్చుమక్కా. అట్లెవురన్నా జెప్పింటే వాల్ల కండ్లుపోతాయి ఆ నా సవుతులు నోట్లో పురుగులు పడి సస్తారు. నువ్వు సీతమ్మోరంత పతివర్తవే. ఇంగేడిసింది సాల్లే గమ్మునుండు' - రామక్క లచ్చుమక్కని వోదారుస్తానే ఉండాది.

"అదిగాదు రామక్కా! నువ్వే జూస్తాండావు గదా. మన పల్లిలో ఎవుతెవుతో ఎవున్నెవున్నో పెట్టుకోనుంటే గూడా నేను గమ్మునగా నా దావంటీ నేను బోతావుండ్లా. నా మొగుడు కూలి పనికి బెంగ్లూరుకి పొయ్యి రెన్నెల్లుకోసారొస్తావున్నా గూడా నేనెంత పతివర్తగా బతకతా ఉండానో తెలీన్నాకొడుకెవుడో సెప్పు ఈ పల్లిలో. అట్లాటి దాన్ని నన్ను బట్టుకోని దో.. ఆ సచ్చిన్నాకొడుకు ఎంత మాటనేసినాడే. ఓయమ్మా! ఇంగెట్లరా నాయినా ఈ పల్లిలో తలెత్తుకోని తిరిగేది" ఇంగా గెట్టిగా ఏడసబట్టింది లచ్చుమక్క.



ఉన్నట్టుండి జనాల్ని ఆ పక్కకీ, ఈ పక్కకీ తోసుకుంటా గీతల సొగ్గుడ్డోని ముందరకొచ్చి గుడ్లురిమి సూస్తా ఎర్రోడు "ర్రేయ్! ఇబ్బుడు పిల్సరా నా పెండ్లాన్ని" అంటా గెట్టిగా అరిశ. ఎర్రోని సేతిలో పెద్ద కొడివిలి. అదిరి పడిరి నంద్యాలోల్లు. గీతల సొగ్గుడ్డోడైతే సలి జరమొచ్చినోడాకెట్లు వొనికి పోతాండాడు బయానికి. తాగిండే సారాయి తలకాయికెక్కేసి, కండ్లు ఎర్రగా అయిపొయ్యి సేతిలో ఉండే కొడివిలి పక్కా, గీతల సొగ్గుడ్డోని పక్కా మార్సి మార్సి సూస్తావుండే ఎర్రోన్ని సూస్తావుంటే నంద్యాలోల్లే గాదు, ఆ ఊరోటోల్లు గూడా బయిపడి సచ్చిపోతాండారు ఏం జరగతాందో ఏమోనని.

"ఒ..రే.. ఎ..ర్రో..డా.. ను..వ్..వ్.. వు.. గ..మ్ము..నుం..డ్రా.. వా..ళ్ళ.. షం..గ..టి.. నే..ఋ.. జూ..ష్టా.." అంటా పైకి లేసిన రెడ్డోరు రెండడుగులు ముందరకేసి తాగిన మొత్తుకి ఆ పక్కకీ, ఈ పక్కకీ ఊగి ధబాని కింద పడేసరికి ఆయప్పకాపక్కా, ఈ పక్కా ఉండేటోల్లు రెడ్డోర్ని లేపి నిలబెట్టి ఇంట్లేకి నడిపిచ్చుకోని పోతా పోతా "ర్రేయ్! ఈ నంద్యాలోల్లని ఆ ఇంట్లోపెట్టి బీగాలెయ్యండి. తెల్లారి రెడ్డోరు లేసినాక వాల్ల సంగజ్జూద్దాం. ఆ గీతల సొగ్గుడ్డోన్ని మాత్తరం దో.. ఆ కొట్టంలో ఒగన్నే పెట్టి బీగమెయ్యండి" అంటా సెప్పిన నల్లపరెడ్డి. గీతల సొగ్గుడ్డోన్ని ఒగింట్లో, మిగతాటోల్లనింగో ఇంట్లో బెట్టి బీగాలేసేసి ఎవురిండ్లకు వాల్లెల్లిపోయిన ఊరి జనాలు. రేత్తిరంతా ఎర్రోని తాగుడు కూతలు, ఊరంతా ఇనబడతా.

***

తెల్లారి బారడు పొద్దెక్కి రెడ్డోరు నిద్దర్లేసినాక గీతల సొగ్గుడ్డోన్ని, మిగతా నంద్యాలోల్లన్ని ఆయప్ప ముందరకు పట్టుకొచ్చిన ఊరి జనాలు, లచ్చుమక్కా, ఎర్రోడూ.

"ఏందిరా.. తెల్లారగట్లనే ఇంతమందొొచ్చేసినారు" అంటా ఊరి జనాల్నడిగి నంద్యాలోల్ల పక్కకి జూసి "ఈల్లంతా ఎవుర్రా" - అడిగాడు రెడ్డోరు. రెత్తిరి గొంతుల్దాకా తాగేసిండాడు గదా.. ఏందీ గ్యాపకం లేదాయప్పకి. రేత్తిరి జరిగిందంతా ఒగ ముక్క గూడా తప్పోకుండా సెప్పిన రెడ్డోరి బామ్మర్ది నల్లపరెడ్డి. ఏడిసే పనిబట్టిన లచ్చుమక్క.

"మాకు నువ్వే నాయం సెయిన్నా" - సెప్పిన ఎర్రోడు సేతులు

గట్టుకోని. నంద్యాలోల్ల పక్క సూసి "ఎవుడట్ల అనింది" అంటా లచ్చుమక్క పక్కకి సూసిన రెడ్డోరు.

"దో.. వాడేన్నా".. సెప్పిన లచ్చుమక్క.

"ఇట్లరా.." గీతల సొగ్గడ్డోన్ని గదురుకోన్నెట్లుగా పిలిసిన రెడ్డోరు. బయిపడతా బయిపడతా ఆయప్ప ముందరకొచ్చి నిలబడుకొనిసిన గీతల సొగ్గడ్డోడు.

"రేత్తిరికి రా అంటా నువ్వు ఆయమ్మని పిలిసినావా" - రెడ్డోరడగంగానే "అయ్యా! జరిగింది చెప్తావుండా వినండయ్యా. మాది నంద్యాలయ్యా. మేమందరం ఒకే చోట ఉద్యోగం చేసుకొంటా ఉంటామయ్యా. మదనపల్లిలో మాకు తెలిసిన వాళ్ల పెండ్లికి పొయ్యి తిరిగి మా ఊరికి పొతావుంటే దారి పక్కలో ఈయమ్మ సీతాఫలం పండ్లు బుట్టలో పెట్టుకొని ఉండిందయ్యా. మేము మా బండిని ఆపి పళ్లు ఎంత అంటూ అడిగినామయ్యా. పెద్ద పండ్లైతే ఒక్కటి ఒక్క రూపాయి, చిన్న పండ్లైతే ఒక్క రూపాయికి రెండు అంటూ చెప్పిందయ్యా. మావూరి దగ్గర సీతాఫలం పండ్లు చిన్నవి కూడా ఒక్కొక్కటి ఐదు రూపాయలయ్యా. ఇక్కడ పండ్లు చాలా అగ్గువగా ఉన్నాయంటూ మా వాళ్లందరూ ఒక్కొక్కరు ఐదేసి పండ్లు కొనుక్కొని తినేశారయ్యా. నేనైతే ఒక పది పండ్లు దాకా తిని "ఏమమ్మా! రాత్రికి మంచమెక్కెయ్యొచ్చా?" అన్నది నిజమే నయ్యా. నేనన్న దానికి అర్థమేమంటే, సీతాఫలం పండ్లు చాలా తినేశాం కదా, రాత్రయ్యేసరికి శీతలం చేసి పడిశం పట్టి జ్వరంతో మంచం ఎక్కాల్సి వస్తుందా అని. అంతే కానీ మరో దురుద్దేశం మాత్రం కాదయ్యా," చెప్పి తన కండ్లలోకే దీనంగా సూస్తావుండే గీతల సొగ్గడ్డోన్ని నమ్మాల్నో, నమ్మగూడదో అర్థంగాని రెడ్డోరు నంద్యాలోల్లందరి పక్కా సూసి అందరూ ఉద్యోగం సేసుకొనేటోల్లుగా ఉండారు, వాల్లు సెప్పింది నిజమే అయ్యింటుందిలే అనుకోని ఊరోటోల్లందరి పక్కా సూసి "అదంట్రా సంగతి. ఆయప్పేందో అంటే మీరంతా ఏందో అనికొనేస్తిరి. ఇంగింట్లకి పోండి" సెప్పి లచ్చుమక్కతో "ఒసే లచ్చుమూ! ఆ బయిటూరోల్ల కందరికీ దుడ్డేమీ తీసుకోకుండా తలాకొగ పది సీతాంకాయిలిచ్చి పంపిచ్చు. తినేసి రేత్తిరికి మంచమెక్కేస్తారు" నవ్వతా అనేసి ఇంట్లేకెల్లిపాయ.

ముసిముసిగా నవ్వుకొంటా లచ్చుమక్క, మిగతా ఆడోల్లు. బతికితింరా నాయినా అనుకొంటా నంద్యాలోల్లు.

పి.వి.ప్రసాద్
చౌడేపల్లి, చిత్తూరు జిల్లా.
94903 95116

అసలు మనిషి



అసలు మనిషి
విత్తనం లోపలి చెట్టులా
అంతర్నిహితుడై
ఎప్పుడూ లోలోపలే ఉంటాడు
అహంభావపు కిరీటాన్ని ధరించి
పై తొడుగు తోలుబొమ్మలాట
ఆడుతూ ఉంటుంది అవిశ్రాంతంగా
నవ్వే నోటిలో కాదు
వెక్కిరించే నొసటి ముడతల్లో
రహస్యచిత్రం ఆవిష్కృతమౌతుంది
పెదవి దాటే మాటల్లో
అంతర్లీనపు శ్లేషార్థాలు ఎన్నో
తెరుచుకున్న కన్నుల్లో కాదు సుమా!
రెప్పల కింద దాగిన లో చూపుల్లో
అసలు ఆకాంక్షలు గురి చూస్తుంటాయి
రసోద్రేకాల నడుమ వాస్తవం మనిషి
చటుక్కున బహిర్గతుడైనా
టక్కరి నత్త గుల్లలోకి
అంతలోనే దూరిపోతుంటాడు
విలుకాడు పొదమాటుకు చేరినట్టు
గూడు చాటున సాలీడు
నిరీక్షిస్తూనే వుంటాడు
మర్యాదస్థులై చలామణి
కావొచ్చు గాక
జనం మధ్య వెలిగిపోవచ్చు గాక
పవిత్రతల అగరు ధూపమై
పరిమళించొచ్చుగాక
బయటి మనిషి యథార్థతలు
ప్రశ్నార్థకాలే
పై రూపాన్నే లక్ష్యపెడుతూ పోతే
మిగిలేవి పునః పశ్చాత్తాపాలే
జారిపోయే ఆచ్ఛాదనను నిర్లజ్జగా
వొదిలేస్తూ
ఏకాంతంలో ఆబగా తచ్చాడుతుం
టాడు కపటి
జీవన బీభత్సాలిలా ఉంటే
రంగేసుకున్న అభినయాల్ని ఎలా నమ్మడం
కాలం తిన్నెల మీద కూచుని
ఎన్నైనా చెప్పు నేస్తుడా!
విత్తనంలో చెట్టులా
అంతర్నిహితుడై అసలు మనిషి
లోలోపలే ఉంటాడు
ఏదో కసరత్తు చేస్తూ

- కొండెపోగు బి.డేవిడ్ లివింగ్ స్టన్
మార్కాపురం, ప్రకాశం జిల్లా 94402 11120



మాటకట్టు

అడ్డం!

1. వెంకటరహిత హాస్య, వ్యంగ్య రచయిత (7)
7. యశోభరితంలో దాగిన కాంతి (2)
8. ప్రతిష్ఠకు (ముందుండే) జంట పదం (3)
9. నడిచేదేగానీ 'పావు' భాగం మాత్రం (2)
12. బహుమతి (3)
13. నువ్వు ఆభరణానివి! అంటే నవ్వు (3)
17. తార (2)
18. తెప్పలుగ నిండిన చెరువులోకి చేరుకునే కప్పతో ఇతడిని పోల్చాడు మన వేమన (3)
19. ఐదో ఆంగ్లమాసం పేరు బహువచనంగా మారితే హితము (మంచి) కలుగుతుంది (2)
22. రామారావు దర్శకుడిగా, రావణుడిగా రాణించిన చిత్రం (7)

ఆధారాలు

నిలువు!

నిలువు:

2. మొదలు లేని కళ్లము (2)
3. సేవకుడికి గల మరో పేరులో సున్న శూన్యమైంది (4)
4. అంతం లేని మమకారం. సంస్కృతంలో నాది (2)
5. శ్రీకృష్ణుని పెంచిన తల్లి (3)
6. శ్రీకృష్ణదేవరాయలు 'లెస్స' అని మెచ్చిన భాష (3)
10. అలుకనో, కోపమో ఇది సత్యభామ వహించింది (3)
11. జాజర, మోసం లాంటిదే! ముందుకు (వెళ్లకుండా) నిలవడం (3)
14. చీరమధ్యలో 'ర'ని ఉంచితే ఇచ్చ కలుగుతుంది (3)
15. ఆద్యంతాలు 'మ' కారాలతో తియ్యదనం (4)
16. ప్రేరేపించడమనే అర్థం! కానీ ముందు మేలు చేరిస్తే మొత్తంగా (నిద్ర నుంచి) లేపడం! (3)
20. తండ్రి తండ్రిని నోరారా పిలవండి (2)
21. చివర తెగిన మాల్యాద్రి! (2)

జి. శుభాకరరావు

కర్నూలు. 93938 29499

సమాధానాలు 93లో...

ద-ద-ద!

ఈవికి గురుతుగా సాగింది ఇలను సృష్టి
పంచ భూతము లిచ్చును మనకు స్ఫూర్తి
స్వార్థరహితములై ధర్మము చెప్పి
దారిచూపి-
ధరపైన దానమే ఉత్తమ ధర్మమంటు
"ద-ద-ద" అని ఉరిమి చెప్పు గగనము,
మహీధరము మోయును ఈ మహి
భారమంతా,
జలదము లియ్యవా జలధారలెన్నో
పంటచేలకు ప్రాణమీయగా,
పాడిపంటలు పసిడి పూవులు
ప్రకృతి పంచద మానవాళికి!
ఎల్ల వేళల వీచు కదా చల్లగాలి
శ్రమ జీవులను సేద తీర్చగా,
తీయని జలము నందించవా నదులు,
కొంచెమిచ్చినా చాలనుచు మనకు
ఘన ఫలము నందించవా తరులు, లతలు!
నీవు మేసిన కసవు తిని గోవులు
నిరతము కురిపించవా నీకై క్షీరధారలు!

దాన ధర్మము చేసికోవలె
దయను మించిన గుణము లేదిల
ఎంచి చూడక వంచ నెంచక
ఎదుటివారికి తోడు నిలబడు-
సాయపడవలసిన చోటనే సంశయించు
స్వార్థపరతను చిక్కి మనుజుడెపుడూ
సాగునా మన బతుకు సహకారము
లేకుండ?
ఇచ్చుటే మిన్న గుణములన్నిటికన్న
వితరణ మెరుగని మనిషికి విలువ సున్న!
జ్ఞానియైన తెలియును దానమహిమ



తెలుసుకో నీ విధి తెలుగువాడా!
('ద' అంటే ఇమ్ము అని అర్థం శిష్ట వ్యావహారికంలోఉంది.)

- వెంపటి హేమ

హయత్‌నగర్, హైదరాబాద్.

95737 05011

మట్టిలో పుట్టిన మాండలిక పదాలు

మన మాతృభాష తెలుగే అయినా పక్క రాష్ట్రాల నుంచి సరిహద్దు ప్రాంతాల్లోకి కొన్ని పదాలు వలసొచ్చి భాషకు కొత్త సొబగునిచ్చాయి. సామాన్యులు తేలికైన మాటలతో వృత్తిపరంగా అప్పటికప్పుడు పుట్టించే మాటలే జనపదాలుగా, ఆ ప్రాంత మాండలికాలుగా మారాయి. అవి వాడుకలోకి వొదిగి బంగారు ఉంగరంలోకి చేరిన వజ్రంలా మెరిసి భాషకు కొత్త అందాన్ని తెచ్చాయి. చిత్తూరు జిల్లా పడమటి ప్రాంతాల్లో కొంత కన్నడ భాషా ప్రభావంతో గ్రామీణ ప్రాంత జనం నోళ్లలో నాని పదాలు పరిమళ భరిత పలుకులై పల్లవిస్తున్నాయి. పక్క రాష్ట్రం నుంచి ఎగిరొచ్చిన పదాల పిట్టలు ఇక్కడి పొలం జనుల పనులపై వాలి సందడి చేస్తున్నాయి. కొత్త శబ్దాల్ని, అర్థాల్ని పుట్టిస్తూ సంతోషపరుస్తున్నాయి. ఆ మాండలికపు ఘుమఘుమల్ని ఆస్వాదిద్దాం.

- వక్కిరి = పూర్వకాలంలో మనుషుల, పశువులకు సైతం తాగునీరందించే కుంట
- బరకం = నారతో తాళ్లు పేని వలలాంటి కళ్లు పెట్టి అల్లినది
- ఉగ్గపట్టి ఏడ్వడం = అతిశయించిన దుఃఖంతో వెక్కివెక్కి ఏడ్వడం
- ఒగు = ఎందుకు పనికిరాని మనిషి
- వప్పణం లేదా ఒప్పణం = వస్తువుని ముక్కలు ముక్కలుగా పగలకొట్టడం
- కొటారు = ధాన్యాన్ని నూర్పిడి చేసే స్థలం
- బేసిడి = ఒంటిరాయి వేసిన బంగారు ముక్కుపుడక
- రాగలరాయి = ధాన్యాన్ని పిండిచేసే విసురురాయి
- వరవ = గ్రామంలో సామాజిక, దైవ కార్యక్రమాలకు ఇంటికి ఇంత రుసుమని వేసేది
- ఊరుపత్తులు = గ్రామంలో అందరికి హక్కు ఉండేది
- మెరవణి = దేవతల్ని ఊరేగించడం
- నీరుగట్టోడు = పొలాలకు సక్రమంగా నీటిపారుదల చేసేవాడు
- కంత్రీ = ప్రజల్ని అన్నివిధాలా మోసం చేసేవాడు
- లంకిణీ = ధూర్తస్వభావం కలిగిన స్త్రీ
- కణాకంత్రీ = ఆద్యంతం మోసం చేసేవాడు
- ఊరబిండి = చట్నీ
- బైస్కోప్ = సినిమా, చలనచిత్రం
- ఎంచేయి = వేపుడు
- బిత్తరి = లేనివాటిని కల్పించి చెప్పేది
- అవగూదకాయలు = టమోటాలు
- బాంఛాలి = మొగుడు, ఆలిని సంబోధించే మాట
- తింగరి = అపసవ్యంగా వ్యవహరించేవాడు
- నంగనాచి = అన్నీ తెలిసినా తెలీనట్లు నటించేది

[illegible] పంపవచ్చు.

[illegible] పదం వీనులవిందుగా ఉండాలి. తెలిగ్గా పలకగలగాలి. [illegible] మంచి ప్రయత్నమే అవుతుంది. మీ పదాలను teluguvelugu@eenadu.netకు మెయిల్ చేయవచ్చు.

పద పంచాయతీ

- **abdomen:**(noun) Specialized the lower part of a person's or animal's body, which contains the stomach, bowels and other organs, or the end of an insect's body. పొత్తికడుపు, ఉదరం; పురుగుల సాలీళ్ళ దేహం వెనుకభాగం.
- **ability:**(n) The physical or mental power or skill needed to do something: సామర్థ్యం, దక్షత, ఎదుర్కొనగలిగే, స్తోమత,
- **abnormal :** adj. different from what is usual or average, especially in a way that is bad: abnormal conditions.

◆ ఇదిరతడికె = అక్రమ సంబంధాలకు అడ్డుగోడ
◆ పొగబుట్టి = రాకెట్, రోదసీనౌక
◆ కొడమ = నీళ్లవాగులో చేపల్ని పట్టేసాధనం
◆ మొర్రాలుచేను = ఎర్రటి పలుగురాళ్లు ఉన్న భూమి
◆ కట్రాళ్లు = బావికి, గుణావర్తానికి పేర్చినరాళ్లు
◆ కక్కల కొడవలి = పంటను కోసే కత్తి
◆ గుద్దిలి = చిన్నబారు నేలను తవ్వే సాధనం
◆ దోకుడుపార = పశువుల మేతను భూమి నుంచి వేరు చేసేది
◆ చెక్కుడుపార = గడ్డి మైదానాల్లో గడ్డిని చెక్కే పార
◆ మచ్చుకత్తి = చెట్లు, మానుల్లో కొమ్మలు నరికే కత్తి
◆ మంగలికత్తి = సంపదను పూర్తిగా కాజేసేది
◆ ఉర్లు = పక్షుల్ని పట్టడానికి వేసే వల
◆ ఉరుకులు = కుక్కల వెంట్రుకల్లో జీవించే అణుమాత్రపు జీవులు
◆ ఉల్లిడి = వివాహ సమయంలో పెళ్లికొడుకును స్వాగతిస్తూ తెల్లనివస్త్రం మధ్య కర్ర ఉంచి తీసుకెళ్లడం
◆ గూడుగుత్త = మొత్తం గుత్తకివ్వడం
◆ చేను = మెరకపొలం
◆ మడి = మాగాణి
◆ మశానం = శ్మశానం
◆ సీమనూనె = కిరసనాయిల్
◆ పుంగుచేదు = కానగ గింజల నుంచి తీసిన తైలం
◆ మెగం = పంది
◆ నంజర = మాంసం
◆ గంజరం = గోమూత్రం
◆ పదుబంది = ముళ్లపంది
◆ శేపు = పాలపొదుగులో పాలుధార వచ్చే దశ

అసాధారణ, క్రమరహిత, అసహజ, విపరీత, వికృత.

❍ **abolish:** (v) To end an activity or custom officially: రద్దుచేయు, ఉద్వాసన చెప్పు, తొలగించు, ఎత్తివేయు, నిర్మూలించు.

❍ **abroad:** adv.in or to a foreign country or countries. Adj. outside; not at home. బయట, విదేశాలలో, విపులంగా, విరివిగా, అన్నివైపులా.

❍ **abscond:** (v) Leave hurriedly and secretly, typically to avoid detection of or arrest for an unlawful action such as theft: పారిపోవు, తప్పించుకొని పోవు, చెప్పకుండా పోవు.

❍ **abstract:** adj. existing in thought or as an idea but not having a physical or concrete existence. verb. Consider theoretically or separatly from something else. noun. A summary or statement of the contents of a book, article, or formal speech. అమూర్త, సంక్షిప్త, గూఢ, శుద్ధ; సారం; సారాంశం, సంక్షేపం.

❍ **accountable:** adj. required or expected to justify actions or decisions; responsible. Explicable; understandable. బాధ్యతాయుత, జవాబుదారీ.

❍ **accurate**: adj. correct in all details; exact. Capable of reaching the intended target. జాగ్రత్తగల, కచ్చితమైన, నిర్దిష్టమైన, సరియైన, సిసలైన.

❍ **acquire** :verb. Buy or obtain (an asset or object) for oneself. Achieve as a result of one's behaviour or activities. సంపాదించుకొను, అలవరచుకొను, ప్రయత్నంతో సాధించు.

❍ **backdrop:** (n) A painted cloth hung at the back of a theatre stage as part of the scenery. పూర్వావస్థ, అవరోధం, ఆటంకం.

❍ **background:**(n) The area or scenery behind the main object of contemplation, especially when perceived as a framework for it. The general scene, surroundings, or circumstances. A persistent level of some phenomenon or process, against which particular events or measurements are distinguished, in particular. పూర్వరంగం, వ్యక్తి విద్యాదులు; నేపథ్యం; పెరడు.

❍ **backlog:** (n) An accumulation of uncompleted work or matters needing to be dealt with. నెరవేర్చని హామీలు, పూరించని ఖాళీలు.

❍ **balance:** (n) An even distribution of weight enabling someone or something to remain upright and steady. Mental or emotional stability. A condition in which different elements are equal or in the correct proportions. An apparatus for weighing. Verb. Keep or put something in a steady position so that it does not fall. compare debits and credits in an account so as to ensure that they are equal. తక్కెడ, త్రాసు, తూకం; తూచు, సరితూగు, ఆదాయ వ్యయాలను సరిపుచ్చు, భావోద్రేకాలమధ్య మనిషిని నిలబెట్టు.

❍ **balm:** (n) A fragrant ointment or preparation used to

- ఊరుబిల్లి = ఇళ్లలో ఉండే పిల్లి
- గురికాడు = బోయవాడు
- జీవాలు = గొర్రెలు, మేకలు
- పులుగుముట్టుకొంది = పాముకాటు
- మొగసాల = గ్రామానికి ముఖద్వారం
- పడసాల = ఇంటి వరండా
- మడవ = సాలుకు నీరు పారించేటప్పుడు మట్టితో వేసే అడ్డుకట్ట
- లుచ్చలి = స్నానాల గది
- ఊదోడు = పసిరికల వ్యాధి కలవాడు
- కామాలి = కామెర్ల రోగి
- బోతుడు = అహం కలిగినవాడు
- సద్దిమొఖం = కళాహీనమైన ముఖం
- జాస్తి = ఎక్కువ
- జారద్దు = మాటలతో మభ్యపెట్టడం
- పుడచెండు = గుడ్డముక్కలతో బంతిగా చేసేది
- పుడచేయి = ఎడమచేయి
- మూగట = పాత్రలను మూసి ఉంచే మట్టితట్ట
- పసరుపాము = అభం శుభం తెలియనిది
- చిప్పగెంటి = కొబ్బరిచిప్పతో, వెదురుకర్రతో తయారు చేసిన గరిటె
- ఎల్లెలుక = పంటపొలాల్లో ఉండే ఎలుక
- ముఖండి = మార్గదర్శకుడు
- ఎత్తినోళ్ల చంకబిడ్డ = ఎవరితో ఎలా ఉండాలో అలా మసలుకొనేవాడు
- తమరకట్టె = సంగటి కెలకడానికి బాన కదలకుండా పెట్టే కొయ్య
- కోలుగాడు = కోలాటం వేసేవాడు
- డాలుగాడు = తనకున్నా లేకున్నా ఉన్నట్లు కోతలు కోసేవాడు
- తిప్ప = పేడదిబ్బ
- సంగటికట్టె = సంగటి కెలికే కర్ర
- మునికట్టె = మడక దున్నేటప్పుడు ఉపయోగించే ముల్లుకర్ర
- లోటా = గ్లాసు
- బైరొడ్లు బొరుగులు = బైరొడ్లు వరి ధాన్యంతో బట్టిలో పేల్చే మరమరాలు
- కపిలబాన = కపిల తోలేటప్పుడు నీళ్లతో ఉన్న చర్మం సంచి
- తూండీ = తూమెడు బియ్యంతో అమ్మవారికి సమర్పించే సలిబిండి దీపం
- నీమొగంమూయా = చావు
- గోరగంభం = జాతర సమయంలో జంతుబలికి ఉపయోగించే పంగలకర్ర
- నీకండ్లిమిరిపోనూ = కళ్లుపోయి చావు
- లేమిడి = సత్తాలేని మగాడు
- తుస్సోడు = మాట నిలకడలేని మనిషి
- బావురపిల్లి = అడవులు, పొలాల వెంబడి ఉండే పిల్లి
- ఎంటవ = ముంగిస ఆకారంలో ఉండే జంతువు
- నెలికిరి = పాముతల ఆకారంలో ఉండేది
- గోడకు కొట్టిన సున్నం = తిరిగిరానిది
- చిన్నపల్లెరు = పొలాల్లో కలుపు మొక్కగా ఉండి ముళ్లను వెదజల్లేది

heal or soothe the skin. A tree which yields a fragrant resinous substance, especially one used in medicine. A bushy herb of the mint family, with leaves smelling and tasting of lemon. ఉపశమన లేపనం, సువాసనగల నొప్పి నివారిణి, సుగంధతైలం, సుగంధ తైలాన్నిచ్చే చెట్టు.

- **ban:** (v) Officially or legally prohibit. Officially exclude some-one from a place. Noun. An official or legal prohibition. శపించు, నిషేధించు, వెలివేయు; వెలి, నిషేధం.
- **banquet:** (n) An elaborate and formal evening meal for many people, typically followed by speeches. Verb. Entertain with a banquet. ఉపన్యాసంతోడి విందు.
- **bar code:**(n) A machine-readable code in the form of numbers and a pattern of parallel lines of varying widths, printed on and identifying a commodity and used especially for stock control. వస్తువుల ధర, ఆచూకీలు తెలిపే నిలువుగీతల చిత్రం.
- **bargain:**(n) An agreement between two or more people or groups as to what each will do for the other. Verb. Negotiate the terms and conditions of a transaction. బేరం, ఒడంబడిక; బేరమాడు, ధరను స్థిరపరచు.
- **baseline:** (n) A minimum or starting point used for comparisons. The line marking each end of a court. ఆధారరేఖ, మౌలికరేఖ.
- **cafe :** (n) A small restaurant selling light meals and drinks. A bar or nightclub. A shop selling sweets, cigarettes, newspapers, and perishable goods and staying open after normal hours. కాఫీ అంగడి, అల్పాహారశాల.
- **calamity:** (n) An event causing great and often sudden damage or disaster. కష్టం, విపత్తు, ఇడుము, దుర్ఘటన.
- **calibre:** (n) The quality of someone's character or the level of their ability. The internal diameter or bore of a gun barrel. కొలత, అంతర్వ్యాప్తి; సామర్థ్యం.
- **calligraph:** verb. Write in calligraphic style. అందంగా వ్రాయు.
- **campus:** (n) The grounds and buildings of a university or college. విద్యాసంస్థ ఆవరణ, శిబిరం, ప్రాంగణం.
- **club:** (n) [treated as singular or plural] an association dedicated to a particular interest or activity:.., సంఘం,
- **convoy:** (n) a group of ships or vehicles travelling together, typically one accompanied by armed troops, warships, or other vehicles for protection: కావలి/ రక్షణ నౌకలు, తోడు, మార్గసహాయముగా వచ్చే బలం.
- **cue:** (n) A thing said or done that serves as a signal to an actor or other performer to enter or to begin their speech or performance. A long straight tapering wooden rod for striking the ball in snooker, etc. Verb. Give a cue to or for. స్ఫూర్తి, సంకేతం, ప్రేరకం; పిలక, తోక; బల్లపై బంతులను తోసేకర్ర.

- పెద్దపల్లేరు = పొలాల్లో తీగల్లో ఉండే ముళ్లు
- పరకాపురి = కంపచెట్టు
- కోరుసేద్యం = కౌలు వ్యవసాయం
- బల్లిక = అలసట
- అడపం = మంగలి క్షౌర సామాగ్రి పెట్టుకునే తోలుసంచి
- పరిగిలి పంట = రాబడిలేని పంట

ఇలా చెప్పుకుపోతే పల్లెల్లో మనుషుల నాల్కల మీద కదలాడే పదాలకు కొరతే ఉండదు. కొన్ని పదాలయితే ప్రాంత ప్రాంతానికి అర్థాలు తేడా వస్తాయి. ఎలా పలికినా ఎకసెక్కాలాడినా మాండలిక పదాలు మాతృభాషలో మిళితమై జనపదాలలో పల్లవిస్తాయి. మాండలిక పదాలపై స్థూలంగా చెప్పుకుందాం!

దాసరి కృష్ణారెడ్డి
పాత్రికేయులు, పుంగనూరు,
చిత్తూరు జిల్లా. 98853 26493

మాటకట్టు – 6 సమాధానాలు

	1 ము	2 ళ్ల	పూ	3 డి	ర	4 మ	ణ	
5 య		ము		గ		మ		6 తె
7 శో	భ		8 ప	రు	వు		9 కా	లు
ద		10 కి		డు		11 ఆ		గు
	12 కా	ను	క		13 న	గ	వు	
14 కో		క		15 మ		డం		16 కొ
17 రి	క్క		18 బం	ధు	వు		19 మే	లు
క		20 తా		రి		21 మా		పు
	22 సీ	తా	రా	మ	క	ల్యా	ణం	

- **curator:** (n) A keeper or custodian of a museum or other collection. సంరక్షకుడు, కాపుదారు.
- **dais:** (n) A low platform for a lectern or throne. గద్దె, వేదిక, రంగస్థలం.
- **damp:** adj. Slightly wet. Noun. Moisture diffused through the air or a solid substance or condensed on a surface. A check or discouragement. Verb. Make (something) slightly wet. Control or restrain. చోద్యమైన, ఇదివరకులేని; ఇవక, చిత్తడి, తడి, తేమగిలు, దంపకర్రు.
- **dare:** (v) Have the courage to do something. Defy or challenge to do something. Take the risk of. Noun. A challenge, especially to prove courage. కడగు, చిక్కించుకొను, తెగబడు, తెగించు, సాహసించు; సాహసం.
- **deal :** (v) Distribute (cards) in an orderly rotation to the players for a game or round. Take part in commercial trading of a particular commodity. Noun. An agreement entered into by two or more parties for their mutual benefit. Fir or pine wood. ఆటలో చీట్లు పంచు, వ్యవహారం, క్రయవిక్రయాలు; పైను కలప.
- **decent :** adj. conforming with generally accepted standards of respectable or moral behaviour. Of an acceptable standard. సభ్య, మర్యాదగల, యోగ్యమైన.
- **decide:** (v) Come to or cause to come to a resolution in the mind as a result of consideration. నిశ్చయించు, నిర్ణయించు, తీర్పుచెప్పు.
- **defame:** (v) Damage the good reputation of (someone); slander or libel. పరువుతీయు, అప్రతిష్ఠకలిగించు.
- **echo:** (n) A sound or series of sounds caused by the reflection of sound waves from a surface back to the listener. Verb. (sound) be repeated or reverberate after the original sound has stopped. ప్రతిధ్వని, అనుకరణ, అనుకరించు, మారుమోగు.
- **element:** (n) A part or aspect of something abstract, especially one that is essential or characteristic. Each of more than one hundred substances that can not be chemically interconverted. మూలకం, మూలపదార్థం, అంశం, ప్రధానద్రవ్యం.
- **embrace:** (v) Hold someone closely in one's arms as a sign of affection. కౌగిలించు, స్వీకరించు.
- **eminent:** adj. (of a person) famous and respected within a particular sphere or profession. ఉన్నత, ప్రఖ్యాత, ఎత్తైన.
- **emporium:** (n) A large retail store selling a wide variety of goods. అంగడి, వాణిజ్యకేంద్రం.
- **fame:** noun: The state of being known by many people. యశస్సు, ఖ్యాతి, కీర్తి.

కథ మీద సాము

కథా వస్తువుల విస్తృతి పెరిగింది. రచయితలు కథాంశం కోసం సమాజం లోలోపలికి చొచ్చుకెళ్తున్నారు. అలాంటప్పుడు... ఒక ఏడాదిలో వివిధ పత్రికల్లో ప్రచురితమైన కథల్లో ఉత్తమ కథలను ఎన్నడం కత్తిమీద సామే. మధురాంతకం రాజారాం సాహిత్య సంస్థ ఏటా వెలువరిస్తున్నట్లుగానే.. 2011లో వచ్చిన కొన్ని ఆణి ముత్యాలను ఒక దండగా పేర్చి 'కథావార్షిక-2011' పేరుతో ఒక సంకలనాన్ని తెచ్చింది. ఒక సంవత్సరంలో వెలువడిన కథా సాహిత్యమంతటినీ సింహావలోకనం చేయడం కథావార్షిక ప్రధానోద్దేశం. మొత్తంగా ఎటువంటి కథలు వెలువడ్డాయి.. వాటి రంగూ రుచీ వాసనా ఏమిటో.. విమర్శనాత్మకంగా చర్చించడం ఈ సింహావలోకనం లక్ష్యం అని సంపాదకులు స్పష్టం చేశారు. ఈ బాధ్యతను 2011 ఏడాదికి అఫ్సర్ తీసుకున్నారు. సంపాదకుడి లక్ష్యానికి ఆయన న్యాయం చేశారు.

సంపాదకుడి ప్రధాన లక్ష్యం సింహావలోకనం అయినప్పటికీ... దీనికి అనుబంధంగా కొన్ని కథలనూ ప్రచురిస్తూ వస్తున్నారు. కథా సేద్యం చేసేవారికి సింహావలోకనం విందే కావచ్చు. సాధారణ పాఠకుడికి మాత్రం.. అనుబంధంగా ఇస్తున్న కథలే పసందు. అలాంటి కథలు పది ఉన్నాయి. ఒకప్పుడు విలువలకు పెద్దపీట వేసిన సమాజాన్ని ఇప్పుడు లాభాపేక్ష, స్వార్థం ఎలా ఆక్రమించిందీ కళ్లకు కడుతూ పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన కథ 'మా ఎడ్ల కొట్టం...'.; అమెరికాకు వెళ్తే జీవితంలో వెలుగులే అని నమ్మిన మెక్సికన్ యువకుడు ఒకరు.. అక్రమంగా సరిహద్దులు దాటి వెళ్తే ఉన్న కాస్త వెలుగూ పోయి చీకట్లు ఎలా అలుముకున్నదీ వివరిస్తారు 'సరిహద్దు' కథలో.. గొర్తి సాయి బ్రహ్మానందం. ఒక భారతీయుడికి మెక్సికన్ యువకుడు రాసిన లేఖ రూపంలో కథ చెప్పిన తీరు ఆకట్టుకుంటుంది. ఒక పేదింటి ముస్లిం కుటుంబంలో ఆడపిల్ల పెళ్లి ఎంత భారమో స్కైబాబా రాసిన 'కబూతర్' కథ కళ్లకు కట్టినట్టు రాశారు. మిగిలిన ఏడు కథలూ వేటికవే ప్రత్యేకం.

సంచాలకుడు: మధురాంతకం నరేంద్ర; పుటలు: 158; వెల: రూ. 80;
ప్రతులకు: అన్ని విశాలాంధ్ర పుస్తకకేంద్రాల్లో

- టి.జి.బి.తిలక్

వర్తమాన సామాజిక చరిత్రకు సాక్ష్యాలు

ముప్పై ఏళ్ల సాహిత్య ప్రయాణం ఒక రచయిత జీవితంలో తక్కువైందేమీ కాదు. ఆ పయనంలోని తన రచనలను ఒక సామాజిక చలనాన్ని నమోదు చేసే సాధానాలుగా తీర్చిదిద్దుకుంటూ ముందుకు సాగుతున్నారు డా. వి. చంద్రశేఖరరావు.

ఈ మధ్యకాలంలో ఆయన వెలువరించిన 'ద్రోహవృక్షం' (కథల సంపుటి), 'నల్ల మిరియం చెట్టు', 'ఆకుపచ్చని దేశం' (నవలలు) ఒక సంక్షుభిత సమాజాన్ని మన ముందు పరుస్తాయి. 'ద్రోహవృక్షం' కథల్లో 2003-2011 మధ్య కాలంలో చోటుచేసుకున్న సామాజిక పరిణామాలు కనిపిస్తాయి. 'లైఫ్ అండ్ టైమ్స్ ఆఫ్ సత్యప్రకాశం'... పతనమవుతున్న రాజకీయాలకు, వ్యక్తులకు ప్రతినిధిగా నిలుస్తుంది.

రచయిత డా.వి.చంద్రశేఖరరావు; పుటలు: 312; వెల: రూ.100;
ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తకకేంద్రాల్లో

అదృశ్యమయిపోయిన ఆదర్శ వ్యక్తులను నాస్టాల్జిక్‌గా ఆవిష్కరిస్తుంది 'అతను, అతనులాంటి మరొకడు' కథ. ఇలా ప్రతికథా దేనికదే ప్రత్యేకంగా ఉంటూ ఓ అనుభూతిని పాఠకుడికి పంచుతుంది.

మాదిగ దండోరా ఉద్యమ నేపథ్యంతో వచ్చిన నవల 'నల్లమిరియం చెట్టు' ఒక సామాజిక వర్గపు దుఃఖ తీవ్రతను ఆర్తితో, వేదనతో పరిచయం చేసే నవల. నవలను చదవటం ముగించగానే పాఠకుడు దుఃఖ ప్రవాహంలో కొట్టుకుపోతాడు.

ఇక వెలుగొండ ప్రాజెక్టు వలన నిర్వాసితులయ్యే చెంచుల గురించి, చెంచుల గూడేల గురించి చెప్పేందుకు చేసిన ప్రయత్నమే 'ఆకుపచ్చని దేశం'. కమ్మని కలలపాటలా, పురాణ జానపదగాథను గానం చేసే జానపద గేయంలా ఆశల విత్తనాలను చల్లుకుంటూ వెళ్తాడు రచయిత.

సమకాలీన సామాజిక చరిత్రను నమోదు చేసిన ఈ మూడు పుస్తకాలు ఒక సంక్షుభిత సమాజాన్ని మన ముందు ఆవిష్కరిస్తాయి. మనోవేదనల్ని కలిగిస్తాయి. మనల్ని చింతాక్రాంతుల్ని చేస్తాయి. రచన ఎప్పుడూ చిగురంత ఆశనూ, పిసరంత వెలుగునూ పంచాలన్న రచయిత స్వప్నాన్ని మనమూ పలవరిస్తాం. ఒక గాథ గురించి అంటూ కవి శివారెడ్డి 'నల్లమిరియం చెట్టు'కు రాసిన ముందు మాట ఓ 'యోగ్యతా పత్రం'. అందమైన ముఖచిత్రాలు, ఇంపైన అక్షరాలు, లోతైన భావాల సమాహారాలైన ఈ పుస్తకాలు పాఠకుల మనసులపై బలమైన ముద్రను వేస్తాయి.

- సి.ఎస్.రాంబాబు

'సాహిత్య' మాధురి

సాహిత్యంలోని సొబగులను, విశేషాలను విశ్లేషించటంలో విమర్శ పాత్ర చాలా కీలకమైంది. కొత్త కోణంలో సాహిత్యాన్ని అర్థం చేసుకోవటానికి, దర్శించటానికి ఇదెంతగానో ఉపయోగపడుతుంది. అలాంటి సాహిత్య వ్యాసాల సమాహారమే 'సాహిత్య సౌహిత్యం'. వివిధ సందర్భాల్లో, వివిధ పత్రికల్లో ప్రచురితమైన వాటిల్లోంచి ఏర్చికూర్చి ఆణిముత్యాల్లాంటి 16 వ్యాసాలను ఇందులో పొందుపరచి అందించారు. నన్నయ, కాళిదాసు, చేమకూర వేంకటకవి, జాషువా వంటి కవుల కవిత్యంలోని మాధుర్యం వీటిల్లో అడగడుగునా అబ్బురపరుస్తుంది.

భారతావతారికలో ఆదికవి నన్నయ చెప్పిన పద్యాల్లో ద్యోతకమైన భవిష్యత్ దృష్టిని 'భారతంలో భావ్యర్థం'లో విశ్లేషించిన తీరు అద్భుతం. 'దుర్గమార్గజలగౌరవభారతభారతీసముద్రం' అనే సమాసంలోని 18 అక్షరాలు 18 పర్వాలను ధ్వనిస్తున్నాయంటూ నన్నయ ప్రత్యగ్దృక్కును కళ్లకుగట్టారు. ఇలాంటి విశేషాలు ఈ వ్యాసంలో ఇంకా చాలానే ఉన్నాయి. శకుంతల పాత్రను నన్నయ తీర్చిదిద్దిన తీరునూ 'ఆధునిక వనితావాదం - ఆదికవి ఆమోదం' వ్యాసంలో కొత్తకోణంలో విశదీకరించారు. కాళిదాసు విరచిత అభిజ్ఞాన శాంకుతలం కావ్యంలోని ప్రతి శ్లోకమూ రసానందాన్ని

రచయిత: డా॥ పి.నాగమల్లీశ్వరరావు, పుటలు: 128, వెల: రూ.120,
ప్రతులకు: లక్ష్మీశ్రీ రెసిడెన్సీ, సంతపేట, ఒంగోలు

అందించేదే. మచ్చుకు 'అపరిక్షత కోమలస్య యావత్' శ్లోకాన్నే తీసుకోండి. ఇందులో ప్రయోగించిన ప్రతి పోలికా సందర్భోచితంతో కూడుకున్న తీరును 'కాళిదాస కవిత'లో వివరించారు. ప్రతి పద్యాన్నీ చమత్కృతితో చెప్పటంలో విఖ్యాతుడైన చేమకూర వేంకటకవి రచనా నైపుణ్యానికి అద్దం పట్టిన 'చేమకూర చమత్కృతులు' వ్యాసం ఈ పుస్తకానికే మకుటాయమానం. జనం కవి జాషువా రచించిన 'నా కథ' కావ్యంలోని అర్థాంతరాలనూ రచయిత చక్కగా విశ్లేషించారు. గ్రామనామాలు, ఇంటిపేర్ల పుట్టుకలోనూ చరిత్రను దర్శించవచ్చని నిరూపించిన వ్యాసాలు కూడా ఇందులో ఉన్నాయి. ఒంగోలుకు ఆ పేరు ఎలా వచ్చిందో, పడవల అనే ఇంటిపేరు వెనక గల చరిత్ర ఏంటో పరిశోధనాత్మకంగా వర్ణించిన తీరు శ్లాఘనీయం. దేనికదే ప్రత్యేకంగా తొణికిసలాడే ఈ వ్యాసాల్లో అచ్చుల్లో అచ్చి వచ్చిన ఆధునిక శ్లేష, పక్కసైడు పదాల వర్ణనా 'ఔరా' అనిపిస్తుంది. ఈ పుస్తకం ఒకవైపు సాహితీ పిపాసులకు తృప్తిని కలిగిస్తూనే.. మరోవైపు సామాన్య పాఠక ఆసక్తి దాహాన్నీ తీరుస్తుంది.

- పున్న సుదర్శన్

అంతరంగ ఆవిష్కారం

ప్రకృతికి వందనం... మానవీయతకు అభివందనం... ఈ పరిమళాలు ఎప్పుడూ మనసుల్లో గుబాళించాలని... మనిషి కోల్పోతున్న సున్నితత్వాన్ని... వివేకాన్ని తట్టిలేపుతూ 18 కథలుగా ఆవిష్కరించారు పి.చంద్రశేఖర అజాద్. నేటి తరం మరిచిపోతున్న అమ్మమ్మ, తాతయ్యల వాత్సల్యాన్ని ఆత్మీయంగా పొదివిపట్టుకుని ...ఆ అనుభూతిలోని మాధుర్యాన్ని తాతా మనవరాలి మధ్య 'సృష్టి'ంచారు. పుష్పించిన వాటికి ఇక్కడ చోటుందా? ఇక్కడ జననం, మరణమూ వ్యాపారమే... అందుకే ఇక్కడ ఏదీ సంతోషాన్నివ్వదు... మెట్లు కట్టాలంటే చెట్టును కొట్టేయక తప్పదు... ఆ చెట్టున్నంత కాలం మెట్లే అవసరం లేదనే భావన 'వాళ్లిద్దరూ నూరు వరహాలు'గా వర్ణిస్తారు రచయిత. గోదారమ్మ అంటేనే భావుకత. నిష్కల్మషమైన మనసు సందర్భోచితంగా ఎలా స్పందిస్తుందో చెబుతుంది 'గోదారి ఏడ్చింది'. కళకు అంతిమ పరమార్థం సామాన్యుడి దరి చేరడమే. ఎంత గొప్ప కళాకారుడైనా కోరుకునేది ఆబాల గోపాలం తన కళను ఆదరించాలనే. అంతేకాని ఒక వర్గానికే కళ సొంతం కాదని సవర్ణంగా వివరిస్తుంది 'అవర్ణం'. మనిషి హోదాలు పెరగొచ్చు... స్థాయిలు మారవచ్చు... ఇగిరిపోని గంధం వంటి స్నేహ బంధం ఎండిన గులాబీలోనూ 'ఇండియన్స్' రూపంలో ద్యోతకమవుతోంది. ఒకే ఒక్క వాక్యమే కథను మొత్తం మార్చేస్తుందంటే రచయిత ఎంత విలవిలలాడతారో...

రచయిత: పి.చంద్రశేఖర్ ఆజాద్; పుటలు: 160; వెల: రూ.100
ప్రతులకు: ఎ.ఆర్. బుక్స్, 14/161-2, స్టేషన్ రోడ్, గుడివాడ

నేటి ప్రపంచ వ్యాప్త పరిణామాలు సంపాదకురాలిని సైతం రచయితకు అనుకూలంగా ఆలోచింపచేసే 'కథ కాని కథ' హృద్యంగా సాగిపోయింది. ఆకలి ముందు అహం ఎంత చిన్నదో... ఈ రెండూ మనిషిని సందర్భానుసారంగా తమలోకి ఎలా లాక్కుపోతుంటాయో 'ఆకలీ-అహమూ' చెబుతుంది.

పొంగటం ఏరు తప్పు కాదు... వానలు కురిసి తనలో ఐక్యమైనప్పుడు ఏరు పొంగుతుంది. కానీ మనం కష్టాల కన్నీళ్ల వరదలొచ్చినా... ఈ ప్రపంచమంతా ధ్వంసమవుతున్నా పట్టించుకోం... అంటూ 'ఏరు' నిర్వచిస్తుంది. రచన యోగమైతే జీవితం యోగం కాదా? జీవించడం యోగం కాదా? అనుభవం చెడ్డది, మంచిది కావచ్చు... ఓ సృజన జరుగుతున్నప్పుడు ఏ మనిషీ తాను తాను కాదు' అంటూ కథోపదేశం చేస్తుంది 'సరస్వతీ నమస్తుభ్యం'.... ఇలాగే అన్ని కథలూ ఆలోచింపచేసేవే... అర్థవంతంగా సాగిపోయేవే...

- అన్నపురెడ్డి రాజేశ్వరరావు

కొండ అద్దమందు...

అమ్మకు ఆసరా

ఈ కాలం అమ్మలందరికీ ఉపయోగపడే పుస్తకమిది. బిడ్డ పుట్టినప్పటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రచయిత చక్కగా వివరించారు. పోషకాహారం అందించడం, స్నానం చేయించడం, పరిశుభ్రత పాటించడం, టీకాలు వేయించడం లాంటి కీలకమైన విషయాల్లో తల్లులకు నిరంతరం వచ్చే ఎన్నెన్నో సందేహాలను రచయిత నివృత్తి చేశారు. తల్లి పాల విశిష్టతను వివరంగా చెప్పారు. శిశువుల్లో ఆరోగ్యపరంగా వచ్చే మార్పులు, ఆయా కాలాల్లో మీదపడే అనారోగ్య సమస్యలు, వాటిని నివారణ మార్గాలుపై క్షుణ్ణంగా చర్చించారు. పసిపిల్లల పెంపకానికి చక్కటి సూచనలిచ్చే రచన ఇది.

- యార్లగడ్డ మధులత

రచయిత: డా.కోడూరు ప్రభాకరరెడ్డి పుటలు: 72; వెల: రూ.150; ప్రతులకు: 7/829, వైఎంఆర్ కాలనీ, ప్రొద్దుటూరు

భక్తజన మానస వేదిక

శ్రీమదాంధ్ర మహాభాగవత విశేషాలను 'శ్రీభాగవత కరదీపిక'గా రచించారు పాలాది. వ్యాస, పోతన భాగవత రచనా విశేషాల్ని గుదిగుచ్చారు. గ్రంథం మొదటి భాగంలో వ్యాసుడి అష్టాదశ పురాణాల్లో భాగవత వివరణ, రెండో భాగంలో పోతన జనన ప్రాంతం, కాలం, కృతులు, భాగవతంలో ప్రక్షిప్తాలు, వ్యాకరణం తదితర విషయాలపై ఉన్న పండిత వాదాలను స్పృశించారు. వాటికి తన పరిశోధన పరిధిలో పరిష్కారాన్ని చూపారు. రచయిత పాండిత్యాన్ని నిరూపించుకోవాలన్న తపన కంటే పఠన యోగ్యత కనిపిస్తుంది గ్రంథంలో. భాగవత పఠనానురక్తి, సాహిత్యాభిలాష గల పాఠకులకు ఉపయుక్తమైన పుస్తకం.

- శర్మ మావుదూరు

రచయిత: పాలాది లక్ష్మీకాంతం శ్రేష్ఠి: పుటలు: 271; వెల: రూ.150; ప్రతులకు: వైశ్యప్రబోధిని పబ్లికేషన్స్, కడప



పురాణాల్లోంచి పరిష్కారాలు

ఆధ్యాత్మిక, సాహిత్య రంగాలలో అపార కృషి చేసిన వారు రాజగోపాలాచార్యులు. తన జీవితానుభవాలకు ఆధ్యాత్మికతను జోడించి ఆసక్తికరంగా చెప్పారాయన ఈ పుస్తకంలో. బోరుబావుల్లో పడే చిన్నారులు, రైల్వేగేట్ల దగ్గర కాపలా దార్లు లేకపోతే వచ్చే పర్యావసానాలు ఎలాంటివో బ్రహ్మపురాణంలోని చిన్న కథతో చెప్పిన తీరు ఆకట్టుకుంటుంది. కాలక్రమంలో ఎన్నో కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. ఆధునిక సమస్యలన్నింటికి పురాణ, ఇతిహాస గ్రంథాలలోని అనేక దృష్టాంతాలను చక్కని సమాధాన మార్గంగా తెలియజేశారు. అపార శాస్త్ర పరిజ్ఞానం ఉంటేనే ఇలాంటి రచన సాధ్యం.

- వై.శివరామప్రసాద్

రచయిత: రాజగోపాలాచార్యులు; పుటలు: 120; వెల: రూ.60; ప్రతులకు: 27-17-45, ఎ.ఎస్.ఆర్.నగర్, భీమవరం, ప.గో. జిల్లా



నవ్వుల గీతలు

కార్టూనిస్టు: గీతా సుబ్బారావు; పుటలు: 160; వెల: రూ. 100; ప్రతులకు: అన్నీ ప్రముఖ పుస్తక కేంద్రాల్లో

గీతలు గీయటమంటే మాటలు కాదు గీతలే! ఒక అంశాన్ని పాఠకులకు అర్థమయ్యేలా, హాస్యం పండించేలా గీయటం ఒక కళయితే ఆ కళని బాగా ఔపోసన పట్టిన అతికొద్ది మందిలో గీతా సుబ్బారావు ఒకరు. గీతాజగత్, గీతానవ్వులు అనే పేర్లతో రెండు పుస్తకాలు తెచ్చారు. కార్టూన్లన్నీ సరళమైన గీతల్లో సూటిగా స్పష్టంగా ఉన్నాయి. "చీ అదేం సరసం తల మీద నీళ్లు చల్లేరు" అనడిగిన భార్యకు "సమ్మర్ కదా! పువ్వులు వాడిపోకుండా మా కొట్లో ఇలాగే చల్లుతాం" అంటాడు భర్త. పదాలను అలతి అలతిగా వాడుకుని హాస్యాన్ని పండించారు గీతా సుబ్బారావు. ఇందులో కొన్ని కార్టూన్లు సుతిమెత్తగా మనసును శ్రుతి చేస్తాయి, కొన్ని సూటిగా వచ్చి కస్సుమని గుండెను కోస్తాయి. ముఖ్యంగా గీతలో, రాతలో తెలుగుదనం పరిమళిస్తుంది. హాయిగా నవ్వటానికి ఈ నవ్వు 'టానిక్' కొనుక్కోవచ్చు.

- జావేద్



తెలుగింటి పల్లెపదం

వివిధ జానపదాలపై ప్రముఖులు రాసిన వ్యాసాలతో పాటు తాను సేకరించిన 259 కళారూపాల వివరాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు రచయిత. చాలామందికి తెలియని, ఎప్పుడూ వినని కళల్నీ పరిచయం చేశారు. జానపదాలు భిన్న రకాలు... కొన్ని సంగీత రూపకాలైతే మరికొన్ని నృత్య రూపకాలు. భట్రాజు వేషం, బుడబుక్కల వేషం, జంగం దాసు, ఫకీరు సాహెబు, ఎరుకల సోది... వంటి ఎన్నో వేషాల ప్రత్యేకతలు, అలంకరణ గురించి వ్యాసాల్లో చెప్పారు. ఆయా జానపదాల పుట్టుపూర్వోత్తరాలు, ప్రస్తుతం కళాకారుల జీవన స్థితిగతుల గురించి వివరిస్తూ సంబంధించిన మంచి చిత్రాలూ జోడించారు. జానపద కళలతో పాటు జానపద సాహిత్యం, వాద్యాల గురించి ప్రస్తావించటం విశేషం. రచయితకు భిన్న కళారంగాల్లో ప్రవేశం ఉన్న విషయం రచనలో, పుస్తకం కూర్పులో స్పష్టంగా కనిపిస్తుంది. **- భాస్కర్**

రచయిత: తాతా రమేష్‌బాబు; పుటలు: 272; వెల: రూ.200;
ప్రతులకు: తాతా జానకి, 14/161-2, స్టేషన్‌రోడ్, గుడివాడ



మట్టివాసనల గుబాళింపు

కవితంటే హృద్యంగానే ఉండి తీరాలన్న నిబంధనేదీ లేదు. అద్దంలో ప్రతిబింబం భిన్నంగా ఉండదుగా! అలాగే, కవి దర్శించి, అనుభూతించిన విషయం కరుకైనదైతే కవిత్వమూ కరుకుగానే ఉంటుంది. డా॥ సత్యనారాయణ రాసిన 'యుద్ధకాండ' కవితా సంకలనం అలాంటిదే! 'తలుపులు అవసరం లేని ఇల్లు నా జీవితం, నది ఒక్కటే నువ్వు నేను ప్రవాహం' లాంటి మాటలతో సమాజంలో తన ఉనికిని పారదర్శకం చేసుకున్నారు రచయిత. తక్కువ పదాల్లో, అరమరికలు లేని ప్రాసలతో సాగే ఈ సంకలనంలో ప్రతి కవితా కవి ఆలోచనల తీవ్రతకు అద్దం పట్టేదే! ఆయన కవితల్లో బడుగు జీవుల నిశ్శబ్ద రోదనలు వినిపిస్తాయి, వారి ఆకలి కేకలు గుండెల్ని పిండుతాయి. ఆ అనుభవ గాఢతను అర్థం చేసుకోవాలంటే ఒకింత కటువుగా, ఇంకొంత కరాఖండిగా 'యుద్ధకాండ' చదవాల్సిందే! **- ప్రవల్లిక**

రచయిత: డా.బి.సత్యనారాయణ ; పుటలు: 92; వెల: రూ.70;
ప్రతులకు: పాలపిట్ట బుక్స్, మలక్‌పేట, హైదరాబాద్

కొత్త పొత్తాలు



మహా ప్రస్థానం- శ్రీశ్రీ, **ర:** పి. నరసింగరావు; **పు:** 37; రూ. 40; **ప్ర:** రచయిత, 16-156, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్

వెలుగు రెక్కలు, ర: రఘుశ్రీ; **పు:** 60; రూ. 60; **ప్ర:** వి. శ్రీలక్ష్మి, 2-1-421; ప్లాట్ నెం. 202, సాయినిలయం, నల్లకుంట, హైదరాబాద్

జీవన చిత్రాలు, ర: కూర చిదంబరం; **పు:** 45; రూ. 30, **ప్ర:** సౌమిత్రి ప్రచురణలు- సికింద్రాబాద్/ పాలపిట్ట బుక్స్-హైదరాబాద్



నడత మారాలి, **ర:** కె. వి. ఎస్. నరసింహం; **పు:** 57; రూ. 30; **ప్ర:** ప్రజాసాహితీ వేదిక, గాజువాక, విశాఖపట్నం

సుమ పరిమళాలు, సంకలనం: వేజెళ్ల నాగేశ్వరరావు; **పు:** 87; రూ. 50; **ప్ర:** రచయిత, 11-7-4, ఘంటావారివీధి, పాండురంగపేట, తెనాలి

శ్రీహరిశతకం, **ర:** కె. ఎస్. నరసింహమూర్తి; **పు:** 56; రూ. 50; **ప్ర:** రచయిత, 66/3ఎ, శ్రీనిలయం, ఇందిరానగరు, హోసూరు, తమిళనాడు

మహాత్మా!; ర: పిళ్లా చింతప్పడు; **పు: 26;** రూ. 20; **ప్ర:** రచయిత, చీపురుపల్లి, విజయనగరం

అపస్మారకస్థితిలో, ర: మోదు రాజేశ్వరరావు; **పు:** 37; రూ. 40; **ప్ర:** సంపాదకులు, కావ్యసమీక్ష, తెలుగు మాస పత్రిక,శారదానగర్,విశాఖపట్నం

అంతర్యానం **ర:** కొండముది సాయికిరణ్‌కుమార్; **పు:** 70; రూ. 50; **ప్ర:** పాలపిట్ట పుస్తక కేంద్రం, హైదరాబాద్

లవంగాలు; **ర:** జోగారావు గుండాన **పు: 28;** రూ. 20; **ప్ర:** రచయిత, 6-342, శ్రీసాయినగర్, విశాఖపట్నం

ర: రచయిత, పు: పుటలు, ప్ర: ప్రతులకు

అమ్మ భాష

చక్కటి మాటల చిక్కటి భాష మన తెలుగు. మన పలుకుల్లో అర్థవంతమైన పదబంధాలుంటాయి. సంభాషణలకు మెరుపులద్దుతాయవి. అలాగే, మనస్సులను హత్తుకునే భావవ్యక్తీకరణలకూ తెలుగు తరగని గని.

ఆ లోటా ఇట్లా పట్రారా బుజ్జిగా... అమ్మమ్మ కేకేసింది. 'ఫోర్త్ క్లాస్' చదువుతున్న బుజ్జిగాడికేం అర్థం కాలేదు. మా... మామ్మేంటి తెమ్మంటోందని 'మమ్మీ'ని అడిగాడు. 'గ్లాసు' రా అంది ఆయమ్మ. అలా చెప్పొచ్చు కదా మరీ అని గొణుక్కుంటూ దాన్ని తీసుకెళ్లాడు.

తరాలు మారేకొద్దీ తల్లిపేగుతో బంధం పెళుసైపోతోంది. నాటి తరం నాలుకలపై నిత్యం నర్తించే అచ్చతెలుగు పదాలు నేటి తరానికి బ్రహ్మపదార్థాలు. వారసత్వంగా ఆస్తులు చేతులు మారుతున్నాయి కానీ మనవైన మాటల మూటలు మాత్రం పెద్దవాళ్లతోనే అనంతదూరాలకు పయనమైపోతున్నాయి. తెలుగును తెలుగులా కాపాడుకోవాలంటే మాత్రం ఆ మాటలన్నింటినీ మూటకట్టుకోవాలి. భావితరాలకు అందించాలి.

అవి ఎక్కడ దొరుకుతాయా అని ఆలోచిస్తున్నారా! అంత ఆలోచన ఎందుకు... మీ ఇంట్లోనే ఉన్నాయి. అమ్మలు, అమ్మలు, నాన్నమ్మలు, తాతయ్యల మాటలను శ్రద్ధగా ఆలకించండి... ఎన్నో అచ్చతెలుగు పదాల సుమధుర సంగీతం మన మనస్సులను ఆహ్లాదపరుస్తుంది. మా అమ్మ రమణమ్మ. వయసు ఏడు పదులకు పైనే. తను గుంటూరు జిల్లాలో పుట్టి నెల్లూరు ప్రాంతంలో ఎక్కువ జీవితం గడిపింది. తను నిత్యం వాడుకలో వాడే మాటల్లో కొన్ని ఇప్పుడు అంతర్ధానమైపోయాయి. మరికొన్ని రాతలో మాత్రమే మిగిలున్నాయి. మరోమాట... అమ్మ ఇప్పటికీ శేర్లు, ఈసల్లోనే కొలతలు కొలుస్తుంది. ఆంగ్లంతో స్నేహం చేసి మనం అలవాటు చేసుకున్న కేజీలు, మీటర్లకు తనకూ చాలా దూరం. తన మాటల్లో వినిపించే అచ్చతెలుగు పదాల్లో కొన్ని...

గౌలు: భరించ లేని వాసన

మోయనంగా: బరువుగా

యవ్వారం: న్యాయస్థానాల్లో జరిగే వాదనలు

మోపుకున్నారు: కష్టాన్ని పంచుకున్నారు అనడానికి

మోటుకున్నారు: అండగా నిలబడ్డారు

ఈసందు: ఈమధ్య

అవిరేణి: మూడు రోజుల పెళ్లి కోసం అలంకరించిన కుండ

వక్కాకు: కిళ్లీ

కూటిల్లు: వంట గది. కిచెన్!

సద్దికూడు: అల్పాహారం. టిఫిన్!

పిరిం: మండే ధరలు

అగ్గువ: తక్కువ

తొలచకొస్తాయి: పాత జ్ఞాపకాలు, బాధలు గుర్తుకు వస్తున్నాయి అనడానికి

పెద్దతొడుగు పెట్టుకోవద్దు: వేడుకలను ఆడంబరంగా చేయవద్దు

అంకణాలు: భూమి కొలత. మనం ఇప్పుడు గజాలు, సెంట్లు అంటున్నాం.

సేరు, పావుసేరు: కేజీ, పావుకేజీలకు తెలుగు

ఈసె: బట్టల కొలత. ఇప్పుడు మీటర్ల లెక్కన కొలుస్తున్నాం.

తూముడు, పుట్టి, బాణం, కడవ: ధాన్యపు కొలతలు

బారుచెయ్యి: నలుగురికి పెట్టే గుణాన్ని వివరించడానికి

పదును: మంచి వాన

అరపదను: ఓ మోస్తరు వాన

కమ్మప్రతిష్ఠ: భూమిపూజ. కొత్తగా ఇంటి నిర్మాణం చేసేటప్పుడు నవ ధాన్యాలతో కమ్మప్రతిష్ఠ చేయడం కొన్ని ప్రాంతాల్లో సంప్రదాయం.

ఇలాంటి మాటలెన్నో! మీరూ ప్రయత్నించి చూడండి... వైవిధ్యభరితమైన, అందమైన పదాలెన్నింటినో గుర్తించగలరు. అదీ చాలా తక్కువ శ్రమతోనే. ఇలా ఎవరికి వారు, ఇళ్లలోని పెద్దల మాటల్లో దొర్లే చక్కటి పదాలను తెలుసుకుని నమోదు చేస్తే మన పదసంపద పెరుగుతుంది. మన చిన్నారులకు మనదైన భాషను నేర్పించడానికి సాయపడే మహత్కార్యమిది.

– సాయిహర్ష, కర్నూలు

RAMOJI
GROUP

ప్రియ రైస్ రిచ్‌తో
అవధులు లేని ఉల్లాసం, ఉత్సాహం...

priya
RICE RICH®
Healthy Cooking Oil

రైస్ బ్రాన్ ఆయిల్‌ని ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యవంతమైన నూనెగా గుర్తించారు.
ప్రియ మీకు రైస్ బ్రాన్‌లోని సుగుణాలను అత్యాధునికమైన టెక్నాలజీ ద్వారా ప్రాసెస్ చేసి
అందిస్తూ ఉన్నది. అందువలన ప్రియ రైస్ రిచ్ ఎందరో వినియోగదారుల అభిమానాన్ని
పొందుతోంది.... మరి మీరు కూడా మీ ప్రియమైన వారి
ఆరోగ్యం కోసం - ప్రియ రైస్ రిచ్‌ని ఎంచుకోండి....

www.priyafoods.com

ISA CERT HACCP-IS 31261

Ushodaya Enterprises Pvt. Ltd. (Foods Division)
Plot No.: A1/1(Part), Block No.: 3, IDA, Uppal, Hyderabad - 500 039, A.P., India. Tel.: 040-27200351, 27200354, Fax: 27202596.

Crocin Advance
STARTS RELEASING*
ITS MEDICINE
IN AS LITTLE AS
5
MIN
కేవలం 5 నిముషాలు#
#ఆప్టిజోర్బ్ టెక్నాలజీతో ఇది భారతదేశపు మొదటి టాబ్లెట్. ప్రామాణిక
పారాసేటమోల్ టాబ్లెట్‌ల మాదిరిగా కాకుండా కేవలం 5 నిముషాల్లోనే తన
మందుని విడుదల చేయటం ఆరంభిస్తుంది.
ప్రతీ క్షణం విలువైనది అయినప్పుడు, క్రోసిన్ అడ్వాన్స్.
PARACETAMOL FAST RELEASE TABLETS
Crocin Advance
A Smart Choice.
OPTI ZORB
25 BLISTER STRIPS X 15 TABLETS
*Wilson C et al. Abstract PH 217, International Association for the study of Pain 12th World Congress on Pain, Aug 2008.
Paracetamol Fast Release Tablet 500 mg. Overdose may be injurious to liver. Max recommended dose not to exceed 4g/day.
Crocin is a trademark of GlaxoSmithKline group of companies. © 2013, GlaxoSmithKline.
* In a clinical study